NPRO 16/112

పంచకట్టి

NPRO1Gr112

కవిరాజు



కవిరాజ సాహిత్యవివారము

గుడివాడ

B

శంబూక వధ

(ఉత్తరరామ చరిత)

కృష్ణాజిల్లా [illegible] గ్రామస్థులు
[illegible] గారు
డా॥ చంద్రశేఖర్ గారు
బహూకరించిన పుస్తకం

కవిరాజు :

త్రిపురనేని రామస్వామి చౌదరి,

శతావధాని, బారిష్టరు.

కవిరాజ సాహిత్య విహారము
గు డి వా డ
ప్రచురణ నెం 2.

తొలికూర్పు : 1922

మలికూర్పు : 1934

మూడవకూర్పు : 1964

8816

వెల : రెండు రూపాయలు

ప్రతులకు :

అన్నపూర్ణ పబ్లిషర్సు,
ఏలూరు రోడ్డు :: విజయవాడ-2

మలి పలుకులు

త్రిపురనేని వెంకటేశ్వరరావు.
(విజయవాడ)

ఈ శంబుకవధను ముప్పదేండ్ల విలంబము పిమ్మట మూడవ ముద్రణము వెలయించు నిప్పుడు సుమారర్ధ శతాబ్దము క్రిందఁ గవిరాజు వెలువరించిన సుదీర్ఘములైన తొలి పలుకులయందు నొండు రెండంశములకు నుపోద్బలకమగు పరిశోధనమును జోడించు టుచితమని తలంచి యీ మలిపలుకులకుఁ గడంగితిమి.

ముద్రణ :
సాయిబాబా ప్రెస్ — విజయవాడ-1

రామాయణకాలము నాటికి లంకాద్వీపము వేరికి మాత్రమే లంక. భరతఖండము నందది యంతర్భాగమై యున్న కాలమొకటంతకు మున్నున్నదనఁజెల్లును. సింహళ గాథలందు రావణానంతర కాలమున సముద్రము లంకాద్వీప పశ్చిమోత్తర భాగముల నిరుమారు ముంచివేసినట్లు గలదు. అనఁగా భారతదేశమునకును నేటి లంకకును నడిమిప్రదేశము కడలిపాలైనది.

రావణుని దుర్వర్తనకుఁ గినిసి తద్వధానంతరము సింహళ మందలి నేటి మన్నారు మొదలు మలయాలము నందిప్పటి టూటికోరిన్ వరకు నాల్గులక్షల ప్రతోళికలుగల యిరువదైదు రావణ దుర్గములను గడలి కబళించినదని 'రాజావళి' నుడువు చున్నది. మరలఁ క్రీ. పూ. శివ శతాబ్దిలో గల్యాణినేలిన తిష్యరాజొకఁ డొక బౌద్ధ భిక్షువును దనరాణి వాసము తోడి చనవు శంకించి సలసలమను నూనెలో వేఁచెను. నిర్దోషినట్లు గావించిన నేరమునకు వాని పట్టణములను, గడలి ముత్యాలుదీయు జాలారుల పల్లెలను నుదధి ప్రమింగినదని రాజావళి కథనము.

ప్రాచీనతమిళసారస్వతమునఁ గూడఁ నీ రెండవ కడలి ముంపు ప్రసక్తమైనది. అనఁగా భరతదేశఁపు దక్షిణది గ్భాగముగూడఁ గొంత సముద్రగత మైనది పాండ్య

త్రిపురనేని వేంకటేశ్వరరావు, విజయవాడ.

రాజ్యమునకుఁ దొలుత కవాడపురము రాజధాని. ఇదే రామాయణమున 'ముక్తామణి భూషితము' 'గవాటగుప్తము' నునగు పాండ్యుల హేమపురము. పాండ్యకవాడక మౌక్తిక జాతివిశేషముఁ గౌటిలీయార్థశాస్త్రము మెఱుంగును. రెండవ తమిళ సారస్వత పరిషత్తు (సంగమ్)న కది మనికిపట్టు. నేటి మదురకింకను దక్షిణమున మొదటితమిళసారస్వత పరిషత్తు విలసిల్లిన తెన్‌మదుర యుండినది. ఈ రెండు పట్టణములతో నలువది తొమ్మిది నాఁడుల పాండ్యభూమి జలధి మగ్నమయినది. పాండ్య రాజధాని నేటిమదురకు జరిగి వచ్చినది.

ఇరుతీరముల సముద్ర మిట్లిరవుకొన్నను నేటికిని దాని కొలఁది యిరువదిమూఁడు 'మైళ్ళు'. మెగస్తనీసు నాటికిని లంక భరత ఖండమునుండి యొక నదిచే విడదీయబడినట్లున్న దఁట. ఇఁక గపుల వారధి నిర్మాణ మెంతపాటిదో !!

ఇట్లగుటచే లంకకు నిక్కుడకు రాకపోకలు తఱచు. వియ్యాలుమెండు. లంకనుండి యీ దేశమునకు వలసలు నెక్కుడు. లంకా రాక్షసులు వింధ్యవరకు నేలిరి. దండకాటవి రావణుని రాష్ట్రము. తెలంగాణమందు గోదావరిగట్టున ధర్మపురికి దిగువఁగల 'కోటిలింగాల'ము రావణుఁడు శివార్చన కను దినమువచ్చి పోయెడివాఁడని స్థల మాహాత్మ్యము లల్లుకొన్నవి. హిరణ్యకశిపు హత్యానంతరము లంకా రాక్షసులు

దక్షిణాపథ దానవ సంఘములతో కూటువగట్టి యార్యులతో తారకామయమను భీషణ సంగ్రామ మొనరించిరి. బలివైరో చనుని యుద్ధములను, గాలనేమి రణంబునను గూడనదే కూటువగాన వచ్చెడిని. కడకు రావణవధతో ద్రావిడ ప్రభ యణఁగి పోయినది. ద్రావిడు లార్యులకులోఁగిరి. ఆర్యులతో గలిసిరి. రంగు మారినది. మొగము మారినది. మాట మారినది. నూతన జాతులావిర్భ వించినవి. ఎడనెడఁ గొందఱిని మాత్రము పూర్వనామరూపములు, కొన్ని పూర్వాచారములును బీడించి పీటవెట్టుక నిల్చినవి. తక్కిన జనుల, సంస్కృతుల పుట్టువులను జ్ఞప్తికిఁ దెచ్చు మేనమామ పోలికలుఁగా మిగిలియున్నవి.

నేటి మన సంఖ్యామానమంతయుఁ బదియంకెలమీద నిర్మింపఁబడి నట్టిది. ద్వాదశాంకములు మూలముగా శత సంఖ్య దనుక లెక్కించుకొండొకసంఖ్యామాన ముండినది. అది సింహళ దేశీయమని యేతచ్చారిత్రకుల నిశ్చితాభిప్రాయము. 'మినికాయ్' వంటి సమీపద్వీపము లందిప్పటికి నిది యుండుటనుబట్టి యవి యొకప్పుడు సింహళముతోఁ గలిసి యుండెడివని వారూహించుచున్నారు. చూడఁగా మన కొండజాతు లందీ సింహళ సంఖ్యామాన మిప్పటికిఁ జావకున్నది. శ్రీకాకుళము, కోరాపుట్టి, గంజాము జిల్లాలందున్న కోదుసవర గోందుజాతులందు నీ సంఖ్యామాన ముస్నది.

ఇంతియకాక, లంకకుఁజెందిన గాయకజాతియగు 'పాణన్' తెగకూడ దక్షిణ హిందూదేశము నలుగడల జెదరి

జీవించి యున్నది. సింహళమందు 'యాళ్' యను తంత్రీ వాదన మొండుండెడిది. ఈ లంకా విపంచికనే రావణుఁడు పతాకచిహ్నగా నైకొన్న కళావేదియని కంబ రామాయణ మనుచున్నది. ఈ 'యాళ్' మీదఁబాడు 'పాణన్' తెగ వలన. లంకా ద్వీపోత్తరభూమి 'యాళ్పాణ' భూమియని పేరొందిది, నేటికది వ్యవహారవశమున 'జాఫ్నా' యయినది. సవరలను, కోదులను నంటిపెట్టుకొని వారికన్న నధికులై, వారిని మోసగించుచుండు నొకతెగ 'పాణో'లనుపేర నున్నది. శ్రీకాకుళము మైదానమునందు స్థిరపడిన వీరే పైడీలనిపించు కొనుచున్నారు. వీరుసంగీత పియలు. కొండతెగలవారిపెండ్లిం డ్లేవంటి యెల్ల కార్యములకు వీరి వాద్యగీతములే కావలయును. వీరు నేతగాండ్రు. పైడి దుప్పట్లు మన్నికకుఁ బేరు. మలబారు నందునుఁ 'బాణన్' తెగ యున్నది. అది మంత్రగాండ్రపుట్ట. ఆ భూతవైద్యులు వేషములూని పాడుచు నృత్యము గావిం తురు. కోరాపుట్టి 'పాణో' లను 'డోంబు' లందురు. అనఁగా బిశాచులు, దయ్యములునని యర్థము. లంక పిశాచ మండ లము గదా! తమిళ దేశమందునుఁ 'బాణన్' లున్నారు.

లంకలోఁ గాపురముజేసిన యక్షులు, నాగులు తెలుఁగునాఁట నక్కడక్కడ నప్పుడప్పుడు రాజ్యము లేర్పర చిన జాతులని చారిత్రకు లెఱుఁగుదురు. తదవశేషములు వేరొకకులముగా మిగిలినవారే జక్కలు, నాగవాసపువారును.

పురాణము లెఱిఁగిన నాఁటగోలె లంక యక్షౌవాసము. సింహళమను పేరు సైతము యక్షభూమినే సూచించును.

సింహపూజ యక్షుల ప్రత్యేకత. యక్షులను సింహ సంబంధులనుఁగా జెప్పుట తెలుగువారికి గ్రొత్తకాదు. శాతవాహనులు సాతుఁడను యక్షుఁడు సింహరూపమున మోసితెచ్చిన బాలుని సంతానము. యక్షులను సింహరూపులనుగాఁ జెప్పుట పౌరాణిక పద్ధతి. లంక తొల్లివారి యధీనమగు నిన్నమొన్నటి వరకును సింహళరాజులు సింహధ్వజులై యుండిరి. లంకకుఁ జెందిన మయాసురుని జెండాయు సింహ లాంఛితము.

సింహళ బౌద్ధగ్రంథమగు మహావంశముకూడ నొక పురాణగాథను వల్లె వేసినది. సింహమొక్కటూదేశపు రాజ్ఞిని బెండ్లాడి కన్నసంతుచేఁ బాలింపఁబడిన దగుటచే నాపేరు గల్గినదన్నది. మన పురాణములు సైంహికేయులఁ గూర్చి చెప్పినవి. వారు హిరణ్యకశిపుని చెల్లెలయిన సింహికకు విప్రచిత్తి దానవునకుఁ గల్గిన సంతానము. సింహికాపత్యమైన వారు పేరునుబట్టి సింహ పూజాంకములనుఁ జేఁబట్టి నారనఁ దగును. సింహిక లంకామాతయైనది. హనుమంతుని సముద్రతరణమున నాగమాతృకయైనసురసతోవచ్చియెదురొక్కన్నది.

లంకకుఁ బిశాచ మండలమనియుఁ బేరు. యక్షశబ్దము రాక్షసశబ్ద పర్యాయ పదమైనట్లే పిశాచశబ్దమునకు నైనది. ఉపనిషత్తులందును నీయర్థమున వాడుక గన్నది. లంకావాసులకు దయ్యాలబెడద మనకన్న మిక్కుటమఁట. లంకా ప్రేత విశ్వాసములపై గ్రంథములు బయల్వెడినవఁట.

శివుఁడు పిశాచ గణాధిపుఁడు. యక్షులకును శివుడే దేవర. కుబేరుని యింటివేల్పునూడ. లంక యష్టేశివుని కొల్పు

కూటమియే. లంక నయిదు విభాగములైన యటవీ పర్వత మరుతీర సేద్యవాటికలకు మాయన్, మురుగన్, కొట్టివై వరుణేంద్రులు దేవతలఁట. వారి పై దేవుఁడు శివుఁడఁట. మున్నేశ్వరము, కోనేశ్వరము, నకులేశ్వరము, తిరుకేతీశ్వరములు శైవమహాక్షేత్రములు. యుద్ధమునకై లంకలో నడుగిడగనే రాముఁడు మున్నేశ్వరమున శివపూజ గావించెను. లంకలో నేటి 'జాఫ్నాకు' దక్షిణభూమిలో రామునకుఁ బూజ లేదు.సమన్ దేవియో పేర లక్ష్మణారాధనము మాత్రమున్నది.

వీరశైవము శాకాహారమును విధించును. పుష్పఫల పత్ర తోయముల పూజ నంగీకరించిన తొలిదేవర శివుఁడు. నేటికిని దమిళదేశమున శైవసాపాటనఁగా శాకాహారము. అక్కడ శైవము బ్రాహ్మణేతరులదే. బ్రాహ్మణులందు మిక్కిలి తక్కువ. జైనబౌద్ధముల తాకిడికి నుత్తరభారతమున మాంసఁపుఁ దిండిమానని బ్రాహ్మణ్యము శైవమునుఁ దట్టుకొంటకు దక్షిణాపథమున శాకాహార నియమమునకు లోఁగినది. ఆటవికులైన కోయలందే మాంసముమాన్పి శైవము 'లింగకోయ' లను శాఖను సృజించినది. నేడు లంకలో, దమిళదేశములో బ్రాహ్మణునకుఁ జెల్లుచున్న 'అందణర్' 'పార్పనన్' (ద్రష్ట - తెలుఁగున బాపన) శబ్దము లనార్యములు. యక్షరాక్షస నాగాది సర్వజాతులవారు జ్ఞానులై యాపేర్లు బొందువారఁట. నేటికిని లంకలో అబ్రాహ్మణులైన వెల్లాల పూజారులా 'అందణర్' వ్యవస్థయొక్క యవశేషమందురు. వారు శుద్ధ శాకాహారులు.

విజయుఁడను కాళింగుఁడు లంకలోదిగునాటికి యక్షులు లంకా మధ్య దక్షిణ భాగములందును, నాగులనువారు పశ్చిమో త్తర భాగములందును వసించుచున్నారని "మహా వంశ" కథనము. నాగులువసించు భాగము నాగద్వీపముఁగాఁ బ్రసిద్ధి కెక్కినది.

కేతువు నాగవంశజుఁడని, లంకావాసియని యక్కడ గాథలున్నవి. అతఁడు శివభక్తుఁడు. అతడు శివునిఁ బ్రతిష్ఠించిన యాలయము దిరుకేతీశ్వరమని వానిపేరఁ బ్రశస్తిగాంచి వది. మయాసురుఁడు లంకలో మాదోట (మాంబై) నేలిన నాగుఁడు. తారకుని సైదోడు. తారకామయము వారిరుగురి యొడ్డినము. లంకలో మహిషాసురుని సూచించుచు మహిష ద్వీపమున్నది. లంకా ప్రాచ్య మొకప్పుడు వేరుదీవియఁట. దానికి 'ఎరుమై ముల్లైదీవు' అని పేరు. అది యెరుమై దీవియై నది. ఎరుమై యనఁగా ఎనుము - దున్నపోతు.

పురాణము లందలి మయుఁ డొక్కవ్యక్తిగాడని పించును. లంకా నాగులందు 'ఓవియరు'యను తెగ యొండున్నది. అది శిల్పులతెగ. పంచశిల్పులు నందుపజాతులు. ఆ యేనింట నొక్కరు 'మయులు', వడ్రంగులు. మయులు వాస్తుశిల్పులు. తెలుఁగు దేశమున విశేషప్రచారమునన్న వాస్తువు గర్గవిశ్వకర్మలది కాక, మయవాస్తువే. మయ జాతీయు లెల్లరు నార్యులకు మయుఁడే యైయుండును. ఈ యోవియరు నాగశిల్పులు 'మాంబై' రాజధానిగా నేలిన వారు. ఈజాతినిబట్టి చిత్తరువునకు దమిళమున 'ఓవియం' అని

కల్గినది. వీరి మాండై రావణుని లంకాపురికి సమీపమున నున్నది. ఈ రెండు రాజవంశములు వియ్యమందుకొన్నవి. రావణ పూర్వుడైన యక్షరాజు శూరపద్మనిసతి పద్మ కోమలి, రావణసతి మండోదరి, కుబేరసతి చిత్రరేఖ యీ శిల్పక రాజకుమారికలు.

వీరి మాదోట యెత్తైన యినుప గోడలుగలకోట. కేవుపట్టణము. తమిళ యవన రచనములందల్లే యున్నది. లోహదుర్గమున్న వీరి నాగరికతను బురాణములును లోహమయముగనే జెప్పినవి. గోరూపిణియైన భూదేవినుండి దానవులు మాయాక్షీరములు లోహపాత్రములోనే పిండుకొన్నారట. తారకామయుల రథము లోహరథము. శిల్పకులైన మయుల చేతలు (యుద్ధములును) తెలియరానివై, తదర్థమున మాయా శబ్దము ప్రవర్తిల్లిన దనవచ్చును.

దాక్షిణాత్యులందు సాహిత్య మెన్నడో యావిర్భవించినట్లు సంప్రదాయమున్నది. భారత యుద్ధకాలమందు మురింజియూరి ముడినాగరాయరను ద్రవిడకవి రెండవ సంగం కవియందురు. రామాయణము బేరొక్కన్న మురచి పట్టణమే మురింజి. నేడది జలధి డాగినది. తమిళుల మొదటిసంగం రామాయణమునకుగూడ మున్నటిది. అందు శివుడు, కుమారస్వామియును సభ్యులందురు. మూడవ సంగము సాహిత్యమే లభించుచున్నది. అందుగవులనేకులు నాగవంశీయులు నాగనార్ అను బిరుద నామమున నున్నారు. ముడి

నాగరాయరును నాగుఁడే. తమిళమునఁ గవులైన నాగులు తమ భాసలోఁగాక పోయిరాయని సందియము.

యక్షనాగుల భాష 'యేలు' భాష. 'ఈల' మందలి భాష 'యేలు'. 'ఈలమ్' అనఁగా సింహళియందు బంగారు. సింహళము సువర్ణ ద్వీప మనిపించు కొన్నదిగదా! నేటి కకుడ ప్రవ్యకములఁబట్టి యీ భాషకు లిపి క్రీ. పూ. మూడవ శతాబ్దికి మున్నెన్నఁడో యేర్పడినట్లు దేలినది. తిష్యారామఁపుఁ ద్రవ్యకములలోమట్టి కుండలపై కుమ్మరులు వ్రేలితో వ్రాసిన యక్షరములు గలవు. యత్తల, మహారామ నిర్మాణముల యిటుకలమీద నచ్చుగట్టి గ్రుద్దిన యక్షరము లున్నవఁట. కుమ్మరులకు నిటుక పనివాండ్రకును నక్షరజ్ఞాన మున్నదనఁగా నా 'యేలు'లోఁ గవనముండక పోవుటెట్లు?

పరాధీనతలో బ్రొఁత యౌన్నత్యము చచ్చినది. తమ కళలు మఱుఁగునఁ బడ్డవి. కుమారస్వామి నల్లునిఁగా గొన్న యక్షులు, రావణునివంటి వేదవేత్తను గన్న యక్షులు నేడు లంకలో వికృతులై 'వెడ్డ'లుగా మిగిలినారు. అంతయేల? 'యాళ్' వీణ యదృశ్యమైనది. నూటమూడు 'పణ్'(రాగము) లెఱిఁగిన యజువజాతి సంబంధారు శైవుని నాటికి నరువ దొకటి మిగిల్చినదఁట. నేటికవి యతని తేవారములందు నిరువది మూటికి సన్నగిల్లి నవఁట.

ఇంక రామాయణ జాతులందలి వానరులను గూర్చి ముచ్చటింపవలెనని మనంబున్నను స్థలాభావముచే మరొక్క సందర్భమునకు మిగుల్చుచున్నాము.

త్రిపురనేని వేంకటేశ్వరరావు, విజయవాడ.

తొలిపలుకులు


పదియేనేండ్లనాఁడు "శంబుకవధ" ఆంధ్రలోక ప్రచారంబునకై వెడలినప్పుడు లోకము సంపూర్ణ విముఖముగనుండెను. పలుకరించు వారులేరు. ఆదరించువారులేరు. అయినను మొండికట్టుయై దేశదేశములు తిరిగినది. రంగూను వెళ్లినది. దక్షిణఆఫ్రికా వెళ్ళినది. లేక్కలేనన్ని దూరులుపడుచు, లెక్కపెట్టక యిల్లిల్లు తొంగిచూచి తనకుఁ దోఁచిన రీతి నీతులు చెప్పినది. కట్టకడకు విముఖముగానున్న లోకము కొంతవఱకు సుముఖమైనది. పలుకరించిరి. ఆదరించిరి. ఆతిథ్యమిచ్చిరి. ఆహ్వానములు వచ్చెను. పిలుపులు వచ్చెను. "మా యూరువచ్చి యుపన్యసింపవలయు"నని ప్రజలు కోరిరి. పిలుపువచ్చిన చోటికెల్ల నేగినది. ఉపన్యసించినది. ప్రజలయొక్క దృక్పథములో మార్పు గలిగించినది. భావపరిణామము చేకూర్చినది. రామాయణ కథనుగూర్చి తర్క వితర్కములు బయలుదేరినవి. పెక్కురు బ్రాహ్మణేతరులు శంబుకవధ న్యాయముకాదని నమ్మఁజొచ్చిరి. కన్నవారల్లరతో వాద ప్రతివాదములకు దిగిరి. తమప్రశ్నలకుఁ దగిన సమాధానములు రామిచే శంబుకవధ, వధయే యనుకొనసాఁగిరి.

ఈ మార్పుఁ గాంచి, కలవరపడి పెక్కురు బ్రాహ్మణులు, చదువుకొన్నవారు, చదువుకొననివారు, "శంబుకవధ"పై డాడి నడిచిరి. ఒక్క కాశీభట్ల బ్రహ్మశ్యశాస్త్రిగారి విమర్శనము నొక్కఁ దక్కినవన్నియు హేయములుగను, నసూయాగ్రస్తములుగను, నిందాభూయిష్ఠములుగనునుండెను.

కాన వానిని మఱుకువపాలుచేయుట యుచితమని తలంచు చుంటిమి. బ్రహ్మయ్యశాస్త్రిలగారు మా వాదమెల్లనంగీక రించుచు, శంబుకవధను బ్రబేరేచినది, వసిష్ఠుఁడు కాఁడనియు నారదుఁడనియు, నారదుఁడు బ్రాహ్మణుఁడు కాఁడనియు, దేవర్షి యనియు, నందుచే నీ యకార్యమును బ్రాహ్మణుల నెత్తిపైఁ బడవేయుట ధర్మము కాదనిరి. ఇది సత్యమే. కాని నారదుఁడు దేవర్షియైనను, బ్రాహ్మణుల ఛాయయే. బ్రాహ్మ ణుల చేతిలోని కీలుబొమ్మయే. బ్రాహ్మణులచేతి కొఱముట్టే. అందుచే భేదమాట్టే కన్పట్టదు. శంబుకవధ న్యాయమా ? అన్యాయమా ? యను సంగతి జర్చించు నప్పుడెవరు బ్రేరేచి శ్రీరామునిచేఁ జేయించినది తీసికొనఁదగిన విషయము కాదని మా యభిప్రాయము.

ఇంతియకాక; నారదుఁడు మోసగించి శ్రీరామునిచే శంబుకవధ చేయింప నున్నప్పుడు, వంశగురువగు వసిష్ఠుఁడు దానిని జరుపకుండఁ జేయవలసియున్నాఁడు. అట్టిది తట్టింపలేదు. కావున వసిష్ఠునకు శంబుకవధ యిష్టమనుట స్పష్టము. బహిరంగముగాఁ బ్రోత్సహించినను, లేకున్నను, గనుసైగచేఁ జేయించెననుట విదితము. ఇయ్యది ఫలములేని భేదము.

ఇఁక యుగములఁగూర్చి యొక్క మాటఁజెప్పెదము. పూర్వులు చేసిన యుగనిర్ణయము, వత్సర సంఖ్యా పరిమితి ప్రచారమున నెన్నఁడున్నట్టు పొకట్టదు. ఈ వాక్యముల బుజువుచేయుటకు నీ క్రింద హిరణ్యకశిపుని వంశవృక్ష మిచ్చుచున్నాము. ఇయ్యది నిజమను దేట తెల్లము చేయఁ గలదని నమ్మించుంటిమి.



ద్వాపరాంతము.

తారము.

త్రేతాయుగము.

చూచితిరా చిత్రము! బలిచక్రవర్తి కూఁతురు త్రేతాయుగము నందున్నది. కొడుకు కూఁతురు ద్వాపరాంతమున నున్నది. దీనింబట్టి యుగముల విషయమై యేమి తేలునో చదువరులూహించుకొందురుగాక. ఇంకొక్క విషయము. పై వంశవృక్షమును బరిశీలింపుడు. ఒక్క వంశమును రూపుమాపుటకు భగవంతునకు నాలుగవతారము లెత్తవలసి వచ్చినది. అహో! యిది యెట్టి మహావంశమో కదా. జాత్యుద్ధరణకై యిన్ని తరములు పెనఁగులాడిన

యుత్కృష్టవంశము మఱియొక్కటి మనదేశమునఁ గన్పట్టదు. శ్రీకృష్ణుఁ డనార్యుఁడగుటచేతనే బాణాసురుని మహా యుద్ధమున నోడించి విడిచి, చుట్టుటికముఁగూర్చి కొనినేగాని, యార్యులవలెఁ జంపివైవలేదు,

శ్రీ

తొలికూర్పు
తొలిపలుకులు

ప్రాచీన హిందూదేశము

ద్రావిడులు

రామాయణ కథాకాలమునాఁడు హిందూదేశ మెట్లున్నదో విచారింపకమున్ను తత్పూర్వస్థితిగతులనుదెలిసికొనుట యుచితమగుటయేకాక యవశ్యమనికూడ భావింతుము. వీనిని దెలిసికొనినంగాని శ్రీరామచంద్రుఁడు భగవదవతారముగాఁ జేయఁబడుటకుఁగల కారణములు సులభముగా బోధపడవు. ఇందుచేతనే రామాయణ కాలము నాఁటికిఁ బూర్వమున్న హిందూదేశ పరిస్థితులనుగూర్చి యిచ్చట శాఖాచంక్రమణముగానైనను ముచ్చటింప బూనుకొంటిమి. ఉత్తర కురు భూములనుండి యార్యులు హిమాలయపర్వత సానువులఁబడి, కనుమలగుండ, హిందూదేశముఁ జొచ్చునప్పటికే యీ దేశము జనాకీర్ణము కాకపోయినను, మానవ సంవాసితమై యుండెననుటకు సందియములేదు. నాగరికతయందు హెచ్చు లొచ్చులున్నను, నీ యాదివాసులెల్ల రొక్కజాతివారనుట యనుమానాతీతంబు; వీరే వేదములు మొదలగు తొలిపలుకులయందు దస్యులనియుఁ బురాణములయందును, నైతిహ్యములయందును, గొన్ని మహాకావ్యముల యందును రాక్షసులనియు, వానరులనియు, స్మృతులయందు ద్రావిడులనియుఁ శూద్రులనియుఁ బేరొక్కనఁబడిరి. కొందఱి యభిప్రాయమున

నీజాతి యార్యులకన్న నధిక నాగరకతకలదనియుఁ గొందఱి మతమున నట్లుకాదని నేఁడు వినుచున్నాము; కాని యార్యుల కన్న నాగరకతయందు వెనుబడియుండెననియుఁ, దారతమ్యము మాత్రమత్యల్పమనియు మా యాశయము. కాకున్ననార్యులు వీరలను దస్యాది నామములచే వ్యవహరింప సాహసించి యుండరు. సంస్కృత గ్రంథములు వివేకముమాని గొంతెత్తి చెప్పుచున్నట్లు వీరు పచ్చిమాంసమును, నర మాంసమును దినెడువారా యనునది విచారణీయము. విరోధులను గౌరవ భావముతోఁ జూచి యున్న సౌజన్యమును, సౌశీల్యమును నొప్పుకొనుట మానవస్వభావముకాని యట్లు కన్పట్టుచున్నది. నేఁడు జర్మను భాషాగ్రంథములు చదివినవారికి "ఇంగ్లీషు" వారును, "ఇంగ్లీషు" భాషాగ్రంథములు చదివినవారికి జర్మనులును రాక్షసులుగాఁ దోఁపక మానరు. విపక్షులను గూర్చి వ్రాసిన సంస్కృత గ్రంథములు చాలవఱకిట్టి భావమునే వెలిపుచ్చెనని మేమభిప్రాయపడుచుంటిమి. ద్వితీయపక్ష రచిత గ్రంథము లేమయిననున్న యెడల దౌర్భాగ్యవశమ్మున మన కంటబడకుండుట శోచనీయము. ఇందుచేతనే ప్రాచీన హిందూ దేశమును గూర్చి యిదమిద్ధమని రూఢిపఱచుటకు మివుల సాహసము కావలయును. ఈ యాదిమ వాసులను మేము ద్రావిడ శబ్దవాచ్యులనుగాఁ జేసినందులకుఁ జదువరులు మన్నింతురుగాత.

నాగరకత్వ తారతమ్యమునుబట్టి ద్రావిడులను రెండు భాగములుగా విభజింపవచ్చును; (1) మాంసభక్షకులు (తారకాదులు) శాకభక్షకులు (వాలిసుగ్రీవాదులు) మాంస

భక్షకులు రాక్షసులనియు, శాకభక్షకులు వానరులనియు వ్యవహరింపఁబడిరి. వానరులకుఁ గిష్కింధా పట్టణమాయువు పట్టు, రాక్షసులకు లంకాపట్టణము గుండెకాయ. రాక్షసులు వివిధాపక్వ మాంసభక్షకులని గీర్వాణగ్రంథములు వాకొను చున్నవి. సింహళద్వీప చరిత్ర పరిశోధనబుద్ధితోఁ జదివిన యెడల నచ్చటి యాదివాసులయిన యక్షులపక్వమాంస భక్షకులుగా నున్నట్లు పొడకట్టును. మలయాల ప్రాంతమున నున్న నొకజాతి స్త్రీ పురుషులందఱు తమపండ్లను నాకు రాయిచేఁ గోరలుగాఁ జేసికొను నలవాటు కలదనియు, నిది యొక కాలము ప్రిందటనున్న నరమాంసభక్షకచిహ్నమనియు నొకరు వాదించు చున్నారు. ఇది నిజమయినను గావచ్చును. ఇంతయేల ? ఆర్యులయందు * నర మేధమను నొకవిధమగు యజ్ఞమాచరణలోనున్నది. నేఁటికిని పసిఫిక్ మహాసముద్రము నందున్న దీవులయందు నరమాంస భక్షకులున్నారు. సమస్త దేశముల యందును నెప్పుడో యొకప్పుడు నరమాంసభక్షకు లుండిరి. ఈ రాక్షసులయందు నెక్కువ పరిజ్ఞానముకలవారు వీర శైవులుగా నుండిరి. ఇందుచేతనే పురాణములన్నియు సామా న్యముగా రాక్షసులను శైవభక్తులనుగా వర్ణించినవి. జాతివిరుద్ధ ముగా నెవ్వఁడో యొక్కఁడు విష్ణుభక్తుఁడుగా నుండెడి వాఁడు. ప్రహ్లాదునకిందుచేతనే యన్ని కడగండ్లు వాటిల్లినవి.

---

* అంబరీషుఁడు రుచికుని కుమారుఁడయిన శునశ్శేపుని లక్షగోవులనిచ్చి యజ్ఞపశువుగాఁ గైకొనియె. బాలకాండము; భాస్కరరామాయణము.

సోమకుఁడు కుమారునిజంపి నరమేధమును జేసెను.

అరణ్యపర్వము తృతీయాశ్వాసము భారతము.

ఈ ద్రావిడులకుఁ బట్టణములు కాని, పల్లెలు కాని, మొట్టమొదట లేవు. నేఁటి కోయ, చెంచు మొదలగు జాతులంబలె, నే చింతతోఁపులయందునో, యే చెట్టుల మధ్యనో, తాత్కాలిక కుటీరములయందు నివసించు చుండిరి. వీరు వనాటులు. చీమలు దూరని చిట్టడవియైనను, కాకులు దూరని కారడవియైనను, మూలమట్టుగ వీరికవగతము. అడవుల యందున్న దొంగదారులను, సందుగొందులను, వీరు బాగుగా నెఱుంగుదురు. అటవీరాజ్యమే వీరి రాజ్యము; అడవులుకూడ వీరి నామములచేతనే పిలువంబడుచుండునవి. అటవీ రహస్య జ్ఞాన మార్యులకు లేకపోవుటచేత రాత్రులడవులు బాగుగ నెఱింగిన ద్రావిడులకు మిగుల భయపడుచుండువారు. రాక్షసులకు రాత్రులు బలమెక్కుడని చెప్పు పురాణాదుల వాక్యములకుఁ గారణమిదియే.

వీరికి వైవాహిక నిబంధన లేవియులేవని చెప్పవచ్చును. అన్న భార్యను దమ్ముఁడుంచుకొనుటయుఁ; దమ్మునిభార్యను నన్నయుంచు కొనుటయు దోషము కాదయ్యె. సోదరీసంపర్కముకూడ హేయముగాఁ దలంపఁ బడినట్లు కన్పడుటలేదు. ఈజిప్టు దేశమునందుఁ జిరకాలము క్రిందట రాజవంశమునకు సాంకర్యము కల్గుననిచెప్పి యేకగర్భజాతులే పెండ్లియాడు చుండిరి. బోర్నియో దేశము నందిప్పటికిని నక్కచెల్లెండ్ర బిడ్డలకును నన్నదమ్ముల బిడ్డలకును వివాహములు గలవు. రషియా దేశపు చక్రవర్తికుటుంబమునఁ దఱచిట్టి యుద్వాహములు జరుగుచుండెడివి. వర్తమాన కాలంబున మహమ్మదీయుల యందును, క్రైస్తవులయందును నిట్టి పెండ్లిండ్లున్నవి.

ఎక్కడికో పోవుటేల మనకు నేవమును బుట్టించు కొన్ని విధములగు పెండ్లిండ్లు శుద్ధద్రావిడ దేశమయిన మలయాలము (కేరళదేశము) నందు నేటికిని నాచార మందున్నవి. ఈ ద్రావిడులు సర్వసాధారణముగఁ జెట్టు ను, బుట్టను, తాయిని అప్పను, వేయేల జంతుసామాన్యమును దేవరలగాఁ దలంచి పూజించువారు. తెలుఁగు దేశము మొదలు కన్యాకుమారి యగ్రము వఱకుఁగల పల్లెలలోను, బట్టణముల లోను, నీ దేవరలను నేటికిని జూడనగును. కాలక్రమమున నీ రాయిరప్పలు పోలేరమ్మ, అంకమ్మ, మద్దిరామమ్మ, పోతరాజు మొదలగు గ్రామదేవతలుగా మాఱి జన్మస్థాన మయిన ద్రవిడదేశమును వదలనేరక నేటికిని నిండెతాండవ మాడుచున్నవి. క్రమక్రమముగా నియ్యవి తెలుఁగు దేశమున రూపుమాయుచున్నను, నఱవదేశమునఁ జూరుపట్టుక వ్రేలాడుచు గ్రామరక్షణఁ జేయుచునే యున్నవి. ఇంతియ కాక నాగుల చవితినాఁడు పూఁబోఁడులెల్లరు పాలు పుట్టలలోనున్న పాముల పాలుసేయుచుండుట మనము చూచుచునేయున్నాము. నాగేంద్రస్వామియని పేరుచెప్పి యువతీ జనంబు తమతమ పిల్లల జుట్టును భక్తిపురస్సరంబుగా నర్పించి సంతసించుట కాంచుచునే యుంటిమి. వేల యేండ్లు కడచినను నిట్టివి తెలుఁగు దేశమున రూపు మాయకుండుట కడు చిత్రము. ప్రాచీనాచారములయందు హిందువులకున్న మూఢ విశ్వాసమే యిందులకుఁ గారణము.

ఆర్యులు

దేశమిట్టి స్థితియందుఁడఁగా నుత్తర కురు భూముల

నుండి యార్యులు హిమాలయ దరీముఖద్వారములను దీఱి హిందూదేశముపైఁబడి ద్రావిడులను దక్షిణాపథమునకుఁ దఱిమిరి. మొట్టమొదట వీరతిసారవంతములగు సింధు గంగా నదీ ప్రాంత భూముల నాక్రమించుకొనిరి. ఇచ్చటనే యార్య ద్రావిడులకు భయానక యుద్ధములు సంభవించెను. కొన్నియెడ లఁ దుములసమరములు, కొన్నియెడలఁ దులారణములు గల్గి కొన్ని వందల యేండ్లు వఱకు జయాపజయములు నిర్ణ యింప వలను పడదయ్యెను. క్రమ క్రమముగా ద్రావి డులు వీఁగిరి. ఆర్యులు వీరలను దక్షిణ దిక్కు-నకు నెట్టి వేసిరి. ఈ యుద్ధములనే పురాణాదులు దేవదానవ యుద్ధ ములుగా వర్ణించినవి. తుట్టతుదకు నీ యార్య జైత్ర యాత్రా సముద్రమునకు వింధ్యపర్వతపంక్తి, చెలియలి కట్టయైనది. జాతివైషమ్య మప్పుడే యంకురించినది. నాఁటి నుండియు వింధ్యపర్వత దక్షిణభూమి పాపభూమియనియు నుత్తరదేశము పుణ్యభూమి దేవభూమి, నార్యావర్తమనియు, బ్రహ్మావర్త మనియు, బ్రహ్మర్షి దేశమనియు సంస్కృతకవుల గ్రంథములయందు వాసికెక్కెను. చిరకాలమువఱకునార్యులు వింధ్యపర్వత పంక్తి నుత్తరించి దక్షిణాపథమునకు రాఁబ్రయ త్నింపరైరి. వీరి మాతృభాష గీర్వాణము. అందుచేతనే యీ కాలమందు దేవభూమియందు వ్యవహరింపఁబడుచున్న గీర్వాణమునకు దేవ భాషయను నామము కల్గినది. వింధ్య పర్వతము నుత్తరించి ద్రావిడులకు సనాతనధర్మము బోధింప మొట్టమొదట వచ్చినది యగస్త్యుఁడు. దీని నాధారముఁ జేసి కొనియే పురాణములు సూర్యున కడ్డమయిన వింధ్యపర్వత మును నగస్త్యుఁ డణఁగఁద్రొక్కెనను గాథను గల్పించినవి.

ఆర్యశబ్దమునకుఁ గృషీవలుఁడని కొందఱర్థముఁ జెప్పు చున్నారు. ఈ యర్థమెట్లున్నను హిందూదేశముఁ జొచ్చు నప్పటికి నార్య సంఘము త్రివర్ణముగా విభజింపఁబడి ధర్మ బద్ధమై యుండెను. బ్రహ్మ క్షత్రియ వైశ్యులను, మూఁడు వర్ణములే నాఁడార్య సంఘమందున్నవి. ద్రావిడులతో జరి గిన యుద్ధముల పిదప, విజితులయిన ద్రావిడుల నండఱను గల గూరగంపఁజేసి శూద్రు లనునామకరణముతో నాల్గవ వర్ణ మని చెప్పిరి. ఇందుచేతనే యార్యులకు మాతృభాష యగు గీర్వాణమును నాల్గవవర్ణమగు శూద్రులభ్యసింపఁగూడదనియు శాసింపఁబడెను. జాతివైషమ్యము పెచ్చుపేఁగిన కొలఁది వీరికి మానవసామాన్యములగు స్వత్వములు నిషేధింపఁబడెను. వైశ్యులకు పాశుపాల్యము నియత ధర్మముగా నిర్ణయింపఁ బడెను. ఈపాశుపాల్యము నాగరకత నిశ్రేణికయందు మొదటి మెట్టని మాయాశయము. కాన మృగదశనుండి కంటంబడిన వన్యమృగముల మీఁదను, నాకలముల మీఁదను, గాయ గసరుల మీఁదను నాధారపడక గోవులనుబెంచి పాలరుచి యెఱుంగుటచే ద్రావిడులకన్న నెక్కువ నాగరికత కలవారని భావించుచుంటిమి. ఈ తారతమ్యము మాత్రమత్యల్పము. ఇయ్యది యీ పీఠికను సాంతముగాఁ జదివినవారికి బోధపడఁ గలదు.

సారవంతమై, ఫలభారనమ్రతరుసమావృతమై, పుష్ప లతాపరిష్కృతమై, నిర్మలోదక నదీ సంసేవితమై, నందనో ద్యానముంబోలియున్న యీ హిందూదేశ మార్యులకు మిఱు మిట్లుగొల్పి, యాశాబద్ధులంజేసి యిఁక నెలవు లేర్పఱచి కొనుటకు బుద్ధిపుట్టించుటంజేసి, నేఁటి కియ్యది వారి జన్మ

భూమియయ్యెను. వీరు సంపూర్ణ మాంసభక్షకులుగా నుండు టయే కాక గోమాంస భక్షకులుగాఁ గూడనుండిరి. ఇంతియ కాక గోమేధము పుణ్యకార్యముగాఁ గూడ భావింపఁబడెను. నరమేధముకూడ నచ్చటచ్చట యవలంబింపఁబడుచుండెను. భవభూతి యుత్తర రామచరితలో వాల్మీకి కాతిథ్యమొసంగు సందర్భమున జాగరూకులమై పరీక్షించినచో వసిష్ఠుఁ డెట్టి తఱపి పెయ్యను జంపి విందు చేసినది తెలియఁగలదు. ఒక మహారాజు నిత్యబ్రాహ్మణ సమారాధనకయి గోవులనుజంపి యా చర్మములను మెట్టగా వైచిన నందుండి ప్రవించిన ద్రవమే (ఇప్పుడీ నది "చంబల్" అను పేరుతో వ్యవహరింప బడుచున్నది.) చర్మణ్వతీ నదియయ్యెనన్న భారతకథ మన కన్నులం దెఱచి సత్యమును మోమోటము లేకుండఁ జూపిం పఁగలదు. నేఁడు మాంసభుక్కుల యిండ్లకుఁ జుట్టములరుదెం చిన వెంటనే యే గోడినో, కోయుచుండునటుల బూర్వ మతిథి యింటికి వచ్చినచో నాఁబెయ్యను జంపి వండుట యాచారముగా నుండెను. ఏతత్కారణంబున నతిథి "గోఘ్నుఁడు" అను బిరుదముఁ దాల్చెను. వలయునేని యిఁకను బెక్కుదాహరణములను జూపింపఁగలము.

వీరి వైవాహిక నిబంధనలు ద్రావిడుల సంబంధము లట్లు హేయముగనే యున్నవి. పున్నామనరకమునుండి తప్పించుకొనుటకుఁగా సంతాన లాభమునకై యొక ఋషి మఱియొక ఋషిపత్నిని "బాడిగ"యైన లేకుండగనే గ్రహించి పుత్రసంతాన ప్రాప్తియగుదు మరల నంపివేయుట తటస్థించు చుండెను. ఒక స్త్రీ పలువుర మగలను గైకొనుటకాని, యొక పురుషుఁడు పలువుర స్త్రీలను గైకొనుటకాని, దోషము

కాదయ్యె. పంజాబు దేశమునందు నొక తెగ హిందువుల యందు నన్నచమ్ములందఱు నొక యుమ్మడి భార్యను సంపాదించుకొను నాచారము నేటికిని ప్రబలి నిరాటంకముగా సాగుచున్నది. ఎవ్వాడయినఁ దెగించి యీయాచారమునకు వ్యతికరించి పెండ్లాడినచోఁ దత్సాంఘికులు వానిని గొంచెము వానినిగాఁ జూచుచుందురఁట.

ఉత్తర కురుభూములనుండి వచ్చిన యార్యులు తమ జన్మస్థానమును దేవలోకమనియు, ద్రివిష్టపమనియుఁ దమ గ్రంథములచేఁ జెప్పించిరి. ఈ త్రివిష్టపమే "టిబెట్" అని యిప్పుడు పిలువఁబడుచున్నదని కొందఱి చరిత్రకారుల యాశయము. "టిబెట్" పీఠభూమి, అనఁగా హిందూదేశపు మైదానమునకు సుమారు మూఁడు మైళ్ళ యెత్తున నుండును. ఇంత యెత్తున నుండుట చేతనే త్రివిష్టప మాకాశమందున్నదని పౌరాణికులు చెప్పిరి. ఈ చరిత్రకారుల యభిప్రాయము నిజమనుటకుఁ గొన్ని బలవత్కారణములు గన్పట్టుచున్నవి. మన హిందూదేశమునకును నీ త్రివిష్టపమునకును, నెంత చుర్గమైనను దారియొకటి కలదని పురాణములు చదివిన వారికెల్లరకుఁ దెలియఁగలదు. పురాణము లెట్టి దానులు కల్పించిన నేమి ? స్వర్గలోకమునఁ బూజ్యార్హుఁడును, దేజోవంతుఁడును, ప్రబలు నమ్మఁగల రాజు లేకపోవుటచే స్వర్గలోక వాసులు మన హిందూదేశమునకు వచ్చి, యసమాన ప్రజ్ఞాధనుఁడైన నహుషునింగొనిపోయి పట్టాభిషిక్తునిం జేసిరి. కృష్ణుఁడు సత్యభామా సమేతుఁడయి, కల్పవృక్షమునకయి స్వర్గలోకము పయి దాడి వెడలియుండెను. అర్జునుఁడు కూడఁ గారణాంతరములచే స్వర్గలోకమును జూడఁబోయెను. అనఁగా "జనక

తండ్రి" యింటికిఁబోయెను. అప్పుడర్జునుఁడు స్వర్గలోకమునఁ జూచిన యాచారవ్యవహారములకును, నేఁటి టిబెట్టులోనున్న కొన్ని యాచారవ్యవహారములకును, భేదము రవ్వంతయుఁ గానఁబడదు. స్వర్గలోకమున స్త్రీ పురుషులకు వావివరుస లక్ష్యములేను. టిబెట్టునందు నంతియే. స్వర్గలోకమున స్త్రీ పదిమంది పురుషులను గొంగునముడివైచి, "టింగురంగా" యని తిరుగవచ్చును. టిబెట్టునందు నంతియే. ఈ యాచారమే టిబెట్టునుండి యార్యుల మూలమునఁ బంజాబు దేశంబున కాలి చప్పుడు కాకుండఁబ్రవేశించినది. ద్రౌపదీదేవి వివాహము దీని ఫలమని మా యాశయము. దీనికిఁ బూర్వము కూడ నిట్టి యుద్వాహములున్నవని పురాణముల వలన మనకుఁ దెలియుచున్నది. గౌతముని కూఁతురగు జటిలయను బ్రాహ్మణకన్య యేడ్వురను, భార్గ్యయను ఋషికన్య పదిమందిని బెండ్లాడువఱకుఁ దనివిఁజెందలేదఁట. ఇట్టి వివాహము లింకను బంజాబు దేశమునందున జరుగుచునే యున్నవి. స్వర్గలోకమున నతిథితో వ్యభిచరించుట దోషముగాఁ బరిగణింపఁబడదు. టిబెట్టునందు నతిథికి భార్యను వ్యభిచారమున కయి సమర్పించు నాచారము గొన్ని చోటుల నింకను బ్రబ ర్తిల్లు చున్నది. ఈ కారణములచే "టిబెట్" ప్రవిష్టపమగు నేమో యని భావింప ననువగుచున్నది. పూర్వోదాహృత పరిస్థితులన్నియు నాఁడు నాగరకత శైశవావస్థ యందున్నదని బుజువుచేయునని నమ్మెదము. వీనిని దిలకింప నార్యద్రావిడ నాగరకతా తారతమ్య మిసుమంతయని తోఁపకమానదు.

రామాయణ కథాకాల హిందూదేశము,

ద్రావిడులు (వానరులు)

రామాయణ కథాకాలమునాఁడు ద్రావిడ దేశము (అనఁగా వింధ్యపర్వత దక్షిణదేశము) సాంద్రారణ్యములతో గీచు మనుచున్నది. ద్రావిడులు చెట్టులం, గుట్టలం బట్టి యుండిరి. మానరక్షణకై వస్త్రధారణముఁ జేయుచుండిరి. నేఁటి తెలుఁగు దేశము దండకారణ్యముగా నుండెను. పంచవటి, జనస్థానము మొదలగు పల్లెలుదక్క నీ యరణ్యము నిర్మానుష్యము కాకపోయినను నిష్పల్లి యని చెప్పవచ్చును గాని కొన్ని కొన్ని భాగములు రాక్షసుల యేల్బడి బడియున్నవి. బళ్ళారి ప్రాంతము జనాకీర్ణమై యుండెను. ఇదియే రామాయణమునందు సుప్రసిద్ధమగు కిష్కింధాపురసీమ. రావణాపహృతభార్యుఁడై శ్రీరామచంద్రుఁడు వర్షకాలంబున సీతావియోగ దుఃఖముచేఁ గృశించి, కృశించి, కాపురము చేసిన మాల్యవంతమిదియేయని తత్సీమ వాసులు చూపించుచుందురు. ద్రావిడ జాత్యంతర్భాగమగు వానర లోకంబునకు నిదియే మునికి పట్టు; ఇంతకుమున్ను సుప్రసిద్ధ వానరులుకాని, వానరనగరంబులు కాని యున్నజాడ పొడకట్టదు. ఇప్పుడిప్పుడే వానరులాటవికదశనువీడి నాగరకు లగుచున్నారు. అనఁగా నడవులలోను, గొండల మీఁదను, తోఁపులలోను దలదాఁచుకొనుట మాని పట్టణంబులఁ గట్టికొని యందు వాసమును జేయుటకుఁ బ్రారంభించిరి. ఇందుచేతనే యొక్కకిష్కింధాపట్టణము దక్క వానరులకుఁ బట్టణములు లేవు. రామాయణ కాలమున వాలి వానరసార్వభౌ

ముఁడై యిచ్చట నతిపూజ్యముగ రాజ్యమేలుచుండెను. పరిసర దుర్గమ దుర్గములు, నరణ్యములు, చిన్న చిన్న పల్లెలతో నిండి యుండెను. ఇయ్యవి యొక్కొ-క్క దండనాథుని యాధిపత్య ములో నుండెడివి. జాంబవంతసుషేణ, నల, నీల, మైంద, ద్వివిదాదు లీ పల్లెలకు రాజులు. వాలిసార్వభౌముని సరదార్లు. ఈ ద్రావిడ యోధులకెల్లను గిష్కింధాపట్టణము గుండెయ.

వీరికింకను నార్యసంపర్కము కలుగలేదు. కాని యార్యులు (అనఁగా ఋషులు) దండకారణ్యముఁ బ్రవేశించి యచ్చటచ్చట పల్లెలం గట్టుకొనిరి. ఈ జాతిద్వ్యయమున కింకను బరిచయము కలుగలేదు. దేశదిమ్మరియైన హనుమం తుని వంటివాఁడెవ్వఁడో యీపాటి పల్లెలను జూచియుండును. రామాయణమువలన హనుమంతుఁడు నాల్గునాళ్ళపట్టపవలుగ ఋషుల సాహచర్యమనుభవించెనని తెలియఁగలదు. ఈ సాహచర్యమే వీనికొంపఁదీసి రామునకు దాసానుదాసునిగఁ జేసినది. కాని యార్యుల యాచార వ్యవహారము లింకను వానరుల తలకెక్కలేదు. ఇందుచేతనే వానరులకుఁ గల్లు ద్రాగుట మొదలగు నార్యుల సుగుణంబులు పట్టువడలేదు. యజ్ఞయాగాదులు వీరెఱుంగరు. బలులు వీరెఱుంగరు. మాంస భక్షణంబు వీరెఱుంగరు. జైత్రయాత్రలనిచెప్పి దేశమును సంక్షోభింపఁజేయుట వీరెఱుంగరు. ఏ పుట్టతేనెయో ద్రావుచు, నే మావిపండో కడుపారఁదినుచుఁ గాలక్షేపముఁ జేయుచుం డిరి. భార్యలు తారుమారగుచున్నను బెండ్లిండ్లు గొంత వరకు కట్టుదిట్టములకు లోఁబడినవి. గృహచ్ఛిద్రములకుఁజిక్కి వాలి సుగ్రీవుని నిల్లువెడలఁదరిమి యాతని భార్య రుమను గ్రహించెను. ఇటులే వాలి వధానంతరము తద్భార్యయగు

తారను సుగ్రీవుఁడు గైకొనియెను. గృహస్థాశ్రమ మత్యవసర మను నభిప్రాయ మప్పటికి లేదు. ఆర్యాలం బోలి వీరికిఁ బున్నామ నరకము లేదు. ఇందుచేతనే హనుమంతుఁడు బ్రహ్మచారిగా నుండెను.

"వానరులు" అనఁగా వికృత నరులు, అనఁగా సౌందర్య విహీనులు. ఇట్టిజాతులింకను నీలగిరి మొదలగు కొండల మీఁదను, నరణ్యముల యందున్నారు. * సవర (శబరు)ల యందు "అరసి" యనుజాతి యొకటియున్నది. అరసి యనఁగా క్రోఁతి యని యర్థము. ఈ జాతినే "లంబోలంజ్" అనికూడ పిలుచుచుందురు. అనఁగా దీర్ఘ వాలము కలవారని యర్థము. దీర్ఘ కౌపీనము పెట్టుకొనుటచే దీర్ఘ వాలము కలవారని పిలువం బడుచుండిరి. ఇంతియే కాని తోఁకలున్నవని తలంపము. రామాయణమున రుమతారలను వర్ణించునప్పుడు వాల్మీకి తోఁకలున్నట్లు చెప్పలేదు. హిమాలయసాంద్రారణ్యములోఁ గూర్చుండి రామాయణము ప్రాయఁబూనిన వాల్మీకి వానరులు కోఁతులవలె నుందురనివిని, తత్కారణంబునఁ దోఁకలు కూడ నుండునని భ్రమపడి యచ్చటచ్చట వీలయినప్పుడెల్ల వానరులకుఁ దోఁకలు తగిలించినాఁడని తలంతుము. జాంబవంతుని కూఁతురగు జాంబవతిని కృష్ణుఁడు పెండ్లాడెను. వ్యాసభట్టారకుఁడు జాంబవతికిఁ గూడఁ దోఁక తగిలించక పోవుటయేకాక మానవ స్త్రీని వర్ణించునటుల వర్ణించెను. పసి కూనయగు జాంబవతి యుయ్యెల తొట్టిలో శమంతకమణి కట్టుట మానవస్వభావమునే తెల్పుచున్నది. శీత వాతాతప

---

* గంజాము, విశాఖపట్టణము (నేటి శ్రీకాకుళము) జిల్లాల యందున్నారు.

బాధల మాన్చుకొను వెఱవెఱుఁగక యెండకు నెండుచు వానకుఁ దడియుచున్నచో వికృతరూపము లలవడు టస్వాభావికముకాదు. నరులకు వానరులకు వివాహము జరుగుచున్న యప్పుడు వీరికిఁ దోఁకలెట్లు వచ్చును ? మగ కోఁతులకుఁ దోఁకలుండుటయు, నాఁడకోఁతులకుఁదోఁకలు లేకపోవుటయుఁ దటస్థించెనందురా ? వాలిడికోఁతులను జూచితిమికాని యాడ మగ కోఁతులకు దోఁకలులేవు. కాన వానరులకు వాలములు గలవను పలుకులను మేము విశ్వసింపఁజాలము. నిజముగ నీ వానరులు మృగములే యగునెడల మనుష్యులకును, వీరికిని వైవాహిక సంబంధ మెట్లుండును ? సంతాన మెట్లు సంభవించును? సుగ్రీవుఁడన్నపైనున్న కసిదీర్చుకొనుటకై యుచితానుచితములు మఱచి శ్రీరామునకుఁ జెలిమికాఁడై హనుమదాదుల తోడ్పాటుచే రావణుని జంపించి లంకారాజ్యము రామునకుఁ గైవసముం జేసెను. "జ్ఞాతిశ్చేదన లేనకిమ్న"ను నార్యోక్తి నీ యెడ మఱవఁదగదు. ఆర్యుఁడగు శ్రీరామచంద్రునకు సాయపడుటచే గ్రంథము లార్యకవులు వ్రాయుటచే వీరు దేవాంశ సంభూతులైరి. బ్రహ్మకూడ నరుఁడుగాఁబుట్టక వానరుఁడుగ నేలపుట్టవలయునో ? దృష్టి దోషము తాకుననియా ? లేక బుద్ధి జాడ్యమా ?

రాక్షసులు

బళ్ళారికి మిగుల దిగువనున్న దక్షిణా పథమంతయు మాంసభక్షకులగు ద్రావిడుల (అనఁగా రాక్షసుల) స్వాధీనమందున్నది. కిష్కింధా పురమునుండి లంకా దిగ్విజయయాత్రకై శ్రీరాముండు బయలుదేరిన పిదప నెచ్చటను మున్యాశ్రమములు లోచనగోచరము కాలేదు. ఇందుచేఁ

గిష్కింధకు దిగువనున్న యరణ్యములను ఋషులు [అనఁగా] ఆర్యులు చొరనట్లు స్ఫుటమగుచున్నది. వానరరాక్షసులకుఁ గూడ సంఘర్షణ మత్యల్పము; సర్వోపపంచ విజిగీషాపరవశుఁడైన రావణునకు నేవాలిచేతనో పరాభవమగుటతక్క పరస్పర వైషమ్యము లేదనియే చెప్పవచ్చును. వీరు సర్వసాధారణముగా వీరశైవులు. రామాయణ కథాకాలమునకుఁ బూర్వము వీ రార్యులచే సంపూర్ణపరాజితులగుటంజేసి ముఖాముఖి యుద్ధమునకుఁ దొడరక కన్నాటి యుద్ధమునకుఁ జొచ్చిరి. పురాణములయందుఁ బెక్కుచోట్ల వీరు దేవతాస్త్రీలను, రాచకన్నియలను బలాత్కారముగను, మాయవేషములతోడను, మోసగించియుఁ గొనిపోవుట నెఱుంగుదుము. ఈగతి పగతురకు మనోవైక్లబ్య మాపాదించుచుండిరి. వీరి వివాహములన్నియు బలాత్కార వివాహములుగనే యున్నవి. అందుచేతనే బలాత్కారవివాహములు రాక్షసవివాహములని పేరొక్కనఁబడుచున్నవి. వేదాదులయందు వీరుదస్యులనంబడిరి. ఎదుటంబడి యార్యులతోఁబోరి గెలువంజాలక, రాత్రులార్యుల పల్లెలపైఁబడి గందరగోళముఁజేసి యార్యయువతీ జనంబును హరించుకొనిపోవుచుండిరి. వేదములయందున్న దైవప్రార్థనలలోఁ జూలవఱకు నార్యులను దస్యులనుండి కాపాడు నిమిత్తమేర్పడినవి. వీరికి వైవాహికములున్నను, వీరియందు స్వైరవిహారధీరలు చాలమంది కలరు. అజవక్త్రియను రాక్షసికి వ్యభిచారమే యొకనోముగా నుండెనఁట. జరభీ సంతానము నింద్యముగాఁ బరిగణింపబడినదికాదు. ఈ కాలమున పరాజితుల భార్యలతోఁగూడ నిస్తువునంతయు స్వాధీనపఱచుకొనుట యాచారమై, ధర్మవిరుద్ధము కాదయ్యెను. ఈ

యాచారము వానరులయందుఁగూడ నున్నయది. ఇందు వల్లనే వాలి భార్య తారను సుగ్రీవుఁ డుంచుకొనుట తటస్థించినది.

రాక్షసులలోఁగాని, వానరులలోఁగాని, యార్యులలోఁగాని పోడశవర్షాత్పూర్వము కన్యావివాహములు దలపెట్టుట యెఱుంగము.వినను లేదు.కననులేదు.ఇట్టి యధర్మవివాహముల నాదేశించు మునిరూపశార్దూలుకును లేరు. రామాయణ కాలమున నార్యులయందు దోషములుగాఁ బరిగణింపబడు చున్న యాచారములు వీరిచే హేయములుగా నెంచబడక యనుష్ఠింపఁబడుచున్నవి. వీరు మాంసభక్షకులు, సురాపాన ప్రియులు. కాని సురసేవ్యమానమగుటచే సురయయ్యేనేమో యూహింపఁదగియున్నది. రాక్షసులకు మానవులకు నిరా టంకముగా నుద్వాహములు జరిగియుండుటచేతను, నర మాంస భక్షకులని చెప్పఁజాలము. పైపెచ్చు రామాయణము రావణుని నరమాంసభక్షకునిగాఁ జెప్పియుండలేదు. ఆర్యు లకుఁ బ్రత్యర్థులగుటంజేసి గీర్వాణకవులు వీరియెడ మాత్సర్య జనిత భావములను గుప్పియుందురు. ప్రహ్లాదునివంటిభక్తుఁడు, బలివంటి వదాన్యుఁడు, వృత్రునింబోలు తత్వవేత్త, హిర ణ్యాక్షునివంటి రణనీతిబద్ధుఁడు, రావణునివంటి యంతర్వాణి యార్యులయందు సైతమెందరున్నారో ప్రవేలుమడంచిలెక్కిం చినఁ దెలియనగు. రాజ్యకాంక్షచే సవతితల్లి గర్భస్థ పిండ ముల ఖండించిన క్రూరుఁడు, సోదరుఁడగు విశ్వరూపుని తలఁ దునిమిన నిర్ఘృణుఁడు, పూజ్యయగు మునిపత్నిని మోసగించి వ్యభిచరించిన నీచుఁడు, చేసినమేలు మఱచి ప్రాణదాతతో డీకొనిన కృతఘ్నుఁడు నయిన యింద్రుఁడు త్రైలోక్యపాల

కుండఁట. బలి హింతవ్యుఁడట ! ఇయ్యది సంస్కృత కవీం
ద్రదలేఖినీ మాహాత్మ్యముకాదా ?

రామాయణకాలమున రావణాసురుఁడు వీరి రాజేం
ద్రుఁడు. వీరికి లంకాపట్టణము గుండియ. త్రిశిరుఁడు మొద
లగు వారలు ప్రతినిధులై దక్షిణాపథమునునేలుచుండిరి. దక్షి
ణాపథముననున్న యరణ్యసీమ శూర్పణఖ కరణముగా నిచ్చిన
యుద్యాన వాటిక. తిరుచునాపల్లి యియ్యది నిజమని సాక్ష్య
మిడుచున్నది. ఈ త్రిశిరుని ద్రావిడ నామము తిరుసీరు;
ఈ తిరుసీరునే త్రిశిరునిగాఁజేసి సంస్కృత కవులు మనకు
వీనిని మూడు తలల వానిగాఁ జూపించిరి. ఇట్టులే దశశాస్త్ర
నిష్ణాతుఁడయిన దశవదనుని బదితలల రావణాసురునిగాఁ జేసి
యుండిరి. ద్రావిడ శబ్దములను బెక్కింటిని సంస్కృత శబ్దము
లుగాఁ జేసియుండిరనుటకుఁ బె క్కుదాహరణములను జూపఁ
గలము. దీనిఁగూర్చి వేఱుగ్రంథమునఁ జర్చింపఁదలంచి యిట
విడుచుచున్నారము.

రామాయణ కాలమునాఁటికి నార్యసంఘమునందుఁ
బెక్కు మార్పులు గలిగెను. గోమాంసభక్షణము త్యజింపఁ
బడుటయే కాక దూష్యమనికూడ భావింపఁబడఁ జొచ్చెను.
కాని మాంసభక్షణం బన్ని కులములయందు దినదినాభివృద్ధి
గాంచుచునే యుండెను. "మధుసేవఁజేయఁడు, మాంసంబు
ముట్టఁడు." అను రామాయణ వాక్యము దీనికి సాక్షీభూత
మగుచున్నది. కల్మాషపాదునియింట బ్రాహ్మణుండొక్కఁడు
మాంసభక్షణముఁ జేసెనన్న భాగవతకథ దీనిని బలపఱచు
చున్నది. ఇంత యేల ? కం॥ "పిత్రాకార్య యజ్ఞ ముఖ
ముల శ్రుతిచోదిత హింసఁ గీడు జొరనేరదు." అను భారత

నీతి యొక్కటియే మా వాక్యములను స్థిరపరచును సోమ పానంబను మిషచేఁ గల్లుఁ ద్రావుట పవిత్ర కార్యముగనే యున్నది. సోమలతరసమయినను, ద్రాక్షారసమయినను, ద్రాటిరసమయినను, మద్యములే యగుటంజేసి మా యభి ప్రాయమునఁ దుల్యములే. ఏతత్పూర్వము బహుళవ్యాప్తిలో నున్న నియోగము గర్వ్యామై, నామమాత్రావశిష్టముగా నున్నది. జీర్ణావస్థలోనున్న యీ నియోగమునే వ్యాసభట్టా రకుండు పునరుద్ధరించెను. ఈషణాత్రయ భేదముతో నీ నియో గము నేటికిని నోఢ్రులయందున్నది. వేదకాలమునుండి యున్న యనులోమ, విలోమ వివాహములు మాయమై యేక కులమునందే వివాహములు సంభవించుచుండెను. యయాతి దేవయానులీయాచారమును దిరస్కరించి పెండ్లి జేసికొనిరి. వారి సంతానము దూష్యము కాలేదు. బహు పతిత్వము హేయముగాఁ బరిగణింపఁబడుటఁజేసి కానలమల్లా డఁజొచ్చెను. "వ్యాసో నారాయణో, హరి" కరుణాకటాక్ష మునఁ బాండవులు ప్రాపడిన యీ యాచారమునకు జీవముఁ బోసిరి. బహుపత్నిత్వము తప్పను నభిప్రాయమునప్పుడప్పుడే మోసులెత్త సాగినది. ఇందుచేతనే రామాయణము నందు రాముని యేకపత్నిత్వమునకు నవసరమయినంత ప్రాముఖ్య మొసంగబడినది. తుట్టతుదకీ యేకపత్నిత్వమే రాముని నవ తార పురుషునిగాఁ జేసివైచినది. వైవాహిక ధర్మ ముచ్చ స్థాన మలంకరించినది. కాని యనులోమ వివాహములు నిరా ఘాటముగా జరుగుచునే యున్నవి. ఒక్క వసిష్ఠుని వంశముఁ దీసికొని విచారించినయెడల సత్యము బోధపడగలదు. వసి ష్ఠుఁడు బ్రాహ్మణుఁడు. భార్య యరుంధతి మాల; కుమా

రుండు శక్తిమహాముని, తదాభార్య పుంగనూరు మాదిగ; శక్తి మహాముని కుమారుఁడు పరాశరుఁడు, భార్య బోయ; చాల బ్రాహ్మణ కుటుంబము లిట్లున్నట్లే పొడకట్టుచున్నవి. కాని నేఁటి బ్రాహ్మణులు బ్రహ్మముఖమునుండి యూడిపడితిమను చున్నారు. వంశవృక్షమును బరిశీలించిన యెడల నెక్కడ నుండి యూడిపడినది తెలియఁగలదు. సాంఘిక దౌర్జన్యము మతము నొకమూలకుఁ బారఁద్రోలుటచే నాముష్మిక చింత రెండవది యైనదని చెప్పసాహసించుచున్నాము. వారిపేరున, వీరిపేరున, దొంగస్మృతులు వ్రాయుటప్పుడే యారంభమైనది. ఈ వ్రాతలకుఫలముగా శ్రీరామచంద్రుఁడు "కృశాంగున్, నిరాహారున్ శోణజటాచ్ఛటాధరు మహోగ్రాచాము నేకాగ్రతా పారీణాత్మ నధోముఖున్ భసితశుంభత్కాండుర శ్రీనిధిన్, ధీరత్వాకరు, జీరధారు, దీవ్యత్తపస్వాన్వితున్," అయిన శంబుకుని శూద్రుఁడని యనుకంపాశూన్యుఁడై, కత్తికి బలి యిచ్చెను. నేఁటివలె వరుఁడు వధువునకన్నను బెద్దవాఁడుగా నుండవలయునను నియమములేదు; శ్రీరామచంద్రుఁడు సీతా మహాదేవి కన్నను జిన్నవాఁడు. 'పదియేనేఁడుల బాలుఁడు' 'కాకపక్షసంయుతుఁడు' అగు రాముఁడు తరుణవయస్కయగు సీతను బెండ్లియాడెను. పంజాబు క్షత్రియులయం దమ్మలక్కలిట్టి పెండ్లిండ్ల నుబుసుపోకకుఁ జెప్పికొనరు. ఇట్టి వివాహమొక్కటి మే మెఱుంగుదుము.

ఈ కాలంబున నార్యులు రాజకీయవిషయంబులం దపారవై దగ్ధ్యంబును గౌశల్యంబును గడించిరి. నయవర్త్మ మూహసనుబడెను. తంత్రము విస్తరించెను; కౌటిల్యమును బ్రకటించియైన నభీప్సితంబులఁ బొందుటకు వెనుదీయరైరి. ఋషు

లకుఁగూడ రాజ్యరక్షణమే పరమావధియయ్యెను. ప్రత్యేక వ్యక్తి నశించి యంతయును రాజునందు మూర్తీభవించెను. రాజు "నారాయణుఁపృథివీపతి" యయ్యెను. పొట్టకూటికై యార్యులు దేశభ్రమణంబుమాని పల్లెలంగట్టుకొనిరి. పల్లెలెల్లను బట్టణంబులుగా మారెను. భిన్నరాష్ట్రము లేర్పఱిచికొని రాజులు ప్రజానురంజకముగా నేలుచుండిరి. భూమి నదీమాతృకయగుటంజేసి, 'అకృష్టపచ్యా ఇవసస్యసంపద' ప్రజలను సంతృప్తులను జేయుచుండెను. జార చోర భీతిలేక రాష్ట్రములు నిత్యకళ్యాణము, పచ్చతోరణములుగఁ జెలఁగుచుండెను.

సూర్యవంశ మూర్ధన్యులయందు మిగుల మన్నింపఁబడుచుండెను. సూర్యవంశ్యులకు సాకేతంబు (అయోధ్య) రాజధాని; ఉత్తరహిందూస్థాన మిట్టిస్థితియందుండ శ్రీరామభద్రుఁడు సాకేతపుర సింహాసనాసీనుఁడయ్యెను. ప్రాచీనకాలంబున రాజును దేవునిచే మతప్రచారంబునకుఁ బంపఁబడుదురను విశ్వాసముండెను. ఇందుచే రాజ్యతంత్రమునందు మత సంబంధికులకు నపరిమితాధికారము చేఁజిక్కెను. దీనిఫలముగా వైదికులు మంత్రులైరి. ఇయ్యది యితరదేశ చరిత్రములయందు' నిస్సంశయముగాఁ జూడనగును. రోమక సామ్రాజ్యమున "పోపు"నకున్న నిరంకుశాధికారము విస్మయజనకము; చిరకాలము క్రిందట "ఇంగ్లీషు" రాజ్యమున మత సంబంధికుఁడయిన "ఛాన్సలరు" ముఖ్యమంత్రియగుటయే గాక యప్రతిహతాధికారము చెల్లించుకొనెను. ఈవిధముగ శ్రీరామచంద్రునకు మతగురువగు వశిష్ఠాదులు మంత్రులైరి. గురువెట్టివాఁడయినను గురుతిరస్కారము శిష్యధర్మము

కామిచేఁ దుదకు శ్రీరామచంద్రుఁడు వశిష్ఠునిచేతిలోఁ గీలు బొమ్మయయ్యెనని చెప్ప సాహసించుచున్నాము. ప్రతిపక్షము బలహీనమైనకొలంది బ్రాహ్మణులు భూదేవులయిరి. ఆర్య జాతి విజృంభణమునందు నీకాలము కృతయుగమని మా యభిప్రాయము. ఈవిషయమున మేము పూర్వమహాపురుషుల నుండి భిన్నులమైతిమని యెఱుంగుదుము. ఇప్పటినుండి యార్యజాతి పతన మారంభించి భారతయుద్ధమున ముగిసెను. ఇందనుక మనము జాగరూకులమై యార్యులచరిత్ర పరిశోధన బుద్ధితోఁ జదివితిమేని, జాతియొక్క క్రమక్రమాగతాభివృద్ధి (evolution) స్పష్టపడును. ఒక కాలమున వివాహము లేకుండ * పుత్రవతి యగుట హేయముగా నుండెను. ఇట్టిది దోష దూషితము గాకుండుటకు గాను నమంత్రకమైన గాంధర్వ వివాహము నొక్కదాని నంగీకరించిరి. నేటికి దక్షిణాపథము నందలి యడవిజాతుల యందున్న వివాహములలోఁ బెక్కులు గాంధర్వవివాహములే. ఒకకాలమున సంతానప్రాప్తికై పెర భార్యను దెచ్చికొనుట హేయముగా నుండెను. వేఱొకకాల మున బహుపత్నిత్వము నింద్యముగా నుండెను. కొండొకకాల మున బహుపతిత్వము గర్హ్యముగాకుండెను. కాని విజ్ఞానవివే కము కన్నులఁ దెరచినకొలఁది యీ యాచారములన్నియు నశించినవి. ఇదియే మన మెఱుంగఁదగినది.

ద్రావిడులు వానరులు, రాక్షసులనుమాటయు నార్యులు దేవాంశసంభూతులను మాటయుఁబోయి మాన వులే యను నభిప్రాయమిప్పుడే మోసులెత్తెను.

---

* సత్యవతి మొదలగువారు.

ఇదానీంతనము. రామాయణకాలానంతరము

రావణవధానంతరము హనుమదాదులు సాకేతపురం బును బ్రవేశించుటఁజేసి దక్షిణోత్తర హిందూస్థానములకు రాకపోకలు తఱచై యార్యసంపర్కము వృద్ధియయ్యెను. హనుమదాదులు జన్మభూమినివిడిచి సాకేతపురంబుఁజేరి ఋషులపాదములువట్టి యాధ్యాత్మికవిద్యయందుఁ బాండిత్యము సంపాదించిరి. దక్షిణాపథము మ్లేచ్ఛభూమియనుమాట మఱచి ఋషులిచ్చటకు రామొదలుపెట్టిరి. ద్రావిడులలోఁ గొంచెమో, గొప్పయో, జ్ఞానముకలవారు ఋషుల పరిచయముం గలిగించుకొని వారి యాచార వ్యవహారములను బట్టులనలేఁ బొగడుచుఁ దమహీనస్థితిని నొప్పుకొనుచుఁ దదాచారములను స్వీకరింప మొదలిడిరి. ఇట్లు మొట్టమొదట తమజాతినిఁదెగడి యార్య నాగరకతకు దాసానుదాసులై తల లొగ్గినవారు బ్రాహ్మణులయిరని మాయాశయము. నేఁడు మాలలలోఁగొందఱు మతము (అనఁగా క్రైస్తవమతము) పుచ్చుకొన్న యనంతరము కొదవమాలలు చీకటిలోనున్నా రనియుఁ, దాము వెలుతురులోనికి వచ్చితిమనియు నిరసంపుఁ జూపులతోఁజూచుట మనము కాంచుచునేయున్నాము. ఇట్టిది యాయెడ సంభవించినది. ఇప్పటికిని దాక్షిణాత్య బ్రాహ్మణులకును, నౌత్తరేయ బ్రాహ్మణులకును జాల భేదముగలదు. చూచిచూచుటతోడనే యెవ్వరెవ్వరో మనము గ్రహింపవచ్చును. ఆర్యుల నాగరికత యవలంబించిన పిమ్మట యార్యులతో సంబంధబాంధవ్యములు తటస్థిం

చెను. అనఁగా సాంకర్యము కలిగెను. ఇందుచేతనే బ్రాహ్మణులవర్ణము (శరీరచ్ఛాయ) నందంత తారతమ్యములు కనుపట్టుచుండును. ద్రావిడులుష్ణ ప్రదేశవాసులగుటచే నీలవర్ణులు. ఆర్యులు శీతలదేశవాస్తవ్యులగుటచే శ్వేతాంగులు. ఈ షచ్ఛోణసమ్మిశ్రితమైన తెలుపునకు "బాపనవెల్ల యని" ప్రాకృతజనంబు నేఁడును వ్యవహరించుచుండును.

ఈ నడమంత్రపు బ్రాహ్మణు లార్యులతోఁ జుట్టరికంబు వృద్ధియైనకొలఁది ద్రావిడులపొంతువ లంతముఁ జేసికొన సమకట్టి కొంతవరకు సఫలీకృత మనోరథులైరి. మధ్వ వైష్ణవులకు నామాలు మెండన్నట్లు ఆర్యులయందులేని కొన్ని నూతనాచారములను గ్రొత్తగాఁ జీలియేర్పడిన తమ సంఘమునందుఁ జొప్పించిరి. ఈకారణముననే దృష్టిదోషము, మితిమీరిన నిష్ఠ, ఒకరినొకరు తాకకుంట మొదలగు వెట్టి యాచారములు తామఱతంపరసరణి వృద్ధిఁబొందినవి. కాన రక్తమున కెక్కని శాకభక్షణంబుమాని యార్యులఁబోలె మాంసభక్షకులు కారైరి. శాకభక్షణ ద్రావిడులయందు మిగుల వృద్ధియందున్నది. ఇందుచేతనే తెలుఁగు దేశము నందుఁ గోమట్లు, నఱవదేశంబున వీరశైవులు శాకభక్షకులుగనే మిగిలియున్నారు. శాకభక్షణము, వీరశైవము ద్రావిడ సంప్రదాయసిద్ధములు. కలంకమున్నయప్పుడే నిష్ఠయు, నావేశము నధికమగును. పశ్చిమతీరమందున్న "మాపిళ్లాలు" అరేబియా మహమ్మదీయులకన్నను, నిష్ఠాపరులుగను, నావేశపరులుగను నున్నారు. ఆర్యమతముగాని, తన్నాగరికతగాని చేపట్టని వారలను నవలకుఁదటెమి నీచముగాఁ జూడనారంభించిరి. వీరికి మాతృభాషలు (అనఁగా తెలుఁగు, అఱవము

మొదలగునవి) అనాగరకభాషలైనవి. నూతనమతస్వీకారముచే సంస్కృత మత్యనవసరమగుటచేఁ దదాభ్యాసపరిచయమునకై పట్టుఁదలఁ జూపఁ బ్రారంభించిరి. ద్రావిడబ్రాహ్మణు లిందు వీతనే యూత్తరేయ బ్రాహ్మణులకన్నను నత్యద్భుత గీర్వాణ భాషాపాండిత్యమును సంపాదింపఁగలిగిరి. కాలక్రమమున నీసంస్కృతము వంశపరంపరగా సంక్రమించిన ముల్లెయని భావింపబడెను. సంస్కృతభాషాజ్ఞానముగలిగిన వీరికిఁదెలుఁగు భాష, కోయ, చెంచు భాషయైనది. సంస్కృతభాషానభిజ్ఞులు మోటువారలు, పశుప్రాయులైరి. క్షణకాలమైనను వీరికిఁ దెలుఁగవసరమనునూహ మనంబునకుఁ దట్టలేదు. గాసట బీసటయై యనాగరిక సేవ్యమానమైన తెలుఁగును నాగరక జనోపయోగముం జేయుట యుచితమని కొందఱు మహానుభావులకుఁ గోరిక పొడచూపినది. సంస్కృతశబ్దసంచితమైనఁ గాని పూజ్యముకాదనియెంచి మహామహుఁడు నన్నయ చెలియలికట్ట బ్రద్దలుగొట్టి సంస్కృతశబ్దజాలఝరిని తెలుఁగు దేశముమీఁదికి విడచెను. విడచినయనంతరము సంస్కృత శబ్దములను వ్రాయుటకుఁ దెలుఁగు వర్ణసమామ్నాయము చాలక కొఱవడి యుండెను. ఈ కొఱత తీర్చుటకుఁ దెలుఁగు లిపికి 'ఒత్తు' అక్షరములు చేర్పఁబడియెను. ఇంతకును ఫల మేమి? తెలుఁగుదేశమంతయు వరదపాలయ్యెను. విస్మయ చిత్తుఁడై చెలియలికట్ట యవసరమని తలపోసి నన్నయ్య గంటముఁ దీసికొని 'ఆంధ్రశబ్దానుశాసనంబును' సంస్కృతం బున రచించెను. తెలుఁగు వ్యాకరణము సంస్కృతంబున రచింపఁబడె. ఏమివింత! ఏమిచిత్రము! ఈ పిచ్చి యింతటితో ముగిసెనా? లేదు. తరువాతివారలుకూఁడ గొంతకాలము

వఱకుఁ దెలుఁగు వ్యాకరణములు సంస్కృతమునందే ; వాసిరి.

సనాతనధర్మమును సంపూర్ణముగా గ్రహింపఁజాలక పోయినను 'అంకమ్మ, పోలేరమ్మ' గుడులను బాడువడఁజేసి యా సానములయందే సీతారాములకు హనుమదాదులకు గుడులు, గోపురములుకట్టించి ద్రావిడులు సంపూర్ణముగా హిందువులమైతిమని యానందించుచున్నారు. తమ సంఘము నుండియే, తమ యెట్టయెదుటనే యార్యమతము స్వీకరించి కొందఱు "బ్రాహ్మణోఽముఖమాసీత్" అను పదవిని బొందుటజూచి కన్నఁగట్ట, మఱికొన్ని ద్రావిడాంతశ్శాఖలార్యసంఘముతో నేకీభవించుటకు సహమహమికఁ జూప మొదలిడెను. ఇందు మొదటివారలు కంసాలులు. వైదిక బ్రాహ్మణులఁ దలఁదన్ని పుట్టితిమనియుఁ దామే సద్బ్రాహ్మణులమనియు వాదించుచు ద్రావిడనామమును ద్యజించి 'విశ్వబ్రాహ్మణ' యను సంస్కృతనామమును వహించిరి. విద్యాహైన్యముచేతను, దారిద్ర్యముచేతను, వీరియభీష్టము కొనసాగమికి మిగుల జింతించుచుంటిమి. మఱియొక యంతశ్శాఖ దేవబ్రాహ్మణులైరి. వీరినందరిజూచి చేతిలోనిలాభము పోయెఁబోయెననిచెప్పి రేకెత్తి కోమటులార్యసంఘద్వారము లను తెఱచి లోనికిబోవఁ దహదహలాడుచుండిరి. కోమటిశబ్దమును దిగ్రదొక్కి "ఆర్యవైశ్యులు" అను సంస్కృతశ్రుఁ బేరు దాల్చి యార్యులమనుకొనుచుఁ దమస్థితిగతులను బాఱఁ జూచుకొనుసరికిఁ బెద్దయాటంకము పొడచూపినది. అనుములు, మినుములు, పెసలు, పిప్పళ్లు గోత్రముల జూచి కొందఱు సంస్కారప్రియులు కోమటిశబ్దమును "ఆర్య వైశ్య" చేసినయట్లు లీగోత్రములు సాంకేతికములని చెప్పి యాంగిరస

భరద్వాజ ప్రముఖ బ్రాహ్మణ గోత్రములకు మార్చివైచి కొని యార్యసంఘమునందుఁ జేరుటకు ముస్తాబయి కూరు చుండిరి. దీనినంతయుఁ బరిహాసమునకు వ్రాయుటలేదు. పై పెచ్చు వీరి సముత్కంఠ గొనియాడుచుంటిమి. చారిత్రక విషయమగుటచే వ్రాయవలసినవార మైతిమి. తుదకీరోగము వెలమ, కమ్మవారికిఁగూడ సోఁకినట్లున్నది. వీరార్యత్వప్రతి యుల మనుకొనుచున్నారు. విస్తరభీతిచే నీ యంశమును స్థాలీ పులాకన్యాయమునఁ జర్చించి క్లుప్తీకరించవలసిన వార మైతిమి.

ఆంధ్రదేశ మార్య ద్రావిడ నాగరికతా సంఘట్టన స్థానమగుటచేఁ దెలుఁగు జాతులలోఁ గొన్ని సంకరములని చెప్పవచ్చును. ఆర్యమత స్వీకరణముఁజేసి యార్యుల మైతి మని యనుకొను నీ దిగువ ద్రావిడ జాతులను బరిశీలించినచో మా వాక్యములయందలి సత్యము మనస్సునకుఁ దట్టకపోదు. ఆంధ్రద్రావిడులను, నంబితంబళ్ళులను, వైష్ణవ, వైదిక నియోగులయందుఁ గొందఱిని, నఱవ కన్నడ బ్రాహ్మణులను బరిశీలించిన యెడల జాతి సాంకర్యము బోధపడకమానదు. వెలనాటి పూజారులను గోమటులను, గంసాలులను, జూచిన యెడల నన్యమత స్వీకరణముచేఁ గల్గిన యార్యత్వము విస్ప షము కాకమానదు.

ఆర్య బ్రాహ్మణుల నింకను మాంసభక్షణంబు వదల లేదు. వంగదేశ బ్రాహ్మణులు, నోడ్ర బ్రాహ్మణులు మత్స్య భుక్కులు; కనోజి బ్రాహ్మణులు, మహారాష్ట్రులయందు సారస్వత బ్రాహ్మణులు మాంసాహారులు; పంజాబీ బ్రాహ్మ ణులయందుఁ గొందరు మాంసాహారులు. వీరందఱును బంచ

గొడులలోనివారు. తెలుఁగు దేశమునందుఁ దూర్పకంసాలు లయందు మాంసభక్షణంబు ముసుఁగులో నున్నయది. ఒక వేళ నిది యోర్ధ్రదేశపు సహవాస దోషమేమో ? ఆర్య ద్రావిడ వర్ణవిభాగ మీ దిగువ నుదహరించు చుంటిమి. పాఠకులు జాగరూకులై పరిశీలింతురుగాక.

ఆర్యులు.	తద్ధర్మము.
1. బ్రాహ్మణులు:—	భగవదారాధనా విధానము. (యజ్ఞ యాగాదులు చేయుట, చేయించుట.)
2. క్షత్రియులు:—	పరిపాలన (చాతుర్వర్ణ్యధర్మములు సాంకర్యముఁ బొందకుండఁ గాపాడుట)
3. వైశ్యులు:—	కృషి వాణిజ్యగోపాలనము (ఈ మూఁడు జాతులు ద్విజాతులు)
4. శూద్రులు:—	త్రైవర్ణిక శుశ్రూష.

వీరు మత సాంఘికస్వత్వబహిష్కృతులు. వీ రార్యులు కారు ;పరాభూతులయిన ద్రావిడులు. కావుననే యార్యులకు సేవకులుగా గ్రహింపఁబడి సేవాధర్మము వీరికి విధింపఁబడెను. ఇంతియకాక త్రైవర్ణికులకు వర్ణసాంకర్యమునఁబుట్టిన వారలు గూడ నిందుఁ జేర్పఁబడిరి.

ద్రావిడులు

వర్ణవిభాగము.	తద్ధర్మము.
వెలమ, కమ్మ, రెడ్డి, కాపు మొదలగువారు	క్షత్రియ ధర్మము. అనఁగా శస్త్రజీవనము, పరిపాలనము. నేఁడు తెలుఁగు దేశమునందున్న జమీనులే దీనికి సాక్ష్యము. వైశ్యధర్మము

లోఁ గొంతభాగము, కృషి గోపాలనము.

2. గొల్ల, పల్లి, కుమ్మరి, మొదలగువారు — బ్రాహ్మణ ధర్మము-అనఁగా దేవరల గుడులయంచుఁ బూజారితనము.

3. కోమటి, బలిజ, సాలి, మొదలగు జాతులు — వైశ్య ధర్మములో నొక భాగమయిన వాణిజ్యము.

4. కాసా, బోయ, చాకలి, మొదలగు జాతులు — సేవా ధర్మము.

ఆర్యుల యందలి వర్ణవిభాగమునందు బ్రాహ్మణులు ప్రథమస్థాన మలంకరించి తదితర జాతులకు బోద్ధలుగానుండి యన్నివిధములగు హక్కులఁ ననుభవించుచున్నారు. బ్రాహ్మణ పాదోదకము పాపహరమనియు, బ్రాహ్మణ భుక్తశేషము మోక్షదాయకమనియు, నభిప్రాయముఁ గల్గించిరి. క్షత్రియులు రెండవ స్థానమును, వైశ్యులు మూఁడవ స్థానమును, నాక్రమించుకొని యున్నారు. వీరందఱు ద్విజులు. ఈషద్భేదముతో వీరికి సమానస్వత్వములు గలవు. స్వజాతివారు కాక పోవుటచే శూద్రులనంబడువారు కొంచె మించుమించుగా బానిసలుగనే యున్నారు. వీరికున్న హక్కులు నామమాత్రములు.

ద్రావిడ వర్ణ వివక్షతయందు శస్త్రజీవులైన వెలమ, కమ్మ మొదలగువారగ్రస్థానమును, వాణిజ్యజీవులగు కోమటులు మొదలగువారు రెండవస్థానమును, గొల్ల, కుమ్మరి

♦ నేఁడు కాసాలు తెలగవారమని చెప్పుకొనుచున్నారు.

మొదలగు బ్రాహ్మణ ధర్మ్యులు మూఁడవ స్థానమును, బోయ మొదలగు సేవాధర్మపరులు నాలుగవస్థానమును, గైకొనియుండిరి. ఈ వర్ణ వివక్ష కొందఱికి విస్మయజనకము గావచ్చును. కోమటులను వెలమ, కమ్మవారి తరువాత నుని చితిమని యార్యవర్ణ విభాగ మెఱింగినవారనవచ్చును. అఱవ దేశము ద్రావిడదేశమగును. కాన నఱవదేశంబునందున్న యాచార వ్యవహారములను బట్టియే వర్ణవిభాగములను నిర్ణయింపవలసియుండును. ఆ దేశంబున వెలమ, కమ్మవారలు కోమటుల యిండ్లకడ పుడిసెలినీరమయినను ద్రావరు. ద్రావిడ వర్ణ విభాగంబును దిలకించినయంత వెలమ కమ్మవారలు క్షత్రియులమనియుఁ గోమటు లార్యవైశ్యులమనియుఁ జెప్పుకొనుటకుఁ గల హేతువు సులభైక వేద్యము. ♦ వైశ్యధర్మములలో నొకటియగు వాణిజ్యమును బూనిన కోమటులు వైశ్యుల మనియు, క్షత్రియ ధర్మమయిన శస్త్రజీవనము దాల్చుటచే వెలమ కమ్మవారలు క్షత్రియులమనియు, ననుకొనఁదొడంగిరి. ఇంతియకాని యే పరశురాముని నినో లేక యే పరశురాముని మగనినో కాంచి బెగ్గిలి యదివఱకున్న జండేములను బ్రదించివైవలేదు. వీరు బాపనిఁ జూచిన యంత మాత్రమునఁనే మగబీరమును డించి మూలముడుంగునంతటి భీరువులు కారు. విక్రమావష్టంభమున దిక్తటముల బీటలు వారించిన వీరు బ్రాహ్మణునికి భయంపడి యుపనయనాది సంస్కారములను వదలి శూద్రులై పోయిరనుట కన్నఁ బరిహాస

♦ తెలుఁగునాఁడు "ఆర్య ద్రావిడ నాగరక సంఘట్టన స్థానమగుటచేఁ గోమటులార్యత్వము చప్పున గ్రహింపఁగల్గిరి.

మేమి కావలయును ? అట్టివారి సంతానమని చెప్పుకొనుట కయిన సిబ్బితిలేదా ? ఆర్యులకు యజ్ఞోపవీత ధారణము మత సంబంధమైన కార్యము. వీరి యాచార వ్యవహారముల నవలంబించిన దక్షిణాపథము నందున్న బ్రాహ్మణులు, విశ్వ బ్రాహ్మణులు, రాజులు, వైశ్యులు, బ్రిటాజులు, సాలీలు, మొదలగు వారలప్పుడు జందెమును మెడకుఁ దగిలించుకొనిరి. నేఁడు కమ్మవారు నిటులే యజ్ఞోపవీతధారులగుచున్నారు.

లంకా ద్వీపము

రామాయణము ప్రకారము లంకాద్వీపము హిందూదేశమునకు శతయోజన దూరమందున్నది. యోజన మనఁగా నేమి ? భాస్కర రామాయణమునందు "యోజన" శబ్దము "ఆమడ"గా భాషాంతరీకరింపఁ బడినది. ఈ యామడ వెవ్వేఱుచోటుల, వెవ్వేఱుగా నున్నది. తుదకుఁ గొంద ఱెనిమిది మైళ్ళన్నఱగా సిద్ధాంతీకరించినారు. దీనిం బట్టిచూడ లంకా ద్వీపము హిందూదేశమునకు నెనిమిది వందల యేఁబది మైళ్ళ దూరమునందుండవలయును. కాని యట్లు లేక యిరు వది మూఁడు మైళ్ళన్నఱలో నున్నది. ఈ తారతమ్యమును సమర్థించు టెట్లు ? యోజన శబ్దమునకు వే ఱేమయిన నర్థ మున్నదేమో తెలిసికొనవలసి యున్నది. మహాపండితులను గొందఱి నడిగి యుఁటిమికాని వారు చెప్పిన యర్థములయం దొక్కటియు సరిపోవక పోవుటచే నామడయను నర్థమే సమంజసమని నిర్ధారింపవలసిన వారమైతిమి. ఇంకెట్లు దీనిని సమర్థించుట ? వాల్మీకి మహాముని దక్షిణాపథ మెఱుంగని వాఁడగుటచే, వారివలన, వీరివలన విని పొరపడియుండునని

చెప్పి రామభక్తులకుఁ గోపము రగుల్పవలసి వచ్చి నంచులకు మిగులఁ జింతించుచుంటిమి.

కడుంగడుఁ బూర్వకాలమున లంకా ద్వీపమునకును హిందూదేశమునకును మెట్టదారి యొకటుండి దాని మూలమున దక్షిణదేశ పశువులు "స్పుల్లరి" మేతకై లంకకుఁబోవు చుండెననుటకుఁ బెక్కు దృష్టాంతములు కలవు. రామాయణ కాలము నాఁటికి సంతతసముద్రోత్తుంగ తరంగ సంఘట్టితంబగుటచే సింహళమును, నీ దేశమును గల్పుచున్న యీ మెట్ట దారియందు గండ్లుపడి యుండెను. నీలుఁడను ద్రావిడ శిల్పి వానరుల సాయమునను, శ్రీరామచంద్రుని యాజ్ఞచేతను గండశిలలచే నీగండ్లనే పూడ్చి దారిని బలపఱచి భద్రముగాఁ జేసెను. ఇదియే సేతువని జగత్ప్రఖ్యాతి గాంచెను. రామాయణమున నీ కథకు వాల్మీకిమహాముని కుంచె కోలతోఁ బెక్కురంగుల నైచెను. నేఁడు నీలుఁడు వేసిన రాళ్ళు, అప్పలు కొట్టికొని పోవుటయేకాక, కడలతాకుచే మిగిలిన కట్టకూడఁ గొట్టుకొనిపోయి సముద్ర మీవలావలికిఁ బొరలిపోవుచున్నది. పొరలిపోవు చున్నది సుమీ. పెద్ద పెద్ద నావలు నిరపాయముగా నీ మార్గమునఁ బోవఁజాలవు.

శ్రీరామాయణమునం జెప్పబడిన సువేలము, త్రికూటము, సుమనఃకూటము లంకా ద్వీపమున నేఁటికిని నిలిచి యుండి రామత్రైలోక్యయాత్రను వేనోళ్ళఁజాటుచున్నయవి.

యక్ష నాగలోకము లేవి?

యక్షశబ్దము సంస్కృతము. దీనికిఁ ప్రాకృతము "ఎక్కలు." తద్భవము (తెలుఁగు) జక్కలు. సింహళ ద్వీపమునందు వాడుకలోనున్న భాష పాళి. ఇది ప్రాకృత భాష.

కాన సింహళమునందు యక్షులు, "ఎక్కల"నియుఁ, దెలుఁగు దేశమునందు జక్కులనియుఁ బిలువంబడు చున్నారు. సింహళ దేశము యొక్క యాదిమవాసులు "ఎక్కల"ని తచ్చరిత్రలు విస్పష్టముగాఁ జెప్పుచున్నవి. రావణుఁడు లంకా ద్వీపముఁ బ్రవేశించి దొమ్మిల్లయుద్ధమున యక్షరాజయిన కుబేరునోడించి యుత్తర దిక్కునకు ననఁగా మలయాలమునకుఁ దోలకమున్ను లంకాద్వీపము యక్షులోకముగా వ్యవహరింపఁ బడుచుండెను.

భారతమున సమయవిరుద్ధముగా ధర్మజద్రౌపదీ మందిర ప్రవేశముఁ జేయుటచే భూప్రదక్షిణముఁ జేయవలసి వచ్చిన విజయుఁడు (అర్జునుఁడు) ప్రభాసతీర్థమున నులూచి యను "పాఁపజవరాలి"చేఁ బాతాళమునకుఁ గొనిపోఁబడె ననియు నట నులూచిని వరించి యిలావంతుఁడను కుమారునిఁ బడసెననియు మన మెఱుంగుదుము. ఈ కథనే సింహళద్వీప చరిత్రలు మఱియొక విధముగాఁ జెప్పుచున్నవి. విజయుఁడను నుత్తర హిందూస్థాన వాస్తవ్యుఁడు సహచరులతో నొక సర స్తీరముననుండఁ గువేణియను నొక యక్షిణి విజయసహచరులను మోసగించికొనిపోవ నెట్టులో సాధించి విజయుఁడు కువేణిని బట్టుకొని చంపఁబోవఁ దన్నుఁబెండ్లాడిన సహచరుల నిత్తునని చెప్పఁగాఁ బెండ్లాడి యనంతరము యక్షులోకము నంతయు జయించి రాజ్యమేలె ననియు, నీ దంపతులకు నొక కుమారుఁడు, కుమారియుఁ గల్గిరనియు సింహళద్వీప చరిత్రకారులు చెప్పుచున్నారు. ఇచ్చట హిందూదేశ చరిత్రకారులు యక్ష నాగలోకములను గలగూరగంపఁ జేసిరని మేమభిప్రాయ పడు చుంటిమి. దీనికిఁ దగు కారణముకూడఁ గలదు.

సింహళ ద్వీపముయొక్క యుత్తర భాగమును నాగ

ద్వీపమనియు, నాగులను నొక జాతివారచట వాసముఁజేయు చుండిరనియు సింహళద్వీపచరిత్రల వలనఁ దెలియుచున్నది. మలయాళ దేశమునందున్న "నాయరు" అను జాతివారచటకు వలసపోయిరనియు, వారలే నాగులైరనియుఁ గొందఱు వాదించుచున్నారు. ఈ యిరుతెగలయం దాచారసామ్యము కలదు. ఈ భేదము బాగుగా గుర్తెఱుంగని మన గ్రంథకర్తలు మనము "ఇంగ్లీషు" వారిని హూణు లనుచున్నట్లే, యక్షులను నాగులను జేసియుందురని తలపోయుచున్నాము. ఈ యక్షులిప్పటికి నీ లంకాద్వీపము నందున్నారు. నాగరికత లేని యాటవికులు. వీరలను మేము చూచితిమి. మన కోయ, చెంచు వాండ్రకన్నను హీనస్థితి యందున్నారు. వీరల నిప్పుడు "ఎడ్డులనియు, ఎడ్డి మనుష్యులనియు" బిల్చుచుందురు. ఈ రెండు శబ్దములును వ్యాధశబ్దభవములు. మన దేశము నందున్న జక్కఱలు వీరికి సంబంధించిన వారేమో చూడ వలసి యున్నది. వివాహము లేకుండుటను, బడుపువృత్తికల్గి యుండుటనుబట్టి చూడ మా శంక నిజమగునేమో ! యక్షులు వివాహమెఱుంగరు. ఇప్పుడు నాగలోకము లంకాద్వీపోత్తర భూమి యనియు, యక్షలోకము లంకయనియుఁ దెల్లమగు చున్నది. ఈ యంశమును విపులముగాఁ జర్చించి పెక్కు దృష్టాంతములు చూపింపవలయునని మనంబున్నను విస్తరభీతి మమ్మందులకుఁ జొఱనీకున్నది.

రాక్షసులు, రావణుఁడు.

వీ రార్యులకుఁ బ్రత్యర్థులు; తమ జన్మ భూమియగు నీ హిందూదేశమును నార్యులు ప్రవేశించి, యాక్రమించు

కొనుటఁజూచి సహింపఁజాలక వారలను పటిమి వేయుటకు వివిధ ప్రయత్నములుచేసి విఫలీకృత మనోరథులై, విజితులయిరి. వీరు వీర శైవులు. వీర శైవులకు జీవహింస సంప్రదాయ విరుద్ధము. హింసాప్రపూర్ణములగు యజ్ఞ యాగాదులను వీరందుచేతనే మాన్పించు చుండిరి. అందు రావణుఁడత్యంత శైవభక్తుఁడగుటం జేసి, దీనిని నాచరణము లోనికిందెచ్చెను. అందుచేతనే జగత్కంటకుండని రామాయణముచేఁజెప్పించిరి. రావణుఁడీ పశువధ మాన్పుటకుఁగాను భక్తి ప్రపత్తి పరవశయగు తాటకిని దండకారణ్యమున నుంచెను. ఈ తాటకి దండకారణ్యమున విశ్వామిత్ర యజ్ఞవిఘ్నకారిణి యగుటయు, శ్రీరామచంద్రుఁడు చునుమాడుటయు మన మెఱుంగుదుము.

తాటకి ప్రపత్తి సంపన్న. తిరువడ ముదూరునందు నీమెకు నింకను దేవాలయమున్నది. ప్రభాతమునఁనే లేచి వన వాటికరిగి, స్వహస్తముతో పుష్పాపచయముఁ గావించి, శివుని సన్నిధిని నొక మాలనుగూర్చి శివునికర్పించుట యీమె యాచారము. శివుఁడీమె భక్తి పరీక్షింప నెంచి మాలికా నిర్మాణముఁ జేయునప్పుడు సర్వ విషజంతు దష్టము గావించెను. భగవద్ధ్యానమున లీనమయిన యీమెకు నీ బాధ యేమియుఁ జేయనేరదయ్యె. పూదండగ్రుచ్చి శివునిమెడలో వైవలేచినప్పుడు శివుఁడింకను బరీక్షింప నెంచి యీమెను నగ్ననుగాఁ జేసెను. భక్తిపరవశయైయున్న యీమె దీనిచే నొకించుక చలించి చేతనున్న పూదండను వదలనొల్లక సంకుచిత దేహయై మాలికా సమర్పణము గావింప నెంచుట తిలకించి శివుఁడే జాలినొంది మెడను ముంచుకుఁజాపఁగా బుష్ప మాల మెడను వై చెను. ఈ కథను దెల్పు నొక పురాతన

దేవాలయ మిప్పటికిని తిరువడ ముదూరు నందున్నది. తాటకి అనగా—తట్ =ఆపుట, అనఁగా శైవధర్మ విరుద్ధమైన జీవ హింస నాపుట=జీవహింస నాపునది కానఁ దాటకియయ్యెను. రామాయణము కూడ నీమెను యక్షిణి యనియు, యజ్ఞ విఘ్నకారిణి యనియుఁ జెప్పుచున్నది. ద్రావిడ భక్తుఁడొకఁడు భగవద్ధ్యానముఁజేయుచు "ఓ దయామయా! తాటకికి నలవడిన భక్తి నా కెన్నఁడిత్తువు. అందనుక నాకు ముక్తి కలుగదని వేడెనఁట. శూర్పణఖ జీవసమాధిని బొందెనని ద్రావిడ చరిత్ర చెప్పుచున్నది.

రావణుఁడు దక్షిణదేశముననుండి సింహళముపై దండెత్తి కుబేరుని మళయాళమునకుఁ దఱిమి, లంక నాక్రమించుకొని రాజధానిం జేసికొనియె. ఇతఁడు మహా బలపరాక్రమ సంపన్నుఁడు, అధిక సౌందర్యవంతుఁడు, మిగుల ధీశాలి, అసమాన శైవభక్తి ప్రపూర్ణుఁడు, ధర్మప్రభువు. పాఠకుఁడా! యీ విశేషములు నీ కాశ్చర్యమును బుట్టింప వచ్చును. మా వాక్యము లాకర్ణించిన నయ్యది పోఁగలదు. బలపరాక్రమ సంపన్నుఁడనుట రామాయణముఁజదివిన వారికెల్లఁ దెలిసియే యుండును. సౌందర్యవంతుఁడనుటకు సుందరకాండములోఁ ప్రథమ సందర్శనమున రావణుం గూర్చి హనుమంతుఁడు తల పోసిన తలపోతలె తార్కాణము.

వేదము లగమ్యారణ్యముగా నున్నయప్పుడు ఛేదించి యిదానీంతనులు వల్లెవేయుటకుఁ దారిఁజూపె. ఇదియే నేఁటికిని రావణ భట్టీయమను పేరనున్నది. ధీశాలియే కాక బ్రహ్మజ్ఞాని. ఇందుచేతనే రావణ వధానంతరము రాముని బ్రహ్మహత్యా మహాపాతకము పీడించినది. ఇదియుఁ గాక

యితఁడు నవకోటి శివాలయార్చకుఁడు. మలయాలమునం దున్న గుడి గోపురము లితఁడు ధర్మప్రభువని వేనోళ్ళఁబలుకు చున్నవి. ఇవన్నియు వీని సుగుణములు. దుర్గుణము లున్నవి లేనివి కల్పించి విసుగు, విరామములేకుండఁ గంటికి నిద్ర యెఱుంగకుండఁ బ్రబంధరచితమయిన రామాయణము లోక మునకు వెల్లడించుచునే యున్నది.

రా మా య ణ యు ద్ధ మె ప్పు డు జ రి గి న ది ?

మన పౌరాణిక కవులు మున్నగువారు, సార్వభౌము లకు, ఋషిసత్తములకు నాయువు నిచ్చుటయందు దానకర్ణు లైరి. ఇంత యుదారస్వభావము మఱి యే యితర దేశకవుల యందుఁ గన్పట్టదు. సూర్యవంశ్యులగు రాజులకు వేలకొలంది సంవత్సరములు దానముఁ జేసిరి. వసిష్ఠాదులగు ఋషులకు బ్రహ్మాయువే యొసంగిరి. ఇంతటితోఁ దనివి సనక విభీషణ హనుమత్ప్రభృతులకు రామనామ మిహలోకమునఁ బ్రవర్తిం చిన యంతకాలము జీవింపుఁడని వరంబిచ్చిరి. వరంబిచ్చుట యొక యెత్తు. అది చెల్లుట మఱియొక యెత్తుకదా ! ఇప్పటి కిని విభీషణుఁడు పర్వదినంబుల రామలింగేశ్వర స్వామిని బూజించి పోవుచునే యుండునఁట. కాని మన యదృష్ట హీనతచేఁ గన్నులుండియుఁ గాంచ లేకున్నాము.

ప్రాచీనులు కాలమును నాలుగు యుగములుగా విభ జించిరి. అందు మొదటి యుగమయిన కృతయుగమునకు 1728000 సంవత్సరములును, రెండవ యుగమయిన త్రేతకు 1296000 వర్షములును, మూడవ యుగమయినద్వాపరమునకు 864000 హాయనములును, నాల్గవ యుగమగు కలియుగము

నకు 432000 యేండ్లును నొసంగిరి. శ్రీరామచంద్రుఁడిందు రెండవ యుగమయిన త్రేతాయుగ మహాపురుషుఁడు. త్రేతాయుగము కడపట శ్రీరామచంద్రుఁడు రాజ్యమేలెనని తలంచినను, నిప్పటికి రమారమి 869000 యేండ్లక్రిందట నున్నాఁడని స్పష్టపడగలదు. అనేక కారణములచే నియ్యది యసంభవముగాఁగన్పట్టుచున్నది. పాఠకుఁడా! యీ వేయు లగు గ్రంథములను ధిక్కరించి ప్రజ్ఞావిశేషమును జూపించుటకు యత్నించు చున్నారమని భ్రమ పడకుఁడు. ఋషి భక్తి యందు మే మెవ్వరికిని దీసి పోము. కాని బహుళ గ్రంథావ లోకనమునఁ గ్రోడీకరించిన కొన్ని సంగతులను నీకు నివేదింతుము. గ్రాహ్యంబులయిన గ్రహింపుము. అగ్రాహ్యంబులని తోఁచినఁ ద్రోసిపుచ్చుము. ఇంతియే మేము గోరునది.

భారత యుద్ధము ద్వాపరాంతమునఁ బవర్తిల్లెనని హిందువులెల్ల రెఱుంగుదురని నమ్మెదము. భారతపురుషులు రామాయణ వీరులను జూచుట తటస్థించునెడల నీ రెండు యుద్ధముల మధ్యనున్న కాలము లక్షలకొలంది సంవత్సరములుగాక యత్యల్పమై యుండవలయునని ప్రాజ్ఞులగు విమర్శకులకుఁ దోఁపకపోదు. కావున భారత రామాయణ పురుషులకుఁగల్గిన సందర్శనంబులఁ గొన్నింటి నిటఁజూపించుచున్నాము. కౌంతేయ మధ్యముండును నపారభుజబల సంపన్నుఁడునయిన భీమున కరణ్యవాసంబున నాంజనేయ సందర్శనంబు లభించె. భాగవతంబున ద్వివిదుఁడను వానరుని బలరాముడు సంహరించెను. అమృత భక్షకులును, సుగ్రీవుని

మామలునై రామ రావణ యుద్ధమున నద్వితీయ పౌరుషంబుఁ
జూపిన మైంద ద్వివిదులలో ద్వివిదుఁడితడే. భాగవతంబునఁ
గృష్ణభగవానుండు వానరులయందెల్ల మిగుల వృద్ధుఁడగు
జాంబవంతుని నోడించి తత్సుతను బెండ్లాడుట మనమెఱుంగు
దుము. సీతామహాదేవి జనకుఁడయిన విదేహుని యొద్ద బల
రాముఁడు తత్త్వవిద్య నభ్యసించెను. శ్రీరామచంద్రుని సమ
కాలికుఁడయిన పరశురామునకును, భారత ప్రపితామహుఁ
డయిన భీష్మునకును నెక్కుటి కయ్యము సంభవించెను. రాజ
సూయాధ్వర సమయంబున నకులునకు విభీషణుఁడు కానుక
లిచ్చెను. రామాయణ కృతికర్తయగు వాల్మీకి ప్రియశిష్యుం
డైన భరద్వాజుని కుమారుఁడయిన ద్రోణుఁడు కురుపాండ
వులకు ధనురాచార్యుఁడయ్యెను. రామాయణ భారత పురు
షుల పరస్పర సందర్శనముచే నీ యుద్ధద్వ్యయమునకు మధ్య
నున్నకాల మత్యల్పమని యూహింపనగును. గాని రామా
యణ యుద్ధకాల నిర్ణయముచేయుటకు మాత్ర మయితికాదు.
కాని భారత యుద్ధము మూఁడు నాల్గువేల సంవత్సరములకు
బూర్వము జరిగియుండునని కొందఱు చారిత్రకు లభిప్రాయ
పడుచున్నారు. ఇంతియకాని రామాయణమునన్న యే
యితర యాధారములు కాల నిర్ణయమున కనుకూలపడవు.
ప్రతిపక్ష దేశమయిన సింహళమున నేమయిన నాధారములు
దొరకునేమో చూడవలయును. సింహళ ద్వీప వాస్తవ్యులు
హిందువులకన్న నెక్కువ జాగరూకతతోఁ దమదేశచరిత్రను
ప్రాసియుంచిరి.

సింహళద్వీప చరిత్రయగు "రాజావళి" యను మిగుల
పురాతన గ్రంథ మీ విధముగా వాఁకొనుచున్నది. "బుద్ధ

దేవుఁడు తన సత్య సందేశమును లోకమునకుఁ దెలియఁజేయు టకుఁ బూర్వము 1844 సంవత్సరముల క్రిందట శ్రీరామచం ద్రుఁడు సింహళముపై దండెత్తెను."

బుద్ధ దేవుఁడు క్రీస్తు పుట్టుటకుఁ బూర్వము 526 సంవ త్సరముల క్రిందట తన సందేశమును లోకమునకు బోధించెను. అనఁగాఁ గ్రీస్తు పుట్టుటకుఁ బూర్వము 2370 వర్షములక్రిందట శ్రీరామచంద్రుఁడు సింహళముపై దండెత్తెను. అనగా నేటికి (2370+1922) 4292 సంవత్సరముల నాఁడు లంకాపట్టణ మైత్రయాత్ర సంభవించెను. ఇయ్యది రామాయణ భారత యుద్ధముల మధ్యకాలము నత్యల్పము చేయుటచే విశ్వసనీయ ముగా నున్నది. ఇంతకన్నను బలవత్తరమయిన కారణములు గోచరించు వఱకు నీ కాలనిర్ణయమే సమంజసమని తోఁచు చున్నది. నాల్గువేల సంవత్సరములన్న సామాన్యముకాదు.

పాఠకుఁడా యింతదనుకే యతి దీర్ఘమయిన పీఠికను దెలుఁగు దేశమునకు సంబంధించిన యొకటి రెండు సంగతులు ముచ్చటించి ముగించెదము. శ్రీరామచంద్రుఁడు తెలుఁగు దేశమునకు వచ్చెననియు, భద్రాద్రికడ నున్న పర్ణశాల రాముని పర్ణశాలయనియు, నుష్ణగుండము సీతామహాదేవి స్నాన మాచరించిన గుండమనియు, నాంధ్రులకు మిగుల నమ్మకమున్నది. ఇది కేవలము చరిత్ర విరుద్ధము. కైకచే నర్థింపఁబడినవాఁడై శ్రీరామచంద్రుఁడు గంగానది నుత్తరించి దక్షిణాభిముఖుఁడై, బొంబాయి రాజధానిఁజొచ్చి, నాసిక యందు శూర్పణఖా నాశికావిచ్ఛేదనం బొచరించి, పదంపడి రావణాపహృతభార్యుఁడై, బళ్ళారియందు సుగ్రీవుని చెల్మిఁ జేసి యచ్చటనుండి దక్షిణంబుగా, బయలుదేరి లంకం బ్రవే

శించి, రావణసంహారంబుఁ గావించెను. ఇంతియకాని భద్రా
దికి రానులేదు, వచ్చుటకు నావశ్యకతయును లేదు. పర్ణ
శాలయు నుష్ణగుండమును రామునకు నేమాత్రము సంబం
ధించినవి కావు. ఉష్ణగుండము సీతామహాదేవి స్నానమాచ
రించుటకు సృష్టింపఁబడినదికాదు. ఇట్టివి వెక్కు దేశముల
యందుఁ గలవు. ఐసులాండు (Ice-Land) అను ద్వీపము
నందు నాకాశములోనికి నెగయుచుండు తప్తోదకముగల యుష్ణ
గుండములు వెక్కులు కలవు. ఇంతయేల ? మన హిందూ
దేశమునందే బరోడా రాష్ట్రము సందున్న "యూగే" అను
గ్రామమునందు నుష్ణగుండములుకలవు. ఇవన్నియుఁ బ్రాకృత
జనంబును లోఁబఱచుకొనుటకుఁ బన్నిన తంత్రములు. పాఠ
కుఁడా ! యభిప్రాయ భేదములను బాటింతురనిచెప్పి నిర్భ
యముగా మా యభిప్రాయములన్ని మీకు నివేదించితిమి.
పొరపాటులున్న యెడల నెఱుఁగఁజేసిన యుక్తమయినచో
ద్దిద్దుకొనుట కేమియు నభ్యంతరము లేదు. ఒక్కరయినను నీ
గ్రంథమును సాంతముగాఁ బరిశీలనబుద్ధితోఁ జదివిన యెడల
మ్మాశ్రమ వ్యర్థముకాలేదని తలంతుము.

నాటక విషయము

శంబుకవధ మతరక్షణాసక్తి ప్రేరితము కాదనియు, రాజనీతి ప్రేరితమనియు, నుత్తర రామాయణముఁ జదివిన వారికెల్ల బోధపడక మానదు. ఈ విషయమున మా యభిప్రాయములను నీ నాటకమే చాటుచుండుటఁజేసి యిచ్చట వెండియుఁ జెప్పుట యనవసరము. ఈ నాటకమునఁ గథా నాయిక లేదు. అనవసరమును, సంబంధమును లేని కథా నాయికను గొనితెచ్చి వృథా నాటకమును బెంచుటకన్న వదలివేయుట యుత్తమమని తలపోసి యిట్లాచరించితిమి. ఇయ్యది నూతన మార్గము కాదు. సంస్కృత నాటకమగు "ముద్రారాక్షసమునకును గథానాయిక లేదు. నాటకవిషయ మునఁ "గురుక్షేత్రసంగ్రామము" యొక్క పీఠికలో బయలు పుచ్చిన యభిప్రాయములే యింకను మమ్మా బాధించు చున్నవి. పద్యముల యందలి గణయతిప్రాసము లెట్టి మహా కవికైనను గొంతవఱకుఁ బ్రతిబంధకములని యెల్ల రెఱింగిన దియే. కాన సముచిత పద ప్రయోగమున భావప్రకటనముఁ గావించుటకుఁ గొన్ని యెడల ననువు కల్గదు. కాఁబట్టి వచన మునందుకన్నఁ బద్యమునందు నెక్కువ భావప్రకటనమున కవకాశము గలదన్న వాద మాదరణీయము కాదు. కాని 'పద్యనాటకములయందు సంగీతము ముఖ్యాంగమగుటంజేసి యయ్యది ప్రేక్షకుల మనోగతులను గొంతవఱకు లోఁబఱచు కొని రసోదయముఁ గావించును. అయినను గద్యనాటకముల యందు నభినయ విశేషము చేతను, స్వరగతి చేతను నీ రసో దయమునే కల్పింప వచ్చును. పద్యమునకన్న గద్యము

ప్రాకృతజనంబునకు సులభగ్రాహ్యముగా నుండును. కాన సంగీత నాటకములున్నను, లేకున్నను, వచన నాటకములు మాత్ర మత్యవసరము. "షేక్సుపియరు" పద్యనాటక ప్రదర్శనములఁ జూచి, తలయూచి, యూనందించి, వచన నాటకముల యందిట్టి భావ ప్రకటనము సాధ్యమగునాయని తలంచుట వెట్టి. నేఁడు "బెర్నార్డ్షా" వచన నాటకములంజూచి మెచ్చని వారెవ్వరు ? ఈ మహాకవి నాటక ప్రదర్శనముం గాంచు భాగ్యము మాకుఁ గల్గినది. ఒక్కొక్క సందర్భమున మేము తన్మయత్వముఁ జెంది, కంటియెదుట జరుగుచున్నది ప్రదర్శనమను మాట మఱచితిమి. ఈ మహాకవి రసోచిత పద ప్రయోగ మటులుంచి యిట్టి తన్మయత్వ దశ కల్గించిన దెద్దియో యనునది విచారించవలయును. దీనికిఁ గారణములు పెక్కులు గలవు. అయినను ముఖ్య కారణములఁ గొన్నింటి నిచ్చుచుంటిమి. ఇందు మొదటిది యభినయము. అభినయ మనఁగాఁ జేతులు, కాళ్ళు, కన్నులు కదల్చుటయే కాక, పలు కులచే వ్యక్తీకరింపఁబడు నవస్థకు ననుకూలమగు ముఖలక్షణ కల్పన కూడ నగును. ముఖ లక్షణముతో పాటు కంఠస్వరము కూడ మార్పుఁ జెందవలయును. ఇవన్నియు మరలఁ బాత్రోచితముగ మాఱుచుండవలయును. అప్పుడే పాత్ర ప్రేక్షకుల మన మాకర్షించి, రసోత్పత్తి కల్గించును; మహారాణికిని, సామాన్య స్త్రీకిని, నొక్క విధముగు నాపద సంభవించినను, నిరువురు నొకవిధముగా శోకింపరు. మహారాణి గుమిలి, కుమిలి పనవును. సామాన్యయో గొంతెత్తి, బావురుమని యేడ్చును. ఈ భేదము సహజముకాదని కొంద అభిప్రాయ పడు చున్నారు. వారితో మే మేకీభవింపక పోవుటయే కాక

యింకఁ బ్రపొపంచక జ్ఞానము గడియించుకొనిన, వారట్టి యభి ప్రాయమును సవరించు కొందురని నమ్మ్మచున్నాము.

పాఠకుఁడా !

దీర్ఘమగు పీఠికను వ్రాసి విసుగుఁ గొల్పియుందుము. మేము వెలివఱచిన యభిప్రాయములయందు నేమేని పొర పాటులున్న వానిని దెలియఁజేసిన యెడల వందన పూర్వక ముగా నందుకొనుటయే గాక తృతీయ ముద్రణ భాగ్యము లభించినయెడల సవరించుకొనియెదము. కాని మాత్సర్య గ్రస్తులై వెట్టి విమర్శనలకు దిగువారి నుడులను బెడచెవులఁ బెట్టెదము.

—: పాత్రలు :—

శంబుకుడు

శ్రీరాముడు

వశిష్ఠుడు

అంగదుడు

హనుమంతుడు

సోమయాజి

చైనులు

గురుదాసు

బ్రాహ్మణుడు

బ్రహ్మదాసు

దౌవారికుడు

శంబుక వధ

(ఉత్తర రామచరిత)

ప్రథమాంకము.

(పథశ్రమమున నంగదుఁడు ప్రవేశించును.)

అంగ :- అబ్బబ్బా ! ఎక్కడ కిష్కింధాపురము ? ఎక్కడ సాకేతపురము ? తుంగభద్రానదినుండి సరయూనదికి రావలయును. వెట్టికి వేయి విధములున్నట్లు నేనీకాలి నడకను రాఁబూనుటేల ? గాంధర్వ విద్యచే నాకాశ గమనంబునరాకతక్కుటేల ! ఈ యార్యుల జన పద మ్ములఁజూచి యానందింపవలసినది యేమున్నది ? వీరి యాచార వ్యవహారములను జూచి నేర్చుకొనవలసినది యే మున్నది ? పర్వత సానువులఁ, బచ్చిక పట్టులఁ, జెట్లతోఁపుల నడిమి నున్న మాపల్లెలే కన్నుల పండు వుగ ముద్దులు మూటఁ గట్టుచుండును. ఈ యార్యుల పేరుగొప్పయేగాని పరీక్షించిన కొలంది యేదియో సామెత జ్ఞాపకమునకు వచ్చుచున్నది ! (విచారించి) అవురా ! యెంత మంచివాడైన నేమి ? జాత్యాభిమా నము వీడదు కదా ! కొలఁది దినములనుండి మాయం "దపనమ్మకము"గూడఁ గల్గినట్లున్నది. కారణమో ?

మేము తమ జాతివారము కామనియా ? మేలు ! ఏవియో మాయ మాటలు చెప్పి, కిష్కింధానగర వానర సామ్రాజ్యమునకు గుండెయు, మా నమ్మిన బంటును, నగు హనుమన్నను సాకేతపురమునఁ గట్టి వైచెను. ఇప్పుడో ! యేదోమిష పెట్టి నన్ను రప్పించు చున్నవాఁడు. దీనినంతయుఁ బరిశీలింప వానర సామ్రాజ్యము తన కైవసమున నుంచుకొనుటకు మమ్ములఁ బూటకాపు చేసినట్లు తోఁచుచున్నది. మా పూర్వ సాహాయ్యమైనఁ దలంపక మతమని పేరు చెప్పి క్రమక్రమముగ దినదినము మా స్వాతంత్ర్యమును గుంజు కొనుచున్నాఁడు. ఎవ్వారును లేరుగదా !

(యిటునటు చూచి)

గీ. అన్నతోఁ దలపడి పోరి యాతురమునఁ
బెఱనుగొని తెచ్చి నెత్తిపైఁ బెట్టుకొనియు
నకట ! తప్పించుకొను నుపా యంబులేక
విసుగుపడుచున్న వాఁడు మా పిన్న తండ్రి. ౧

సీ. నలుఁడు లేకుండిన జలరాశి బంధించి
రావణు లంకకు రాఁగలండె ?
మందుమాఁకులు తెల్పి మాతాత ప్రాణముల్
పోయకున్న నయోధ్య పోవఁగలఁడె ?
కపు లెల్ల దేశముల్ గాలింపకుండిన
దేవి వృత్తాంతంబుఁ దెలియఁగలఁడె ?
దోషాచరులఁబట్టి త్రుంపకుండిన మేను
తోడరి తానొక్కఁడే త్రుంపఁగలడె ?

గీ. వీనినన్నింటిఁ దలపండు మానమందు
వానరుల మమ్మఁ దనతోడి వారిఁగాఁగ
నెంచుచున్నవాఁడంట ! మా కిదియె చాలు
నంట ! యడ్డుచెప్పంగరా దంట ! సుంత. 3

ఉ. ద్రావిడజాతియంచుమమఁ దానొకయప్పుడులోవనమ్మఁగాఁ
బోవక చూడనట్టులదె పో! యొకకంటను జూచుచుండు మే
మేవిపొనర్చుచున్న,మతి యిచ్చునె సౌఖ్యముపారతంత్ర్యమా
హా!విధి!రామరాజ్యమఁట!యక్కట! ఈగతినుండెమాగతుల్.

(విచారించి) యీ నిర్వేదము వలన నేమి యుపయోగము ? అడుగో ! సూర్యభగవానుఁ డుపరదిక్కాంతకుఁ గుంకుమ బొట్టయ్యెను. నేఁటికిందు విరమించి ప్రత్యూషంబున సాకేతంబుఁజేరి రామచంద్ర సందర్శనంబుఁ గావించెద. ననొక్క యార్యునిఁగా బుట్టించనందులకు భగవంతునకు నేను గృతజ్ఞుఁడ. కాయగసరులతోఁ గాలము గడుపఁగల్గుదును. నిండు ప్రాణములతోనున్న యే జంతువునోపట్టి చంపి పొట్టఁ బోషించుకొను నవసరములేదు. ఆహా ! యేమి యీ యరణ్యము. పుష్పఫలభరితంబైయున్నది. ఎవ్వరో పండ్లు గోయుచున్నారు ! (దరిఁజేరి) అయ్యా ! యీ సంధ్యాసమయమునఁ బండ్లు గోయుచున్నారు ? మీరెవ్వరు ?

శిష్య :- మేము రామదాసులము.

అంగ :- అనఁగా ?

శిష్య :- రామునిచే దాసులముగాఁ జేయఁబడినవారము.

అంగ :- ఎవ్వరికి ?

శిష్య :- ద్విజపోతములకు.

అంగ :- ఎందుచే ?

శిష్య :- మేము తమజాతివారము కాకపోవుటచే.

అంగ :- అటులయిన మీరెవ్వరు ?

శిష్య :- వారార్యులఁట. మేమనార్యులమఁట.

అంగ :- అనార్యులనఁగా ?

శిష్య :- ఆర్యత్రైత్రయాత్రకుఁ బూర్వపు దేశవాస్తవ్యులు.

అంగ :- (తనలో) పాశ్చికమైన పరిపాలన మెప్పుడు సర్వజన సౌఖ్య సంధాయకము కాదు. వీనిని గొంతవఱకుఁ దఱచి చూచెద. (ప్రకాశముగా) అయ్యా ! యేల యింత యసంతృప్తితో మాటాడుచున్నవారు ? భగవదవతారమని యెంచఁబడుచున్న రామరాజ్యములోనె కొఱఁత వాటిల్లుచున్నదా ? ప్రాణిసేవ యుత్తమోత్తమమగు కార్యమేకదా ?

శిష్య :- అయ్యా ! యెవ్వరి కెవ్వరి పరిపాలనంబు సర్వసౌఖ్య సంధాయకముగ నుండునో, వారికి నేతత్పరిపాలకుఁడు భగవదవతారమగును గాని యితరుల కెట్లగును ? కాని ప్రొద్దుగ్రుంకుచున్నది. మా గురువు గారు నాకై యెదురుచూచుచుందురు. నేను పోవలయును. మీ రెవ్వరు ? ఎక్కడకుఁబోవుచున్నారు ? మా యాతిథ్యము గ్రహింప నిచ్చగలదేని నాతో దయచేయుఁడు.

అంగ :- అయ్యా ! మీ గురువెవ్వరు ? మీ పేరేమి ?

శిష్య :- శంబుకసంయమీంద్రుఁడు, నా పేరు గురుదాసు.

అంగ :- శంబుకసంయమీంద్రుఁడా ?

గురు :- ఏమి యట్లు వెఱఁగుపడుచున్నారు ? మా గురువు గారినే యెఱుంగరా ! సాకేతపుర ప్రాంతములకు నెప్పుడయిన వచ్చి యెఱుఁగరా ?

అంగ :- రామపట్టాభిషేక మహోత్సవమునకు వచ్చితిని గాని—

గురు :- అయ్యో ! రామపట్టాభిషేకమున కనుచున్నారు, రామచంద్రుని శిష్యులా ? అటులయినఁ బొరపడితిని. ఇట్టి ప్రసంగముం జేయఁ గిట్టదు.

అంగ :- లేదు, లేదు. మేము మీవలెనే కష్టములననుభవించుచున్న వారమే. నేను గిష్కింధాపుర యువ రాజను. అంగదుఁడను.

గురు :- అయ్యా ! ధన్యుఁడను. మీరు తప్పక మాయాతిథ్యమును గొనితీరవలయును. మా గురువుగారు మీ యాగమనమునకు మిగుల సంతసపడెదరు. సుగ్రీవ సార్వభౌముని సంగతి యప్పుడప్పుడు మాతో ముచ్చటించుచుందురు.

అంగ :- నడువుము, వచ్చుచున్న వాఁడను. మీ గురువు గారి సందర్శనమువలన నేనును బవిత్రుఁడనయ్యెద. మహాత్ముని సందర్శనము మాటలతోఁదొరకదుగదా! (నిష్క్రమింతురు.)

చి దా న ం దా శ్ర మ ము

[శల్యగతప్రాణుండును, జటావల్కలధారియు, శాంత స్వరూపుఁడు నయిన శంబుకర్షి ప్రవేశము.]

శంబు :- అబ్బా ! యింకను రాలేదేమి చెపుమా ? జడ

స్వభావుఁడు (పటమటిదిక్కున కట్టెత్తిచూచి) అదుగో!

గీ. అంధకారావృతమునైన యట్టి లోక
ములకునెల్లఁ బ్రకాశంబుఁ బొసఁగుచుండి
జీవరాసులనెల్ల వీక్షించు కర్మ
సాక్షి యస్తమించుచునుండెఁ జరమదిశను. ౨

స్వపక్ష పరపక్ష భేదములులేక యీశ్వరాజ్ఞాబద్ధుఁడై, చేతనా చేతనములనెల్ల స్వార్థత్యాగియై, ప్రత్యుపకృతి నభిలషింపక యొక కంటఁజూచు సూర్యభగవానుఁడెంత కృతార్థుఁడు? 'ఎంత ధన్యుఁడు? ఇందుచేతనే పామరజనంబులు కూడఁ బ్రాతఃకాలమునలేచి, నమస్కరించి యర్ఘ్యపాద్యాదులొసంగి, యాత్మశాంతిని జేసికొందురు.

(తెరలో) ఆత్మశాంతికి నతిథిపూజయే యుత్తమోత్తమమని మీరు నిరంతరము సెలవిచ్చుచుందురుకదా. ఇదిగో! యతిథిని గొనివచ్చితిని.

శంబు :- కుమారా! నీవేనా! యింత యాలస్య మేలచేసితివి? ఎవరా యతిథి? నీవు పోయి పూజాద్రవ్యములను గొనిరమ్ము. ఈశ్వరోద్దేశముచేతను, రాజోద్దేశము చేతను సేవయేకదా మనకుఁ గర్తవ్యము.

[గురుదాసుఁడు, అంగదుఁడును ప్రవేశింతురు.]

గురు :- ఇదుగో! యతిథి. గుర్వాజ్ఞను నెఱవేర్చుటకుఁ బోయెదను. (నిష్క్రమించును.)

అంగ :- కిష్కింధాపురయువరాజు, అంగదుడు నమస్కరించుచున్నాడు.

శంబు :- వత్సా ! చిరకాలము మనుము. నిన్నుఁజూచుటచే నా కానందము గల్గుచున్నది. దారితప్పి వచ్చి నట్లున్నది. సుగ్రీవమహారాజు సుఖముగ రాజ్యమేలుచుండెనా ! కిష్కింధాపుర పౌరులెల్ల రానందముతో వర్ధిల్లుచుండిరా ?

అంగ :- మీ యనుగ్రహమువలన నెల్లరు సుఖముగఁ గాల యాపనముఁ జేయుచున్నారు. రామచంద్రదర్శనార్థమై యరుగుచు మార్గమధ్యమున భవచ్ఛిష్యునిఁగాంచి, మీ యాశ్రమము పరిసరంబున నుండుటెంగి పతితులను బావనులఁజేయు మిమ్మ్ము సందర్శించు మనంబున వచ్చితి.

శంబు :- కుమారా ! యటులయీనచో నీ చేయి మా పర్ణ కుటీరమునఁ గడపి యేపకడనే పోవచ్చును. సాకేత మిచ్చటకు నతిసమీప్యమున నున్నయది సుమా.

అంగ :- మీ వాక్యములే నా కాదేశము.

శంబు :- ఇదిగో ! దర్భాసనంబు. ఇటు గూర్చుండుము.

అంగ :- (కూర్చుండి) దేవా ! యకస్మాత్తుగాఁ బట్టాభి రామునకు సంభవించిన యాపత్తు విని సమాశ్వాసింప వానర రాజ్యపట్టభద్రుఁడు నన్నంపుచుండెఁ. పెందల కడనే పోయి భార్యావియోగమునఁ గుందుచున్న దాశరథిని నోదార్పవలయు.

శంబు :- అగును. పాపము. తీరరాని యాపత్తే సంభవించి నది. చేతులారఁ జేసుకొన్నదాని కంతగా దాశరథి చింతింపఁడు. చింతిల్లఁడు.

అంగ :- చేతులారఁ చేసుకొన్నది యేమి !

శంబు :- చేతులారఁ జేసికొన్నది యేమని విస్మయ పడు చున్నావు ?

ఉ. చాకలి వానిమాటలుని జమ్మని నమ్మిచుశంకితాత్మఁడై
యాకమలాయతాక్షిని,స మంచితసాధ్వినిఁ,బూర్ణగర్భిణిన్
లోకులు నవ్వఁ గారడవి లో వసియింపఁగ నట్టి పంపఁడే
యాకకునింతయేని నెదురాడని తల్లియటంచుఁగాదొకో. ౫

అంగ :- మహాత్మా ! యట్లుకాదు. సూర్యవంశమునందలి సార్వభౌము లీగకాలియంతయినఁ గలంకము లేకుండఁ బ్రజాపాలనముఁ గావించిరఁట. తద్వంశ జ్ఞాతుఁ డయిన శ్రీరామచంద్రుఁడిట్టి కళంకమునకు ననుమానాస్పదుఁడగుటకుఁగూడ నోర్వక యిట్లాచరించెనఁట.

శంబు :- మనము దీని యాథార్థ్యమును శంకింపవలసిన యగత్యము లేదు. కాని, నాఁడు రావణసంహారానంతరమున లంకాపట్టణంబున నిష్కరుణుఁడై యమ్మహాజననిఁ జితి నెక్కించి, హవ్యవాహనుని మూలంబున, నమ్మహాపతివ్రత సాధుశీలమును, నకలంక చారిత్రమును, నవ్యాజ పతిభక్తియుఁ దానెఱుంగుటయే కాక లోకమెల్ల నెఱింగయున్నను, నిప్పుడిట్టి యకార్యమును జేయుటేల ? కేవలము ప్రజలను సంతోషపెట్టుటకేనా ? కుమారా ! యొక్క సంగతియున్నది.

గీ. పెక్కు జనముల సంతోష పెట్టఁదలఁచు
వాఁడొకనినైన సంతోష పఱపలేక
తుదకు వ్యర్థ ప్రయత్నుఁడై, దుఃఖభాజ
నుఁడగు నిరతంబు పెక్కులు నుడువనేల ?

శ్రీరామచంద్రుఁ డీయవస్థనే పొందినాఁడని నా యాశయము.

గురు :- (గురుదాసు ప్రవేశము) ఇవిగో ! పూజా ద్రవ్యములు.

శంబు :- ఇటులుంచును.

గురు :- దేవా ! యప్పుడే వాల్మీకులవారు రామాయణము ప్రాసిరఁట. శ్రీరామచంద్రుని భగవదవతారముగాఁ గూడఁ జేసినారఁట.

అంగ :- గురుదాసా ! కాఁడనియా నీ నమ్మకము ?

గురు :- కాకేమిగాని, కవీంద్రుని లేఖినిలోనున్న మాహాత్మ్యము మాత్రము నన్నబ్బురపడఁ జేయుచున్నది. కవి లేఖినికి విశ్వామిత్రసృష్టిఁజేయు శక్తి గలదు.

అంగ :- గురుదాసా ! యేమి నీయుపాలంభనములు ?

గురు :- యువరాజా ! నన్నుఁ బరిహసింపకుము. మన హనుమంతుఁడు కూడ నొక రామాయణము ప్రాసి శ్రీరామచంద్రున కర్పించెనఁట. ఎందుచేతనోకాని దానిని సముద్రమునఁ బాఱవేయించెనఁట.

శంబు :- కారణమేమి ?

గురు :- శ్రీరామచంద్రుని భగవదవతారముగా వర్ణింపక యసాధారణ మనుష్యమాత్రునిగా వర్ణించుటచేనని లోకము చెప్పుకొనుచున్నది. లోకము నోరుమూయించుట కెవ్వరికి సాధ్యము ?

అంగ :- మంచిపనియే జరిగినది.

శంబు :- సరే ! నీవుపోయి మన పర్ణకుటీరము తూర్పువైపు గదిలో దర్భలతో మెత్తని సెజ్జ యొనర్చి, వానర రాజునకుఁగాను వివిధఫలముల నందుంపుము.

గురు :- చిత్తము. (వెడలును)

అంగ :- (తలపంకించుచుఁ దనలో) పారతంత్ర్యమందున్న వారిగతి యింతియేకదా ! (ప్రకాశముగ) దేవా ! మిమ్ములనొక ప్రశ్నమడుగవలయునను సముత్కంఠ యున్నది. మిమ్ములఁజూచి చూచుటతోడనే సర్వ శాస్త్ర పారంగతులనియు, నిష్ఠురతపో నిష్ఠాగరిష్ఠులనియు, బ్రహ్మర్షిజ్ఞానధనులనియు, మా బోంట్లకుఁ దోఁచకమానదు. కాన..... .....

శంబు :- ఇది కేవలము స్తుతిమాత్రము.

అంగ :- మహనీయులు స్వోత్కర్షవర్ణన వినరొల్లరు. మీ కెట్లు దోఁచినను మాకు మాత్రము సత్యము; కావున నా యల్పబుద్ధికిఁగల్గిన శంకను గూర్చి మిమ్మేఁ బ్రశ్నింప మనంబు వేగిరపడుచున్నది.

శంబు :- కుమారా ! యీయఖండజ్ఞానస్వరూపుని ముంగల మన మందఱి మణుమాత్ర పరిజ్ఞానులము. మన యందలి తారతమ్యము కూడ నంతియే.

అంగ :- మీ సౌజన్యము మిమ్మనట్లు పలికించుచున్నది.

ఏది యెట్లున్నను నా సందియమును దీర్చుటకు మాత్రము మీ రర్హులు.

శంబు :- నీకా యభిప్రాయమున్న నడుగుము.

అంగ :-

చం॥జపము, తపంబు, రెండునుద్విజన్మలవైదికకర్మముల్గదా
నృపతికి వర్ణధర్మముల నెల్లను బ్రోచుట ధర్మవంచు నె
ల్లపుడు వచించుచుండునుగ దా! మనశాస్త్రములట్లుగాన,మి
మ్మిపుడయుపేక్ష సేయఁగలఁడే! రఘురాముఁడుకంటఁజూచినన్.

శంబు :- కుమారా! యంగదా! నీ సంశయములను దీర్తు
నుగాని మన శాస్త్రములనుచుంటివి. ఎవ్వరి శాస్త్ర
ములని నీ యాశయము?

అంగ :- ఆర్యులు చెప్పిన స్మృతులని నాయాశయము.

శంబు :- అవి మన వెట్లగును?

అంగ :- ఇందు భిన్నాభిప్రాయుఁడను. మన వెట్లు కావో
తెలియకుంటిని?

శంబు :- ఇదుగో! వినుము. తెలియఁగలదు.

చం.ఋషులో! మఁటెవ్వరోపలువురెచ్చటనోగుమిగూడితాముక
ల్మషమతిఁ బక్షపాతముగ లక్షలగ్రంథము వ్రాయఁగా నకి
ల్బిషములటంచునెత్తిపయిఁ బెట్టుకపూజయొనర్పనేర్తుమే?
ఋషులకుమాత్రముండవల దేఋజుమార్గమువాలినందనా?

ఇట్లు వ్రాయఁబడిన శాస్త్రములు మన శాస్త్రములెట్ల
గును? మనకుఁగా వ్రాసిరా? మన యభిప్రాయములఁగొనిరా?
కానినాఁడు మనమేల వానిచే బంధింపఁబడవలయు?

అంగ :- ఋషులు కల్మషమతిఁ బక్షపాతముగ గ్రంథము లను చెప్పిరని చెప్పుట సాహసమని యభిప్రాయ పడు చున్నాను.

శంబు :- కుమారా! సాహసమెట్లగును? పక్షపాతముగ వ్రాసిరో లేదో యోజింపుము.

సీ. చోరత్వమునుజేయ శూద్రునకవయవ
విచ్ఛేదనము శాస్త్ర విహితమంట!
ఆ దోషమునె విప్రుఁ డాచరించినయంత
మందలింపులె ధర్మ మార్గమంట!
బ్రాహ్మణేస్నేహసం పర్కమ్మ్నగల శూద్రు
నగ్నికర్పించుట న్యాయమంట!
శూద్రవనిత మరుల్ సొక్కిన విప్రుండు
సంతాపపడుటయే చాలునంట!

గీ॥ ఇవియె మన ధర్మ శాస్త్రము లిందునందు
నివియె చుమ్మ్న నిష్పక్షపా తైక బుద్ధి
మనకుగాఁ జెప్పి పెట్టిన మహితములగు
గ్రంథరాజముల్ వానర రాజ పుత్ర!

అంగ :- సంయమీంద్రా! యేదియెట్లున్నను మనమెన్నఁడో వారి మతమును స్వీకరించితిమి, అట్టిచో—

శంబు :- అచ్చటాగుము, అట్లనఁజనదు. మనము వారి మతమును స్వీకరింపలేదు. పరస్పర మతసమ్మేళనము వలన నిష్పన్నమైన దీహిందూ మతము. వారిది

జ్ఞానయోగము, మనది భక్తి యోగము. ఈ యోగములు రెండును హిందూ మతమునకు మూలాధారములే.

అంగ :- అయినచో మన మత గ్రంథముల మనమే తూలనాడుట సమంజసమగునా ? యిది విచారింపవలదా ?

శంబు :- కుమారా ! యెంత వెట్టిపడితివి. ఇవి మత్గ్రంథములా ! ఇప్పుడే యీ స్మృతి కర్తల కడకేగి భగవద్ధ్యానముఁ జేయుటకును, భగవత్కైంకర్యముఁ జేయుటకును, భగవత్తాన్నిధ్యముఁ జేరుటకును, నీకులము లేమయిన నడ్డుపడునంచు రేమో ప్రశ్నింపుము.

అంగ :- ఏమందురని మీ యుద్దేశ్యము ?

శంబు :- ఇందుద్దేశ్యమేల ? నిశ్చయమే. ఏకగ్రీవముగా నీశ్వరుని దృష్టియందుఁ నెల్లరును దుల్యులని వారు నిశ్శంకముగాఁ జెప్పెదరు.

అంగ :- అటులయినచో నీ స్మృతులన్నియు నిట్టులేలచెప్పిరి? కారణమేమి చెప్పెదరు? దీన ఋషులకు లాభమేమి?

శంబు :- ఇదియే మనము శ్రద్ధగా విచారింప వలసినది. చెప్పెద వినుము. ఇవి సంఘ నిర్మాణమునకు దీర్ఘదృష్టితోడను, నైపుణ్యము తోడను నేర్పఱచిన కట్టుదిట్టములు. ఈ శిక్షాస్మృతులు లేకున్న సంఘము చీకాకువడి నిర్వీర్యమును దుర్బలమును నగునని నమ్మి వీనిఁ బుట్టించిరి.

అంగ :- స్మృతులు మతసంబంధములగు గ్రంథములే కావా?

శంబు :- ముమ్మాటికిని గావు. సాంఘిక చరిత్రమునకు సంబంధించినవి. ఇట్లు వివరింపకయే రెంటిని గలగలిపి

మనలను మతస్వాతంత్ర్య దూరగులఁజేసి మహాపాతక
మును మూటఁగట్టుకొనుచున్నారు. భగవంతుఁ డిట్టి
వాఁడని యివి బోధించుచున్న వా ?

అంగ :- అటులయినచో స్మృతు లనవసర గ్రంథములనియా
మీ యభిప్రాయము ?

శంబు :- కుమారా ! అట్లుకాదు వినుము. పరాజితులఁ దమ
సంఘమునందుఁ జేర్చుకొనునప్పుడు జేతలు జాగరూ
కులై యుండుట ధర్మము. లేక సమాన స్వాతంత్ర్య
మును, స్వత్వమును నొసంగినఁ బాలితులకుఁ బాలకుల
లోపాలోపములును, బలాబలములును దెలియును.
దానఁ బాలకుల యుచ్చదశకుఁ దప్పక భంగము
వాటిల్లును. కావునఁ బాలితులకుఁ బాలకుల యాయువు
పట్టుఁ జూపించుట రాజనీతి కాదు. ఇది తలంచియే
కొందఱు ఋషులు స్మృతులు రచించి సంఘమును
బలవత్తరముఁ చేసికొనిరి. ఇదియే ఋషులకుఁ గల్గు
లాభము.

అంగ :- ఈ సిద్ధాంతముచే మీవాదము నీరసమగుటలేదా ?
మనము పాలితులముకాన సమానములగు హక్కుల
నీక రాజ్యతంత్రావరణమునకు దూరముగ నుంచుట
రాజనీతియేకదా ?

శంబు :- అగునుగాని యింకొక్క సంగతి యున్నది. ఇది
రాజనీతియే. కాని. మనమేనాఁడో యేకమతస్థులమై
వారి యాచారవ్యవహారముల నవలంబించి సంపూర్ణ
ముగా నార్యసంఘముతో నేకీభావమును బొందితిమి.
ఇట్టి మనలను బరులఁగాఁజూచుట రాజనీతికి విరుద్ధము

కాన మనమార్యసంఘముతో బాటు సమాన స్వాతంత్ర్యమును, హక్కులను బొందఁదగియున్నాము. వానిని బొందుటకే మేమిప్పుడు సర్వప్రయత్నములు సేయుటకుఁ గృతనిశ్చయులమయి యుంటిమి. ఈ యాశ్రమస్వీకారముఁగావించి, హింసాపరాఙ్ముఖుఁడనై భగవద్ధ్యానముఁ జేసికొనుటకు నన్నిప్రాపిడచర్మ మాటంక పఱచునా ! ఆత్మకు నీ యావరణతో సంబంధ మేమున్నది ! భగవంతుఁడు దీని నేల నిషేధించును ? నిషేధించిన భగవంతుఁడెట్లగును ! భగవంతునకు సమబుద్ధి యుండదా ?

అంగ :- మహాత్మా ! సంపూర్ణ విజ్ఞానముఁబొందితిని. నా యవివేకపుఁ బ్రశ్నల మన్నింపుఁడు. (సాష్టాంగ నమస్కారముఁ జేయును.)

శంబు :- వత్సా ! లెమ్ము, లెమ్ము, ఇది యనుచితము. (లేవఁదీయును.)

అంగ :- మీ యీ బోధనలను ద్విజులు విన్న తూష్ణింభావముతో నుపేక్ష సేయుదురా ?

శంబు :- ఎందుల కుపేక్షచేయుదురు ? వారి యాధిక్యమునకు భంగములగు కార్యముల వారుపేక్షింతురా? ఇది సహజమే కదా ? మఱియు నీ యభిప్రాయములన్నియు, వికసింపక మొగ్గగా నున్నయపుడే గిల్లివేయ విశ్వప్రయత్నములు సేసెదరు. ఇంతకుమున్నే ద్విజ సంఘమునందుఁ గలవరపాటుద్భవిల్లినది.

అంగ :- దేవా ! నాకొక భయము పొడముచున్నది. ఇది కలవరపాటుతో నాఁగునని నమ్మను.

శంబు :- ఎంతవఱకుఁ బోవునందువు ?

అంగ :- రాజు బ్రాహ్మణాధీనుఁడు. అందు శ్రీరామచం
ద్రుఁడు వర్ణాశ్రమాచారముల నెలకొల్ప బద్ధ కంక
ణుఁడు. కాన మీ స్థూలశరీరమునకే యుపద్రవము
గల్గునని భీతిల్లు చుంటిని.

శంబు :- ఔమాఁరా ! యియ్యది నేనెఱుంగకపోలేదు. అయి
నను శ్రీరామచంద్రుఁడు యుక్తాయుక్త విచారణ
సేయక యీ యకార్యమునకు నొడిగట్టునను విశ్వా
సము లేదు. దుష్టశిక్షణంబునకు, శిష్టరక్షణంబునకును
నుపయోగింపఁబడు చున్నదన్న యీ నిశాత కరవా
లంబు నిరపరాధియు, దుర్బలుఁడునునైన యొక ముని
కంఠమునఁ గెగయునా ?

అంగ :- స్వామీ! శ్రీరామచంద్రుఁడొక్కఁ డేమయిన నిట్టి
యవినీతి కార్యములకుఁ దెగఁడుకాని ద్విజులు బలవంత
పెట్టి చేయించకుందురా ? ఇయ్యది దుష్టశిక్షణ, శిష్ట
రక్షణంబని, శ్రీరామచంద్రునకు బోధింపరా ?
శ్రీరామచంద్రుని నిమిత్తమాత్రునిఁ జేసెదరు.

శంబు :- శ్రీరామచంద్రుఁడు బ్రాహ్మణుల చేతిలోని కీలు
బొమ్మ యనియా నీ యభిప్రాయము. అట్లయిన నేను
చింతింపవలసిన కార్యమేలేదు. ఈ శరీరంబునకు మర
ణంబు నైసర్గిక ధర్మంబు. ఇదివఱకే నిరంతర తపం
బుచే, శుష్కించి, శుష్కించి, శల్యావశిష్టంబుగ
నున్నది. ఈయెముకల ప్రోవుపై శ్రీరాముఁడు విశ్వా
మిత్ర దత్తమైన ధనుష్టాండిత్యము మెఱయ నస్త్ర
ప్రయోగముఁ గావించి కీర్తినిబొందినఁ బొందునుగాక!

శిష్యుని లక్ష్యజ్ఞానమునకు విశ్వామిత్రుఁడు సంతసించిన, సంతసించుగాక. కుమారా ! యింకొక్కటి విచారింపుము.

సీ॥ ఇల్వలవాతాపు లిద్దరు పల్వార
మనుజుల దిగమ్మింగి రనుటయేల ?
కుంభకర్ణాదులు గుటగుట రక్తంబుఁ
దెగఁడ్రావిరని చెప్పి తెగడుటేల !
చేతికందినయట్టి జీవరాసులఁ గబం
ధుఁడు చంపి, తినెనంచు నుడువుటేల ?
మత్తిల్లి తారక మనుజాశి పల్వార
భక్షించెనని చెప్పి బదరుటేల ?

గీ. సూర్యవంశోద్భవుం డతి శూరవరుఁడు
వివరమెఱిఁగిన మనుజుండు బికిరమెత్తి
కొనుచు జీవించు నొక కృశాంగుని నలౌకి
కుని నిరపరాధు దయమాలి గొంతుఁగోయ. ౧౦

అంగ :- అమంగళము ప్రతిహతమగుఁగాక.

శంబు :- ఇందమంగళమేమున్నది ? జరుగవలసిన కార్య విధానమేయిది.

అంగ :- అయ్యా ! యీ వృధామరణము వలన లాభమేమున్నది ?

శంబు :- ఏమున్నదా ? శ్రీరాముఁడు ఖడ్గహస్తుఁడై చనుదెంచి, నన్నీజపతపంబులు మాని ద్విజసేవ చేయు

మన్నను నా యంతరాత్మకు వ్యతిరేకముగా దాని నొనర్పఁజాలను. ఒనర్పకున్న జరుగునది యిదియే కదా ! రామరాజ్య మిట్టిది యని కొన్ని నాళ్ళకైన జగమెఱుంగఁగలదు. శంబుకుని వధ, న్యాయమో, యన్యాయమో, నిష్పాక్షిక బుద్ధితో నంతర్వాణులు నిశ్చయింతురు గాత. చావునకు భయంపడిస్వత్వమును నశింపఁజేసికొందుమా ?

అంగ :- ఇట్టి దారుణకార్యములు జరుగకుండుఁగాక.

శంబు :- యువరాజా ! యిప్పటికే చాల ప్రొద్దుపోయినది. ఇంకేమయిన నున్నయెడల రేపు ముచ్చటించెదము. ఇంక నిదురింపఁ బొమ్మ్ము.

అంగ :- చిత్తము. (నిష్క్రమించును.)

శంబు:- గీ. జగముకంటివేల్పు సర్వకృత్యములకు
సాక్షిగాఁగ నన్ను సాఁకుగాత
స్వల్పబుద్ధినగుట సతతంబు పరికించి
మంచిమార్గమందు నుంచుగాత ! ౧౧

(నిష్క్రమించును.)

ప్రథమాంకము సంపూర్ణము.

శంబుకవధ

(ఉత్తరరామచరిత)

ద్వితీయాంకము.

సాకేతపురము, రఘుఘుంటాపథము, బ్రాహ్మణగృహము.

(అరుఁగుపై నాకులు కుట్టుకొనుచు సోమయాజి కూర్చుండును.)

సోమయాజి:- వషే, వషే ! యేమిటి యారొద? ఎల్లప్పుడు పదిమంది వేదపాఠముఁ జేయుచున్నట్లు లిల్లంతయు మాఱు మ్రోఁగుచుండును.

సోమిదేవి :- ఎప్పుడు నన్నొక్కటేవిధముగా నాడిపోసి కొను చుందురు. చైనులుగారువచ్చి మీరెక్కడనున్నారని యడుగఁగా జవాబుఁ జెప్పుచుంటిని. దానికింత బ్రహ్మాండముఁ జేయుచున్నారు.

సోమయాజి :- అట్లా చెప్పు. అదియా సంగతి? సరే.

చైనులు:-(ప్రవేశించి) సోమయాజులుగారూ! అరుఁగుమీఁద గూర్చున్నారా? ఏమిచేయుచున్నారూ యిచ్చట?

సోమయాజి:- ఓహో ! చైనులుగారా? దయచేయండి, ఏమి చేయుటలేదండి. ఇంటిలోని పోరుపడలేక విస్తళ్ళఁ గుట్టుచుంటి. ఈ వయస్సున నేపనిఁజేయఁబోయినను గష్టముగనే యుండును.

చైనులు:- (ఒకచేతితో నేలనానుకొనుచు నాత్రముతో) కొంప
లన్ని కొట్టికొనిపోవుటకు సంసిద్ధముగా నున్నయప్పుడు
మీ కీ శాంతమెక్కడనుండి వచ్చినదండి ? సాకేత
పురమంతయు నాగుబ్బగాఁ జెప్పుకొనుచున్న సంగ
తులు మీ చెవినిఁబడలేదా ? ఎంత శాంతము ?
ముసలితనము హెచ్చినకొలంది శాంతము కూడ
హెచ్చుచున్నది. ఇదో సృష్టివైచిత్ర్యము.

సోమయాజి :- చైనులుగారూ ! మీ దంతయు నొకగోల.
గ్రుడ్డికన్ను మూసిననేమి తెఱచిననేమియన్నట్లు, చెవి
దగ్గర శంఖమూదినను వినఁబడని నాకు నూరిలోని
సంగతులు తెలియఁగలవా ? వెట్టిగాని ?

చైనులు:- అట్లయిన మీరు మంచియవస్థలోనే యున్నారు.

సోమయాజి:- (విసుగుతో) మంచో ! చెడుగో ! కాని మీరు
వచ్చినపని చెప్పరాదూ ?

చైనులు:-చెప్పుటకు మాత్రము నోరాడవద్దూ ? శాస్త్రకారుల
మాటలప్పుడే నిజములగుచున్నవి చూచారా? శాస్త్ర
కారులు తెలివి తక్కువవారా ? త్రికాలజ్ఞులుకాదూ?

సోమయాజి:- శాస్త్రముల యుబుసెత్తుచున్నావు. మన కిప్పు
డేమి మూడినది ?

చైనులు:-ఏమి మూడినదా! మొన్నటిసంగతి విన్నారుకదా ?

సోమయాజి :- గురుదాసు పేలినమాటలా ? ఆఁ! వినకేమి ?
తగిన ప్రాయశ్చిత్తమే యయినదికాదా ? కొఱత
వేయించినారు కదా. నీవు కండ్లారఁజూచినావా ?
దుర్మార్గుల శిక్షించుపట్ల శ్రీరామచంద్ర భగవాను

నకు దయ యనుమాట యేకోశమందయిన నుండదు సుమా !

చైనులు:- ఈయగ్రాచ్యపుముండ కొడుకులుశిక్షించిన కొలంది మొండివారగుచున్నారు. వీరు పెచ్చుపెరుగు చున్న ట్లున్నది.

సోమయాజి:- క్రొత్తగా నిప్పుడేమి వాటిల్లినది ?

చైనులు:- ప్రాతఃస్నానముఁజేసి, సంధ్యావందనముఁ జేసికొను టకు వేకువ జాముననేలేచి నేఁడు కకుత్థ్సఘట్టమునకుఁ బోయితిని. నాకన్న ముందుగనే యొకఁడొడలెల్ల బూడిదపూసికొని వివిధకుసుమ పత్రసమాహృత్యుఁడై విఘ్నేశ్వరపూజఁ జేయుచుండె. కపరకప్పర చీకఁ టులు నలుగెలంకుల నలముకొని యుండుటచేఁ జూడక యావినాయక విగ్రహముపైఁబడితిని. అంత నాతఁడు మండిపడుచు నన్నుఁ దూలనాడ నారంభించెను.

సోమయాజి:- చైనులుగారూ! దేవతా విగ్రహముపైఁబడుట దోషము కాదా ?

చైనులు:-దోషమేకాని, యాతఁడెవ్వఁడనుకొన్నారు? అతఁడు గురుడాసుని తమ్ముఁడఁట.

సోమయాజి:- అవురా ! ఏమని తూలనాడినాఁడు ?

చైనులు:-దేవపూజా విఘ్నముగావించుట మొఱకుల లక్షణ మని యేమేమియో గొణిగినాఁడు.

సోమయాజి:-దారితప్పిపోయిన కొలంది యీముండకొడుకులు పైపైకి వచ్చుచున్నారు. దయా దాక్షిణ్యములు మాని వీరలను దల్లివేరులతోఁ బెకలించిపాఱవేయించ

వలయును. రామభద్రున కీ సంగతి తెలిసినదా ? ఆస్థే
యములగు శాస్త్రములను ధిఃకరించి గురుధనాపహర
ణమునకుఁబూనిరిగాతుచ్ఛలు. ఇప్పుడే వీరిని గొఱుత
వేయించ వలయును. పెందలకడనే మేలుకొనుట
యుక్తము.

చైనులు:- పుండొకచోటనున్న మందొకచోటవేసినఫలమేమి
వీని నొక్కనిఁ దుదముట్టించిన లాభమేమి ?

సోమయాజి:- నీవు చెప్పుచున్నమాటలు నాకర్థమగుట లేదు.

చైనులు:- ద్రావిడులయందు నూతనశక్తి యెండుద్భవిల్లినది.
ఆర్యులతో సమానస్వాత్వమును గోరుచున్నారు. దీని
కంతకును మూలకంద మా శంబుకుఁడు. వానిని గడ
తేర్చినఁగాని యీ యాందోళనము సమసిపోవదు.

సోమయాజి:- అయితే నీవు శంబుకు నెఱుంగుదువా ?
వాఁడెంతపనిఁజేయుచున్నాఁడు. తొల్లి తపోభంగమై
ద్రావిడుఁడై పుట్టెనుగాఁబోలు.

చైనులు:-ఆఁ! యెఱుంగుదును. పరమసాధువు, విజ్ఞాని, పరా
పకారముఁ దలపెట్టఁడు.

సోమయాజి:- నీ మాటలు చిత్రముగా నున్నవి. అట్లయినచో
నిదియంతయు నేమిటి ? ఎందులకు వచ్చినపని !

చైనులు:- ప్రజలందఱుసమానముగాఁ బరిపాలింపఁబడవలయు
ననియు, సమానమగు హక్కులుండ వలయుననియు
నాతని వాదము. అందులో మతవిషయమున నీషణ్మా
త్రమైన భేదముండఁగూడదని యాతనియభిప్రాయము.
అందుచే నతఁడిట్లు చేయుచున్నాఁడు.

సోమయాజి :- అట్లయితే ఋషిప్రోక్తములగు గ్రంథము లన్నియు సున్నచుట్టవలసినదేనా ?

చైనులు:- స్వత్వసామాన్యమునకుఁ బ్రతిబంధకములగు నీతు లన్నియు గర్హ్యములనియే యాతని యభిప్రాయము.

సోమయాజి:- ఓహో ! కొంపకు నిప్పుపెట్టించుచున్నాఁడే ? అతఁడిప్పుడెక్కడ నున్నాఁడు ?

చైనులు:-మనపట్టణంబునకుఁ బరిసరంబుననే సరయూ నదీతీరమునఁ జిదానందాశ్రమమని పేరువెట్టుకొని యొక యాశ్రమము నిర్మించుకొని తపస్సుఁ జేసికొనుచు, నప్పుడప్పుడు శిష్యులకుఁ దత్త్వోపదేశముఁ గావించుచున్నాఁడు.

సోమయాజి:- (మండిపడుచు) ఏమి ! తపస్సా ! శూద్రుఁడు, తపస్సా ? శిష్యుల కుపదేశములా ? ఏమి వింత ? రామరాజ్యములోనే యిట్టి వింతలా ? ఇప్పుడు మనము చేయవలసినది యేమి ? వెంటనే నిశ్చయింపుము.

చైనులు:- వీని నీ వైపుల లేకుండఁ జేసినఁగాని యీ గందర గోళము మానదు.

సోమయాజి:- ఈ వైపులనేమిటి ? వెనుక వచ్చువారికి మరల నొకపనియా ? ఈ లోకమున లేకుండఁగనే చేయవలయును. సరే ! నడువుము. నేనుగూడ వచ్చెదను. రామభద్రునికడకు వెళ్ళెదము.

చైనులు:- తొందరపడకుఁడు. ముందుగా వసిష్ఠులవారి కడకుఁ బోయి వారితో నాలోచించి కార్యము నడపెదము.

సోమయాజి:- సరే మంచి యూహా, నడువుము; ఈ విస్త
ళ్ళింటిలోఁ బడవేసి వచ్చెదను. (నిష్క్రమింతురు)

(శ్రీరాముఁడు, హనుమంతుఁడు, అంగదుఁడు
ప్రవేశింతురు.)

శ్రీరామ :- అంగదా! చిరకాలమునకు మమ్ము దర్శింప
వచ్చితివి. వానర సార్వభౌముఁడు సుఖముగ రాజ్య
మేలుచుండెనా? మమ్మేమయినఁదలపోయుచుండునా?

అంగ :- దేవా! హసాదు. మీ యాజ్ఞాబద్ధుఁడై కాదా
కిష్కింధాపురమున వానరసార్వభౌముఁడు రాజ్యము
జేయుచుండుట? మిమ్మునేదలంపని నిమిష మొక్కటి
యయిన నుండునా? అందు సుగ్రీవ సార్వభౌముఁడు
మిమ్మునే దలంపకుండునా? "ఆమరణాంతము కృతజ్ఞుఁ
డనై యుండఁదగిన సాహాయ్యము చేసితి"రని చెప్పు
చుండును.

హను :- [తనలో] ఏమి యువరాజు మాటలు వ్యంగ్య
ప్రధానముగా నున్నవి. ఏలొకో? వీనిచర్య లనుమా
నాస్పదములుగాఁ గన్పట్టు చున్నవి.

శ్రీరామ :- క్షమారా! అంగదా!! మేముచేసినది కడు
నల్పకృత్యముసుమీ! మీ పినతండ్రి మిగుల ప్రబు
ద్ధుఁడగుటచే మాయందుఁ కడుంగడుఁ గృతజ్ఞుఁడై
యున్నాఁడు.

అంగ :- [తనలో] నిజముగ నల్పకృత్యమే. [పకాశముగా]
దానికే రేయింబవళ్లాంతరంగికులతోఁజెప్పికొని యువ్వి

ల్లూరుచుండును. దేవరవారికి నాకస్మికముగా వాటిల్లిన యాపత్తునకుఁ గుంది కుంది వెంటనే నన్ను మీకడ కంపెను.

శ్రీరామ :- అంగదా ! తీరరాని యిక్కట్టే కాని,

సీ. కాక పక్షంబులు గల్గని పసినాఁడె
దేశముల్ బుషితోడ దిమ్మదిరిగి
కనులలోఁ బెట్టుక యనుకంప సాకిన
పితమరణంబుచే వెగటుచెంది
కడలేని యడవులఁ గాల్నడతోడ ని
ల్లాలితోడుత నడయాడి యాడి
కడుఁగ్రొవ్వి కన్నులు గనక రావణుఁడు చే ;
సిన పరాభవముచేఁ జివికి చివికి

గీ. యుండినను ధర్మసంస్థాప నోచితంబు
లైన యట్టి కార్యముపట్టు లందు జంక
మెపుడు రవ్వంతయేని యే మేని పెద్ద
దిగులు గొల్పెడు కష్ట మే తేరనున్న.

కాన రాజధర్మ పరిరక్షణంబుకై యర్థాంగిని గారాని యడవుల కంపినందులకై పరితపింపము.

హను :- దేవా ! మీరనునది నిజమేకాని యొక్కసంగతి మాత్రము విచారింపవలసియున్నది.

సీ. కన్నవారలనెల్లఁ గడకుఁ ద్రోసి మహాత్మ !
భవదాశ్రయముఁగోరి వచ్చెనయ్య

అక్కటక్కట ! యసూ ర్యంపశ్యాయయ్యు మీ
తోడునీడవలె న ల్లాడెనయ్య
పలలాశికొని పోవఁ గలయందు సైతము
రేఁబవల్ మిము సంస్మ రించెనయ్య
మీసంశయము తీర్చ్ నాసతోఁ దెగమందు
సాదనెక్కి కమలక బ్రబి కెనయ్య

గీ. అట్టి సాధ్వీమతల్లి మా యమ్మ మూఁడు
లోకములతల్లి యక్కటా ! లుబ్ధకాళి
పంచఁజేరినఁ బక్కునఁ బగిలి నా హృ
దయము చావనైతినిగదా తత్క్షణంబ. ౩

శ్రీరామ :- ఆంజనేయా ! వెట్టియేడ్పు లేడ్చుచున్నావు. మేము విధించిన దండనచే మేము దోషముఁజేసితి మనియా నీయుద్దేశ్యము.

హను :- నే ననఁజాలనుగాని, మాయమ్మమాత్ర మాదండ నకు నర్హ్యా రాలు కాదని యెఱుంగుదును.

శ్రీరామ :- అయిన మేముదోషముఁ జేసినట్లెకదా ! దీని నిదివఱకేల చెప్పకపోతివి ?

హను :- చెప్పనందులకు నామనస్సాక్షి ననున్ఁ బీడించు చునేయున్నది. ఇన్నిదినములనుండి నేను గంటఁ గూర్కెఱుంగుదునా ? మొన్న యాజగన్మాత స్వప్న మునఁదోఁచి కనుకొలుకులనుండి వేడికన్నీరు కాల్వలై పాఱుచుండఁగొనగోటఁజిమ్మ్నచుఁడగ్గుత్తికతో "గుమా రా! యకలంకమైన నా చారిత్రమును, దుర్మార్గులకు దుర్జ్ఞేయమైన నాపాతివ్రత్యమును, నీ వెఱుంగవా!"

యనెను. నే నులికిపడి తల్లీ యెఱుంగకేమి? ఈ దీనుఁడు మీ సన్నిధానమున నిల్చుటకయిన నర్హుఁడాయంటిని. అట్లయినచో "శ్రీరామచంద్రునితోఁజెప్పి యేల వారి సంశయములనుదీర్పవ"నియెను. తల్లీ! తల్లీ! జగన్మాతా! నేనసమర్థుఁడను, నేనసమర్థుఁడను. అమ్మా! నేనెవఁడను? ఆమహానుభావునకు నొక సామాన్య సేవకుఁడను. నా మాటయందు వారికి గౌరవమెట్లుగయించు నంటిని! కుమారా! నీవు చెప్పినదియు నిజమే. రారాని పోరాని యడవులలోఁబడవలసిన యిడుములకు బీతువడను. అన్యాయంబుగ నామెడకుఁ దగిలించిన యీ "నిరాపనింద" నెట్లుపాపుకొందునాయని దుర పిల్లుచుంటిని. ఇఁక నెవరు నాదిక్కు? మరల మిమ్మోఁ జూడఁగల్గుదునో లేదోయని యంతర్ధానమయ్యెను. నాఁటనుండి నాకు నిద్రాహారములు రుచించుటలేదు.

శ్రీరామ :- ఓయీ! హనుమంతా! నీవు సూర్యవంశపు పరువుమర్యాద లెఱుఁగనట్లు మాటాడుచున్నావు.

హను :- ఎఱుంగకేమి మహాత్మా! ప్రాకృతజనంబులాడు మాటలు పాటించి వంశము కలంకము పాలగునని తలంచి, నిరపరాధయు సాధ్వీమతల్లియు నగు మా యమ్మను హేయమగు నిందపాలుసేయు టుచితమో? నేనెఱుంగనా? నాఁ డశోకవనమధ్యంబున మలిన జీర్ణాంబరములతోడను, సంస్కారశూన్యములగుటచే జడలుగట్టిన శిరోజముల తోడను దివారాత్రములు హా! రామ, హా! రామ, యనుచు మిమ్ముల ధ్యానిం

చుట, అట్టితల్లికా యిట్టివాడు? త్రేతాయుగ లక్షణము కాఁబోలు.

అంగ :- దేవా! మేము చెప్పునంతటి వారము కాముగాని సీతామహాదేవి వనవాసముచేత సూర్యవంశమున కపకీర్తిగాని కీర్తిరానేరదని నాతలంపు.

శ్రీరామ :- [నిమీలితనేత్రుఁడై విచారించి] అంగదా! నీవాక్యములయందు సత్యము లేకపోలేదు. కాని "జనవాక్యమ్మతు కర్తవ్యమ్" అను పల్కులఁ బాటింపవలసిన వాఁడనైతిని.

హను :- దేవా! యీనానుడి మాబోటి ప్రాకృతజనంబులకుఁ గాని మీవంటివారికిఁగాదు.

శ్రీరామ :- ఆంజనేయా! నీవుకూడ నీ నింద మానెత్తిపైనే పడవేయుచున్న వాఁడవా?

[ద్వారపాలకుఁడు ప్రవేశించి] మహాప్రభూ! వసిష్ఠుల వారు తమ సందర్శనార్థమై వచ్చినారు. ఏమిసెలవు?

శ్రీరామ :- ఇంతకన్నను గావలసినది యేమున్నది? వెంటనే తోడ్కొని రమ్ము.

[వసిష్ఠుఁడు, చైనులు ప్రవేశింతురు. శ్రీరామ చంద్రుఁడు పీఠముడిగ్గి] సూర్యవంశోద్భవుండును, శిష్యుఁడునగు రామభద్రుఁడు నమస్కరించుచున్న వాఁడు.

వసిష్ఠ, చైనులు:-వర్ణాశ్రమాచారపరిరక్షణసామర్థ్యమస్తు.

హను :- రామభద్రుని సేవకుఁడు హనుమంతుఁడు నమస్కరించుచున్నాఁడు.

వసిష్ఠ, చైనులు:- పుత్రిపౌత్రాభి వృద్ధిరస్తు.

అంగ :- [తనలో] మా హానుమయ్య యెంత యదృష్ట వంతుఁడు ; పెండ్లియుఁ బెండ్లమును లేకుండఁగనే బిడ్డలమీఁద బిడ్డలను బొందఁ బోవుచున్నాఁడు. ఇందు లకు సంశయమేల ? బ్రాహ్మణులమాట రిత్తవోవునా? (ప్రకాశముగా) కిష్కింధాపుర యువరాజంగదుఁడు నమస్కరించుచున్నాఁడు.

వసిష్ఠ, చైనులు:- [తేఱిపాఁజూచి యాశీర్వదింతురు.]

శ్రీరామ :- ఇదిగో ! యిందు దయచేయుఁడు. (అంద రుప విష్టులగుదురు)

వసి :- రామభద్రా ! మనోవ్యాకులము లేకుండ రాజ్యముఁ బరిపాలించుచుంటివి కదా ? క్రొత్తవింత లేమియు లేవుకదా ?

శ్రీరామ:-మీ యాశీర్వాద బలమువలన ధర్మానుష్ఠానపరుఁడనై ప్రజలు సంతుష్టిఁ బొందునట్లు రాజ్యము చేయు చునే యుంటిని. జగద్గురువులయిన మీరు మాయెడఁ బరిపూర్ణకటాక్షముగల్గియుండఁ బాలనయందుఁగొఱఁ తేమియుండును ?

చైనులు:- దేవా! సూర్యవంశము సాకేతపురసింహాసనము నం దున్నంతకాలము మాబోటివైదికులకుఁగొదవలేమియు నుండవు. కాని (యూఁగును.)

అంగ :- (తనలో)యీాముదుకండేదియో కైలాటముఁ దెచ్చి పెట్టుటకు యత్నించుచున్నాఁడు. శాంతముతో విని యెదను.

వసి :- చైనులుగారూ ! మీరు కొంతతడవూరకుండుఁడు.

(రామునికిఁ గన్నన్నఁజేయును)

శ్రీరామ - హనుమంతా! అంగదుఁడలసినయట్లున్నది. యువ
రాజును విడిదలకుఁ గొంపోయి సత్కారములను
గావింపుము.

హను :- అంగదా ! మనము విడిదలకుఁ బోదుమురమ్ము.

(ఇరువురును బయలుదేరుదురు)

అంగ :- (తనలో) ప్రజ్ఞలకు లోపమాశ్రీ వైదికము నందుఁగాక
లౌకికమునందుఁగూడ వసిష్ఠులవారసాధారణులే. మేమే
మియో వినిపోదుమనిచెప్పి యీ పిషచే మమ్మా
వలకంపించుచున్నాఁడు. అయినను జిత్రము చూచి
తీరవలయును. (హనుమంతునికై తిరిగి) యీంజ
నేయా ! యిది నీవు రామాయణము నిర్మించుట
యందుఁ బడ్డశ్రమకుఁ బ్రతిఫలము గాఁబోలు.

హను :- అంగదా ! యింకను నీకుఁ జిన్నతనము వదల
లేదుగా ! ఆర్యులను దిరస్కరింపఁగూడదు.

అంగ :- ద్రావిడులను దిరస్కరింపవచ్చునా ?

హను :- కొంచెమాటలు మాని యిటువినుము. మనము
సామాన్య సేవకులము. రాజులు రాజకార్యములను
బహిరంగముగాఁ జర్చింపనొల్లరు.

అంగ :- అవును మనము సామాన్యసేవకులమే. అందు ముఖ్య
ముగా నీవు కిష్కింధాపురము వదలినప్పటినుండి
సామాన్య సేవకుఁడవే యైతివి. లేకున్న నిక్కడికేల
వచ్చెదవు ? దీనికేమిగాని ముక్కమూసికొని తపముఁ

జేసికొను నాబాపనితో రాజకార్యము లేముండునా యని వెఱఁగుపడి యిట్లంటిని. ఇందుఁ దిరస్కరణ మేమున్నది ? అయినను మనము సామాన్యసేవకులము గదా, మనకేల ? పోదము రమ్ము. (నిష్క్రమింతురు)

చైను :- (జనాంతికముగా వసిష్ఠునితో) యీనూతనజాడ్యము కిప్పింధాపుర యువరాజునకుఁ గూడ సోకినట్టున్నది.

వసి :- అనుమానముపడియే నేను వానిని నావలకంపు నుపాయముఁ జేసితిని. (శ్రీరామునితో) రామభద్రా ! కర్తవ్యాంశమునకు వత్తము.

శ్రీరామ :- చిత్తము. గురువుగారి వాక్యములు వినుటకు సిద్ధముగనే యుంటిమి. సెలవిండు.

వసి :- ఇప్పుడు క్రొత్తక్రొత్తగాఁ బ్రజలయందు రగులుచున్న కలవరము నెఱింగితివా ?

చైను :- ప్రజలయందుఁగాదు, ద్విజేతరులయందు.

వసి :- ద్విజేతరులయందేమి? వారిని సదమదించుటకు ద్విజుల యందుమాత్రము లేదా ?

శ్రీరామ :- మేమంతగా నెఱుంగమే. దేవా ! యదిపదియో సెలవిండు. (అంగదుఁడు గాంధర్వవిద్యచేఁ బ్రవేశించి యదృశ్యుఁడై యొకమూలడాఁగి శ్రీరామ వసిష్ఠుల సంభాషణము వినుచుండును.)

వసి :- శ్రీరామచంద్రా ! రాజవై యుండియు, వేగులవారి మూలమున రాష్ట్రరహస్యములఁ దెలిసికొనుచుండుట లేదా ? ఎంతమాట ?

శంబుక వధ

అంగ :- (తనలో) శ్రీరామచంద్రుఁడు నాఁడు చాకలివాని యింటిగుట్టు తెలిసికొనుటచేఁ గల్గిన యపకీర్తిని కుందుచే మరల నట్టిపనికిఁ బూనుకొనఁడని నాతలంపు.

శ్రీరామ :- దేశికేంద్రా ! యకస్మాత్తుగా సంభవించిన భార్యావియోగ దుఃఖముచే మతిచెడి రాజ్యకార్య ములయందుఁ బ్రమత్తులమై యున్నారము.

వసి :- సూర్యవంశమునం దుద్భవించిన నీవలన నెట్టి మాటలు వింటి. నీవు ధీరోదాత్తుఁడవు; ఇట్లు కుందఁదగునా ? యిట్లాడఁదగునా ? ఎన్ని సంకటములు సంభవించినను రాజధర్మమును నెఱవేర్చుట విధికాదా ?

శ్రీరామ :- సూర్యవంశపుఁ బరువుమర్యాదలను నిల్పుటకే యీ యపకీర్తులను ధైర్యముతో ననుభవించు చుంటిమి.

వసి :- నీ వీశ్వరాంశ సంభూతుఁడవు. కాన ప్రాకృతజనం బులట్లు మాటాడఁ జనదు. ఈ విషయమున వాల్మీకి మహాముని యభిప్రాయమును వినియుండలేదా ? ఈశ్వ రావతారమని చెప్పుచున్నాఁడు.

అంగ :- (తనలో) ఇటువాల్మీకి రామాయణము విన్నాఁడు; అటు హనుమద్రామాయణమును విన్నాఁడు. కాని శ్రీరామచంద్రుఁడు తానింకను మనుష్యమాత్రుఁడో, యీశ్వరుఁడో నిశ్చయించుకొననట్లున్నది. ఒకవేళ రెండునుగాక త్రిశంకుతాతగారి స్వర్గవాసియేమో !

శ్రీరామ :- దేవా ? తమియింపుఁడు. మనుష్యరూపముతో నున్న మేము మనుష్యులట్ల చరియింపవలదా !

వసి :- శ్రీరామచంద్రా ! నీవు సార్వభౌముఁడ వగుటంజేసి రాజధర్మమును విధ్యుక్తముగా నెఱవేర్పవలసి యున్నది.

చైనులు :- (పరులు వినకుండ) ఆ యోతిముండకొడుకేదియో మందు పోసినట్లున్నది. వాని మొగముఁజూచినప్పుడే నాకనుమానము గల్గినది.

అంగ :- (తనలో) తాతగారూ ! నాకు మంచిబిరుదే యిచ్చితిరి. అదియే నిజము కావలయు.

శ్రీరామ :- చిత్తము ! మీ యాజ్ఞాబద్ధులము.

వసి :- అటులయినచో రామభద్రా ! యిటు వినుము, నీవు రాష్ట్రసమాచారము లెఱుంగకుండినను, మేము మాత్ర మెఱుంగకుండఁజాలము. సాకేతపురరాజ్య శ్రేయస్కాములమయిన మేము దానిపట్లఁ బ్రాణము లయిన విడుతుము. నేఁడయోధ్యా పట్టణమంతయు గుసగుసలతోడను జిటచిటలతోడను నిండియున్నది.

అంగ :- (తనలో) ఏమిచెపుమా! వసిష్ఠతాతగారి యవ్యాజ పరోపకారశీలత వెల్లివిరియుచున్నది.

శ్రీరామ :- కారణమేమి ?

వసి :- కారణమా ? ఎన్నఁడైనవింటివా శంబుకునిపేరు ?

శ్రీరామ :- మాకర్ణతాడితమైనట్లు కన్పట్టదు.

వసి :- నేఁటిదనుక మేమును వినియుండలేదు.

చైనులు :- అట్టి యల్పుఁడే యీ గుసగుసలకన్నిటికి మూల కారణము.

వసి :- ఇతఁడనార్యుఁడు; అనఁగా ద్విజేతరుఁడు; అనఁగా ద్రావిడుఁడు; అనఁగా మన స్మృతులు పేర్కొన్న శూద్రుఁడు.

చైనులు :- (సంతోషముఁబట్టఁజాలక తనలో) ఆహా! పూర్వ సముపార్జితమైన విద్యనంతయు నుపయోగపఱచుచున్న వారు వసిష్ఠులవారు. సమయమున కక్కఱకురాని చదువు చదువా?

అంగ :- (తనలో) వసిష్ఠుల వారందఱిని గలగూరగంప చేసినారే.

శ్రీరామ :- అయిన నేమి?

వసి :- ఏమియులేదు, శాంతముతో వినుము. త్రికాలజ్ఞులును, లోకాతీతులును, బ్రహ్మర్షులునయిన తొల్లింటి ఋషులెల్ల వీరికి జప తపంబులు నిషేధించిరి.

శ్రీరామ :- జపతపంబులనఁగా భగవద్ధ్యానమే కదా!

వసి :- అగును. భగద్ధ్యానమే వీరికి నిషేధించి యార్యులగు ద్విజులకు సేవఁజేయ శాసించిరి.

శ్రీరామ :- ఋషులు మేలుకార్యమునే చేసిరి.

వసి :- ఇంతియకాదు, స్మృత్యనుసారముగా వర్ణాశ్రమాచారములను నిల్పి కాపాడు భారము క్షత్రియులం దుంపఁబడినది. సూర్యవంశ్యులగు క్షత్రియులెల్లరు ఋషుల యాదేశమును గ్రహించి పాటించి నేఁటి దనుక రాజ్యపరిపాలనంబుఁగావించిరి.

శ్రీరామ :- నేఁటిదనుక యనుచుంటిరి, మేమును మా పూర్వులు పోయిన పుంతనే పోవబద్ధకంకణులము.

వసి :- అట్లయిన వినుము, నేఁడీశంబుకుఁడు సాకేతపురమున కతిసామీప్యమున నొక యాశ్రమము నిర్మించికొని, ద్విజేతరులనుండి శిష్యులను గ్రహించి స్మృతులను ధిఃకరించి వారికిఁ దత్తోపదేశముఁ గావించు చున్నాఁడు. అంతటితో విరమింపక, పట్టణములకును బక్కణసీమలకును ఛాత్రులనంపి యార్యులతో సమాన స్వత్వముకలదని శూద్రులకుబోధింపించు చున్నాఁడు.

శ్రీరామ :- మా ప్రజల కెల్లరకు సమానములగు హక్కు లుండుటుచితమే కదా.

వసి :- ఉచితమే స్మృతిసమ్మతమున్నంతవఱకు.

శ్రీరామ :- చిత్తము.

వసి :- అందుచే నీ పట్టణంబున, సాకేతంబున గర్వగ్రస్తులై శూద్రులు బ్రాహ్మణులను దిరస్కరించుటయే కాక వేదాధ్యయనంబునకుఁ గూడఁ గడంగుచున్నారు.

శ్రీరామ :- ఇప్పుడు మాకేమియాదేశము ?

వసి :- ఈ దేశము నీదికాదా ?

శ్రీరామ :- మాదియే.

వసి :- అటులయిన వర్ణాశ్రమాచారములను నిల్పనొల్లవా ?

శ్రీరామ :- నిల్పబద్ధకంకణులము, గాని మమ్మేమి చేయ మందురు ?

వసి :- నీ రాజ్యమునకు రానున్న యీ ప్రమాదములను, నీ ముప్పును వైళమ తొలఁగింపవా ?

శ్రీరామ :- దానికి సందియమేల ? నేఁడేవర్ణాశ్రమాచార ముల ధిఃకరించి విచ్చలవిడి వర్తించువారల నిష్ఠుర

దండన పాలు చేసెదమని శాసనమును బ్రచురించెదము.

వసి :- ఇట్టిశాసనమువలన నుపయోగములేదు. ఇది తాత్కాలికోపశ మనముగల్గఁజేసినఁ జేయును. కాని శాశ్వత ముగా నీ యుపద్రవమును దప్పింపఁజాలదు. బ్రాహ్మణులందుద్భవించిన యీ యావేశమును మీ శాసనమిప్పటికి నణఁచిపెట్టినను, లోన గుమిలి గుమిలి యెన్నఁటికయిన బయల్పడక మానదు. ముందు మేలొనఁగుట మేలు. ఒకరి నిర్వ్యాజంబట్టి శిక్షించిన నుపశమిల్లునని తోఁచును.

శ్రీరామ :- ఎవ్వారిని ? ఏ శిక్ష విధించమందురు ?

వసి :- ఎవ్వారిని శిక్షించిన నేమి లాభమున్నది ? సామాన్య దండనమువలన మాత్రమేమి యుపయోగమున్నది ? ఈ మత ద్రోహుల గురువునుం బట్టియే మరణదండన విధించవలయును. ఇయ్యది కఠినశిక్షయని తలంప రాదు. ఇరుపక్షములవారి మేలుకొఱకే. అవయవ ముల యందొక్కటి దుష్టమైనదానిని ఖండించివైచుట వైద్యునకు విధి. ఇందు వేఱొండు తెఱవులేదు.

శ్రీరామ :- (నివ్వెఱఁగంది, కొంచెము విచారించి) మీ రీ మాటలు చెప్పను దగదు. మేము వినను దగదు. వేయేల ? వినఁజాలము. దుష్టశిక్షణంబున నాఁటితేటిన యీ హస్తము నిరపరాధునిఁ ద్రుంపఁజాలదు.

వసి :- నిరపరాధుఁడనుచున్నాఁడవు. స్మృతి ధిక్కారముఁ జేసి మత ద్రోహముఁ గావించిన నీచుఁడెట్టి దండనకయిన నర్హుఁడే.

(హనుమంతుఁడు ప్రవేశించి యదృశ్యుఁడై యంగ
దుండు కూరుచున్న స్థలమునఁ గూరుచుండఁబోవును.)

అంగ :- (తొలఁగి తనలో) పాపము ! మా హనుమన్నకుఁ
గండ్లు కనఁబడుటలేదు. ఇది బ్రాహ్మణ భక్తికిఁ బ్రతి
ఫలము గాఁబోలును.

శ్రీరామ :- అటులయినచో మేము శంబుకుని సన్నిధాన
మున కరిగి యాతఁడొనర్చుచున్నది మత్ద్రోహమని
నచ్చఁజెప్పి మంచిమార్గమునఁ బెట్టెదము.

వసి :- మేమిదివఱకే యతనితో ముచ్చటించి యుంటిమి.
అతఁడు మా మాటలను బెడచెవులను బెట్టుటయేకాక
యనార్యులకుఁ గూడ మతమునందు సమానమగు
స్వాత్వమున్నదని తర్కించి, ప్రాణమునయిన వీడుదును
గాని యంతరాత్మకు వ్యతిరేకముగా నారబ్ధకార్యము
లను విసర్జింపనని మొండిపట్టుపట్టి ఖండితముగాఁ జెప్పి
నాఁడు. అందుచేతనే మీ సన్నిధానమునకు వచ్చి
తిమి.

శ్రీరామ :- ధర్మసూక్ష్మములు మా బోంట్లకు దురవ
గాహము. అయినను నింతకు మున్ననార్యులుకూడ
బ్రహ్మత్వము గడించినట్లు విన్నారము. శంబుకుని
వాక్యములయందు మత ద్రోహ బుద్ధి యున్నట్లు
కన్పట్టదు.

వసి :- రామచంద్రా ! పొరఁబడుచున్నాఁడవు. నీపు చెప్పు
నవి కృతయుగమునాఁటి కథలు.

శ్రీరామ :- అయ్యా ! యుగభేదముచే స్వాత్వము కూడ
మాఱునా ?

వసి :- దానికింకను సంశయమా ?

శ్రీరామ :- అట్లయిన నీ విషయమున దీర్ఘవిచారణముఁ
జేయవలయును. అనాలోచితముగాఁ గార్యమునుఁ
జేయఁజాలము. క్షమింపుఁడు.

హను :- (తనలో) శ్రీరామభద్రుఁడు సత్యమునే పల్కు-
చున్నాఁడు.

శ్రీరామ :- (ఆలకించి) ఎక్కడ నుండియో రోదనధ్వాన
ములు వినవచ్చుచున్నవి.

ద్వారపాల :- (ప్రవేశించి) బ్రాహ్మణుఁడొక్కఁ డాక్రంద
నముఁజేయుచు మొగసాలకడ నిలువఁబడియున్నాఁడు.
ఏమి సెలవు ?

శ్రీరామ :- వెంటనే లోనికిఁ గొనిరమ్మ్ము.

ద్వారపాల -: చిత్తము (నిష్క్రమించును) బ్రాహ్మణుఁ
డొక్కఁడొక్క బాల శవంబుతో బ్రవేశించి యాత్ర
ముతో రామునుద్దేశించి)

బ్రాహ్మణుఁడు :-

ఇనకులవర్యుఁడౌరఘున రేంద్రునిదొట్టియునేటిదాఁకనున్
జనకులుగల్గఁ బుత్రకులు చచ్చుటగానము నీతలాటమం
దునఘటియిల్లెఁగారణముతోచదుశూద్రుఁడెవండొయెచ్చటో
తనమతధర్మముల్ విడచితప్పాపథంబునఁబోవఁబోలెడిన్ 3

ఓ రఘురామ ! కట్టెదుట నున్నది బాలశవంబుఁజూడుమీ
పాఱులఁ బ్రోవలేని నర పాలకు లేటికి ? మీదు పూర్వులె
వ్వారును విప్రభక్తి పరి వర్జితులెన్నఁడుగారు గావునన్
బాఱుని బిడ్డకిచ్చెదవొ ప్రాణము! శాపమునేగ్రహింతువో!

అంగ :- (తనలో) ఏమీ యీ బెదరింపు; తన బిడ్డను బది
కించుకొనలేని యీ పాఱుఁడు శాపము నిచ్చునఁట,
ఏమనిదో !

వసి :- అకాలబాలమరణదంద హ్యమానుఁడవైన యో
యదృష్టహీనుఁడా ! చక్రవర్తిని దూలనాడకుము.

బ్రాహ్మ :- వసిష్ఠులవారా ! దుఃఖమున మునిఁగిన నేను
మిమ్ముఁజూడఁజాలక యపచారమును జేసితిని. నమ
స్కారము. శాస్త్రవిహితముగా రాజ్యమేలఁజాలని
చక్రవర్తిని దూలనాడకేమి చేయఁ గల్గుదును ?

శ్రీరామ :- ఓ భూదేవా ! బ్రాహ్మణధర్మముగాని యీ
కోపమేలపూనెదవు ? వాటిల్లిన యాపత్తు సవిస్తర
ముగాఁ దెల్పిన నది తీర్చ శ్రీరాముఁడు సంసిద్ధముగా
నున్నాఁడు.

బ్రాహ్మ :- ఇతఁడు నా బిడ్డఁడు, లేక లేక కన్నసంతానము.
నేఁ డకస్మాత్తుగా మరణించెను. కారణము మీరే
యరయుఁడు.

అంగ :- (స్మృతినభినయించి యక్కజపాటుతో) ఔరా !
యౌరా ! యేమి యీ కుట్ర! ఏమి యీతంత్రము!
ఏమి యీఛద్మకౌశలము! ఇప్పుడంతయునర్థమయినది.
వసిష్ఠులవారెంత తంత్రజ్ఞులు. మొన్నసాయంకాలము,
వసిష్ఠులవారశ్వనీ దేవతలతో గుసగుసలు వోవుటకుఁ
గారణమిదియా ! భూదేవు లాకాశదేవు లొక్కటైరి.
ఇఁక శంబుకర్షికిఁ బ్రాణములు దక్కుటెట్లు ? అశ్వనీ
దేవతల సాహాయ్యమున నీ కుట్టివానిని మూర్ఛపోఁ
గొట్టి శంబుకర్షి తపముచే మరణించెనని చెప్పవచ్చిరి.

ఎంత పొఅపాటుఁ జేసితిని. మా సుషేణు తాతగారిని దీసికొనివచ్చిన యెడల నేదియో విఱుగుడిచ్చి లబ్ధ ప్రజ్ఞునిఁ జేయకుండునా ! కట్టా యిప్పుడు నేనేమి చేయఁగలను. ఎంత మోసము. అయినను శ్రీరామ చంద్రుఁడేమి చెప్పునో వినియెద.

శ్రీరామ :- (వసిష్ఠునికై తిరిగి) మహాత్మా ! యిట్టి బాలా రిష్టము దేనివలనఁ గల్గునో సెలవిండు.

వసి :- (దీర్ఘముగా విచారించి)

శ్లో॥ యస్యరాష్ట్రేఽన్యపాలస్య తురీయశ్చ తపోధనః
తత్రతధ్యమ్ భవత్యేవ విప్రబాలస్యమారణమ్ ॥

శ్రీరామచంద్రా ! యింకను సంశయమేల ? ఏ రాజు రాష్ట్రమునందు శూద్రుఁడు తపస్సుఁజేయు చున్నాఁడో యచ్చటనే యకాలముగా విప్రబాలురకు మరణము సంభవించి తీరునని స్మృతివాక్యము చెప్పు చున్నది. ఇంతకన్నను మనకేమి తార్కాణము గావ లయును ?

హను :- (వినయముతో) దేవా ! మీ వాక్యములు మాకుఁ బరమ ప్రమాణములు. సందేహింపవలసినయగత్యము లేదు. కాని యొక్క సంగతిని దెలియఁ గోరు చున్నాఁడను.

అంగ :- (తనలో) కట్టకడకు మా హనుమయ్యకుఁ గూడ నేదియో సందియము పొడకట్టినది. తఱుమఁగాఁ దఱు మఁగాఁ ప్రాణరక్షణకయి గొత్తెయయినను వెనుదిరిగి పొడుచునన్న సామెత యబద్ధమగునా ?

చైనులు :- (కోపముతో) ఆంజనేయా ! వసిష్ఠుల వారేల ? నేనే సమాధానముఁ జెప్పెదను. ఆ సందియమేదియో తెల్పుము.

హను :- ఎవరైన నాకేమి స్వామీ ? "అవశ్యమనుభోక్తవ్యమ్ కృతమ్ కర్మశుభాశుభమ్" అను వాక్యము చొప్పునశూద్రుఁడెవండేని యాత్మకులధర్మములవిసర్జించి ద్విజవిహితములగు కర్మముల నాచరించిన యెడలఁ దచ్ఛూద్రుఁడు పాపాగ్ని దగ్ధుఁడుకావలయును గాని ద్విజశిశువు మరణించుటెట్లు తటస్థించును ? ఇటులయినచో ద్విజేతరులు తపంబుఁజేసినయెడల ద్విజులు నామమాత్రావశేషులగుదురా ? అధర్మమాచరించుచున్న పశ్యతోహరుని మహాపాపముచే నెచ్చటనో యున్న పరులు నశింతురా ? పాతకులను దమ పాపములు బాధింపవా ? అజ్ఞుఁడనైన నా కేమియుఁ దోఁచుట లేదు.

అంగ :- (తనలో) మా హనుమన్న యెంతవాఁడైనాఁడు ! వేదాంతము వెలిఁగించుచున్నవాఁడు, దొంగకు నీతులా ?

చైనులు :- ఆంజనేయా ! శ్రమపడి ప్రశ్ననడిగితివి కాని నీకు శాస్త్రచర్చ చేయునధికారము లేదెయుంగనువా ? మాబోంట్లు ధర్మసూక్ష్మములను నీకుఁజెప్పను దగదు, నీవు వినను దగదు.

అంగ :- (తనలో) మా హనుమయ్య తలతిక్క వదలినట్లున్నది.

హను :- అయ్యా ! మాకెందులకుఁ జెప్పగూడదో యిప్పుడు తెలిసినది.

వసి :- (రామునుద్దేశించి) వింటివా రాఘవరామచంద్రా ! యాశ్రమ సాంకర్యంబునఁ గల్గు దుర్నయములు ! మనము విన్నదానికిని నేఁడు కన్నదానికిని సరిపోయినది. ఇది తప్పక శంబుకుని తపశ్చరణ ఫలితముగా నోపు. నిర్నిమిత్తంబుగ నిట్టివి గలుగవు.

అంగ :- (తనలో) ఇంక నే నిచ్చట నిలువఁ జాలను. మానవుఁడెట్టి కార్యములను జేయఁగలఁడో నేఁడు తెలిసినది. (నిష్క్రమించును.)

శ్రీరామ :- మునీంద్రా ! నా మనంబింకను సంతృప్తి పడకున్నది. నిర్జనమైన యరణ్యసీమ తపంబుఁ జేసికొనుచున్న శంబుకునకును నీ బాలమరణంబునకును గార్యకారణ బాంధవ్యంబు గుర్తింపఁజాలకున్నాఁడ.

వసి :- మనమిప్పుడు సేయుచున్న కర్మమునకు నుత్తర జన్మమునకును సంబంధ బాంధవ్యములెట్లు చెప్పెదవు ? కొన్ని యెడలఁ గార్యకారణ సంబంధమూహింపఁదగినది. అదియుంగాక వంశగురువునగు నేను చెప్పుచున్నాఁడను. ఋషిప్రోక్తములగు శాస్త్రములను జూపించుచున్నాడను ఇంకను సంశయమేల! నాఁడపర బ్రహ్మమయగు విశ్వామిత్ర వాక్యములయందు విశ్వాసముంచి తాటకిని వధింపలేదా ?

హను :- (తనలో) క్రమక్రమముగా నెత్తిపొడుపులోనికిఁ దిగుచున్నదే తాతగారిపని.

శ్రీరామ :- స్వామీ ! యది నరహంత.

వసి :- ఆత్రతముతో నితఁడు బ్రాహ్మణహంత. స్మృతి ధిక్కా
రముచే బ్రాహ్మణవధఁజేసినాఁడు. ఎవ్వరెక్కుడు
పాపకర్మలో యోజించుకొనుము.

శ్రీరామ :- ఇది నిజమయినచో వెనుదీయను.

వసి :- నిజము కాకేమి ? లెమ్ము; కీర్తికాముఁడవుకమ్ము.

హను :- (తనలో) నిరపరాధునిఁ జంపి శ్రీరామచంద్రుఁడు
యశస్వికావలసి వచ్చెనుగా.

శ్రీరామ :- మీ వాక్యములఁ బ్రతిఘటింపఁజాలను. మీ
యాజ్ఞను నెఱవేర్చెద.

హను :- (తనలో) తఱచిట్టి కార్యములు నా నెత్తిపైనే పడు
చుండును. శ్రీరామచంద్రుఁడు నన్నీపనికి మాత్రము
నియోగింపకుండునుగాక.

వసి :- సూర్యవంశజులెన్నఁడు గురుతిరస్కారముఁజేయెఱుఁ
గరు. నీవాచంద్రార్కము రాజ్యమేలుదువుగాక.

చైనులు :- జయతు, జయతు.

శ్రీరామ :- శంబుకుని మాసన్నిధానమునకు రప్పించి కొన్ని
ప్రశ్నములడిగి మఱి మీ యాజ్ఞ నెఱవేర్చెదము.

వసి :- నీ యిష్టము వచ్చినట్లాచరింపుము. ఒక్క సంగతిఁ
జెప్ప మఱచితి. శంబుకుని వధతో నీ బ్రాహ్మణ
బాలశవంబు పునర్జీవితము కాఁగలదు.

శ్రీరామ :- దీని సత్యాసత్యములు పరీక్షింపఁగలము.

వసి, చైనులు :- ఇఁకమాకు సెలవిప్పింపుము.

శ్రీరామ :- చిత్తము.

(నిష్క్రమణము.)

ద్వితీయాంకము సంపూర్ణము.

శంబుక వధ

(ఉత్తర రామచరిత)

తృతీయాంకము.

చిదానందాశ్రమము.

(అంగదుఁడు, శంబుకుఁడు ప్రవేశింతురు.)

శంబు :- యువరాజా ! నీవు వెట్టిబాగులవాఁడవుసుమా ! శ్రీరామచంద్రుఁడు నన్నుఁజంపుననియూ నీకేీ దుఃఖము? నా మరణమువలన నార్యులకుఁ గలుగు లాభముకన్న ననార్యులకుఁగలుగు లాభము మెండుగ నుండునని నీ వెఱుంగవా ?

అంగ :- మహాత్మా ! యిదియెట్లు ?

శంబు :- నా మరణము ద్రావిడ సంఘమునందు నూతన జీవము కల్పింప ,దనియూ నీ నమ్మకము ? ఆత్మాభిమానముగల ప్రతిజాతికిని ద్రూరదండనము స్వాతంత్ర్య రక్షణాశక్తిని బుట్టించును.

అంగ :- ఇది యాత్మాభిమానముగల జాతిలక్షణమని మీరు సెలవిచ్చితిరి. ఇది యనార్యులమయిన మనకు నన్వయించునాయని యురియాడుచుంటిని.

శంబు :- అనఁగా ద్రావిడులకు నభిమానములేదనియా నీయూహము. తొల్లింటి మనపూర్వుల చరిత్రముఁ జదివిచూడుము. ఆర్యులకు ననార్యులకుఁ బ్రవర్తిల్లిన భయానకరణంబులవంక క్షణకాలము నీమనోనేత్ర మును బ్రసరింపఁజేయుము. ఈయుద్ధములన్నియు నేటికి సంభవించినవనుకొంటివి ? మూలకారణమును యోజిం పుము. నీసంశయములు పటాపంచలగును.

అంగ :- ఆర్యులకు ననార్యులకు జరిగినవి యుద్ధములని తల పోయను. దేహదార్ఢ్యముకలిగి విదేశములనుండి తండోపతండములుగ మనదేశముపైఁబడి దేశమును గొల్లఁగొట్టుచు మన పూర్వుల వెన్నాడునప్పుడు యుద్ధములెట్లు పొసంగును ? ప్రత్యర్థినిల్చినప్పుడుకదా సమరము. యుద్ధములేకుండఁగనే చేతనైనంతవఱకు నార్యులనార్యుల నులిమివేసిరని నాయాశయము.

శంబు :- కుమారా ! యంగదా ! మనపూర్వులు భీరువు లనియా నీయాశయము. ఎంత వెఱ్ఱిపడితివి ? ఆర్య లతో హోరాహోరింబోరి, కచాకచింబెనఁగి, బాహా బాహిందొడరి తుదుల సమరఁబుఁజేసిన వారలు మన పూర్వులు. నీవన్నట్టులార్యులు శీతలదేశమునుండి వచ్చుటచే మిగుల శరీరసత్వముకలవారగుటచేతను, రణధర్మములఁ బాలింపకుండుటచేతను దుట్టతుదకు విజయముఁ గాంచిరి. అనంతరము నీవనినది జరిగినది. ఎక్కడికోపోవుటల ? రావణుఁడు బలపరాక్రమసంప న్నుఁడా ? లేకరజ్జులాఁడా ? మీసాహాయ్యము లేకున్న

రాముఁడేమయినఁ జేయశక్తిమంతుఁడగునా ? మీతో డ్వాటుమాట యటుంచుము. జాతిద్రోహియుఁ, గుల ద్రోహియు, వంశద్రోహియు, భ్రాతృద్రోహియునగు, విభీషణుఁడు రాజ్యకాంక్షచే నింటిగుట్టు తెలుపకున్న రాముఁడు వ్యర్థప్రయత్నుఁడగువాఁడా లేదా ? తుదకు మరణధర్మముఁ బాటించి రావణునిఁ జంపగల్గె నారాముఁడు ?

అంగ :- దేవా ! యిదిసత్యమేకాని రావణునిమాటఁ దలపెట్ట కుఁడు. మీవంటివారు తలపెట్టఁదగిన నామముకాదు. అతఁడు నీచుడు, పరభార్యాపహారి.

శంబు :- కుమారా ! నిజమేయనుకొనుము, అతఁడు నీచుఁడే: ఆ నీచునియందు నొకగుణమున్నది కనిపెట్టఁగల్గితివా ?

అంగ :- దేవా ! వానింగూర్చి ప్రసంగింపకుఁడు. క్రోధము రగులకుండ వానింగూర్చి వినఁజాలను.

శంబు :- ఇదిగో ! యీయొకమాటనేవినుము. తొందరపడి వివరమును బాదుచేసికొనకుము. దాన లాభము గల్గఁబోదు.

అంగ :- అటులయినచో సెలవిండు, వినియెదను.

ఆసుగుణమేది ?

శంబు :- రావణుఁడు సీతామహాదేవిని దొంగిలికొని పోయి నాఁడనియేకదా యాతఁడు నీచుఁడంటివి.

అంగ :- అగును ; అందుచేతనే.

శంబు :- కొనిపోయి ఏమిచేసినాఁడు ?

అంగ :- ఆమహాపతివ్రతను బెట్టరానిబాములుబెట్టినాఁడు.

శంబు :- బాములుపెట్టినాఁడుగాని యీమహాపతివ్రత పాతివ్రత్యమునకు లోపము గల్గించెనా ?

అంగ :- అది వాని సుగుణముకాదు. దానికిఁగారణమాజనని సౌశీల్యము, నాత్మబలము. సాధ్యమైనచో నానీచుఁడు చేయరాని పాపకార్యమొకటుండునా ?

శంబు :- దిక్పాలకజేత యపకారము దలంచుకొన్నచో దిక్కుమాలినయబల యేమిచేయఁగలదు ? యోజింపుము. ఇదివానిసుగుణమో దుర్గుణమో ?

అంగ :- దీనికి నేనేమియుఁ జెప్పఁజాలనుగాని, పరస్త్రీని దొంగిలికొనిపోవుట పాపకార్యముకాదా ! అనంతర మెంతనీతితో వర్తించిననేమి? దుష్పథముకాకుండునా?

శంబు :- దీనికిఁగల కారణములనుగూడనాలోచించి యవల నీకుఁదోఁచిన తీర్పుఁచెప్పుము. రాముఁడు నిష్కారణముగా ననార్యులనందఱిని దెగటార్చుటకు ఋషులతోఁ బంతముపట్టెను. ఇదిన్యాయమో !

అంగ :- నిష్కారణమేమి మహాత్మా ? ఆఋషులకు నీద్రోహములెన్నెన్ని యో యపచారములుచేసి యాపదలు గల్గఁజేసిరి.

శంబు :- వీరుచేసిన యవినీతికార్యములుదలపెట్టవా ? వీరు నిజముగ బ్రహ్మ జిజ్ఞాసువులనియా నీయభిప్రాయము?

అంగ :- అగును, బ్రహ్మజిజ్ఞాసువులనియే నాయభిప్రాయము.

శంబు :- నాయనా ! వినుము. నీయభిప్రాయము సరియైనది కాదు. ఆర్యచక్రవర్తులచే ననార్యరాజులగుట్టుమట్టు

కనఁగొనుటకు దక్షిణాపథంబునకుఁ బంపఁబడిన యోగి వేషధారులయిన ఛద్మవిద్యాపారంగతులు. తమనీచ కార్యములకు మతమును గప్పడముగాఁ జేసికొనిన మృషాసంయములు. వీరు దక్షిణాపథమున నచ్చటచ్చటఁ బల్లెలుగట్టుకొని శిష్యపరంపరలమూలమున వార్తాసంగ్రాహణముఁ జేయుచారులు. వింధ్యోత్తర భూములనుండి మనపూర్వుల వెడలఁదఱిమి, దక్షిణా పథమునఁగీచుమను కొఱడవులలోఁ జెట్టుగుట్టలఁ బుట్టలఁబట్టించియు నచ్చటనైన నిలువనీడ లేకుండఁ జేయుటకేర్పడిన కొఱముట్లు. ఇయ్యది సత్యమని వీరి పూర్వచరిత్రంబులయందుఁ బెక్కుచోట్లఁ దార్కాణముఁ జూపనగును. దీనికంతయు మూలకందము జాతివైషమ్యము. సామ్రాజ్యములు దగ్ధపటలముఁజేసి మానవుని సామాన్యస్వత్వమైన స్వాతంత్ర్యమునకుఁ బ్రతిబంధకముఁ గల్పింప నొడిగట్టుకొన్నవారిని దమ దేశమునుండి వెడల నడచుటకయి యత్నించుట పాపమో, దోషమో, రాజనీతివిరుద్ధమో యోజింపుము. (అంగదుఁడు దిగ్భ్రాంతితో వినుచుండును. శంబుకుఁడావేషముతో నంగదుని మోమునందుఁ జూడక నిల్చి) మీ తండ్రి ఋషులకుఁగాని, సాధువులకుఁగాని యేమిద్రోహము, నేమి యపకారముఁజేసినాఁడని రాముఁడు పొదమాటునడాఁగి ప్రాణముఁ దీసెను ? (అంగదుఁడు నిరుత్సాహముతో నూరకుండును.) పల్కవేమి యంగదా ?

అంగ :- (మెల్లఁగా) ఆడినబాస నెఱవేర్చుకొనుటకు.

శంబు :- (ఉద్వేగముతో) అంగదా ! స్ఫుటముగఁ బల్కవేమి ? ఆడినబాస నెఱవేర్చుకొనుటకా ? అంత నీతిశాలియా ? రావణుఁడు లక్ష్మణుని మహాశక్తితో మూర్ఛిలసునిఁజేసినప్పుడు రాముఁడు మీ ముందట మీ పినతండ్రితోడను, విభీషణుని తోడను జెప్పిన వాక్యములేవి ? ఆడినబాస నెఱవేర్తుననియా ? ఆసమర్థుఁడఁబతిన నెఱవేర్పలేననియా ? చెప్పవేమి ? జ్ఞాపకములేదా ? ♦ (అంగముఁడు నిరుత్తరుఁడైయుండును, శంబుకుఁడు సముద్వేగమువలన జనించిన కంపితస్వరముతోఁ జూరుకుచూపులంజూచుచు) కుమారా! యిది యిటులుంచుము, పరోపకారార్థము ప్రతినపట్టుటమేలుగాని యాత్మ లాభమునకై ప్రతిన పట్టితినని నీచకార్యమునకు నోఁడిగట్టుట ధర్మమా ? ప్రతిజ్ఞాపూర్వకములయిన నీచకార్యములన్నియు, నిర్దోషములును, నిష్కళంకములును నిర్మలినములును నగునా?

అంగ :- దేవా! నేను గర్తవ్యతామూఢుఁడనైతి, ముగ్ధుఁడనైతి. మీ వాక్యములఁ బూర్వపక్షము సేయఁజాలను, జేయనొల్లను .(ప్రకంపిత స్వరముతో) అనాఁడు రాయబారిగా లంకాపట్టణమునఁ బ్రవేశించి యాప్తవర్గముతో నిండు కొలువైయున్న రావణుని ఓజస్తేజములు నా కన్నుల మిఱుమిట్లు గొలుప నా సభాంగణమున

♦ భానుజ! నేనఁగొంచుఁ గిష్కింధకు నేగు నాపలుకు ♦ సెల్లదు నీవును బోవిభీషణా ! భాస్కరరామాయణము,

నఅజాము నిస్పృహుఁడనై, నిలువఁబడితిని. తుట్ట తుదకు నడచుచున్నది ధర్మమార్గమని చెప్పి నిందా వాక్యము లాడితిని. మా హనుమన్న మాత్రమో రావణుఁడు మూఁడు లోకములను బరిపాలించుటకుఁ దగిన వాఁడని నాతో రహస్యముగా నొకనాఁడు చెప్పెను.

శంబు :- కుమారా ! యింకొకమాట వినుము. రావణుఁడు నీచుఁడే నీచతరుఁడే నీచతముఁడె; కాని యట్టి నీచుని సబాంధవముగాఁ జంపిన యనంతరము శ్రీరామచంద్రు నకు వాటిల్లిన యాపత్తేమి ?

అంగ :- (విచారించి) నే నెఱిఁగినంతవఱకునకు నాపత్తేమియు లేదు.

శంబు :- లేదా ? అటులయినచో రామలింగేశ్వరస్వామి ప్రతిష్ఠకుఁ గారణమేమి ?

అంగ :- జ్ఞాపకమునకు వచ్చినది. రావణవధచే శ్రీరాము నకు బ్రహ్మహత్యా మహాపాతకము చుట్టుకొన్నది యఁట.

శంబు :- (ఏకసెక్కమునుదెల్పు చిఱునగవుతో) నీచుని జంపుటచే బ్రహ్మహత్య యెట్లు సంభవించును ? బ్రహ్మజ్ఞానియైనప్పుడుకదా తద్వధచే బ్రహ్మహత్యాపాతకము తటస్థించును. నీచకార్యములు చేయువాఁడు బ్రహ్మజ్ఞాని యెట్లగును ! విచారింపుము.

అంగ :- స్వామీ ! క్రమక్రమముగ సర్వమును నా మనోనేత్రములకు విశదపడుచున్నది.

శంబు :- అంగదా ! యింకొక్క సంగతిఁ జెప్పవలచితిని. వాల్మీకి మహామునిని యసాధారణ శేముషీధురీణుఁడు. రావణుఁడు మహ పాతకియని బుజువుచేయుటకు రావణుఁడు సీతాదేవిని బలత్కారముగా మానహానిఁ జేయమిక నేదోయొక శాపము నాటంకముగాఁ గల్పించి లోకులను విభ్రమపాలు జేయఁగలఁడని నాకుఁదోఁచుచున్నది. అయిసను మనము నిజమును గొలఁది దినములలోనే జూడఁ గల్గుదుము.

అంగ :- (వినయముతో) దేవా ! మీ మనస్థైర్యమే మీ నిశ్చితార్థమును సంపాదింపఁ గలదు. ప్రాకృతజనంబులకు మీచరిత్రము దురవగాహము. ద్విజులు మిమ్మునఁ బాషండుఁడవనియు, మత్రిద్రోహివనియు దెగడుదురు. ద్విజేతరులలో విద్యాగంధము లేమిచే బ్రాహ్మణద్వేషివనియుఁ దన్మూలమున రాజదండనకుఁ బాత్రుడవనియు గొణుగుదురు. కట్టకడకు మీరిరు తెగలకుఁ గానివారగుటయే ఫలితము. మీ మహత్వతత్వముఁ దెలిసికొనఁజాలక ద్విజేతరులు కృతఘ్నులగుటయే కాక కృతాపరాధులగుచున్నారు.

శంబు :- యువరాజా ! తెవులుగొంటునకు మందు రుచింప దనిచెప్పి స్వాదు పదార్థము నొసంగుట యుక్తమో ! నే నెందులకుఁగాను పోరాడుచుంటినో ద్విజేతరులు గొన్ని నాళ్ళకయినఁ దెలిసికొనకపోదురా ?

అంగ :- (పొరలి వచ్చుచున్న దుఃఖముతో) నిన్న శ్రీరామభద్రుని సభాముఖమున జరిగిన చర్చను బరిశీలింప

నీకఁ జిరకాలము మీ సందర్శనభాగ్యము మా బోంట్లకు దొఱకదని సందేహము పొడమచున్నది. మీరీ సాకేతము విడిచి దక్షిణాపథమునకు వచ్చి యచ్చో మా సేవల నంగీకరించుచు నజ్ఞానాంధులఁ దరియింపఁ జేయరాదా ?

శంబు :- ఏమి నీ బేలతనము ? దక్షిణాపథమునకు వచ్చుటకు నభ్యంతరమేమియు లేకపోవుటయే గాక నాకు సుగ్రీవ సార్వభౌముని సందర్శన లాభము కూడఁ గల్గును. అయినను నిజముగ శ్రీరామచంద్రుఁడు నా ప్రాణమునకుఁ దెగిన యెడల దక్షిణాపథమునకుఁ దరలి నంతమాత్రమున నేను దప్పించుకొనఁ గల్గుదునా ? ఇదియెట్లయినను నేనిచ్చట నీ యాశ్రమ స్వీకారముఁ గావించుట యాత్మలాభమునకే యనుకొంటివా ? అట్లుకాదు. నా యీ కృత్యము వలన ద్రావిడులందఱు మేలు పొందవలయునని యభిలాషము. కాకున్నచో నే నే దుర్గమారణ్యమందో నిష్ఠురతపో నిష్ఠాగరిష్ఠుండనయి కైవల్యముఁ బొందఁజాలనా ? మఱియు సనాతన ధర్మ రక్షకుఁడను బిరుదంబుఁ దాల్చిన శ్రీరామచంద్రుని సన్నిధానమునఁ నే యీ స్వత్వము నిరూపించుకొనఁ జాలుటో లేక స్వత్వముతోపాటు ప్రాణమును గొల్పోవ్రుటో తటస్థింప వలయును. రామరాజ్యములోమనముదొంగతనముగా భగవద్ధ్యానముఁ జేసికొనవలసియుండునో బాహాటముగాఁ,

బహిరంగముగాఁ జేసికొనినర్హులమో స్థిరపఱచి కొను టకే మేమీ సాకేతపుర ప్రాంతసీమలయందు మల్లాడు చున్నాము. రాజు బ్రాహ్మణవాక్యములఁ దిరస్కరించి మతరక్షణమేచేయునో, పురస్కరించి హితరక్షణమే చేయునో, చూడవలసియున్నది.

అంగ :- ఆర్యంగళము ప్రతిహతమగుఁగాక. దేవా ! మీ యాదర్శము సామాన్యులకు దుర్జ్ఞేయము. మీభావము గభీరము. మీ మానసము కారుణ్యరసోప్లుతము. అఖిలవ్యాపకాంతర్యామియగు నీశ్వరుఁడు మిమ్మఁ బాలించి మీ యారబ్ధ కార్యమును నెగ్గించునుగాక. మగిడి కిష్కింధాపురమునకుఁ బోవు తలంపున శ్రీరామ చంద్రునికడ నెలవంది కొన్నిసంగతులుమీకుఁ జెప్పి పోవువాఁడనై యిచ్చటకు వచ్చితిని.

శంబు :- కుమారా ! చెప్పనైతివా సంగతులను, విన ముచ్చటపడుచుంటిని.

అంగ :- మహాత్మా ! నోరాడకున్నయది. చెడుమాటలు చెప్పవలసిన వాఁడనైతిని.

శంబు :- ఏమి నీవెట్టి ? తెగించినవానికి సముద్రము మోకాలి బంటికాదా ? ప్రాణమున కాశింపనినాకుఁ జెడుమాట లుండునా ?

అంగ :- ఋషిచంద్రమా ! వశిష్ఠులవారి కుట్రచే నోషధీ సాహాయ్యమున నొక బ్రాహ్మణ బాలుని విసంజ్ఞుఁజేసి కొలువునకుఁ గొంపోయి మీయాశ్రమ ప్యత్యాస ముచేఁ గల్గిన ఫలమని శ్రీరామచంద్రునకు నచ్చఁ

జెప్పిరి. నచ్చఁజెప్పి మిమ్ము శిక్షాపాత్రునిఁ జేయుటకు యత్నించుచుండ నేను జూడఁజాలక మీకడ కరుదెంచితిని.

శంబు :- (అలక్ష్యభావమును సూచించు నగవుతో) తోటిలోఁదలదూర్చి రోఁకంటిపోటునకు వెఱవనగునా! ఈ కార్యవిధానమంతయు నూహింపనిదికాదు. కానఁ బిరుతివియవలసిన పనిలేదు. పాపము వసిష్ఠులవారి కెట్టి యవస్థవచ్చినది ?

అంగ :- దేవా ! ప్రొద్దెక్కుచున్నది. అనుజ్ఞయిత్తురా ?

[సాష్టాంగనమస్కారముఁ జేయును.]

శంబు :- [లేవఁదీసి] కుమారా ! కృతార్థుఁడవుకమ్ము, సుఖమునఁబోయిరమ్ము.

అంగ :- (కన్నుల నీరునించుకొని డగ్గుత్తికతో) ఎన్నఁటికో పునర్దర్శనము ? సంయమీంద్రా ! యీ శిష్యునిసేవ నంగీకరింప నిచ్చగలదేని గాంధారి మాంధారి ప్రొద్దు వేళఁ గబురంపినను మీపదసన్నిధి వ్రాలుదును.

శంబు :- పరోపకారబుద్ధి మహనీయుల లక్షణముకదా ! పునర్దర్శనమైనను గాకున్నను బరస్పరసంభాషణమాత్రము మఱచిపోకుము.

అంగ :- దేవా ! మీయాశీర్వాదమే నాకు జీవగట్ట. పని వినియెదను.

శంబు :- (తటాలునలేచి యంగదుని గౌగిలించుకొని గద్గదస్వరముతో) కుమారా ! పోయిరమ్ము. సుఖమునఁబోయిరమ్ము.(అంగదుఁడు నిష్క్రమించును. శంబు

కుఁడు చింతామగ్నుఁడై కూరుచుండ శిష్యుఁడొక యుత్తరముతోఁ బ్రవేశించి) దేశికేంద్రా ! ఇదిగో ! శ్రీరామచంద్రుఁడు మీకయియంపిన యుత్తరము. (అందియిచ్చును) ఏమి సెలవిత్తురో ! వాకిటసేవకుఁడు వేచియున్నాఁడు.

శంబు :- (ఉత్తరమును దీసికొని విప్పుచు) బ్రహ్మదాసా ! మనమనుకొన్నది యనుకొన్నట్లు జరుగుచున్నది. ఈయుత్తరమును నీవుచదువుము. వినియెదను. అక్షరములు బాగుగాఁగన్పట్టుటలేదు. (ఉత్తరము శిష్యునకిచ్చును ; శిష్యుఁడది పుచ్చుకొని చదువును.)

శ్రీసాకేతపుర సింహాసనస్థిత పట్టభద్రుండును, సూర్యవంశ సముద్భూతుండును, సనాతనధర్మ సంరక్షకుండును, వర్ణాశ్రమాచారపరిపాలనబద్ధకంకణుఁడును నగు దాశరథ శ్రీరామసార్వభౌముండు శంబుకునకుఁ దెలియఁజేయునది :-

నీవు వైదికధర్మవిరుద్ధకర్మఠుండవై, స్మృతి విహితమయిన ద్విజసేవఁద్యజించి, ద్విజ కర్మంబు లనుష్ఠించుచుండుటయేకాక వేదాధ్యయనాధ్యాపకప్రముఖ బ్రాహ్మణానుష్ఠేయములకు స్వత్వమున్నదని శిష్యులంగూర్చి బోధించుచు, మత్ప్రధానముఁ గావింపుచున్నాఁడవని మాశ్రుతిపథమునఁబడినది. మేము ధర్మమార్గానుచరులమగుటచే సభాముఖంబున నీస్వత్వమును రూఢిపరచుకొనుట కధికారమిప్పించుచున్నాము. కాన లేపు మూఁడుదినములకు నొడ్డో

లగము జరుగనై యున్నది. వేదవేదాంగపారంగతు
లను. సర్వశాస్త్రనిష్ణాతులను రప్పించు చున్నాము.
స్మృతివిహితధర్మతిరస్కారులకు మరణదండన శాస్త్ర
చోదితమని తెలియఁజేయుచున్నాము. (శిష్యుఁడు
గురువును దేఱిపాఱఁ జూచుచుండును.)

శంబు :- కుమారా! నీయుద్దేశ్యమేమి? ఈపండితపరిషత్తు
నకు శాస్త్రచర్చకై పోదుమా?

శిష్యుడు :- పోవుటయే యుచితమని తోఁచుచున్నది. రహ
స్యముగ మనమెన్ని బోధించిననేమి? ఎన్నఁటికయిన
మనవాదము బహిరంగము కావలసియే యున్నదికదా.
కానఁ దరుణము వచ్చినప్పుడు మనమేల వెనుకాడ
వలయును? ధర్మాధర్మవిచక్షణకర్తయగు శ్రీరామ
ప్రభుని మధ్యవర్తిగనుంచికొని మూర్ఖులతో ముఖా
ముఖిశాస్త్రవాదముసల్పి, యెడిచిపుచ్చి, మనహక్కు
లను బలిమిమై గుంజుకొని నిలువంబెట్టుకొనుట
యుచితమగుటయే కాక నాకుఁ బరమసమ్మతము.

శంబు :- నాయనా! కార్యములు మాటలంతసుకరములు
కావు. పైపెచ్చు తెఱచాటుననున్న మహానుభావుఁ
డెవ్వఁడో యెఱుంగుదువా? వసిష్ఠమహాముని. ఈ
వాక్యములెవ్వరివని నీయాలోచనము?

శిష్యుడు :- శ్రీరామచంద్రునివని; ఇందులకు సందియమేల?

శంబు :- నీవుపొరఁబడితివి. కాదు. ఇవి వసిష్ఠుని వాక్యములు.
స్మృతివిహిత ధర్మతిరస్కారులని యుత్తరమునందుఁ
బేర్కొనఁబడినది. ఇంకదీనికి వాదమేమున్నది? ప్రతి

పక్షరచితగ్రంథములగుటచే స్మృతులు మనకాదరణీయములు గావను మనమొఱ్ఱి నెవరాలకింతురు ? వేదప్రతిషిద్ధమని చెప్ప సాహసించెనేమో చూచితివా ? దీనికి సభాముఖమునఁ బరిష్కారమేమున్నది ?

ఒక్కటేగతి. వారు వేదప్రామాణ్యము నంగీకరింపరు. మనము స్మృతి ప్రామాణ్యము నంగీకరింపము. మనవాదము ధర్మాధికారికి ధర్మవిరుద్ధమగును. మనము శిక్షకుఁ బాత్రులమగుదుము. ఇంతియే తేపు జరుగనున్నది. కానఁ బత్రమును లేఖిని గొనిరమ్ము. ప్రత్యుత్తరమంపెదము.

(శిష్యుఁడు నిష్క్రమించి పత్రము లేఖినితో ప్రవేశించును)

సిద్ధముగనుంటివా ? నేను జెప్పు వాక్యములు వ్రాయుము.

(శంబుకర్షి చెప్పుచుండఁగా శిష్యుఁడు వ్రాయును.)

అతి లోభంబునుబూని యాత్మహిత కార్యస్థాపనాచార్యులై స్మృతి నిర్మాణవిదగ్ధులై తనకు వారిక సభ్యులంజేసి తదీయ పక్షుండవు ధర్మపీఠము నయం, దేకూరుచున్నంత మాగతియేమానో యెఱుంగఁ జాలమొకో యింక రామమా చంద్రప్రభూ !

మతనిర్మాణము కైవచించి ఋషులా, మ్నాయంబులంబిమ్మట స్మృతులఁ జెప్పిరి యార్యసంఘ మొగి వర్ధిల్లంగ మేమందుచేఁ

జతురామ్నాయములందలంచుచు నమస్కారంబులంజేయుచుఁ
స్మృతిధిఃకారముజల్పఁబూనితిమి మా శ్రేమాభిలాషంబుచే

ప్రభుచూడామణి ! మీరు వేదములనే ప్రామాణ్యమన్నట్టిచో
సభకే తెంచెద, మట్లుగానియెడ మీ సాన్నిధ్యముంజేరి మీ
సభకుల్ చేసెడి వాదముల్ వినుటకుఁ సామర్థ్యముఁ లేదు,మా
కభయం బిచ్చెదువారు గానఁబడరే న్యాయంబుపోకుండఁగన్

ఇయ్యది చాలు. ఈయుత్తరముం గొంపోయి సేవకుని కిమ్ము. ఆవలనేమిజరుగునో యోర్చిచూచెదము. కార్యంబులఁ దీర్చికొనుటకు సరయూనదికిఁ బోవలయును. ఇఁక జిరకాలము శాంతముతో సంధ్యావంద నాదులఁ జేసికొనుటకు వీలుండదు.

శిష్యుడు :- చిత్తము. నిష్క్రమింతురు.

తృతీయాంకము.

సంపూర్ణము.

శంబుకవధ

(ఉత్తరరామచరిత)

చతుర్థాంకము.

(శ్రీరామచంద్రుని ప్రవేశము)

శ్రీరామ:- అబ్బా! రాజ్యమేలుట కత్తిమీఁదిసాము గదా!

గీ॥ తెలిసి యపచార మిసుమంత సలుపకుండ
జపముఁ జేసుకొనుచునుండు సాధువులను
బట్టివర్ణాశ్రమాచార పాలనంబఁ
టుంచుఁ బరిమార్పఁగావచ్చె నక్కటకట!

ఇందుచేతనే తొల్లింటిపుణ్యమూర్తులగు ఋషులు "రాజ్యాంతే నరకమ్ ధ్రువమ్" అని నుడివిరి. రామరాజ్యమునందే యిట్టి చిత్రములు జరుగవలయునా? శంబుకుని శిక్షింపకున్న యెడల వంశగురువున కేమి యలుకవచ్చునోకదా?

గీ॥ రాజ్యరక్షణవిషయమై రాజు జాలిఁ
బూనఁదగదంచు గురుమూర్తి యానతిచ్చెఁ
గాని తత్త్వజిజ్ఞాసుల కంఠనాళ
ములనుగోసి రాజ్యముఁజేయ బోవలేను.

అయినను శంబుకునితోడఁ బ్రసంగించి చూచె
దను. ఓరీ! యెవఁడురాయక్కడ?

కా :- (ప్రవేశించి) స్వామి! నేమియాజ్ఞ?

శ్రీరామ:- ఓరీ! మొన్న కాంభోజరా జుపాయనంబుగాఁ
బంపిన యుత్తమాశ్వమును సజ్జీకృతముఁ గావించి
వెంటనే కొనిరమ్మ్ము.

కా :- చిత్తము. [నిష్క్రమించి మరల గుఱ్ఱముతోఁ
బ్రవేశించును]

శ్రీరామ:- [గుఱ్ఱమెక్కి] ఛీ! యెడమకన్నదరు చున్నది.
కారణమేమి చెపుమా?

గీ॥ నాకు గురువెన్ని స్మృతులు క్రో ♦ డీకరించి
చెప్పినను ధర్మమిదియంచుఁ ♦ జిత్తమేమొ!
సంశయాత్ముఁడనైతినీ ♦ సమయమందుఁ
గారణముమాత్రము మదికిఁ ♦ గానరాదు

గీ॥ అంతరాత్మ పీడితుఁడను నగుటచేతఁ
జేయునది లేక మనసెల్లఁ జెదరుచుండె
నిట్టిసమయంబుసను యుక్త మిదియటంచు
నెట్టుబుదికిఁబొడమునో! యెఱుఁగరాదు
[నిష్క్రమించును]

—♦ చిదానందాశ్రమము ♦—

(బడలికతో శ్రీరామచంద్రుఁడు ప్రవేశించును.)

శ్రీరామ:- అబ్బా! సూర్యాతపముచేత డస్సిన నాసర్వాం
గములను సేదదేర్చుచున్న యీమృదుసౌరభశీతల

ములగు మలయపవనకిశోరములు నాకు బ్రహ్మానందముఁ గూర్చుచున్నవి. పాంథులపథికాయాసమును నపనయింప నేనెఱుంగకుండ నీయారామము ప్రవిష్టఁ గావించినవాఁడవఁడై యుండనోపు? (దిక్కులు పరికించి) యేమి యీ యకాల వసంతాగమము. లతాసమావృతములయిన యీనికుంజపుంజములు కోరకితములును, బుష్పితములునై యీయారామ నివాసిమాహాత్మ్యమును బ్రకటించుచున్నవి. (ఊలికిపడి) యేమి! యీరార!! యీశ్చర్యము. చిలుకగోర్వంకలెల్లను వేదపాఠములను బఠించుచున్నవి. అయ్యారే! కోయిలలా సామగానము జేయుట? ఏ జితేంద్రియుని పవిత్రాశ్రమమోకదాయిది. కనుఁగొనియెద. బుష్పాశ్రమమునకు నశ్వారూఢుఁడనై పోవుటయుక్తమా? కాదు. (అశ్వావరోహణముఁ గావించి ముందునకు నడచి సోమలతకుఁ బాదుత్రవ్వి నీళ్ళుపోయుచున్న బహ్మచారింగని) కుమారా! యచ్చట యేమిచేయుచున్నావు?

బ్రహ్మచారి:- (తలయెత్తి చూడకే పాదుఁద్రవ్వుచు) యేమిచేయుచున్నానో కన్పట్టుటలేదా? (అనంతరము శ్రీరామునివంక నెగాదిగఁ జూచి) ఇదిగో! దర్భాసనంబు. ఇచ్చట దయచేయుఁడు. అతిథిపూజ మాకు గురూపదిష్టంబు. మా గురువుగారిని జూచి పోవుటకై మొన్న కణ్వాలవారువచ్చి యీ సోమలతను నిచ్చిపోయిరి. దానికి నీరుపోసి పెంచుటకు

మా గురువుగారాజ్ఞయిచ్చిరి. ఆ పని యిప్పుడు నేను జేయుచున్నది.

శ్రీరామ-: కూర్చుండెదఁగాని, యీ యాశ్రమమెవ్వరిది? మీ గురువుగారి పేరేమి ?

బ్రహ్మచారి:- ఇంతియేనా ? నీ కేమిదెలియును కొంటిని. (రాముఁడు చిఱునవ్వు నవ్వుచు బ్రహ్మచారిని వీపున దట్టుచుండును.) ఇది మా గురువుగారి యాశ్రమము. బ్రహ్మర్షీంద్రుఁడగు శంబుకర్షి మా గురువుగారు.

శ్రీరామ:- ఏమీ! శంబుకర్షియా?

బ్రహ్మచారి:- [అబ్బురముతో] ఏమి యులికిపడుచున్నావు? ఎప్పుడును బేరు వినలేదా? నీ వేదిదెలియదా? పట్టణవాసివని తోఁచుచున్నది.

శ్రీరామ [తనలోఁ బరాకుతో] నాడఁబోయిన తీర్థ మెదురై నట్లున్నది. (ప్రకాశముగా) అవును. పట్టణవాసినే; కాని మీ గురువుగారిని దర్శించుటకు వీలుండునా?

బ్రహ్మచారి:- ఓ! యిదియే మంచిసమయము. మా గురువుగారీవేళనే శిష్యులం గూర్చికొని మతప్రసంగముఁ జేయుచుందురు. ఇదియేదారి. చూచితివా? ఈ దారినే పోయి యాబట్టలాఅవైచిన పొదదగ్గరనుండి యా కుటీరము ప్రవేశించిన మా గురువుగారిని జూడఁగల్గుదువు. (ఏదియో జ్ఞాపకమునకు రాఁగా) పొరబాటు. ఆఖర్జూరవనమునం దీవేళ మతోపన్యాసముఁ జేయుచుందురు.

శ్రీరామ:- సరియే నేను వెళ్లెదను. (ముందుకునడచి తిరిగి వచ్చుచుండును.)

బ్రహ్మచారి:- ఏమి తిరిగి వచ్చుచున్నావు? దారి తెలియ లేదా? నేను జూపించెదను రమ్ము.

శ్రీరామ:- అట్లుకాదు. నీవు ముందుపోయి మీ గురువు గారితో శ్రీరామచంద్రుడు మిమ్ములను జూచుటకు వచ్చుచున్నాడని చెప్పగల్గుదువా?

బ్రహ్మచారి:- (నివ్వెరగంది) ఏమి! శ్రీరామచంద్రులా? మా రాజుగారా? దేవా! యెవ్వరో సామాన్యులను కొని మీకుఁ దగినసత్కారమును జేయలేదు. రాజాధి రాజులను సందర్శించినపుడెట్లు చరియింపవలయునో మా బాబయ్యగారులు జెప్పలేదు. ఇన్నిటికి ఛాంద సులముకదా? క్షమింపుఁడు.

శ్రీరామ:- (బ్రహ్మచారి దగ్గఱకుఁదీసి) కుమారా! నీవలన దోషములేదు. నీమాటలవలన మాకానందముగల్గు చున్నది. రాజాధిరాజులను సందర్శించునప్పుడెట్లు చరియింపవలయునో గురువుగారు చెప్పలేదా? రాజాధి రాజులను గుర్తించు విధమయినను దెల్పలేదా?

బ్రహ్మచారి:- దేవా! లేదు. మిమ్ములను రెండవమాఱు చూచినప్పుడెవ్వరో గొప్పవారను కొన్నానుగాని, మరల గొప్పవారు మాయాశ్రమమున కెందులకు వత్తురాయని-

శ్రీరామ:- నీ బేలతనము మమ్మానందము పాలుచేయు చున్నది. మీ గురువుగారు నీకేమియుఁ జదువు చెప్పరా? చిన్నవని కాఁబోలు.

బ్రహ్మచారి:- స్వామీ! అట్లుకాదు; అట్లుకాదు. నన్నుఁ బోలు చిన్నలకుఁ బ్రొద్దుననే సంధ్యావందనాదుల దీర్చుకొనిన యసంతరము, భగవంతునిగూర్చి కొన్ని కొన్ని సంగతులు చెప్పుదురు. ఆవల మేము పాఠము లను జదువుకొనుటకుఁ బోవుదుము. మధ్యాహ్న సమయమున వైయాకరణులతోడను, మీమాంస కులతోడను బ్రసంగముఁ గావించుచుందురు.

శ్రీరామ :- మీ గురువుగారు మిమ్ముల నెప్పుడయినఁ గోప పడుచుందురా ?

బహ్మచారి :- దేవా! లేదు. ప్రసన్నవదనముతో మాటా డుచుందురు. గురువుగారని పిలువము. బాబయ్య గారని పిలుచుచుందుము. మమ్ములను జూచుటతోడనే చిరునవ్వునవ్వుచుఁ గబురులు చెప్పుచుందురు. బాబ య్యగారిని జూచుటతోడనే మాకు సంతోషముప్పొం గివచ్చును.

శ్రీరామ :- సరే! అటులనా ? నీ విప్పుడేమి చదువుకొను చున్నాఁడవు ?

బ్రహ్మచారి :- సంస్కృత భాషాపరిచయమును గల్గించు కొనుచున్నాఁడను. సంస్కృతము నేర్చికొనుట మిగుల కష్టము. మొన్న మా బాబయ్యగారు వ్యాకరణ మారంభించెదమని చెప్పినారు. అప్పటినుండియు నాకుఁ జెప్పరాని యానంద ముబుకుచున్నది.

శ్రీరామ :- అంత సంతోషముగా నున్నదిగా ? మంచి మాటయే. నీ కేమయినఁ గావలయునేమో చెప్పుము. మే మిచ్చెదము.

బ్రహ్మచారి :- బ్రహ్మచారులకుఁ గోర్కెలేముండును, విద్యా వ్యాసంగముదక్క ? ఆ విద్యను బాబయ్యగారు చెప్పుచునేయున్నారు. అయినను నితరులనుండి యే వస్తువైన నూకక తీసికొనుట దోషమని బాబయ్యగారు చెప్పుచుందురు. వారికిఁ గోపము వచ్చు పనిఁ జేయఁజాలను.

శ్రీరామ :- మేమిచ్చిన వస్తువు దీసికొన నొల్లవా ?

బ్రహ్మచారి :- మా బాబయ్యగా రిష్టపడినయెడల.

శ్రీరామ :- అట్లయిన మీ బాబయ్యగారిని గనుఁగొందును గాని నీవుపోయి మేము వచ్చితిమని తెలియఁజేతువా?

బ్రహ్మచారి :- చిత్తము. సంశయమెందులకు ?

(నిష్క్రమింతురు.)

—♦ ఖర్జూర వనము ♦—

(పీఠముపై శ్రీరామచంద్రుఁడుపవిష్టుఁడగును. శిష్యగణ పరివృతుండై శంబుకర్షి సమీపమునఁ గూర్చుండును.)

శంబు :- దేవా ! మాయాశ్రమము నేఁటికిఁగదా పవిత్రమైనది. మీకాతిథ్యము నొసంగి మేము జన్మకృతార్థులమైతిమి.

శ్రీరామ :- సంయమీంద్రా ! మిమ్ములను దర్శించిమేమును బరితుష్టులమయితిమి. కాని మతవిషయక ప్రసంగమును జేయనుద్దేశించి యీయెడకరుదెంచితిమి. రాజధర్మము మీకుఁ దెలియనిదికాదు. మేము సనాతనధర్మ సంస్థా

పనాచార్యులము. సనాతనధర్మ రక్షణార్థమై సూర్య వంశము సాకేతపుర సింహాసనముననుండి సూర్యుని దొట్టి నేటిదనుక రాజ్యమేలుచున్నది. కాన మతరక్షణము మాకుఁ గర్తవ్యమే కాక విధ్యుక్తధర్మము. మత్రద్రోహము మాతలకంటగింపు. మేము సహింపము. మాప్రజలయందెట్టి మత ద్రోహియున్న శిక్షించుటకు వెనుదీయము. హిందూమతమునఁ బుట్టి హిందూమతమునఁ బెఱిగి, హిందూమతమునకు ద్రోహమాచరించువాఁడు నరకకూపమునఁ బడకమానఁడు. మేము నిమిత్తమాత్రులమయి యూనీచుని శిక్షాపాత్రునిఁ జేసెదము.

శంబు :- దేవా ! యిది నేనెఱుంగనిదికాదు. మత్రద్రోహులను శిక్షాపాత్రులఁజేయుట రాజధర్మము. కానినాఁడు రాజులు తమధర్మము నెఱవేర్చని పాపమునఁబోదురు.

శ్రీరామ :- అందుచేతనే నేఁడు మేమిచ్చటి కరుదెంచి మీరుచేయుచున్న కార్యములు, మతోపన్యాసములు, మత్రద్రోహములగునో కావో నిర్ణయింప నిశ్చయించుకొంటిమి.

శంబు :- సకలధర్మస్వరూపులగు మీరీకార్యముఁ బూనుట కంటె మాకు సంతోషదాయక మగు కార్య మేమున్నది ? మీసాన్నిధ్యమున నీకార్యము నిర్ణయింపఁ బడుటకంటె మాకు వలయునది యేది ? దేవర వారడిగిన ప్రశ్నములకు నాయెఱిఁగినయంతవట్టునకుఁ బ్రత్యుత్తరమిచ్చుటకు సంసిద్ధముగనున్నాఁడను (శిష్యు

లకై తిరిగి) వత్సలారా! మీరు పర్ణకుటీరమున వేద పాఠముఁ జేయఁబొండు. (శిష్యులు నిష్క్రమింతురు)

శ్రీరామ :- అట్లయినచో వినుఁడు. మీరు కొన్ని నాళ్ళ నుండి చేయుచున్న హితోపదేశములును, మతోపదేశములును మాశ్రవణవిదారణముగనున్నవి. మహర్షులందఱును, స్మృతికర్తలెల్లరును మీకుమత వ్యాసంగమునకు నధికారములేదని చెప్పుచున్నారు. కాని మీరావాక్యములను బెడచెవులను బెట్టుచున్నట్లున్నది.

శంబు :- దేవా! మన్నింపుఁడు. ఎందుచే నధికారము లేదని చెప్పుచున్నారు?

శ్రీరామ :- "శూద్రులకు వేదములను జదువుటకుఁ గాని ముట్టుటకుఁగాని యధికారము లేకపోవుటయే కాక మతప్రసంగమును జేయుటకుఁగూడ నధికారములేదు. బ్రాహ్మణులుచెప్పిన నీతులను గ్రహింపవలయునుగాని ప్రశ్నింప రాదు"అని వీరివాదము. దీనికి మీరేమి ప్రత్యుత్తరముఁ జెప్పెదరు?

శంబు :- ఇందు రెండు సంగతులు విచారింప దగియున్నవి. అవియెవ్వి యంటికేని, చెప్పెద, సావధాన మనస్కులరై వినుఁడు. మొట్టమొదటిది మేము శూద్రశబ్ద వాచ్యుల మెట్లగుదుము? ఆశబ్దమును మామెడకేల యంటఁగట్టెదరు? మేము ద్రావిడులము. మానామములు మాకున్నయవి. మాపూర్వులు పరాజితులయినంత మాత్రమున నిష్టమువచ్చిన నామములచే మమ్ము వ్యవహరించుట పాడియా? అయిన దీనితోనేమి?

భిన్ననామములచే వ్యవహరించినంతనే పదార్థములు నైజధర్మమును విడనాడవుకదా; ఇంకరెండవది, మాకు మత్ప్రసంగమునకే యధికారములేదను చున్నారు. ఇదియెవ్వరి యాదేశము, కారణమేమి చెప్పెదరు ?

శ్రీరాము :- ఋషుల యాదేశము, స్మృతుల యభిప్రాయమును ; ఋషుల యాదేశమునకుఁ గారణముకూడ వలయునా ?

శంబు :- దేవా ! ఋషులు సర్వస్వతంత్రులు కానఁ గారణమక్కఱలేనిమాట నిజమే; ఇష్టమున్నయెడల నిన్నటి స్మృతిని వీరు నేఁడు మార్చఁగలరు. మార్పఁగలరనుట యేల ? మార్చిరి, మార్చుచున్నారు. ఇందులకుఁ దారాక్షణము, భిన్నస్మృతులు ; అందుగల పరస్పర విరోధములు; అట్టిచోఁ బ్రతిక్షణము మాఱుచున్న యీ స్మృతులుగాని తత్స్మృతికర్తలుగాని మాస్వత్వ మిట్టిది యని నిర్ణయించుట కెట్లులు శక్తిమంతులగుదురు ?

శ్రీరామ :- (విసుగుతో) ఋషులను, స్మృతులను ధిక్కరింప మొదలిడితిరా ?

శంబు :- శ్రీరామచంద్ర ప్రభూ ! మీరు ధర్మమూర్తులు, ధర్మాధర్మ నిర్ణేతలు కాన నా ప్రార్థనము శాంతముతో నాలింపుఁడు.

నేను ఋషులను దూలనాడుటలేదు. తూలనాడుటలేదు. తూలనాడుట వలన మాకుఁ గించిల్లాభముకూడ లేదు. ఋషుల మనోగతితోపాటు క్షణక్షణము మాఱుచుండు ధర్మశాస్త్రములెట్లు లొక్కజాతిస్వత్వమును

నిర్ణయింపఁజాలునో తెలిసికొనఁగోరుచుంటిని. మీరా స్మృతులను బాటింపకున్న నవియేమగును ? ఇదిగాక మేము దుర్బలులమగుటచేతనేకదా మమ్మధ్రోలోకము పాలుసేయుటకే సృజింపఁబడిన గ్రంథములను ధర్మాధికారులుకూడ ధర్మశాస్త్రములనుచున్నారు. దేవా ! యిని యార్తాలాపములు. ఆలింపుడు. "దుర్బలస్య బలమ్రాజా" యన వినమే ? దోషులమయిన శిక్షింపుఁడు. నిర్దోషులమయిన రక్షింపుఁడు. ఇంతియే కోరునది.

శ్రీరామ :- సంయమీంద్రా ! వినుచుంటిమి, వినుచుంటిమి. మీరు చెప్పుఁదలఁచినదంతయుఁ జెప్పుఁడు. ఆవల దోషులరో, నిర్దోషులరో విచారించి నిర్ణయింతుము.

శంబు :- దేవా ! యాలించు ప్రభువులున్న నా హృదయా వేదనమంతయు వెలిబుచ్చుకొనెదను. మేము హిందూ మతమును స్వీకరించిన కారణమున మానవసామాన్య ములయిన హక్కులను మాయొద్దనుండి బలవంతముగా గుంజుకొనుట యెట్టిధర్మము ? ఎట్టినీతి ? సృష్టికర్త యెడల భక్తివిశ్వాసములను దెలుప నానందరసమగ్న మునై యెల్లప్రొద్దుల నెల్లచోటులఁ బాడు పక్షిగణ మునకున్న యాపాటి స్వాతంత్ర్యము మాకుండఁ దగదా ! ప్రజ్ఞాచక్షువులేని జీవరాసులకున్న యధికా రము మాకుండఁగూడదా ? మే మేమియు నవినీతి కార్యములకుఁ జొరలేదు. ఈ చరాచరములను, జేతనా చేతనములను సృష్టించినయా "ఏకమేవాద్వితీయమ్

బ్రహ్మమ్" ను సేవించుటకును, గీర్తించుటకును, బాడుటకును, బూజించుటకును స్వాతంత్ర్యమును గోరుచున్నాము. చతుష్పాద జంతువులుకూడఁ బూర్వకర్మవాసనచేఁ గల్గిన జ్ఞానలాభమునఁ దపస్సమాధినిజెంది తరించినట్లు మనమువినుచున్నాము. అట్టి యధికారము మానవజన్మ మెత్తిన మాకుండఁదగదా? పిపీలికాది బ్రహ్మపర్యంతము వెలుఁగొందుచున్న యా దివ్యతేజముయొక్క సంకీర్తనపరాయణ లుబ్ధులైన యీబాలురకట్టి యధికారమేలయుండఁ గూడదు? మీరాష్ట్రమున జన్మించితలఁదాఁచు కొనుటచేతనా? పూర్వులు గడియించి యిచ్చిన యీ ప్రాఁజదువులను వీరిని ముట్టకుండఁ జేసి యజ్ఞానకూపమునఁ బడద్రోసిన నీకార్యమునకు నెవ్వరుత్తర వాదులగుదురు? ప్రజల మానప్రాణ స్వత్వ రక్షణ భారమునకు మూలము రాజుకాఁడా? హిందూ మతస్థులమని మేము పిలుచుకొనుచున్నందులకుఁ బ్రతిఫలము మాకజ్ఞాన మొసంగుటా? హిందూసంఘశరీరమునందొక యవయవము క్రుళ్ళికుసుమారుచున్న నయ్యది యెట్లు తేజస్వంతముగనుండును? ఇది మాత్రము ప్రభువులకుఁ గీర్తిదాయకమా? మీరాజ్యమున జన్మించుటచేతనా మా కీపాట్లు?

శ్రీరామ :- సంయమీంద్రా! క్షణకాలమాగుఁడు. మీ యిష్టము వచ్చినట్లు తపస్స్వాధ్యాయనపరులుగండు. మీరు నిశ్చయముగా నీశ్వరధ్యానము సల్పుకొన వచ్చును. కాని వేదములిందులకు సమ్మతించునా?

శంబు :- దేవా ! మీరేయరయుఁడు, సత్యమును గనుంగొనుఁడు. వేదములు హిందువులకెల్లఁ దరణోపాయములుగ నేర్పడినవి; కాని క్షీమింపుఁడు, పొరఁబడితిని, మానవకోటి కెల్లరకును దరణోపాయములు. వేదచతుష్కముచే వికిరితమైనజ్ఞాన తేజమును గ్రహించినవారు, గ్రహింపనిష్టపడినివారు హిందువులనఁబడుచుండిరి. హిందువులయ్యు నా లాభమును బొందఁజాలనివారు మా బోంట్లు; కాన మేమెట్లు వేదములను బొందఁగూడుదో ! యెట్లు భగవద్ధ్యానముఁజల్పుకొనఁగూడుదో దేవరవారే దోహాజింతురుగాక.

శ్రీరామ :- మునీంద్రా ! మీ మాటలు గ్రాహ్యంబుగఁ గన్పట్టుచున్నవి. మా రాష్ట్రవాసులకెల్ల సమానము లగుహక్కులనిచ్చి, పక్షపాతరహితముగ రాజ్యమేలుట మాకు విధ్యుక్త ధర్మము కాన మీరు నిశ్చింత నుండుఁడు; మేము పోయివత్తుము.

శంబు :- (ఆనందపరవశుఁడై, భక్తిపురస్సరంబుగా) దేవరవారి పరిపూర్ణ కటాక్షమునఁ బవిత్రుఁడనైతిని. ఆర్తుల పాలిటి దైవతములుగదా భూనాథులు. మీ యీ మహాత్కార్యముచే ద్రావిడలోకమెల్ల నాచంద్రార్కము కృతజ్ఞమైయుండును.

శ్రీరామ :- మేలు మీ రాజభక్తిచే మేము సంప్రీతుల మయితిమి.

(నిష్క్రమింతురు.)

(గుట్టముపై నానుకొన్న శ్రీరామచంద్రుఁడును, వసిష్ఠుఁడును)

వసి :- శ్రీరామచంద్రా ! కార్య పర్యవసానమును దెలిసి కొనుటకునై యీ కడకరుదెంచితిని, ద్రోహిని శిక్షిం చితివికదా !

శ్రీరామ :- ద్రోహుల శిక్షాపాత్రులఁజేయుటకు నయోధ్య పట్టణాధీశులం దెవ్వరును జంకువారు కారు.

వసి :- తరతరంబులనుండి యీ సంగతి మే మెఱుంగనిది కాదు. అందుచేతనే సూర్యవంశపౌరోహిత్యమునందు సుస్థిరులమయి యున్నారము. గుర్వాజ్ఞను దలపూ వట్టులమన్నింపని ఛాత్రులు మన్ననకుఁ బాత్రులు గారు. గుర్వాజ్ఞను బ్రశ్నింపకుండ నొనర్చుట శిష్య ధర్మము. ఈ గురు శిష్య ధర్మ మిప్పటిదియా ? సృష్ట్యాదినుండి పరంపరానుగతికమయినది. ఇన్నిటికిని మఱచితి. శంబుకుని శిష్యులనండఱి నెక్కడికంపితివి ? వారలకుఁగూడఁ నల్పశిక్షయయిన విధింప వలసి నదియే.

శ్రీరామ :- ఇచ్చటనే యీ చిదానందాశ్రమములోనే యున్నారు.

వసి :- ఎక్కడ నుండిన నేమిగాని కట్టుదిట్టములు చేసితివి కదా ? కన్నులు గానక మిట్టిపడి వర్ణాశ్రమాచార ముల దిగఁద్రావి చెలరేఁగిన గురువునకుఁ బట్టిన గతియే పట్టునని ఖండితముగాఁ జెప్పితివా ? ఈ దురా లోచనములఁ బుట్టినప్పుడే మాన్పుట మంచిది.

శ్రీరామ :- గురువరా ! శంబుకసంయమికిఁ గలిగిన గతి యనియా మీ యభిప్రాయము ?

వసి :- అగును (ఆశ్చర్యముతో) నీవుకూడ సంయమియును చున్నాఁడవే ?

శ్రీరామ :- ఇంద్రియ సంయమముఁ గావించినవాఁడు సంయమి కాఁడొకో ! దీనికేమిగాని శంబుకసంయమికి సంభవించిన దుర్గతియేమి ?

వసి :- రఘురామా ! మమ్మెక్కసక్కెముఁజేయుచున్నావా? ఇప్పుడు శిక్షించితినని చెప్పితివే ?

శ్రీరామ :- దేశికేంద్రా ! క్షమింపుఁడు, మే మట్లు చెప్పలేదు.

వసి :- ద్రోహుల శిక్షాపాత్రులఁ జేయుపట్ల నయోధ్యాపట్టణాధీశులందెవ్వరును జంకువారు కారన్నమాట నీవనినది కాదా ?

శ్రీరామ :- అగును, మేమనినవాక్యమే.

వసి :- అట్లయిన శంబుకుని శిక్షింపలేదనుచున్నావే ?

శ్రీరామ :- శంబుకసంయమిని శిక్షించుటకుఁ బూర్వము ద్రోహియని స్థిరపడవలయునుగదా ?

వసి :- మనవాదమంతయు "ఘట్టకుటీప్రభాతన్యాయము"యినది. స్మృతు లేమి చెప్పుచున్నవో వినింపలేదా ? స్మృతివాక్యంబులను బాటించుటకన్నను రాజధర్మమేమి కలదు ? హిందూమతమునకు స్మృతులు మూలాధారములు. ఆ స్మృతివాక్యముల ననుష్ఠేయములుగాఁ

జేయుట రాజధర్మము. స్మృతులు ద్విజేతరులకు దప
స్సాధ్యాయములను నిషేధించుచున్నవి. వానిని
బాటింపక శంబుకుఁడు మత్రదోహముఁ జేయుచు
న్నాఁడు నీవువానిను పేక్షఁజేయుచు రాజధర్మమునునొక
మూలకుఁ ద్రోయఁజూచుచున్నావు. అయోధ్యాధీశు
లెవ్వరిట్టిపనులకొడిఁగట్టలేదు తొల్లి.

శ్రీరామ :- మీ వాక్యములు సత్యమునే ప్రకటించుచున్నవి.
మీరు శంబుకసంయమిని మత్రదోహిగా రుజువు
చేయఁగలిగితిరో నిష్కరుణులమై వానిని శిక్షాపాత్రు
నిఁజేసెదము. మేమింతదనుకను శంబుకసంయమితోఁ
బ్రసంగించితిమి కాని వాని వాక్యము లాదరణీయము
లుగఁ గన్పట్టుటచే మేమే న్యాయధికార మిచ్చినచ్చి
తిమి. నిరపరాధుఁడుగఁ గన్పట్టు శంబుకుని దును
మాడి పాపమునఁ బోవనొల్లము. రాజులు సర్వ ప్రజాను
రంజకులై నేల నేలఁదగువారుగాని కొంఁతయి యుపదేశ
ముల నమ్మి యపరాధరహితులను బాధపఱచుటకుఁ
దగువారు కారు.

వసి :- (కుపితుఁడై కమండలువు నేలంబెట్టికొట్టి) గురు తిర
స్కారమునకుఁ గడంగుచున్నావు. బ్రాహ్మణులిట్టి
తిరస్కారము సహింపనొల్లరు. బ్రాహ్మణుల శక్తిఁ
బరీక్షింపవలయునని తోఁచెఁగాఁబోలు. అట్లయిన
వినుము. రేఁగిన కార్చిచ్చువలె సర్వలోకములను దగ్ధ
పఱుపముఁ జేయఁజాలును.

శ్రీరామ :- దేవా ! యిది మే మెఱుంగనిదికాదు. పరశు రాముని మే మెఱుంగమనుకొంటిరా ? ఎందుకయిన నోర్తుముగాని మేము విశ్వసింపని కార్యములఁ జేయ నొల్లము. ఇయ్యది క్షత్రధర్మము. ఇది యిట్లుండ మే మరణ్యమునఁ గ్రుమ్మరునప్పుడు గుహుఁడు చేసిన సాహాయ్యమును మఱవుమందురా? శబరి కనంబఱచిన యవ్యాజభక్తిని విస్మరింపుమందురా ? ఈ యలంతుల మాటయేల ? హనుమదాదులు చేఁదోడువాఁదోడుగా కున్న వారధిఁగట్టఁగల్గుదుమా ? రావణ సంహారముఁ జేయఁగల్గుదుమా ? ఆర్యులమైన మనమనార్యులపాటి కృతజ్ఞులమై యుండఁ దగదా ? రాజనీతి మాట యటుంచి తోడ్పడినవారికిఁ బ్రతిఫలముఁ జూపుట మానవ సామాన్యమగు నీతికాదా ?

వసి :- శ్రీరామచంద్రా ! నీ వాముష్మికముమాటఁ దల పెట్టక యైహికం బాలోచింపుము. వీరందఱికి సమాన స్వత్వ మొసంగిన మా పాల్లేమగును ? తరతరంబుల నుండి బ్రాహ్మణ క్షత్రియజాతులు రెండును మిథ స్సాహాయ్యంబున వర్తించుట యెఱుంగవో ? లేకున్న మీ రాజ్యమును మా కులగౌరవంబును జిరకాలము నాఁడే పేరులేకుండెడివి. కావున నట్టి యుపద్రవమును దప్పించుటకే యింత తఱచి తఱచి చెప్పుచుంటిమి.

శ్రీరామ :- (చుఱుకుచూపులతో) దేశికేంద్రా ! బ్రాహ్మణ సాహాయ్యంబు వలననే రాజులు రాజ్యమేలిరనియా మీ యభిప్రాయము ?

వసి :- (ఆత్రముతో) కాదు, కాదు; క్షత్రియులు కత్తితో౮ దీర్ఘ౮దగిన పనిని బ్రాహ్మణులు మాటలతోడనేతీర్చి రాజుల యలజడిని బాపిరని నా యభిప్రాయము.

శ్రీరామ :- చిత్తము ! మంచిమాటయే.

వసి :- కావున నీ రెండు జాతులు పరస్పర సౌభ్రాత్రమునసే సౌభాగ్యమును, గౌరవమును నందియుండగలవు. దీనికి వ్యతిరేకమయినచో నంతఃకలహాములచే దినదినము సంక్షీణభావ మంద౮గలవు. ఇది నిస్సంశయము.

శ్రీరామ :- ఒకజాతి సౌభాగ్యమునకయి మఱియొక జాతిని సర్వకాల సర్వావస్థలయందు బానిసతనమునందుంచి మార్పులను జేయుట రాజనీతియగునా ? రాజధర్మము ప్రజలను నిష్పాక్షికమయిన బుద్ధితో౮ బరిపాలించుట కాదా ?

వసి :- శ్రీరామచంద్రా ! ఇందొక్క జాతిస్వాత్వమును హరించి బానిసలుగా నుంచుట యేమున్నది ? వీరు మీ పూర్వులతో నడుముకట్టుకొని పోరి తమహక్కులను గోల్పోయిరి. పరాభూతులయిన శత్రువులు లో౮బడిరని చెప్పి స్వాత్వ సామాన్యము నొసంగుట రాజనీతి విరుద్ధము కాదా ?

శ్రీరామ :-మహాత్మా ! శరణాగతరక్షణ బిరుదంబు౮దాల్చిన మాకు మీ వాక్యములు బోధపడవు. మీ యుప దేశప్రకారము మే మాచరించిన భవిష్యదంతర్వాణులు మమ్మేమిగా భావింతురు ?

వసి :- మహాపురుషుఁడనియు, రాజదేవేంద్రుడవనియు, భగవదవతారమ వనియు భావింతురు.

శ్రీరామ :- ఇదియెట్లు తటస్థించును ?

వసి :- ఇది యెట్లు తటస్థించునని సంశయచిత్తుఁడ వైతివా ? వినుము చెప్పెదము. ఇంతటి నిర్దాక్షిణ్యముతో రాజ ధర్మమును నెవ్వరు నిర్వర్తింపఁగల్గిరి ? ఇంతటి ధర్మ బుద్ధితో స్మార్తధర్మములెవ్వరు పరిపాలింపఁగల్గిరి ? నీ విట్టి ధర్మ నిర్వహణముఁ జేయుచో ఋషులేల నిన్ను భగవదవతారముగాఁ గొనియాడరు ? వర్ణాశ్ర మాచార పరాయణ శీలుఁడయిన రాజు నిమిత్త మాత్రుఁడై వర్ణసాంకర్యముగల్గఁజేయువారల శిక్షించు నని స్మృలు చెప్పుటలేదా ? లెమ్ము.

శ్రీరామ :- మీరెంత చెప్పినను శంబుకుని వధకు మనసు పోకున్నది. ఇతఁడు నిరపరాధియని మా విశ్వాసము.

వసి :- అపరాధియైననేమి ? నిరపరాధియైననేమి ? శాస్త్ర సమ్మతమైననేమి ? గర్హితమయిననేమి ? ఒక్కని మరణముచే రెండుకులములు సిరిసంపత్తులచేఁ దులఁ దూఁగునప్పుడు, తామరతంపర క్రియ వృద్ధి నందు నప్పుడు వెనుకంజవేయకుము. ఆత్మరక్షణ మెల్లజీవు లకు నవశ్యకర్తవ్యము.

శ్రీరామ :- పాపముఁజేసి మనుటకన్నఁ బరోపకార మాచ రించి, మరణించి యశఃకాయుఁడగుట యుక్తము కాదో ?

వసి :- అందుచేతనే నిన్నీ కార్యమునకుఁ బురికొల్పుట. లేకున్న ధర్మసూక్ష్మ వేదులమయిన మే మిట్టిపనికిఁ బూనుకొందుమా ? ఒకనిని జంపి జాతిద్వ్యయమును సముద్ధరించుట పరోపకారము కాదా ? లెమ్ము. కార్యోన్ముఖుఁడవుకమ్ము. ఆలసింపకుము.

శ్రీరామ :- (తనలో) కొంతవఱకు సందియము దీరినది. ఇది న్యాయముగాకున్న నీ మహానీయుఁ డింత పట్టుదలతో నేలచెప్పును ? (ప్రకాశముగా) గురువరా ! ధర్మాధర్మ విచారణ భారము గురుభుజస్కంధమున నుండును. గురూపదేశంబు వ్యపగతకల్మషంబుగాన శంబుకుని బరలోకప్రాప్తునిఁజేసెదము. మేమిదే పోవుచుంటిమి, సెలవిప్పింపుఁడు. (పోఁబోవును, పాదు త్రవ్వి నీళ్ళు పోయుచున్న బ్రహ్మచారీ వాక్యము లాలించి కన్నీటిచే డగ్గుత్తికవడినస్వరముతో శ్రీరామ చంద్రుని కడ్డపడి)

బ్రహ్మచారి :- మహాప్రభూ ! మూఁబాబయ్యగారిని జంపి దరా ? వలదు. వలదు. మమ్ములనందఱిని దిక్కులేని పక్షులను జేసెదరా ? ఇంతకుమున్ను నేఁగోరినవస్తువు నిచ్చెదమంటిరి. మూఁబాబయ్యగారి ప్రాణమునాకిండు. మూఁబాబయ్యగారిష్టపడినను బడకున్నను నేను మీరిచ్చుదానమును గ్రహింతును. (ఏమి చెప్పుటకుఁదోఁచక శ్రీరామచంద్రుఁడు దిగాలున నిలువంబడియుండ వసిష్ఠుడక్కసుగ్రక్కుచున్న చూపులతోఁ బిల్లవానిఁ జేయిపట్టుకొనిలాగి) మిమ్మాదరించుటకు మేముంటిమి

లెమ్మ్ము. ఇటురమ్ము. (శ్రీరామచంద్రునితో) పిల్ల వానిమాటలతో నేమిగాని నీకార్యాచరణమునకుం బొమ్ము.

శ్రీరామ :- దేశికేంద్రా! అబముసుబమెఱుంగని కసుగందు. ఏమియుఁజేయకుఁడు.

వసి :- మాది మాత్రము కన్నకడుపుకాదా? (శ్రీరామ చంద్రుఁడు నిష్క్రమించును)

బ్రహ్మచారి :- (కంటినీరు కంటఁగ్రుక్కుకొని) అయ్యా! మీరులేకేమి? మాతాతలనాఁటి నుండియు సంపూర్ణ కటాక్షముతోఁ జూచుచునే యున్నారుకదా.

వసి :- లంకను బుట్టినవారందఱు రాక్షసులే. బ్రొత్తలేమి యుండును. ?

బ్రహ్మచారి :- మీరుచెప్పినదిమాత్రము నిజముకాదు. లంకలోఁబుట్టిన విభీషణుఁడు రాక్షసుఁడు కాఁడు! (నిష్క్రమణము)

(శ్రీరామచంద్రుఁడు తపోనిష్ఠనున్న శంబుకుని జేరి రోషమునన్న ఖడ్గమునుబెఱికి, ఝళిపించి మరల నాఁగి విషాదముతోఁ గుడిచేయివంక దేటిపాఱఁజూచి)

కరుణయొకింతలేక కుల కాంతను, సాధ్విని, బూర్ణగర్భిణిన్ వరఁకు నరణ్యభూములకుఁ బంపఁగఁజాలినయట్టి నీకు దు ర్భరమగునే యొకానొకని ప్రాణముతీసెడుపట్ల మానిశే ఖరుఁడగుఁగాక, జాలియెటు కల్గును? దక్షిణబాహుదండమా!

(మరల నుత్సాహముతో ఖడ్గమెత్తి)

క్షత్రధర్మంబు స్మృతివాక్య సమ్మతంబు
ధర్మసంస్థాపనార్థంబు ధరణిలోన
సద్గురూపదిష్టముగాన జంకకుండ
శంబుకుని రామచంద్రుండు చంపుచుండె.

(భిన్నమస్తకుండై శంబుకుఁడు నేలవ్రాలును, దివ్య తేజము మింటికెగయును. శ్రీరామచంద్రుఁడు నిష్క్రమించును)

శంబుక శిష్యుని ప్రవేశము.

ఏమందుఁగటకటా! యిట్టివిడ్డూర
మీమునిందు జరిగినే యెచ్చోటనేని?
చలిచీమనేనియుఁ జూఁడ్రొక్కకుండ
వనసీమలోపల వసియించి యెప్పుడు
పవనభుక్తిఁ దపించు పరమపూరుషుని
శంబుక సంయమిచంద్రు మద్గురుని
బ్రాహ్మణులెల్లఁగాపట్యంబుతోడఁ
బసరిచ్చి యొక విప్ర బాలు, విసంజ్ఞు
గాఁజేసి యయ్యది కల్గె శంబుకుని
జపముచేసనిచెప్పి చాటించి, రామ
చంద్రుచే మద్గురుఁ జంపించి పిదప
బ్రాహ్మణ బాలుండు బ్రతికినాఁడనిరి.

ఎన్నఁడే బ్రదుకునే యీల్గినవాఁడు ?
ఏమి యీ దుస్తంత్ర మేమి యీమాయ ?
ఏమి యీగారడి ? యేమి యీ కుట్ర ?
ఏమెట్టుజీవింతు మేమెట్టుబ్రదుకఁ
గలవారమిఁకమీఁదఁ ? గాలుష్యహార !
లోకాన నాలగోలును బాలగోలు
గగ్గోలు సేయవే ? క్రొచవేజగము ?
మా శోకవహ్నాయు మాదు దుఃఖాగ్ని
కాల్చవే విప్రప్ర కాండులనైన
బాలుర శాపంబు బ్రహ్మ శాపంబు
కార్చిచ్చుబోలె లోకంబులనేర్చు
నీ దోషఫలమెల్ల నీ దేశమందుఁ
బ్రజలార ! వినుఁడు నా పల్కులను నన్ని
స్వాతంత్ర్యమంతయు సమసిపోవంగఁ
బారతంత్ర్యమునందుఁ బడిపడిపోయి
విద్యావిహీనులై విప్రులెల్లరును
సేవక వృత్తిలోఁ జిక్కిపోయెదరు
ధర్మంబు, శౌచంబు దయయు సత్యంబు
లొఅవడఁదమునెల్ల కులములవార
లేవగించఁగనుంగు రేమితోఁచకయె

మఱుగుచునుందురు మాటిమాటికిని
దైవంబు దూఱుచుఁ దగవులేదంచు
నెందాఁక బ్రాహ్మణు లీదోషమెల్ల
దిద్దుకోలేరో యీ దేశంబులోన
నందాఁక నీ రీతి నల్లాడుచుంద్రు
సత్యంబు నామాట సత్యంబుసుండు.

సంపూర్ణము.



కవిరాజు రచనలు

1. భూమి

2. కురుక్షేత్ర సంగ్రామము

ఆ చ్చు లో

కుప్పుసామి శతకము

భూ ర్తమానవా

సూతాశ్రమ గీతాలు

సూత పురాణము

(4 ఆఖ్యానములు)

కృష్ణశాస్త్రి

కవిరాజ సామ్రాజ్యము

కవిరాజ సామ్రాజ్యవివరము

గుడివాడ

ఖూనీ

కవిరాజు, శతావధాని,
త్రిపురనేని రామస్వామిచౌదరి, బారిష్టరు.

కవిరాజ సాహిత్యవిహార్,
గుడివాడ

తృతీయ ముద్రణ : 2

అక్టోబరు 1961

కవిరాజసాహిత్యవిహార్ ప్రచురణ 1

వెల : రూపాయిన్నర

ముద్రణ :

'వెంకటరత్నా'

విజయవాడ-2.

తొలిపలుకులు

ఒకనాటి ప్రొద్దున మా స్నేహితుడు మ॥ రా॥ రా॥ శ్రీ నండూరి శేషాచార్యులుగారి ఇంటికి నుబుసు పోకకునై పోయితిని. మేజాబల్లపై విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'వేనరాజు' వ్రాతప్రతి పడియున్నది. తీసి చదువుట కారంభించితిని. చదివినకొలంది యాంధోళన పడితిని. చదువుట పూర్తి కామిచే నాచార్యులగారి యనుజ్ఞతో నా గ్రంథమును నింటికిం గొంపోయి పూర్తి చేసితిని. కలవరపాటు గలిగినది. నిజముగ వేనరాజు మనుజుల పుత్రులతోఁ జెరలాడునంతటి క్రూరుఁడా, తన్మూలమున వధ్యుఁడా? యను సందియము కలిగినది. వెంటనే భాగవతములోని వేనరాజుకథను జదివితిని. నిష్కర్ష విడచితిని. నా సందియము పటాపంచలైనది. వేనరాజు నిక్కముగ "ఖూనీ" చేయఁబడెనని నాకు బోధపడినది. "వేనరాజు" నాటకముచే వేనరాజునకుఁ దీరని మహాపచారము చేయఁబడినదని నాకు గట్టిగ నమ్మకము కలిగినది. ఈ యపచారమును వెంటనే తుడిచివేసి వేనరాజు నిజస్వరూపము లోకమునకుఁ బ్రదర్శించుట ధర్మమని తోఁచినది. దీనికి ఫలముగా "ఖూనీ" యను నీ చిన్న గ్రంథమును వ్రాసితిని. ఇది నా "ఖూనీ" జన్మకథనము. నాచే నీ గ్రంథమును వ్రాయించినందులకు విశ్వనాథ సత్యనారాయణ గారికిఁ గృతజ్ఞుఁడను.

మఱచిపోయిన తాతలనాఁటి ప్రాఁతకథను త్రవ్వి
వెల్లగించి విశ్వనాథ సత్యనారాయణగారు "ఆర్యబుషుల"
మాహాత్మ్యమును, వారి వృత్తశీలములను క్రొత్తమాటలచే
లోకమునకు బోధింపఁబూనుకొన్నారు. దీనికి వీరికి హక్కు
లేదని చెప్పఁజాలము. "ఆర్యబుషులకు" గంటమును
జేఁబూని, గంటము పదను బోవువఱకును ఆకులు చినిఁగి
పోవ్రవఱకును ధర్మమో, యధర్మమో విచారింపకుండ
వ్రాయుటకు హక్కున్నప్పుడు, సత్యనారాయణగారి కేల
యట్టి హక్కుండరాదు?

కాని యీ హక్కే వేనున కేల యుండరా దని
మేము వాదించుచున్నాము. బుషులకు వ్యతిరిక్తముగా
వారి వాదనను ప్రతిషుటించి ధర్మప్రచారమును జేసిన
మాత్రమున వేనుఁ డెట్లు హంతవ్యుఁడో యూహింపరాదు.
వేనుఁడు హంతవ్యుఁడైనచోఁ దదితరు లేల కాఁగూడదు?
పైనిం జెప్పిన కారణముచే వేనవధ గర్హితమును, దూషిత
మును, నింద్యమును నేల కారాదు? తాము చేసిన ఘోర
కృత్యమును సమర్థించి, యయ్యదియే ధర్మమని లోకమును
నమ్మించుటకుఁ దమ సంతానములో నొకరు నడుముఁ
గట్టుకొని నేఁటికి బయలుదేరి రన్నమాట విన్నచో "ఆర్య
బుషులు" ఎంత సంతసింతురో కదా. సత్యనారాయణగారి
"వేనరాజు"ను జాగరూకతతోఁ బరిశీలించితిమేని, తా నొక
యార్యబుషి సంతతివాఁడ నను నమ్మకముతో కృతికర్త
వేనవధను సమర్థింప నన్నిపాటులు పడెనని బోధపడక
మానదు. సత్యనారాయణగారిచే వాడఁబడిన యీ "ఆర్య

ఋషి" శబ్దము నేఁటి నుదియొక శబ్దమును స్ఫురింపఁ జేయు చున్నది. స్వజాతిదోషమును గప్పిపుచ్చుటకు మహనీయులఁ దూలనాడుట తుందుడుకుతనము కాకుండునా? సత్యనారా యణగారు "Versatilegenius" కావచ్చును, కాకపో వచ్చును. దానితో మాకు సంబంధములేదు. వారు వ్రాసిన గ్రంథముతోడను, సంవలి యభిప్రాయములతో డను మాత్రమే మాకు సంబంధము.

వేనరాజుచరిత్ర భాగవత చతుర్థస్కంధములో నున్నది. ఈ వేనుఁడు పృథుచక్రవర్తితండ్రి. భాగవతము పృథుచక్రవర్తిని వేనుని తనూజునిగాఁ జెప్పుచున్నది. తనూజశబ్ద మిటసార్థకము. అనఁగా వేనునిశరీరమథనముచేఁ బృథువు జన్మించినాఁడని "ఆర్యఋషులు" చెప్పుచున్నారు. వేనశరీరమథనముకూడ వేనునిమరణము గలిగినవెంటనే జరుగలేదు, కొన్నిరోజులకో, కొన్ని వారములకో, కొన్ని నెలలకో, కొన్ని యేండ్లకో జరిగినట్లు భాగవతమువలనఁ దెలియుచున్నది. ఇంతకాలము చెడిపోకుండు నెట్లని పాఠకులు సంశయింపవచ్చును. "శిపివిష్టదేవతాకం బయిన పురోడాశంబు"చేఁ గావింపఁబడిన హోమంబున బయలు వెడలిన "స్నిగ్ధసాయంబు"చేఁ గలిగినవాఁ డగుటచే నిట్టి పవిత్రదేహంబు కల్గెనని తలంపవలయును. ఏది యెట్లయిన నేమి? వేనుఁడు పృథుచక్రవర్తితండ్రి యని పూర్వగ్రంథ ములు చెప్పుచున్నవి. ఆర్యఋషులు పృథువును షట్చక్ర వర్తులలో నొకనిగాఁ జేసిరి. కాని మా యభిప్రాయమున, సుగ్రీవుఁడు, విభీషణుఁడు, ప్రహ్లాదుఁడు మొదలుగాఁ గల

వారివలె కుటుంబద్రోహి. భాగవత మిట్లు వేనునిగూర్చి చెప్పుచున్నది. అంగరాజు వెనుకటి జన్మమునందు, నీ జన్మమునందుఁ బుత్రవిహీనుఁడు. అందుచే దేవతలాహూతు లయ్యి నంగరాజు చేయుచున్న యజ్ఞమునకు రారైరి. వచ్చి పప్పుబెల్లాలు కొనిపోరైరి. ఆర్యబుషులందుచే నంగరాజుచేఁ బుత్రకామేష్టి చేయించిరి. తత్ఫలముగా వేనుఁడు జన్మించెను. ఒక్కఁడే కొడుకగుటచే మారా మెక్కువయై యాతతాయిగాఁ బెరిగెను. అందుచే నంగరాజు కుమిలిచచ్చెను. ఆర్యబుషులందఱు గుమిగూడి యజ్ఞమహిమముచేఁబుట్టిన వేనునిఁ బట్టాభిషిక్తునిగావించిరి. అంతట వేనుని నిజస్వరూపము బయటఁబడెను. ఆర్యబుషులపైఁ దిరుగఁబడెను. రాజ్య మల్లకల్లోల మయ్యెను. ఆర్యబుషు లందఱు ప్రోవై చంపుట యుత్తమని తీర్మానించి చంపివైచిరి. వేనుని దుర్మార్గునిగాఁ జెప్పఁదలంచిన భాగవతము చెప్పినకథ యిది. దీని సత్యాసత్యములు నిరూపించుటకుఁ దగినయాధారములు భాగవతమున నేమయిన దొరకునా యని యాలోచింపఁదగును. వేనుఁడు చిన్నతనంబున బొలురను బసుప్రకరంబును బోలె నరికట్టి చంపెనఁట. ఇది నిజమే యయినచో అంగరాజు మరణానంతరము "ఆర్యబుషు" లెల్లరు సభచేసి విచారించి, వేనుని బట్టాభిషిక్తుని నేలచేసియుందురు? భవిష్యత్తెఱిఁగిన బుషు లింతమాత్రమేల తెలిసికొనరైరి?

"మహితోగ్రశాసనుం" డయిన వేనుఁడు పట్టాభిషిక్తుఁ డయినంతనె "సమస్తసకృతులు సర్వభీతిచేఁ

దలఁగుమూషికములకై వడి" గహనములయందు నడఁగుట యేల కలిగినది ? వేనుఁడు ధర్మ్రపభువే కానియెడల దస్కరులే భయమందుటేల ? దీనింబట్టి చూడ వేనరాజ్యం బులోఁ దస్కరులుకానివారికి భయములే దనియే స్పష్టపడు చున్నది కదా ? ఇట్టి ధర్మ్రపభున్ను "ఆర్యబుషులు" అతతాయిగను, ర్రూరకర్మ్రనిగను, గసాయిగను, ర్రబద ర్శించి కడతేర్చుటేల కావలసి వచ్చినది ? దీనికిఁ దగిన కారణము భాగవత్రములోనే కన్పట్టుచున్నది. వేనుఁడు పట్టాభిషిక్తుఁ డైనవెంటనే నిజస్వరూపము బయటఁబడినది. తన రాజ్యములో నాలుగుమూలలు మారుర్మోగునట్లు లీ విధముగఁ జాటించియున్నాఁడు.

దివ్యలు వెఱఁగందఁగఁ బృ
థ్వీవ్యోమము లగల భేరి వేయించె నయ
ష్టవ్య మదాతవ్య మహో
తవ్యం విర్రాయనుచు నుదాత్తధ్వనులన్.

ఈ విధముగ వేనరాజ్యంబున ర్రబాహ్మణ సంత ర్పణలు మాన్పింపఁబడినవి. వెంటనే మంర్రతంర్రముల వేనరాజు ఖూనీ చేయఁబడెను. ఇది యార్యబుషుల పరార్థ జీవనము, పరోపకారశీలత.

వేనుఁడు :

భాగవత ర్రకారము వేనుఁడు పాషండుఁడు, నాస్తి కుఁడు.

పాషండుఁ డనఁగ వేదబాహ్యుడు. ఇందు దోష మేమియున్నదో తెలియుటలేదు. నేఁ డీ ప్రపంచమునందు నివసించుచున్న 150 కోటులయందు వేదమునందు విశ్వా సము కలిగి, తద్ధర్మముల ననుష్ఠించువారు పదికోట్లకన్న నెక్కువ గానరారు. పాషండశబ్దము మతాంతరులయెడ నుపయోగించు తిట్టు. హిందువులు హిందూతరులను ఘ్లేచ్ఛు లనియు, మహమ్మదీయులు తదితరులను కాఫరు లనియు, క్రైస్తవులు తదితరులను "హిదెన్సు" అనియును నిరంతర మొకరి నొకరు దూషించుకొనుట వినుచునే యున్నాము. ఇంతయేల? శైవులను వైష్ణవులు, వైష్ణవులను శైవులు నింతకన్నను కఠిన వాక్యములచే దూషించుకొనుట యెఱుం గుదుము. పాషండుఁ డన్నంతమాత్రముననే ధర్మపీడలు చేయువాఁ డని యర్థము రానేరదు.

నాస్తికుఁడు:

నాస్తికుఁ డనఁగఁ దేవుఁడు లేఁడని నమ్మువాఁడని యర్థము. కాని వేనుఁడుమాత్రము నాస్తికుఁ డైనట్లు పొడకట్టదు. వేనుఁడు తా నీశ్వరప్రతినిధి యనియుఁ దన యధికారమును ధిక్కరించుటకు నితరుల కధికారము లేద నియు నమ్మినట్లు లీ క్రింది భాగవతములోని పద్యముల వలన నూహింప ననువు కల్గుచున్నది.

"హరిహరహిరణ్యగర్భ
స్వరధీశ్వర వహ్నిశమన జలధిపతిమరు

న్నరవాహన శశిభూరవి
సురముఖ్యులు నృపశరీరసూచకు లగుటన్.

పరికించి నను భజింపుఁడు
ధరణీశుఁడు సర్వదేవతామయుఁడగు మ
త్సర ముడుగుఁడు నాకంచెను
బురుషుఁడు మరియెవ్వఁ డగ్రపూజార్హుఁడిలన్."

దీనినే పాశ్చాత్య దేశములయందు (Divine right of Kings), అని యందురు. నాలుగయిదు శతాబ్దుల క్రిందివఱ కీ యభిప్రాయము పాశ్చాత్య దేశములయందు విపరీతముగ వ్యాపించియుండెను. దీని పిలకయే (The King can do no wrongs) అను నానుడి. కొంచె మించు మించుగ "ఆర్యఋషులు" కూడ నీ వాదము నంగీకరించి యుండిరి; లేనిచో "నా విష్ణుఃపృథివీపతి"యను లోకోక్తికిఁ గారణమే యుండదు. ఇట్టి పరిస్థితులలో నీవాదము సాకుఁ జేసికొని వేనుని ఖూనీచేయుట యెంత న్యాయమో బుద్ధిమంతు లూహించుకొందురుగాక !

కాని పరిశీలించి చూచినయెడ వేనుని యభిప్రా యము లన్నియు నాస్తికత్వమునకే దారి చూపుచున్నట్లు పొడకట్టకమానదు. వేనుఁడు బౌద్ధమతమునకు మార్గదర్శి యని యభిప్రాయ పడుచుంటిమి. నాస్తికులలో లోకకంట కులుకాని, లోకప్రతారకులుకాని, కానివారు పెక్కు పున్నారు. జీవకారుణ్యముకలిగి లోకకళ్యాణార్థము పాటు

పడినవారు, పడుచున్నవా రెంతమంది యున్నారో విజ్ఞు లెఱుంగరా? గేయెల్ల మహాపాపము లాచరించి వఱువాతనే ముక్కు మూసికొని జపముచేయువారిచే లోక ముదరింపఁ బడఁగలదా? ఈశ్వరధ్యానముచేఁ బాపపరిహారము కల్గు నను విశ్వాసము దోషాచరణమునకు దోహదము చేయ కుండునా? ఆస్తికత్వము ప్రపంచపరిణామమునకు నాటంక ములు గలుగఁజేసెను గాని, తోడ్పడలేదని గట్టిగఁ జెప్ప వచ్చును.

నేఁడు ప్రపంచమున నున్న 150 కోట్ల ప్రజలయందు నాస్తికులే యెక్కువగ నున్నారని యెటింగినచో భగవంతుఁ డెట్టిదుర్గతిపాలగుచున్నాఁడో తెలియఁదగును. ఏఁబదికోట్ల బౌద్ధులు, పదికోట్ల మతములేనివారు, ఇరువదికోట్ల చెట్లు, చేమలు పూజించువారు, మతమును బాఱఁదోలిన పదికోట్ల రషియనులు, కలిసి మొత్తము 90 కోట్ల నాస్తికులే ప్రపంచమున జీవయాత్ర గడపుచున్నవారు. ఇంతియకాక హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ మతములయందు జన్మించుటంజేసి యా యా మతములయందే నామమాత్రముగ నుండి భగవంతునియందు విశ్వాసములేనివారు వేలకొలందిగ నున్నారు. ఈ యిరువది సంవత్సరములనుండి నాస్తికులసంఖ్య విపరీతముగఁ బెచ్చు పెఱుగుచున్నది.

మ త ము :

వేనరాజు కాలమునాఁటికి మత మనునది యొకటున్నట్టు పొడకట్టదు. "ఆర్యఋషులు" చెప్పు ధర్మములే

సనాతన ధర్మమని తలంపఁబడుచుండెను. "ఆర్యబుషుల" యభిప్రాయములకు వ్యతిరేకములగు నభిప్రాయములు కలవారు పాషండులుగను, నాస్తికులుగను నెంచబఁడు చుండిరి. తన్మూలమున వారు దండ్యులో, హంతవ్యులో యగుచుండిరి. రాజులు "ఆర్యబుషుల" చేతికొఱముట్లులుగ నుండిరి. తరువాత క్రమక్రమముగ నే మహానీయుఁడో చెప్పిన నీతు లన్నియుఁ గట్టుకట్టి యాతనిపేరిట మతమని చెప్పి, తన్మతేతరుల బలవంతముగాఁ దమమతములోనికి దింపుట పరిపాటి యైపోయినది. ఇందుచే మతయుద్ధములు తలలెత్తసాగినవి. దేశములెల్లను మానవ రక్తప్లావితము లయినవి. దేశమునకు మతములు చేసిన మేలిది యొక్కటి. క్రైస్తవమతమునకు మూలస్థానమైన జెరుసలేము పట్టణము మహమ్మదీయులగు అరబ్బుల స్వాధీనములో నుండుటచే నా పట్టణమును గైవసముఁ జేసికొనుటకు నెంతమంది వీరాధివీరులు హతులయిరో లెక్కపెట్టనలవియా? హిందూ మహమ్మదీయులు తమతమ మతములకయి పోరాడి యెన్ని లక్షలు దుర్మరణము పాలైరో కదా! సోమనాథ దేవా లయఁపు ముట్టడిలో నెంతమంది జంకుగొంకులేని రాజపుత్ర సుభటులు ప్రాణముల నర్పించిరో, మతసహనము కొలఁ దియో గొప్పయో యున్న హిందూదేశమున జైనులు, బౌద్ధులు వేలకొలంది మతావేశమునకు బలిచేయఁ బడ లేదా? మతముపేరిటఁ బరస్పరమారణ మతిదారుణముగాఁ బాశ్చాత్యదేశములయందుఁగూడ జరుపఁబడినది. 1572 వ సంవత్సరమున ఫ్రాన్సుదేశములో 10,000 మంది. ప్రొటె

స్పెంటు క్రైస్తవులు జాలిలేకుండఁ గుత్తుకలు కోయఁబడిరి. స్పెయిను దేశములోఁ గ్రైస్తవమతములోఁ జేరుటకు నిష్ట పడమిచే మూడువందలమంది కాల్చివేయఁబడిరి. దేవుని పేరిట నిట్టి క్రూరకృత్యము లెన్నియో జరుపఁబడినవి. భగవంతుఁ డొకఁ డున్నచోఁ దనపేర జరుగుచున్న యత్యాచారములనైన మాన్పనొల్లఁడా ?

మతము ప్రతిదేశమునందు సౌజన్యము, సౌభ్రాతృత్వము, సమానత్వమును జిందరవందరచేసి, మానవుల నల్లకల్లోలముజేసి, ప్రపంచశాంతి లేకుండఁ జేయుటయే కాకుండ మహాపురుషుల నెందఱినో తనపొట్టఁ బెట్టుకొన్నది. తారకాణముగా నొక యుదాహరణము నిచ్చెదము. సూర్యునిచుట్టు భూమియే తిరుగుచున్నదని చెప్పిన 'కోపర్నికస్' అను జ్యోతిష్కుని, రోమను చక్రవర్తి పెట్టరాని సిలుగులం బెట్టి చంపించెను. మానవుఁ డతి మూఢదశలో నున్నప్పుడు కొండగాని, ఏరుగాని, వాఁకగాని, పందిగాని, కుక్కగాని యేది యతిభీకరంబై మనస్సునకు నలజడిఁ గల్గించునో, యట్టిదానియందు భక్తివిశ్వాసము లుంచి, వేడికోళ్ళర్పించుట స్వభావముగాఁ గన్పట్టుచున్నది. ఇట్టి జనసంఖ్య ప్రపంచమునం దధికంబుగా నున్నదన్నుట స్పష్టము. కాని యీ సంఖ్య క్రమక్రమముగాఁ బెరుఁగుటకు మారు తరుగుచున్నది. కారణమేమి ? ప్రజా సామాన్య మజ్ఞానాంధకారబంధురముగా నున్నప్పు డుబుసు పోకకో, చిత్తశాంతికో దేవుఁ డను మాటా కొకటి కావలసి యుండును. ప్రజలు జ్ఞానచక్షువులం దెఱచి,

తమలోఁ దాము తర్కించుకొనుచున్న కొలంది భక్తి విశ్వాసములు నశింప భగవంతుఁ డున్నాఁడా లేఁడా యను తర్కవితర్కములు బయలుదేరుట సహజము.

మానవుఁడు మృగదశలో నున్నప్పు డే కొండ గానో, యే యేరుగానో వెలసిన దేవుఁడు, మానవ విజ్ఞానము పరిణామముఁ బొందుచున్నకొలంది, భగవంతుఁ డేరు, కొండలరూపమును వదలి, మృగమై, మృగమునుండి, మనుష్యుఁడై మనుష్యదశనుండి యదృశ్యరూపుఁడై నిరా కారుఁడై, నిరంజనుఁడై నిర్వికల్పుఁ డయ్యెను. ఇఁక దరువాతిదశయేమి? శూన్యత్వము అనఁగా నాస్తికత్వము. ఇదియే మూఢమానవ ప్రతిపాదితుఁడైన భగవంతునకు నేఁడు వాటిల్లుచున్న దశ. రష్యాలో నిరువదియేండ్లక్రింద బయలుదేరిన యీ ప్రళయఝంఝామారుతమునకు భయ పడి యచ్చటి గుడుల (Churches) లో నున్న భగ వంతుఁడు కాలిచప్పుడు కాకుండ నెచ్చటికో దారితీసెను. ఈ యిరువది సంవత్సరములలో నచ్చట బయలుదేరిన సాంఘిక మానసిక పరిణామము బహు విచిత్రమై ప్రపం చమునకు విస్మయముఁ గొల్పుచున్నది. ఈ విచిత్ర పరిణా మమును జూచి ప్రపంచమునందలి రాజకీయవేత్తలందఱు దిగ్భ్రమఁజెంది ప్రపంచ మే మగునో యని దిగులుపడు చున్నారు.

రష్యాయందుఁ బది పదియేను కోట్ల జనమున్నది. యూరపు మహాసంగ్రామమునకుఁ బూర్వ మీ దేశమును

"జారు" అను బిరుదుగల యొక చక్రవర్తి పాలించుచుండు వాఁడు. ఈ జారును రషియను లందరు (Little God) చిన్న దేవుఁడని పిలుచుచుండువారు. జారుపరిపాలనలో నున్నంతకాలము రషియాయందు మతావేశము మెండుగ నుండెను. రాజశాసనముచే నెల్లరు విసుగు, విరామము లేక భగవత్పూజ చేయవలసి యుండెను. దీనికిఁ బ్రతిఫల మేమి? ప్రజలలో నూటికి డెబ్బదిమందికిఁ గూడుగాని, గుడ్డగాని, మంచముగాని, కంచముగాని లేకుండెను. యూరపుమహాసంగ్రామమునుమధ్య జరిగిన మహాదారుణమైన జారుహత్యకు భయపడి భగవంతుఁడు రష్యానువదలి పలా యితుఁ డయ్యెను. చిన్నదేవుఁడు చావఁగాఁ బెద్దదేవునికి గతిలేకపోయెను. గుడు లన్నియు యంత్రాగారములుగను, పుస్తకభాండాగారములుగను మారిపోయెను. గుడులకున్న మడిమాన్యములు ప్రభుత్వవశమైపోయెను. తలఁదాచి కొనుటకు నిల్లు, వాఁకిలి లేనప్పుడు భగవంతుఁడు మాత్ర మేమిచేయఁగలఁడు? ఈ మాప్పునల్ల రషియాదేశమునకుఁ గలిగిన ప్రతిఫలమేమి? నూటికి డెబ్బదిమందికిఁ దినఁ గూడును, కట్ట బట్టయుఁ, బండ మంచమును, సాపఁ గంచమును లభించినవి. పురుషకార మప్రతిహతమగు నధికారము చెల్లించుకొనుచున్నది.

ప్రార్థించినంతమాత్ర, సేవించినంతమాత్ర, క్రైంక ర్యము చేసినంతమాత్ర భగవంతుఁడు ప్రీతుఁడై, సిరిసంప త్తుల నిచ్చి, పరలోక సౌఖ్యములు గల్పించుననుట నమ్మఁ దగినదేనా? ఇట్టివి యెన్నఁడు, నెచ్చటను జరిగియుండలేదు.

ఇయ్యది మానవ హృదయ దౌర్బల్యమును సూచింపక తప్పదు. ఈ ప్రార్థనలు, ఈ సేవలు, ఈ కైంకర్యములు స్వాతంత్ర్యమును గోల్పుచ్చి, పురుషకారమును నశింపఁజేసి మానవులను నంబేదలగు బానిసలనుగాఁ జేయుట కుపక రించునుగాని మఱెందులకుఁ గొఱగావు.

పాషండు లైనంతమాత్రమునఁ (అనఁగా వైదిక ధర్మములను ననుష్ఠింపనంత మాత్రమున) మానవుఁడు పాపకర్మములను చరించుననికాని ధర్మపీడలను సల్పునని కాని చెప్పుట లోకమునెడ మహోపచారము చేయుట యగును. భగవంతుని ప్రేమించుటకన్నఁ దోడి మాన వులఁ బ్రేమించుట పరమోత్తమంబు. పాషండుఁ డనఁగా సకలపాపములను జేయువాఁడని ప్రాకృతలోకంబునఁ గల యూహలను నాధారముజేసికొని విశ్వనాథ సత్యనారాయణ గారు వేనరాజును నా విధముగ నభివర్ణించియున్నారు. ఇది కేవలము పొరపాటు. పాషండులయం దెట్టి పవిత్ర జీవనము సల్పిన యుత్తమపురుషు లున్నారో లోకచరిత్రఁ జదివినవారికి బోధపడకపోదు. కావుననే పాషండు లైనంత మాత్రమునచే మానవులు దుర్మార్గులు కారనియు వేన రాజు పాషండుఁడైనను, సత్యనారాయణగారు చిత్రించి నట్లు దుర్మార్గుఁడు కాఁడనియు రుజువుచేయుటకే "ఖూనీ" వ్రాయఁబడినది.

సూతాశ్రమము,
1—9—35.

కృతికర్త.

16

ఖరా నీ

[మొదటిరంగము—మునిపల్లెలో యజ్ఞశాల; గౌతముడు, శునశ్శేపుఁడు, వటువులు; నవరంధ్రములు బిగించి పట్టుకొనఁబడిన మేఁక; యజ్ఞగుండము, సమిధలు, సమిధలతోఁ బ్రజ్వరిల్లుచున్న యగ్నిహోత్రము.]

వేనుఁడు : [పేరెలుంగునఁ దొందరతో] ఓహో! యాశ్రమవాసులగు యాయజూకులారా! ఏమి యీయాగము? ఏమి యీ యాగము; చాలింపుఁడు; చాలింపుఁడు: జంతుబలి యేరూపమునైన సరియె, వేనరాజ్యంబున నిషేధింపఁబడుట యెఱుంగరా ? ఎటోఁగి యెటోఁగి యిట్లు శాసనతిరస్కారముఁ గావించి, నండ్యలేల యయ్యెదరు? నవరంధ్రములు బిగియఁబట్టి యీదిక్కుమాలిన యజమును యజ్ఞగుండమున వేల్చుటకు సాహసించుచుంటిరా. ఒక్కసమిధ యజ్ఞగుండమునఁ బడెనా యొక్క ప్రాణ మెగిరిపోవును. భీకరశాసనుండగు వేనునిశాసనంబు ధిక్కరించి యెవరు బ్రదికిపోవఁగలరు ? ఆతఁడు చారచమువుకాఁడు.

అతఁడు స్వయముగఁ దనరాష్ట్రిమెల్లఁ గుశ్మ్మరు చుండును. ఎవ్వరును దప్పించుకొని పోవలేరు. [ధృష్టవర్మద్వితీయుఁడై పరివేశించి] గౌతమా! యేల యిట్లు దిగులుపడి బిక్కమొగముతో వెట్టిచూపులఁ జూచెదవు? ఈ దొంగజన్నమునకు మునిపల్లెయే కావలసివచ్చినదా?

గౌతముఁడు : ఏమి యీ యహంకారము? ఆర్యబుషుల యెదుటఁ గూడ నీ యహంకార ప్రదర్శననూ? చాలుంజాలు. బ్రహ్మవిద్వరిష్ఠులచేఁ బవిత్రీకృతము లగు మునిపల్లెలుకూడ నేఁటికీ యహంకార ప్రదర్శనమునుం జూడవలసి వచ్చెఁగా? ఆర్యబుషులం దిరస్కరించి శాపదగ్ధుఁడు కాక బ్రదికిపోయినవాఁడింతకు మున్నెవండు కలఁడు?

వేనుఁ: నేనుమాత్రము బ్రదికిపోదునని చెప్పుచుంటినా? బ్రదుకవలయునని కోరుచుంటినా? కాని గౌతమా! మీ బుషిపరంపరయందు పుట్టి గిట్టనివాని నొకనిం జెప్పుము. మీతండ్రి తాతముత్తాతలు చావక మిగిలి యున్నారా? సిగ్గలకయొకనిఁ జంపుటకూడ గొప్పయే యని కొండాడుచుంటివి. బెబ్బులి సాధుమృగంబులఁ జంపుట లేదా? భేదమేమియున్నది? గౌతమా! యొక వేళ నీవంటిమహర్షి యెవ్వఁడయిన నన్ను ఖూనీ చేయుటకు సిద్ధపడిన యెడల, నిప్పుడు నేఁ బూనిన ధర్మము స్థాపింపక పూర్వము, ఒకవేళ సాధ్యపడక

పోయిన-చోఁ బ్రిచారమయినను జేయకపూర్వము మాత్రి మట్టిది తటస్థింపదని గట్టిగఁ జెప్పుచుంటిని.

గౌత : ఏమి యీ యహంకారము ? చావ్రుబదుకులుకూడ నీచేతిలో నున్నట్లు మాటాడుచుంటివి.

వేనుఁ: అహంకార మహంకార మని యెత్తి పొడుచు చుంటివి. అహంకారములేని యభాగ్యుఁ డెవ్వఁడు ? అహంకారములేని దీ ప్రపంచమొక్క-గడియయైనను సాగునా ? అహంకారములేని రాజు రాజ్యమేలఁ గలఁడా ? వేయేల ? నీ వాక్యము లహంకారద్యోత కములు కావా ? ధృష్టవర్మా ! ఈ గౌతముఁడు మాటలంజెప్పి మనలను మఱపించుచున్నాఁడు. ఏల యట్లూరక చూచెదవు? ఆమేఁక యుక్క-రి బిక్క-రియై చచ్చిపోవుటకు సిద్ధముగ నున్నది. మునుముందు వారల నవలకుగెంటి యామేఁకను గాపాడుము. ఆవల వాదించు కొందము.

ధృష్టవర్మ : చిత్తము, మహాప్రభూ ! [మేఁకవైపునకు నడ చును.]

గౌత : ధృష్టవర్మా ! ఆగు మాగుము; ఏమి యీ తుందు డుకు ? మంత్రిపూతమైన యీయజమును నీవు స్పృశింపరాదు.

ధృష్ట: నేను మేఁకను స్పృశించువఱకు దానిని విడువ నొల్లరా ? ఏమి యీతిరస్కృతి? నన్నుఁ బల్క-రింప

కుము. నాకుఁ బ్రభునాజ్ఞ యొక్కటియే యాచర
ణీయము. వే రొండుఁతో నాకుఁ బని లేదు.

గౌత : అహహో ! యేమి యీ దుండగము. నేఁటికి ముని
పల్లెలుకూడఁ బాషండ షండ పాదధూళీధూసరితము
లగుచున్నవి. యజ్ఞశాల కెట్టి గతి పట్టినది ! ధృష్ట
వర్మా ! అవమానితులయిన యార్యబుషు లూర
కుందురా ? ఎన్నఁడయిన నూరకుండిరా! వాగ్బాణు
లయిన బుషులం జెనకి యెవ్వఁడు సుఖనిద్ర చేయం
జాలును ?

వేనుఁ: గౌతమా! పరుషవాక్యములతోఁ బ్రయోజనమేమి?
తిట్టుఁబోతులకు భయపడువారు నేఁడున్నారనియేనా
నీ యభిప్రాయము ? మదీయ బాహుయుగళీ వజ్ర
గుప్తుండవై మునిపల్లె సురక్షితుండ వయిన నీవు
తెగఁబడి నన్నుఁ బాషండుఁడ వని తిట్టనుంకింతువా?
ఇది యేనిధర్మము ? పొగడికలకును, దెగడికలకును
వేనుఁడు చలించి ధర్మపథమును వీడువాఁడుకాఁడు.
అతఁ డచలుఁడు. అతని ధర్మమచలము. అతఁడు
పాషండుఁడైననేమి? షండుఁడైననేమి? అతం డెవ్వఁ
డైననేమి ? అతనిరాజ్యముననున్న ప్రజలు సుఖజీవ
నము చేయవలయును. సుఖనిద్రఁ బొందవలయును.
ఇదియే యతనిపరమావధి. ఇంతియెకాక యతని
నాలుచెఱఁగుల నేలయందలి భూతజాలము పసుపట్టి
క్రిమికీటకాదులుసైతము బాధనొందరాదు. బాధ

నొందిన, వేనుని మనస్సు తరుగుకొనిపోవును. వానికి నిద్దురపట్టదు. వానికి జీవనమే దుస్సహమగును. పెక్కు మాట లేల? ఈయజ్ఞములు, ఈయాగములు లోకకల్యాణార్థమని నీవు రుజువుపఱిపఁ గల్గినచోఁ బూర్తిగావింప నేననుజ్ఞ యిత్తును. లేనిచో నొక్క సమిధయైనను నీయజ్ఞగుండమున మండదు.

గౌత : వేనరాజా! ఎందులకో మొట్టిపట్టు? దీన నుభయులకు మేలు లేదు.

వేనుఁ: నే నడిగినదానికేఁ బ్రత్యుత్తర మిమ్ము, నా కితర ముతో సంబంధము లేదు.

గౌత : అటులయిన వినుము.

అంగవంశోద్భవు లన్యాయవర్తులై
శిష్టమార్గములఁ బాసినదిలేదు,
విపరీతధర్మ్మలై వేదోక్తకర్మ్ములఁ
చేసేతఁ దోర్పిసివేసినదిలేదు,
అధికారబధిరగర్వాంధులై ప్రిల్లద
మ్మునఁ బ్రజాపీడ సల్పినదిలేదు,
అన్యరాజన్యజనాట్టోపదీనులై
నృపతిధర్మ్ముల మానినదిలేదు,
అతిసుభిక్షంబుగాఁగ రాజ్యంబు లేలి
చుట్టుపక్కలు నల్లూళ్ళ పుట్టఁజేసి
బ్రాహ్మణాశీస్సులను బొంది పరమపదముఁ
జేరినారు మున్ మీవారు, పేరుప్రోసి.

ఇట్టిమహనీయవంశంబున జన్మించి, మీ పూర్వుల పోకడల నీసడించి చరియించుట ధర్మమగునా ?

వేనుఁ: గౌతమా ! నీమాటలు గాదననేల ? నీచెప్పిన మాట లన్నియు నిజమనియే నమ్మెదను. ఇప్పుడీప్రసంగము వలన లాభ మేమియున్నది ? మాపూర్వులు తాము నమ్మిన ధర్మములను గట్టిగా నిలువఁబెట్టిరి. పూర్వా చారములన్నియు ననుసరణీయము లనియే మీరు చెప్పఁగల్గుదురా ? దేశకాల పరిస్థితులంబట్టి యాచా రములు మారుచుండవా ? తొల్లివారు విశ్వసించిన ధర్మముల వా రాచరించిరి: నేఁడు నేను విశ్వసించిన ధర్మముల నేనాచరించుచుంటిని. కాన న్యాయంతఃకరణప్రవృత్తికి విపరీతము లయిన ధర్మముల నారా జ్యమున నడుగుపెట్టనీయను. భూతదయకు విరుద్ధము లయిన పనులం జూచిన నాగుండె నీరై పోవును. నేను జూడలేను. మంచి కానీ, చెడ్డ కానీ నాయవస్థ యిది. మునీంద్రా! మాటలతోఁ బ్రొద్దుపుచ్చకుము. ఈయజ్ఞయాగములు లోకకల్యాణార్థమని సిద్ధాంతీక రింపఁ బ్రయత్నింతువా ? లేదా ? కాలయాపన సహింపను.

గౌత : ఇటు కూర్చుండుము_చెప్పెదను. తొందరపడనేల ? రాజవు, మూయింటి కతిథివై వచ్చితివి. ఇంతమాత్ర మాతిథ్యము స్వీకరింపఁగూడదా ?

వేనుఁ: ఇంటికి వచ్చినవాని కాతిథ్య మీయవలయు నని

యిప్పటికిఁ దెలిసినదికాఁబోలు. నాకు మర్యాద లతోఁ బనిలేదు. మి మ్మేయలజడి లేకుండఁగాపాడు చున్న నా యాజ్ఞలయందు గౌరవముఁ జూపలేనినీవు నాయెడ గౌరవముఁ జూప నేల యత్నింతువు?

గౌత : వేనరాజా! యే కారుకోనలోనో యే మారుమూలనో పారుటాకులయిండ్లలోఁ గాపురముఁ జేయుమాకు నతిథి, యభ్యాగతిపూజలుక్రొత్తలుసుమా! ఎందుల కొకరి నొకరు వేళాకోళముఁ జేసికొనుట? నీ వడిగిన ప్రశ్నకు సమాధాన మిత్తును; శ్రద్ధాళుఁడవై వినుము.

వేనుఁ: సిద్ధముగ నుంటిని; విన్పింపుము.

గౌత : ఎఱుంగుదువుకాదే మేఘములు ధూమయోనులని పిలువంబడుట.

వేనుఁ: ఎఱుంగుదును. అయిన?

గౌత : ధూమయోనులనఁగా ధూమముచేఁ బుట్టింపఁ బడునవి.

వేనుఁ: ఏధూమముచే?

గౌత : యజ్ఞధూమముచే.

వేనుఁ: ఇతరధూమముల కేల యన్వయింపదు?

గౌత : యజ్ఞధూమమునందున్న మహాశక్తి వానియందు లేదు గావున.

వేనుఁ: ఎవరు దీనిని గనిపెట్టిరి?

గౌత : ఆర్యఋషులు; త్రికాలజ్ఞులగు ఋషులు వెల్లివారని

తలంచుచుంటివా ?

వేనుఁ: ఋషులు వెట్టివారని నే నెన్నఁడును దలంపను. కాల చక్రము నెదురు త్రిప్పనేర్తురు. ఋషులే మాబోంటను మూర్ఖులని తలంతురు. ఎందుల కీగొడవ, నీవు చెప్పఁదలంచుకొన్న దేదియో చెప్పరాదా ?

గౌత : మేషములు ధూమయోను లగుటచేతనే మీ శ్రేయస్సు గోరు మేము మీ యాజ్ఞాతిరస్కారముఁ జేసియైనను యజ్ఞములు చేయఁబూనితిమి.

వేనుఁ: కారణము?

గౌత : కారణమా? కఱువు రాకుండుటకుఁ బొడిపంటలుమూలము, పొడిపంటలకు వఱిపులేమి మూలము, వఱిపు లేకుండుటకు వానలు మూలము, వానలకు మేఘములు మూలము, మేఘములకు ధూమవముమూలము, ధూమమునకు యజ్ఞములు మూలము.

వేనుఁ: యజ్ఞములకు ఋషులు మూలము, ఋషులకుఁ గుటీరములు మూలము, కుటీరములకు నాశ్రమములు మూలము, సరిపోయినది, నీవాదము నెగ్గినది, నాసంధియము దీరినది. ఇంకేమి వలయును? కాని గౌతమా! యెవ్వరితో మాటాడుచుంటివో యించుకంతయైన నీకు బోధపడలేదా? మహావిదుషీమణియు, సదసద్వివేకసంపన్నయు, సృష్టి రహస్యజ్ఞానచతురమతియు నగు సునీథాదేవిచే బోధింపఁబడిన వేనుఁ డీకుతర్కమునకుఁ జెవియొగ్గుననియేనా నీనమ్మకము? పొగచే

మొయిళ్ళు, మొయిళ్ళచే వానలు, వానలచేఁ బాడి పంటలు, పాడిపంటలచేఁ గాటకము తొలఁగుట: తనూజులమున యజ్ఞములు లోకకల్యాణప్రదాయకములు. మేలు మేలు! నారాజ్యంబున యజ్ఞయాగములు సూన్పింపఁబడి యెన్నినాళ్ళయినదో యెరుంగుదువా? నాఁటనుండియు నేఁటిదనుక మేఘములు కంటంబడుచునే యున్నవే. ఇవి పొగచేఁ గల్పింపఁబడిన మేఘములు కావా? ఈ జన్నంపుఁబొగ మొయిళ్ళను సృజించునో, లేదో కాని యజ్ఞాస్త్రమంబుల నన్నిఁటిని నల్లూళ్ళను జేసివైచుచున్నది.

జన్నంపుఁబొగమంచు చదలు గప్పకయున్న
నెల మూఁడువానలు నిలిచికురియు
విత్తనంబులఁ దెచ్చి, పెదజల్ల మోసెత్తి
ముక్కారుపంటలు పిక్కటిల్లు
అన్ని కారులయందుఁ గ్రొన్ననల్ గొనసాఁగి
విరితీవియలు పూలు, విరియఁబూచు
చవిగల్గు రుచిగల్గు, చాల కమ్మనిపండ్లు
పండ్లచెట్లు నెపుడు, పండఁగాయు
గరిక కలివేసు చిప్పర, కనుము మొలన
పచ్చిబీళ్ళపైఁ దిరుగాడు పాడిమొదవు
పాడియిచ్చును బొనలు పట్టకుండ
తొమ్మ మెఱుఁగవు నే నేలు సీమ లెల్ల.

పునశ్శేషుఁడు : వేనరాజా! నీవు చెప్పిన దంతయు నిజమే. కాని యిది యంతయు నీషన్మా సంస్థాపనప్రతిఫలం

బని తలంచుచుంటివా? యెంతవెట్టి? మీవంశము నలదలి ప్రేమచే నెంతమంది మానులు నీరాజ్యము నందలి కీకారణ్యములయందు నిల్చి యజ్ఞములు చేయుచున్నారో నీకేమి తెలియును? ఆయజ్ఞయాగ ములే లేకయున్న నీరాజ్యమింత సుభిక్షముగా నుండ వచ్చేనా?

వేనుఁ: ఓహో! శునశ్శేఫా! క్రొత్తవింతలు దెలుపు చుంటివి. మీరెంతకైనను దగుదురు. ఈవిధంబుగ దొంగ జన్నంబులు చేయుఋషులింక నా రాజ్యంబున నున్నారుగా. ఇందు నే నాలసింపరాదు. నారాజ్య మెల్లఁ గ్రుమ్మరి యట్టి వేమయిన నున్నచో వెంటనే మాన్పింపవలయును. శాసన ధిక్కారమెంత చుల కనయైనది. గౌతమా! యొకమాటఁ జెప్పుచుంటిని. నీ బూకరింపుమాటలతో లాభ మేమియునులేదు. మాటలం జెప్పి నన్ను మోసగింపనేరవు. నే నంగ రాజ్యసింహాసనం బధిష్ఠించినప్పటినుండియుఁ గఱవు లేదు, వఱపులేదు. ధర్మసంస్థాపనాపటిష్ఠం బైననా ద్రాఘిష్ఠ ఖడ్గ ధారాధాళధళ్యమును జూచి జార చోరులు పరసీమలకు దారితీసిరి. పౌరులు పిక్కబెదరు లేక తమతమ కార్యములయందు నిమగ్నులై యున్నారు. క్షుధాతురు లెందుఁ గనరారు. జాన పదులుసైతము ఓమ్మ్రొక్కఁ జేయిడికొని, భయము లేక హాయిగా నిదురించుచున్నారు. ధృష్టవర్మా! యీ గౌతముని వితండవాదమువల్ల ప్రయోజన

మేమియును లేదు. ఆలసింపకుము. ఆ రావిపేళ్ళాఱిక కాలిపోవ్రుచున్నవి. యజ్ఞగుండమును జల్లార్చివైవుము. భగవంతుఁ డొకఁడున్నచో నోరు వాయిలేని యీ మేకమాంసమును గోరునా ?

శున : వేనరాజా ! నీ తండ్రితాతలు, ముత్తాతలెఱుంగని ధర్మసూక్ష్మము లెఱిఁగితివి. అహో ! మేధావిశే షము. ఈ పశువిశసనము దేవప్రీత్యర్థము కాదు.

వేనుఁ: క్రొత్తదారి త్రొక్కుచున్నావే ? కాకున్న మఱి దేనికి ?

శున : ఋషులు స్వార్థపరులు గారనియుఁ, బరార్థజీవను లనియు నెఱుంగుదువా ?

వేనుఁ: ఎఱుంగ కేమి ? ఎఱుంగుదును. అయిన ?

శున : ఈ యజ్ఞముచే నీ యజ్ఞపశు వుత్తమపదంబును బొందును.

వేనుఁ: మఱి యజ్ఞకర్తయో ?

శున : అతండును నుత్తమలోకప్రాప్తిఁ గాంచును.

వేనుఁ: ఓహో ! యిదియా పరార్థజీవనము ? మేలు ! ఋషు లింత పరార్థజీవనులే యగునెడల నింకొక్కపనిఁ జేయరాదా !

శున : ఏది యాపని ?

వేనుఁ: మీకులపతియు, గురువున్నైన యీ వృద్ధగౌతముఁడు నిన్ను యజ్ఞపశువుంగాఁ జేసి, యీ యజ్ఞమును ముగించినచో లోకమెంత సంతసిల్లును ? ఒక్క

యజ్ఞముచేతనే గురుశిష్యులిరువు రుత్తమలోకంబును
బొందఁగల్గుదురుగదా ? మీ జాతికైనను జెందని
యీ మేఁకకు సద్గతులు కల్పించుటకంటెఁ జిన్న
నాటనుండియుఁ గొలిచి సేవించుచున్న నీకు నుత్తమ
లోకంబు కల్పించుట సమంజసముకాదా! గౌతమా!
దీనికి నీవేల యెడఁబడవు ? ఇందుఁ దప్పేమున్నది ?

శ్లేష్ట: దేవా ! యీశునశ్శేఫుని యూపంబునకుఁ గట్టి
వైతునా ? శునశ్శేఫా ! యింత చవుకగా నుత్తమ
లోకంబులు కల్గుచున్నపుడు నీ వేల యూలసింతువు ?

వేనుఁ: ఆతండు యజ్ఞపశు వగుటకు నిష్టపడినప్పుడుకదా
యూపంబునకుఁ గట్టివెచుట. శునశ్శేఫా ! యింత
కును జెప్పవైతివి, యుత్తమలోకము లనఁగా నేమి ?
స్వైరవిహారము, సురాపానము, వృద్ధవేశ్యానితాజ
నతాపాంగవీక్షణము లేనా ?

గౌత : విశ్వాసమేలేని నీకు వీనితోఁబనియేమి ?

వేనుఁ: తెలిసికొన్నపిదప నైనను విశ్వాసము కలుగవచ్చును
గదా. దయయుంచి తెల్పుఁడు.

శున : ఇవి కొన్ని.

వేనుఁ: మిగిలినవి ?

శున : ఎందుల కీయెక్కసక్కియములు ?

వేనుఁ: ఎక్కసక్కియము లేమి ? ఇవియే యైనచో నీభూలో
కంబున నొరకవా ? విచ్చలవిడిఁ దిరుగరాదా ?
గొంతుబంటి తార్కరాదా? ముదుసలిపడుపుఁగత్తెల

కొగిళ్ళం గులికి కులికి లాలాదరింబును జవిచూడ రాదా ? స్వార్థపరత్వబుద్ధిచే నొక్కడిక్కుమాలిన జంతువునుజంపి యుత్తమలోకమును బొందయ త్నించుట మానవుఁడు చేయుఁదగిన కార్యమేనా ? పరలోకము లున్నవోలేవో ? ఉన్నచో నవియుత్తమ లోకము లగునోకాదో? అగుచో నేమేఁకను నగ్నిలో వేల్చితిన్నంతమాత్రమున నవిచేఁజిక్కునో చిక్కవో; ఇట్టి సంశయాస్పదము లగు పరలోకసౌఖ్యముల కాశించి భూతదయ నుజ్జగించి పరహింసఁ బొనరించి మూర్ఖుండ వేలయయ్యెదవు ?

శున : ఇది వికత్థనము, అధిక్షేపము, దుస్సహాము.

వేనుఁ: నామాటయే నీకు దుస్సహ మైనప్పుడు, నిండు ప్రాణముతోనున్న యొక్క సాధుమృగంబును నవ రంధ్రము లు బిగించిపట్టి, బగ్గుబగ్గున మండుమంటలో వైచి కాల్తుగన్నచో నేపడు మనోవేదన యెవ్వఁ డొనుంగనేర్చు ? శునశ్శేపా ! లే లెమ్ము, యజ్ఞము మాని సర్వభూత సమభావుఁడవు కమ్ము. ఈ వృద్ధ గౌతముని మాటలువిని మతి చెడఁగొట్టుకొనకుము.

గౌత : ఈ పరుషవాక్యములు కర్ణశూలములును, మనశ్శల్య ములును.

వేనుఁ: ఈ కల్లకన్నీటిబొట్టు లేటికి ? నిరంతరము ముసలివలె కన్నీరేల కార్చెదవు ? ద్విజేతరుఁడు వేదంబును విన్నంతమాత్రమునఁనే కర్ణరంధ్రములఁ గరగించిన సీసమును బోయు మన్నప్పుడు నీ మన స్సెట్లుండెను ?

ఎందుల కీ కపటావేదన ?

శున : వేనరాజా ! ఎంత యధికార మున్నను, ఆ యధికార మెంత యప్రతిహత మైనదైనను, ఇంత విశంకట ముగా సంచరింప ధర్మముగునా ? ప్రజలను గాపాడి, తెలిపి సన్మార్గమున నడిపింపనలసిన మహారాజవు, పూజ్యులగు నార్యబుషులచేఁ బ్రయుజ్యమానము లయిన యజ్ఞములు మాన్పి నరకలోకగంతవ్యుఁడ వేల యయ్యెదవు?

వేనుఁ: శునశ్శేషా ! బుషు లెట్టికార్యములు చేసినను వాని కిం దలయూపకున్న నరకలోకమునకుఁ బోవలసిన దేనా ? ఎందుచేత !

శున : వారు పరార్థజీవనులు గాన.

వేనుఁ: తాము త్తమలోకమును బొందఁగోరి యే జంతువునో యగ్నిగుండమున వేల్చుట, పరార్థజీవనుల లక్షణ మేనా ?

శున : బుషితిరస్కారము నరకలోకమునకు దారితీయును.

వేనుఁ: ఎచ్చట నున్నది ? ఎంత దూరములో నున్నది యా నరకలోకము ? నీవుగాని, నీ గురుపరంపరలో నెవ్వ రయినఁగాని యెప్పుడయినఁ జూచివచ్చితిరా, మాటి మాటికి నెఱిఁగియున్నట్లు మాటలాడుచుంటివి.

గౌత : రాజా ! నీ నాలుక చీలిక గాకున్నది. ఎట్టెట్టి మహా నీయుల నిందించుచున్నావు.

వేనుఁ: మీ రే కోరిక యైనను గోరుకొందురుగాని, యీకోరిక మాత్రము గోరుకొనకుఁడు. నా నాలుకయే చీలిక

యైనచో నాభీలవ్యాళమ నయ్యెద. అప్పుడు మఱింత భయంకరుండగా నుందును. దయయుంచి నన్నీ రూపమునసే యుండనిండు. నీ తపశ్శక్తిగూడ వ్యయము గాకుండు.

శున : ఈ యెత్తిపొడుపులత్తో మన స్నారాటపడు చున్నది. వేనరాజా ! యెవ్వ రడ్డుపడినను నీకుమాత్రము నరకము దప్పదు.

వేనుఁ: ఒక రడ్డుపడుట యేల ? నేనే పోదును, బోవలసిన యగత్యము కల్గుచో. కాని యచ్చట మీవంటి ఋషులుగాని, యిటువంటి కటికదుకాణములుగాని, యిటువంటి ధర్మపీడలుగాని యుండునా ?

శున : మీవంటి ఋషులచ్చట నెందుల కుందురు ?

వేనుఁ: మీవంటి ఋషులే యచ్చట లేకున్న నేను గాపురము పెట్టుటకు నాక్షేపణ మేమియుండు ? నాకుఁ బరమ సమ్మతము. స్వర్గమున నీవంటి ధర్మదూరుల పొత్తునఁ బడియుండి, మనోవేదనఁ బడుటకన్న మీరులేని నరకమున నొంటరిగ నుండుట మేలు కాదా ? ఇన్ని యజ్ఞపశువులు, యజ్ఞగుండమునఁ బడకుండఁజేసి ప్రాణదానముఁ జేయుచున్న నేను నరకలోకమునకుఁ బోయినను మేలేయగుఁగాక, ప్రాణపరిదానమునకుఁ బ్రతిఫలంబు నరకలోకమా ? ఎవ్వరు నా కీ నరకలోకిము నిచ్చినది ?

శున : భగవంతుఁడు.

వేనుఁ: ఎవ్వాఁడీ మహానుభావుఁడు ? ఈయన ప్రకృతియేమి?
ఇంతవఱకెప్పుడును నా రాజ్యంబునఁ గన్పట్టలేదే!
ఇంతకుఁ జెప్పవైతివి: యీయన యుద్యోగ మేమి ?

శున : సర్వాంతర్యామి, సర్వప్రపంచసృష్టి స్థితి లయ హేతు భూతుఁడు. దుష్టుల శిక్షించుట, శిష్టుల రక్షించుట యీయనయుద్యోగము. అహోరాత్రము లీ ప్రపంచ ములఁ గనిపెట్టికొనియుండు.

వేనుఁ: పాపమెంత బాధపడుచుండునో నిద్రాహారములు మాని, రేఁబవలు కనిపెట్టికొనియుండి. ఈ మహా మహుఁడేనా నాకు నరకలోకము దానము చేయునది? జీవహింస సల్పుచున్నందులకు మీకు స్వర్గము, దానిని బొపుచున్నందులకు నాకు నరకము ! ఈ దేవుని మీరు క్రొత్తగా సృజించినట్లున్నది. ఈ మీ దేవుఁడు తన ధర్మమునుగూడ మఱచువాఁడుగ నున్నాఁడు. ఎంతమంది దుష్టులు శిక్షను దప్పించు కొని పోవుచున్నా రీలోకమున? ఎంతమంది శిష్టులు శిక్షింపఁబడుచున్నారు.

గౌత : కటకటా! భగవానుఁడు కూడ నీ పరిహాసమునకుఁ బాత్రుఁ డయ్యె. నీకుఁ బ్రాయశ్చిత్తమే లేనట్లున్నది.

వేనుఁ: నాకుఁ బ్రాయశ్చిత్తమే లేనట్లున్నది; నీకుఁ జిత్తమే లేనట్లున్నది.

గౌత : ఏమేమి ?

వేను: ఏమున్నది ? ఒకరికిఁ బ్రాయశ్చిత్తము, నింకొకరికిఁ జిత్తము లేనట్లున్నది. లేనిచో దృగ్గోచరుఁడు కాని వాఁడును, భూతవులచే సృజింపఁబడినవాఁడును సృష్టి స్థితి లయకారకుఁడేమి ? సృష్టిస్థితిలయములు స్వభావ జన్యములుకావా ? మన కంటికిఁ గన్పట్టుట లేదా ? పుట్టినది గిట్టకున్నదేది ? ఇందులో భగవంతునకుఁ బెత్తనమేల ?

గౌత : పాపము శాంతించునుగాక ! దినదిన మిాలోకమున జరుగుచున్న కార్యక్రమమునందు భగవంతునకుఁ బెత్తనమేలేదా ? ఏమిపాపముఁ జేసికొంటినో కాని యిట్టినూటలు వినవలసివచ్చినది.

వేను: తొల్లి నీవేమి పాపముఁ జేసితివో యెవ్వఁ డెఱుఁగు? నేఁడుసూత్రము యజ్ఞమిషంబున మహాపాపంబును మూఁటఁ గట్టుకొనుచున్నావు. ఇది యటుంచుము. నీవు చెప్పిన చొప్పున భగవంతునకు నీ ప్రపంచమున నిత్యము జరుగుచున్న కార్యక్రమమునందుఁ బెత్తనమే యున్నయెడల నిన్ని ఘాతకకృత్యము లేల జరుగును ? వీని నణంచలేఁడా ? ఎందులకు నణంచఁడు ?

శున : ఏమి విచిత్రమైన వాదముఁ జేయుచుంటివి ? నీ మాటల కెదురాడువారు లేరనియా ? మానవుఁడు కర్మప్రేరితుఁడై చేయుచున్న కార్యముల నెవ్వరు మాన్పఁగలరు ?

వేను: అయినచో భగవంతుఁడు నిష్ప్రయోజకుండా ?

శున : మహాపాతకమును మూఁటఁ గట్టుకొనుచున్నావు.

గౌత : నిష్ప్రియోజకుం డెట్టగును ? అతఁడు సర్వకర్మము లకు సాక్షి.

వేనుఁ: కూటసాక్షియా ? ఎందుల కీసాక్షిత్వము ? తనకళ్ళెదుట జరుగుచున్న కూరకర్మల మాన్పనేరక సాక్షి యగుచున్నాఁడా ? ఏమి చిత్రము ! ఈసాక్ష్య మెవ్వరి యెదుట నుపయోగపడును ? ఎవ్వరికిఁ బ్రియోజన కారి యగును ? విచారణకర్త యెవ్వరు ?

గౌత : నీవు పాషండుఁడవు: నీకు సుగతులు లేవు.

వేనుఁ: లేకపోయినఁ బోనిమ్ము. "మాటిమాటికి నీకు సుగతులు లేవు, నరకమునకుఁ బోదువు" అని బెదరింతువేల ? నీబెదరింపులు దుర్బలహృదయునిఁ గలఁగింపనోపు. నావంటివానిని గాదు. లోకముఁ గన్గప్పి, మీదుర్వ్యవసాయమునకుఁ దోడ్పడ భగవంతు నొకని సృజించి లేనిపోని సర్వశక్తులు వాని కంటఁ గట్టి జగమును నుట్టూఁతలూపయత్నించుచుంటిరి. మీకా సుగతులు, నాకా లేనిది ?

గౌత : మహాపాతకహేతువులగు నీమాటలు వినఁజాల.

వేనుఁ: చేయఁగల్గుదువుకాని వినలేవు. నిజముగ నీవు సృజించిన భగవంతుఁడు కాఁడా ? నీయవసరము కొలఁది నీ భగవంతుని యవతారము లెత్తించలేదా ? వేషభాషాదులు మార్చలేదా ? ఒకప్పుడు నిరాకారుఁడంటివి, ఒకప్పుడు సాకారుఁ డంటివి; ఒకప్పుడు భీకరాకారుఁ డంటివి; ఒకప్పుడు వికారుఁ డంటివి; ఒకప్పుడు నరమాంసము; వేఱొకయప్పుడు గో

మాంసము; ఇంకొకప్పుడు మృగమాంసము; మఱి యొకప్పుడు ఫలపత్రపుష్పాదులు భోజ్య మంటివి. నీ బుద్ధిభ్రమణముతోఁ బాటు భగవంతుని యాకార భాషాభూషా విశేషాదులు మాఱలేదా ? మాఱు చుండుట లేదా ? ఏల సత్యమును మఱుఁగుపుచ్చె దవు ?

గౌత : వేనరాజా ! నీవు నాస్తికుఁడవు. నీతోఁ బ్రసంగమే పాపహేతు వగును. ఈ యాశ్రమము వీడిపొమ్ము - మగిడి యెన్నండు నీయాశ్రమముగడప దాఁటి లోనఁ బ్రవేశింపకుము.

వేనుఁ: నేను నాస్తికుఁడనైన లోకమునకుఁ గల్గు నష్టమేమి ? నే నేమయిన లోకద్రోహముఁ జేయుచుంటినా, లోక ప్రతారణముఁ జేయుచుంటినా ? పరహింసాచరణము నకుఁ గడంగి లోకమును దుఃఖభూయిష్ఠముగాఁ జేయు చుంటినా ? నాస్తికతయే పాపహేతు వంటివి. పాప మనఁగా నేమి ?

గౌత : పాప మనఁగా నేమి ! ఇంతవఱకు వచ్చినది. పాప మనఁగా నేమియో యెఱుంగవైతివి. ఇందుచేతనే యింత నిరంకుశప్రవర్తనుఁడ వైతివి. ఈ ప్రజా సౌభాగ్య మిఁక నీచేతం బడి నలిగిపోకుండునా ?

వేనుఁ: గౌతమా ! అడిగినదానికి నేలప్రత్యుత్తర మీయవు? ఈవిధంబుగనే శిష్యపరంపరకు బోధించుచుంటివా ? మేలు మేలు, ధృష్టవర్మా ! యగ్నిగుండమును జల్లార్పివైచితివికదా.

ధృష్ట: చిత్రము దేవా! శునశ్శేపునిమాటఁ జెప్పనైతిరి. యూపంబునకుఁ గట్టివేయుమందురా?

వేనుఁ: నీ ప్రశ్నకుఁ బ్రత్యుత్తరము కులపతి చెప్పఁదగినది. ఇక నీవై తండికునిత్రోఁ బ్రబసంగించి లాభములేదు. నిదుర పోయినట్లు నటించు నానిని మేలుకొల్పుట యెవ్వనికి సాధ్యమగును? మగిడిపోదము [ఒకపొడల జింక పిల్ల వేనునికాలు రాచుకొనుచుండును. వేనుడు చూచి] శునశ్శేపా! ఎక్కడిది యీ కృష్ణసారశాబకము? మానవునికిఁ జాల మచ్చిక పడియున్నది. ఎరుగదుఁ మానవుని ప్రకృతి.

శున : ఆశ్రమమునఁ బెరుఁగుచున్నది.

వేనుఁ: ఎందులకుఁ బెంచుచుంటిరి. అహో! మఱచితి, మఱచితి. కృష్ణసార మాంసము ఆర్యబుషులకుఁ జాలరుచ్యముగ నుండునుగాదే. ఇది పోతరించిన పిమ్మట భోజన భాజన మగునుగాఁబోలు. కానిదీనిది మొండియాయువు. లేకున్న నాకంటఁబడదు. ఈ పొడలెంత మురువుగా నున్నవి. ఇదియెంత ముద్దుఁ గొల్పుచున్నది! ధృష్టవర్మా! నేనుదీనిని గొంపోయి సాకెదను. వంటయిల్లు చొచ్చినకుండేలు తప్పించుకొని పోవుచున్నది. శునశ్శేపా! యేల యట్లుదిగులుపడి చూచెదవు? ఒక్కపూట నీ మాంసములేనంతమాత్రమునఁ నే ప్రాణమునిమ్మాదికి రాదులే.

గౌత • ఆర్యబుషులతోడి పరిహాసములు ఆయుఃక్షీణ హేతువు.

వేను: గౌతమా ! యెంతకాల మీ బెదరింపులు ? కడసారి మాట జెప్పుచుంటిని వినుము. నీ వెట్లేగి యెట్లేగి శాసన తిరస్కారము గావించితివి. ఇది ప్రథమతిర స్కార మగుటచే మందలింపులతో ముగిసినది. ఇట్టి దియే మరల వాటిల్లినచో వేను డతిప్రచండ శిక్షా ప్రదాత యగును. ధర్మాపేక్ష నతడు మన్నింపడు. ఇంక నే నిందుండరాదు. ఒక్క హితోపదేశమును జేసిపోయెదను. ఈ చిన్నవటువుల కిప్పటినుండియు మాంసము భుజింప నేర్పవలయునా ? నేర్చుకొన వలయు నన్నచో గావలసినంత కాలమున్నది. మాంసమును మాన్పి ప్రపంచమును దుఃఖభూ యిష్ఠము గాకుండజేయలేవా? ఆలోచించుకొనుము. నేఁ బోయివచ్చెద. ధృష్టవర్మా ! ఈ జింకపిల్లను నీవు తీసికొని బయలుదేరుము, పోదము. [నిష్క్రమింతురు]

మొదటి రంగము

ముగింపు

రెండవరంగము

[రాజమాత సునీథాదేవి; గౌతముఁడు.]

గౌత : తల్లీ ! హృదయమువిప్పి చెప్పుచుంటిని. అంగరాజు మరణము నేఁటికి మాకుఁ గొంగొత్తదియై దిగులు గొల్పుచున్నది. భావికాలము గాఢాంధకార మయం బైమాకు విషాదభూయిష్ఠంబుగ నున్నట్టు పొడకట్టు చున్నది. ఏమని చెప్పనేర్తును. ప్రశాంతనిలయంబు లయిన మా యాశ్రమంబు లల్లకల్లోలమయినవి. పర హింసా పరాజ్ఞులయిన పరమతపోధనుల డెందం బులు తల్లడిల్లినవి. ఆశ్రమవాసు లా బాలగోపాల మెంత సంక్షోభపడిరో భగవంతుఁడెఱుఁగు. పరమ పూజ్యుండగు నంగరాజు రాజ్యంబున మాగతు లిట్లయినవి. ఈ దీనుల మొఱలాలింతు రేమోయని పడుచు లేచుచు నిచ్చటికి వచ్చితిని.

సునీథాదేవి : గౌతమమునీంద్రా ! మావేనుఁడు రాజ్యముఁ జేయుచున్న కాలములోనే యిట్టి దుండగములు వాటిల్లినవా ? పరమసాధువులగు మీకే కడగం డ్లిట్టిపడినవా ? ఏమి దుర్గతి ! మా వేనుఁడెక్కడ నున్నాఁడో ! ఏమి చేయుచున్నాఁడో ! అతఁడు పరిమత్తుఁడు కాఁడే ? కుడిచినచోటఁ బండక పండిన చోటఁ గుడువక రాజ్యమెల్లను దీనజనావనార్థమై యెల్ల పొద్దులఁ గుమ్మరుచుండును.

గౌత : తల్లీ ! కంచెయే చేను మేయుటకుఁ బూనుకొన్నది.

సునీథా: కంచెయే చేను మేయుటకుఁ బూనుకొన్నదా ? యేమీ ! మా వేనుఁడాశ్రీమవాసులగు ఋషుల యెడ నపచారముఁ జేసెనా ? చిత్రము. చలిచీమ నైనను జావఁదొక్కనేరని మా వేనుఁడు, పై కుఱుక నున్న క్రూరశరీరుఁడైనను బాణమునఁ గొట్ట నొల్లని మా వేనుఁడు, పసితనంబు నుండియు నుగ్గు బాలతో రంగరించి పోసిన భూతదయా రసంబుఁ ద్రావి పెరిగిన మా వేనుఁడు, బీదసాదలఁ దోడులేని వారఁ బ్రోవ బద్ధకంకణుండయిన మా వేనుఁడు పరహింసాపరాఙ్ముఖులయిన ఋషులయెడ నప చారముఁ జేసెనా? ఏలొకో నామనస్సు నమ్మఁజాల కున్నది. ఎవ్వరో పొరపడియుందురు. ఎచ్చటనో పొరపాటు జరిగి యుండవలయును.

గౌత : మీకేల యిట్టిసంశయము కలిగెనో తెలియఁజాలను. మా పురాకృతఫలంబు గాఁబోలు. పొరసాఁటెందును, నెవరియందును లేదు. మా యాశ్రమంబులో మొన్న మే మజమేధమును జేయుచుండ నెచ్చటినుండియో పరుగు పరుగున వచ్చి, కులపతులు వలదని బతి మూలుచున్నను, వారిపలుకులు పెడచెవింబెట్టి, పట్టి యుంచఁబడిన మేఁకను వదలించి, యజ్ఞగుండమును జల్లార్పివైచెను.

సునీథా: గౌతమమునీశ్వరా ! సత్యమిప్పుడవగతమైనది. ఇది యేనా కంచెయే చేను మేయుట? పట్టియుంపఁబడిన

మేఁకను వదలించెను. అగ్నిగుండమును జల్లార్పెను. ఇంతియే. ఆశ్రమవాసులగు తపోధనులజోలికిఁ బోవ లేదుకదా ! నిజముగ నిది వేనుఁడు చేయుపనియే.

కాదనఁబోడు నాయెదుట
గట్టిగఁ జెప్పిన కార్యమెన్నఁడున్
వాదము లాడఁబోడు బుధ
వర్గముతోఁ నవ్వుఁగాదటంచు సం
వేదముఁ జూపబోఁడు పర
వృత్త మెఱుంగఁగఁగోరి కాని యీ
వైదిక ధర్మమన్నఁ బొర
పాటునవైనను మెచ్చఁడేమియున్.

మా వేనుఁడు చాలపాపభీతి కలవాఁడు. ఎట్టివానిని నైన, నెట్టి సమయంబునందైనఁ జెనకువాఁడు కాఁడు.

గౌత : ఎవ్వరో పొరపడియుందురంటిరి. ఎవ్వరు పొరపడిరో యిప్పుడు మీకు బోధపడుటలేదా ? మా యీ ఆశ్ర మంబుననున్న పరమపూజ్యులగు తపోధనులతో మహారాజు వితండ వాదంబుఁ గావించెను. వారలం గవిసి మాటాడి విసివించెను. తుట్టతుదకుఁ గఠోర స్వరంబున "ఒక్క-సమిధ యజ్ఞగుండమునఁ బడెనా యొక్క-శిరస్సు మింటి కెగురు" ననిబూకరించి చెప్పి యచ్చట నిలువక డబ్బాటుగా వెడలిపోయెను. తొల్లి మీవంశంబున ఋషులయెడ నింత విశృంఖ లముగా సంచరించినవా రెవ్వరైన నుండిరా ?

సునీథా: గౌతమ మునీశ్వరా ! మా వేనుని నే నెఱుంగునట్లు లొకు లెవ్వ రెఱుంగరు. ఏయే పరిస్థితులయందు నాతఁడెట్లు సంచరించునో నాకు బాగుగాఁ దెలి యును. ధర్మపీడ కండ్లారఁ జూచెనా మైమఱచి మాటాడుట యాతనివాఁజ. చిఱుతనాఁటనుండియు నాతఁ డట్టివాఁడే. ఎవ్వరి స్వభావంబు నెవ్వరు మాన్పఁగలరు ? మీ మనస్సులు నొవ్వకుండ నచ్చఁ జెప్పి తనపని దీర్చుకొనరాదా ? నొవ్వనాడుట యేల? మందలించెదను.

గాల : మీరుకూడ నిట్లు చెప్పుచుంటి రేల ?

సునీథా: నే నేమి కానిపూటఁ జెప్పితిని. కొన్నివిషయంబు లందు మావేనుఁడు దృఢాభిప్రాయంబులు కల వాఁడు. ఒకరిమాట వినఁడు.

గౌత : నట్టేటఁ బుట్టి మునిఁగినది. యజ్ఞగుండమును జల్లా ర్పుట, యజ్ఞపశువును దోలివైచుట, యజ్ఞవిఘ్నముఁ గావించుట తప్పులు గావనియేనా మీతలంపు ?

సునీథా: నాతలంపులతో మీకుఁ బ్రయోజన మేమియున్నది? మా వేనుఁడేమి తలంచెనో యదికదా మీకుఁ గావలసినది. అతఁడు మోఱకుఁడుగాఁడు, అతనికిఁ బుణ్యపాపజ్ఞాన మున్నది. దోషాదోష విచక్షణ యున్నది. అతఁడు మంచి చెడ్డ లెఱుంగును. కాని ధర్మసంస్థాపనవిషయమునమాత్ర మతండు మోమోటమి యెఱుంగడు. ఇట్టివానికి నేనేమి బోధింతును?

గౌత : ఇప్పుడు ధర్మసంస్థాపనవిషయమేమి వచ్చినది ?

సునీథా: యజ్ఞములు హింసాప్రపూర్ణములు గావున నవి
త్యాజ్యము లనియు; నందుచేఁ దనరాజ్యంబున
నయ్యవి జరుగఁగూడ దనియు నాతనిపట్టు. దీనికి
నే నెటు ప్రతిబంధకము గల్పింపఁగల్గుదును ?

గౌత : అయినచో మాకు దిక్కెవ్వరు? మాయజ్ఞ యాగంబు
లకుఁ దిలోదకములు వదలనలసినదేనా ? వేనరాజు
మొన్న మా యాశ్రమంబునఁ జిన్నబెద్దల తార
తమ్యంబు లేక, యద్దుపద్దులు లేక సంచరించెను.
శిష్టరక్షణముఁ జేయవలసిన రాజే యీవిధంబుగ
సంచరింప మాగతి యేమి ?

సునీథా: శిష్టరక్షణఁ జేయుచుంటి ననియే మా వేనుని యభి
ప్రాయము. హింసామూలకము లయిన యజ్ఞములు,
యాగములు, త్యాజ్యములనియు నపరిగ్రాహ్యము
లనియు, వానిని నాచరించువారు శిష్టులు గారనియు
మా వేనుని వాదన. నేను జెప్పఁ గలదానినే కాని
విన్పింపఁగలనా ?

గౌత : అయ్యో! ఇంకేమి యున్నది? అగ్గికి గాలితోడైనట్లు
వేనమహారాజునకు నాతని సైన్యాధిపతి ధృష్టవర్మ
తోడైనాఁడు. రాజునకుఁ దగినబంటు, క్రూరస్వభా
వుఁడు. మొగమెత్తి మమ్మేఁ జూడకయే యగ్ని
గుండమును "నుఫ్" అని యూదివైచెను.

సునీథా: అట్లయినచో ధృష్టవర్మ తన సేవాధర్మమును
జక్కగా నెఱవేర్చెను. నమ్మఁదగినబంటే.

గౌత : సునీథాదేవి ! ఇంక నంగరాజ్యంబునకుఁ దొలంగి

మేము వలసపోవలసినదేనా? అంగరాజ్యంబున ఋషు
లకు నిలువ నీడయేలేదా ? తలఁ దాఁచికొనుటకు
జేనెడుచోఁటులేదా? అరణ్యములయందు వన్యమృ
గంబులకరణిఁ దిరుగుటకునైన ఋషులు నోఁచు
కొనలేదా ? ఏనాఁటవచ్చితిమో యిచ్చటకు, నేఁటి
కీయిక్కట్టులు వాటిల్లినవి. అతిపూజ్యులును, వయో
వృద్ధులునగు కులపతులు నలుగురు కష్టదుట నవ
మానింపఁబడిరి. ఇఁకమేము బ్రతికి ప్రపంచమునకుఁ
జేయునది యే మున్నది? రాజైయుండి వైదిక కర్మ
కాండను దిన్నఁగా జరిపించుటకు మాఱు, వంశపరం
పరగా వచ్చుచున్న యజ్ఞములకు విఘ్నమాపాదించు
చుండె. పూరట్టి కుమారునిపట్టమై, వాని కుమార్గ
మును, వాని ధర్మపీడలను సమర్థింపఁ బూనుకొనఁ
చుంటిరి. మీవంటి సాధ్వీమతల్లికిది చెల్లదు. లోక
మంతయు నాగుబ్బగానేమి చెప్పుకొనుచున్నదో
మీ రాలకించుటలేదు. వేనరాజాకతాయ గాకున్న
మా మునిపల్లెలో నంత గందరగోళము జరుగునా?
తల్లీ! దీర్ఘముగ యోజింపుము. ఉభయులకు
శ్రేయస్సు కాదు.

సునీథా: మునీంద్రా! వాగ్గోరణి మార్చుచుంటిరి. బెదరించి
కార్యముఁ జక్కఁబెట్టుకొన యత్నించుచుంటిరా! ఇది
తప్పు. దీనివలన మీ కేమియు లాభము లేదు.

గాత : క్షమింపుఁడు. నా కా యుద్దేశము లేదు. మాకష్ట
నిష్ఠురంబులు చెప్పుకొనుచుఁటిమి. మహారాజవలం

బించిన నీతిచే మాకు సంభవించుచున్నకష్టగాథ లను మీాకుఁ దెల్పి మేలు పొందఁగోరు మేము బెద దించుచుంటి మని మీా రేల తెలఁపవలయును? ఇట్టిది సమకూడునా?

సునీథా: ఊరక మా వేనరాజును దూషింపకుము. నీాచే దూషింపఁబడఁ దగినవాఁడు కాఁడతండు. అతని యందు నధర్మముకాని, దౌర్జన్యముకాని యేమ యిన నున్నయెడల నన్ను దూషింపుము. దానికి నేనే కారణ మగుదును. అతనిమాట యెత్తకుము. అతని ప్రవర్తనకు నేనే యుత్తర వాదినని యెఱుంగుము:.

వేనుఁ: [తెరలో] తల్లీ! క్షమింపుడు. మీా రెట్లుత్తర వాదు లగుదురు? నేను జేయుచున్న ప్రతికార్యము నకు నేనే యుత్తరవాది నగుదును. [ప్రవేశించి] ఆ వేశమున మైమఱచితి. ఇదిగో! నమస్కారము గ్రహింపుఁడు.

సునీథా: కుమారా! దీర్ఘాయుష్మంతుఁడవగుదువుగాక.

వేనుఁ: ఇందనుక నేమి చెప్పుచుంటిరి? నాకార్యములకు మీా రెట్టి బాధ్యత వహింతురు? శైశవమునుండి విద్యా బుద్ధులు గఱపితిరి. సదసద్వివేకము గల్గించితిరి. ధర్మా ధర్మనిరూపణశక్తి యలవఱచితిరి. దోషాదోషవిజ్ఞా నము సంఘటించితిరి. అంతవఱకే మీాసంబంధము. ఆవల నాకుఁదోఁచినరీతి ధర్మసంస్థాపనార్థంబు కొన్ని నూతనమార్గములు ద్రొక్కితిని. ఏ తత్కార్యఫలము

నకు సంపూర్ణముగా నేనే బాధ్యుఁడను. నాయందే మయిన మంచియున్న దానికిఁ బ్రతిఫలంబుగా నీకు సద్గతులు గలుగునుగాక. ఇంతకు నేను జేసినయప రాధ మేమి? గౌతమా! యిక్కడ నేదియో తంత్ర మును బన్నుచున్నట్టులున్నది.

గౌత : వేనరాజా ! ఇంతయావేశముతోడను, ఇంతయాక్రో శముతోడను మాటాడవలసిన యవసరమిప్పుడేమి కల్గి నది ? నాఁడు మా యజ్ఞగుండమును జల్లార్చి, మా యజ్ఞ విధ్వంస మాచరించితివి. ఆగోడు రాజమాతకు విన్నవించు కొనుటకై వచ్చితిని. దిక్కున్నచోటు నకుఁ బోవ్రట యెల్లరకు సహజముకదా ? దీనికై నీ వింత యుదుటుమాటలు మాటాడనేల ?

వేనుఁ: రాజమాత రాజ్యకార్యములయందు జోక్యము కలుగఁజేసికొనదని నీ వెఱుంగవా ? గృహచ్ఛిద్ర ములఁ గల్పించి మమ్మలజడిపాలు సేయుతలంపున వచ్చితివా ? అట్టిదేమియు నిందుజరగదు.

గౌత : ఇది రాజకార్యమా? మతవిధ్వంసము రాజకార్య మందువా? మే మేమయిన నీపరిపాలనఁ బ్రతిఘటిం చుచుంటిమా ? నీవు రాజవు కాదని వాదించు చుంటిమా ?

వేనుఁ: గౌతమా ! మతవిధ్వంస మని చెప్పి గొంతెత్తి గగ్గోలుపెట్టెదవేల ? మతము లేకున్న మానవునకు ముక్తిలేదా ? మోక్షములేదా ? నిర్వాణములేదా ? సంసారబంధ విమోచనుండు కాఁజాలఁడా? మతము

పేరిట నెంతమంది యొకరికొక్క లొకరు నులిమివైచు కొనుచుండిరి. మతములే లేకున్న నీ ప్రపంచ మింత బహుళ దుఃఖా కీర్ణముగా నుండునా? మిథ్యాకలహాము లకుఁ బరస్పర మారణములకు మతమే తోడ్పడుచుం డుట మనమెఱుంగమా? మతమును నడ్డముగాఁ జేసి కొని యజ్ఞమని యొక్కఁడు, యాగమని యొక్కఁడు, బలియని యొక్కఁడు, క్రొవ్వొక్కబడియని యొక్కఁడు దినదిన మెన్ని వేలసాధుమృగంబుల విశసించుచున్నా రు? ఈదిక్కుమాలిన యజ్ఞపశువుల రోదనధ్వానము లను విని విని నిలువున నీరై పోవుచుంటిని. ఒక్కమా రొక్కరోదనము నాచెవులంబడిన నాయొడలు జల్లరిం చును, పులకరించును. కంటినిండ నిద్దురగాని, కడుపునిండఁ గూడుగాని యెఱుఁగుదునా నేను? గౌతమా, పదిజీవులను జంపియొకజీవిని బోషింతు ననుటకంటె నొక్కజీవిని జంపి పదిజీవులను బోషిం తుననుట యుత్తమము కాదా?

గౌత : వేనరాజా! ఈ వెట్టివేదాంతమేమి? ఈ ప్రపంచ మంతయు బహుళహింసాప్రపూర్ణము. నీమాటలు సృష్టివిరుద్ధములు.

ప్రాణిహింస నీవు పనికిరా దందువే
హింసఁ జేయకుండ, నెవఁడు బ్రతుకు?
జీవరాసులెల్ల జీవించుచుండవే
జగతి నొండొరులను జంపి తినుచు.

ఈఁగను గప్ప, కప్పను బాము, పామును నెమలి,
నెమలిని వేటకాఁడు నిరంతరము చంపి తిని జీవించు
చుండుట లేదా? ఈ విధమున ననోన్యభక్షణమునఁ
బ్రపంచము వర్ధిల్లుచుండ నీవేమియో కుతర్కముచేఁ
గార్యమును సాధింపఁజూచుచున్నావు. ఈ నీయత్న
మేటి కెదురీదుట కాదా?

వేనుఁ: సృష్టిస్వభావమని చెప్పి, చతుష్పాదజంతుకోటి
ప్రవర్తనమే మానవునకు మేలుబంతిగా నిరూపింపఁ
బూనుట ధర్మమా? గౌతమా! నీవాదమే సమంజస
మగునెడల దీనికేమి సమాధానముఁ జెప్పెదవు?

అంగదను దూలు తోడేళ్ళు, నలమటించు
తిమితిమింగిలమ్ములు స్వజాతి దిగ్రమింగు—
ఇదియె నైసర్గిక మటంచు నెంచి నరులు
చంపి తినవచ్చునొకో- స్వజాతిజనుల.

పోతు పెంటి యనెడి పోర పొక్కటియె చతు
ష్పాదజంతువులకు, వావి లేదు;
నరుఁడుకూడ నిదియె నైసర్గిక మటంచు
నడచుకొనుట యెట్లు న్యాయమగును?

గౌతమా! నీవాదమును సంపూర్ణముగ నంగీకరించిన
యెడల నెట్టివిపరీతము లుద్భవించునో పరికించుము.
మానవులు క్రమముగా జంతుసంతానములోఁ జేరి
పోదురు. చదివితివి, చదివించితివి. కాని చదువుచే

నీ చిత్తప్రవృత్తి యేమియు మారినట్లు గన్పట్టదు.

జంతువులకు మానవులకు సరిసమాన
ములగు నాహారనిద్రాభయాదు లెందు
మానవున కధికంబు విజ్ఞానమొకటి
యందుచేతనే తారతమ్యంబు కలుగు.

గౌత : మహారాజా! నీవు చెప్పినది నిజమేయని భావింతము. మానవునకు విజ్ఞానధన మున్నది. పశుపక్షి క్రిమికీట కాదులు భగవంతుని ధ్యానింపలేవు: పూజింపలేవు: బహువిధంబుల సంప్రీతుని జేయలేవు. మానవుఁ డొక్కఁడే వీనిని జేయసమర్థుఁడు. భగవంతునికొఱకుఁ జేయుచున్న కార్యములను దుష్టము లదుష్టము లని నీ వేల నిర్ణయింతువు? అట్లు చేయుటకు నీ కధికార మెక్కడిది?

వేనుఁ: రాజున కధికారమే లేదా? నా రాజ్యములో నున్న ప్రజలసౌభాగ్యమును వర్ధిల్లఁజేయుట నా ధర్మము కాదా? పాపకార్యములు భగవంతునిపేరిటఁ జేసిన మాత్రానఁ బుణ్యకార్యము లగునా? ఇతరజంతువు లను బలిగాఁజేసి భగవంతునిఁ బ్రీతునిగాఁ జేసెదనని చెప్పుటకన్న ఆత్మార్పణముఁజేసి కృతకృత్యుఁడవు కారాదా? ఇదియే నీవుచేసిన యెడల మా కీ గొడవ యంతయుఁ దప్పునుగదా? జంతుముఖంబున భగవంతునిఁ బ్రీతుని చేతుననుట విజ్ఞానముకల్గు మానవుఁడు చేయదగినదేనా? కాన నీ యజ్ఞయాగ

ములు కట్టిపెట్టి పరార్థచింతకుఁడవు కమ్ము.

గౌత : ఎంతకాలము చెప్పినను యజ్ఞయాగములు కట్టిపెట్టు మన్నమాటయే కాని యొండు చెప్పనొల్లవు. నీ వాదము వినుచున్నకొలఁది మేము కన్నీఁటితో నంగ రాజ్యంబునకుఁ దిలోదకంబు లర్పించి పరసీమలకుఁ బోవలసివచ్చినట్లున్నది. తరతరంబులనుండి నిరంత రాయముగఁ దపము, జపము, దానము, ధర్మము, యజ్ఞము, యాగముఁ జేసికొనుచుఁ గాయగసరు లతోఁ గడుపు చిచ్చార్చుకొనుచు, నడవులయందు మునిపల్లెల నివసించుచుంటిమి. ఈ జీవనము మా కిఁక దుర్లభమా ?

వేనుఁ: గౌతమా ! ఒక్కప్రాణిహింస వలదంటినిగాని, మీ ప్రశాంతజీవనమునకు నే నేమి యవరోధముఁ గల్పించితిని. జపము వలదంటినా ? తపము వలదంటినా ? మీవిజ్ఞానధనమును వెదఁజల్లి లోకమెల్ల నిత్యకల్యాణము, పచ్చతోరణముగాఁ జేసి మీరానందించుఁడు: మమ్మానందపఱిచుఁడు. ఈ ప్రాణిహింసకు సుముఖుఁడ నగుటకు నెన్నిమాఱులో ప్రయత్నించితిని. నా కయితికాదయ్యె. ఒక్కయాక్రందనము వింటినా నాగుండె లవిసిపోవును. నే వినఁజాల. నాప్రకృతి యిది. తుదిమాటఁ జెప్పుచుంటిని. లోకము నా యాజ్ఞాబద్ధమై యానందమయమైనను గావలయును,

లేకున్న నే నీలోకమును బాసియైనను బోవలయును.
నాకు వేఱొండు తెఱువ లేదు.

సునీథా: కుమారా! అశ్లీలములు వచించుచున్నావు.

వేనుఁ: తల్లీ! మీ రెఱుంగనిది లేదు. "స్వధర్మే నిధనం శ్రేయః" అను నభియుక్తి పాటింపఁదగినది కాదా? ఎటిఁగి యెటిఁగియే యొకొ్కక్కయడుగు ముందు నకు వైచుచుంటిని.

సునీథా: నేఁడు గాకపోయిన, రేపయినను నీ మనోరథము నెఱవేరకమానదు.

వేనుఁ: ఓ యాశీఃప్రభావ మనంతము. ఈ వ్యర్థవాదముతో నగు పని లేదు. సెలవిప్పింపుఁడు: పోయివచ్చెద.

సునీథా: కుమరా! అప్రమత్తుండవై చరింపుము.

వేనుఁ: చిత్తము. [నిష్క్రమించును]

గౌత : నా కేమి సెలవిత్తురు?

సునీథా: వింటివికదా మహారాజు నిశ్చితాభిప్రాయములు. ఇఁక నేఁజేయునది యే మున్నది?

గౌత : అయినచో దిక్కులేనివానికి దేవుఁడే దిక్కు. నాకు సెలవా? పోయివచ్చెదను. [నిష్క్రమించుచు]

"లోకము నాయాజ్ఞాబద్ధమై యానందమయమైనను గావలయును"-నిజము! నిజము! మహారాజువాక్యము లేఁజూకు దారిచూపుచున్నవి. ఇందు మొదటిది జరుగ

రాదు. రెండవది జరిగి తీరవలయును. కానిచో మాకు భవితవ్యమే లేదు. అగునగు: సేనాపతి ధృష్టవర్మ యతిముర్ఖుఁడు. కాని యత్యంతసాహసి: ముందుచూపేగాని ప్రక్కచూపులేదు.

రెండవరంగము

ముగింపు

మూడవరంగము

[శునశ్శేపుఁడు బైరాగివేషమునఁ బితారుమీఁటుచు,
రాజవీథులయందుఁ దిరుగాడుచు.]

పుట్టిపుట్టకముండె విప్రుఁడు,
పూజనీయుం డొఁగదే
విప్రబాలుఁడు మాన్యుఁడొఁగద
వృద్ధుకంచెను దమ్ముఁడా !
శఠుఁడుసైతము విప్రుఁడొనెడ,
సర్వపూజ్యుం డొఁగదే
తెలిసి తెలియనివారిమాటలఁ జెవినిఁ
జేర్పకు దమ్ముఁడా !
కులములన్నిఁటిలోను వినరా
బ్రహ్మకులమే కులమురా !
బ్రహ్మకులమును మించినట్టిది
పాటిఁజూచిన లేదురా !
"బ్రాహ్మణో మమ దేవతా"యని
పరమపురుషుఁడు చెప్పఁడే ?
బ్రాహ్మణోత్తమ సేవఁజేసిన,
బ్రహ్మపదమే వచ్చురా !

[ధృష్టవర్మప్రవేశము.]

ధృష్ట : ఏమి యీ చిత్రము! మా మహారాజు రేయనక పగలనక, వానయనక వంగుళ్ళనక, దేశమెల్లఁ గ్రుమ్మరుచు బీదసాదలజాలిపాట లాలించి, లాలించి, పాలించుచున్నను ప్రాకృతజనంబునకు విశ్వాసము కుదురకున్నది. ప్రజలు నివురుగప్పిన నిప్పువలె నున్నారు. ఏవేళ బగ్గుమని మండిపడుదురో! నే నెంత జాగరూకుఁడనై నచ్చినట్లు రాజశాసనముఁ బ్రజలకు బోధించు చున్నను వినువారేలేరు. దినదినము విరోధులసంఖ్య హెచ్చుచున్నది. ఋషులెన్ని కపటో పాయములఁ బ్రజల రెచ్చఁగొట్టుచున్నారు! ఎప్పుడో నాప్రాణ మీమూఢుల చేతులలోఁ జిక్కక మానదు, కానీ చూతము.

శున :

లోకమంతయుఁ జిమ్మచీఁకటి
జిమ్ముచుండెను మేలుకో!
లోటుబాటులు దెలియకుండిరి
లోకపాలురు తమ్ముఁడా!
వర్ణధర్మము రాజధర్మము
వక్రమార్గముఁ ద్రొక్కఁగా
పాపపంకిలు లగుచునుండిరి ప్రజలు
నేఁటికిఁ దమ్ముఁడా!

ధృష్ట : ఏమి యీ పాట; ఎవ్వఁడో వీఁడు భీకరశాసనుండగు వేనునిశాసనంబుఁగూడఁ దిరస్కరించుచున్నాఁడే!

శున :

వర్ణధర్మము కూలిపోయెను,
వేదధర్మము కాలిపోయెను
రాజధర్మము వ్రీలిపోయెను,
రాజు రైతును నొక్కఁబేనట !
కానికాలము వచ్చె నేఁటికిఁ,
గర్మమిట్టులఁ బండిపోయెను
బ్రాహ్మణుండును నవరవర్ణుఁడు
ప్రాతచుట్టము లైరితమ్మ్నోఁడ !

ధృష్ట : ఓయి, యెవ్వారవు నీవు ?

శున :

బ్రహ్మ్మముఖముననుండి వచ్చెను
భరతవర్షం బంత చొచ్చెను
పరమపూజ్యం డయ్యె నేఁటికి
భావికాలం బెటుల నుండునో !

ధృష్ట : ఓయీ, ఎవ్వారవు నీవు ? పిలిచినఁ బలుకక పాడు చున్నావు. వేనరాజ్యంబున నీపాటలు పాడుటేమి ? ఈపాటలు పాడుచున్న నీతల యీపాటికే యెగిరి పోవలసి యున్నది.

శున : ఎచ్చటకు స్వామి ?

ధృష్ట : ఉప్పరవీధికి.

శున : నేనా వీధికిఁ బోనొల్లను. నేనీ వీధిలోనుండియే ముష్టి యెత్తుకొందును. వేనరాజ్యంబులోని చిత్రములఁ గందును. ఉప్పరవీధికి నెందులకు ?

ధృష్ట : వేనరాజ్యంబునందలిచిత్రంబులఁ గందువుగాని, వేన రాజ్యంబులో నీ పాఁతపాటలు పాడుచోఁ గోఁతనో కొఱుతనో పడుదువు.

శున : పాఁతపాటలుపాడువారి నందఱిను గోఁతనో, కొఱుతనో వేయించుటేనా ? ఇ దెక్కడిరాజ్యము ? ఇదెక్కడిధర్మము ? కారణ మేమయినఁ జెప్పెదరా ? అదియుఁగూడ లేదా ?

ధృష్ట : కారణములఁ జెప్పకేమి ? ప్రాఁతపాటలు న్యూనాధిక్యములుబోధించి సౌభ్రాతృత్వముఁ జెడఁగొట్టి యసంతృప్తి కల్గించుననియు, హింసాప్రబోధకంబులనియు, భూతదయా విధ్వంసకములనియు మా మహారాజునభిప్రాయము. అట్టి తారతమ్యంబుల నుద్రేకించు పదములు, పాటలు తన రాజ్యంబున నడుగు పెట్టనీయనని శపథంబుఁ బట్టినాఁడు. ఈ శాసనం బప్రతిహతంబు.

శున : పాటలు పాడినందులకే యింతక్రూరదండనమా ? ఈపాటలు మాతాత మాతండ్రికి నేర్పేను. మా తండ్రి నాకు నేర్పేను. పుడిసిలిగంజికై యీ పాఁత పాటలు పాడుకొంచు దేశమెల్లం దిరుగుచుందును. నాల్గునాళ్ళకై మరలఁ గ్రొత్తపాటల నెక్కడ నేర్చి కోఁగల్గుదును. నడివయస్సు దాఁటినది. చేపో చూపో; దీనికింత యూరాటమేల ?

తనువు సత్యముగాదురో రన్నా
ధర్మమొక్కటె నిత్యమో రన్నా

తనువు శాశ్వత మనుచులోనమ్మా
తప్పుదారులఁ ద్రొక్కబోకన్నా!

ధృష్ట : నే నడుగుచున్నది యొక్కటి, నీవు చెప్పుచున్నది మరియొకటి. పదములుపాటలతోఁగాని జవాబు చెప్పలేవా? సరియైన జవాబు చెప్పింపవలయునా?

శున : అంత కోపపడియెద నేల? అలవాటుచేఁ బాటలు తమంతతామే నోర్వాడలి వచ్చుచున్నవి. మీకుఁ గావలసిన సమాచార మేదియో యడుగుడు, చెప్పెదను.

ధృష్ట: మీ దేయూరు?

శున : మాది యుత్తరాది.

ధృష్ట: ఇంతలోనే యబద్ధముఁ జెప్పుచున్నావా? నేను వినలే దనుకొంటివా, నీవు పాడుచున్న పాటను?

శున : పెద్దచిక్కే వచ్చినది. మాది బ్రహ్మముఖము. ఉత్త రాది యన్నను బ్రహ్మముఖ మన్నను నొక్కటే.

ధృష్ట: అది యెచ్చట నున్నది?

శున : బ్రహ్మకపాలముదిగువ నానుకొని యున్నది.

ధృష్ట: అందలివిశేషము లేమి?

శున : పేరుకొని పేరుకొనని గంగోదకము శింఘాణమువలె బ్రహ్మముఖమును వెలువడి వచ్చుచుండును.

ధృష్ట: చిత్రము. నీవీ పట్టణంబునకు వచ్చి యెన్నినాళ్ళయినది?

శున : రెండు మూడు వారము లయినది.

ధృష్ట: ఇన్నాళ్లెచ్చట నుంటివి ?

శున : ఈపొంతనున్న మునిపల్లెలో పగలెల్ల నడిగికొని తెచ్చిన. యన్నకబళమును గుడిచి రాత్రిపూట మునుల సేవఁజేయుచుఁ గాలక్షేపముఁ జేయు చుందును.

ధృష్ట: ఓహో! యీపాటలకుఁ గారణ మిదియా? ఈపాటలు మీతాతదగ్గరనుండి తండ్రికి, తండ్రిదగ్గరనుండినీకు వచ్చెనంటి వేమోయి? ఒక తప్పును గప్పిపుచ్చ రెండనదియా ? అబద్ధమేల యాడెదవు ?

శున : స్వామీ ! యిట్లనుచుంటి రేమి ? నాకబదపూడుట్లు చేతకాదు. నేను జెప్పిన దంతయు సత్యమే.

ధృష్ట: మునిపల్లె మహారాజునకుఁ బ్రతికూలమని యెఱుంగ వా ? మునిపల్లెలోనున్న మునిప్రుచ్చలందఱు మహా రాజునకు వ్యతిరేకులే. కలహశీలులైన యీ మానుల చేతనేపట్టణ మింత యలజడి పొందుచున్నది. మహా రాజునుదలక్రిందు చేయవలయునని వారుపన్నుచున్న పన్నుగడలు, వారు చేయుచున్న కుట్రలిన్నిన్నని చెప్పనగునా. వారుచేయుచున్న శాసనధిక్కార మున కంతున్నదా ?

శున : ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. నా కీ గొడవ యేమియుఁ దెలియదు. ఎట్లేగి యెట్లేగి యగ్నిగుండ

మున దూఁకెదనా ?

ధృష్ట: ఋషులు కానిచో నీ కిట్టిపాటలు నేర్పనెవ్వారు సాహసింతురు ?

శున : గట్టిగఁ జెప్పుచుంటిని. ఋషులు నా కీ పాటలు నేర్పలేదు.

ధృష్ట: నేను నమ్మను. ఋషు లీ పాటలు నీకునేర్పి పట్ట ణంబులోఁ బొడుట కంపియుందురు. ఏమి జరుగునో చూతమని వారియూహ. ధృష్టవర్మ ప్రాణములతో నున్నంతకాలము రాజశాసన తిరస్కృతి, ప్రాణ ప్రయాణ మొక్కమాటే జరుగును.

శున : బాబూ ! ఎవ్వరా ధృష్టవర్మ ?

ధృష్ట: వేనమహారాజు సర్వసైన్యాధిపతియుఁ దదాంత రంగికుండును.

శున : వారెచ్చట నుందురు ?

ధృష్ట: ఈ పట్టణంబున నెచ్చటఁజూచినను వారేయుందురు.

శున : ఏరీ యిచ్చట ?

ధృష్ట: నీతో మాటాడుచున్నవారే.

శున : హతోస్మి, హతోస్మి. ఎఱుంగక యింతప్రసంగముఁ జేసితిని. ఇఁక నే నీపాటలు పాడను. మునిపల్లెగడప యైననుద్రొక్కను. కాని ఋషులెంత దొంగలు,

నాకుఁ జెప్పఁగూడదా ఈపాటలు పాడినఁ బ్రాణము పోవునని ! స్వామీ ! మీరునాతో మునిపల్లెరండు. ఎందులకింత మోసపుచ్చిరో మునులను గనుఁ గొందము.

ధృష్ట: [తటపటాయించి] సరే, నడుపుము. వారేమి చెప్పెదరో చూచెదను. వారియింగితముకూడఁ దెలిసికొందును.

శున : మీ రటకు వత్తుననుటచేఁ గృతార్థుఁడనైతిని. నా నిజము మీరు తెలిసికొనవచ్చును. కాని మునుల కీగొడవయెందులకు? పగఁబట్టి రాజును సాధింతురా? రాజు కన్నుఁ దెఱచిన మలమల మాడిపోదురే.

ధృష్ట: రాజు కన్నుదెఱచువాఁడు కాకపోవుటచేతనే ఋషుల యాటలు సాగుచున్నవి. దీనికిఁ దగినట్లు కాలము తలక్రిందగుచున్నది. క్రొత్తప్రాఁత పోరాటములోఁ బ్రజలు నలిగి చచ్చిపోవుచున్నారు.

శున : మెత్తనిరాజును జూచిన నెవ్వరు భయపడుదురు? ఎవ్వరు మన్నింతురు? ఎవ్వరు శాసనబద్ధులగుదురు?

ధృష్ట: ఇప్పుడీ రాజ్యంబునఁ దటస్థించు చున్నదింతియే. పోదము పద. [నిష్క్రమింతురు]

[మునిపల్లె: గౌతముని కుటీరము; ధృష్టవర్మ శున శ్యేనులు ప్రవేశింతురు.]

శున : స్వామీ! ఆ కనఁబడుచున్నదే గౌతములవారి కుటీరము. గౌతము లీ మునిపల్లెకుఁ గులపతులు. చాలఁ బెద్దలు. అన్ని శాస్త్రములు కూలంకషముగా నధ్యయనముఁ జేసిన పండితులు. వారు దర్శనముఁ జేయఁదగినవారు. అచ్చటకుఁ బోదము రండు.

ధృష్ట: గౌతములవారిని మునుపొకయప్పుడు చూచియుంటిని. నాకు వైతండికులుగాఁ గన్పట్టినారు.

శున : అట్లనఁజనదు. గొప్పతార్కికులు. వారివాద మద్భుతంబుగా నుండును. ఎట్టివారినైన సుముఖులుగాఁ జేసికొనఁగల్గుదురు.

ధృష్ట: ప్రాయశః మామహారాజునిదక్క.

శున : ప్రతిపక్షులగుటచే నొకరివాదము నొకరు వినినే వినరుగాఁబోలు.

ధృష్ట: విన్ననునొకరిమాట యొకరికి నచ్చదు. ఇప్పుడీ వాదము మనకేల? పోదము పద.

గౌత : ఓయీ! యెవ్వరినో కొనివచ్చుచుంటివి [పరికించి] ఓహో! దండనాథులా! దయచేయుఁడీ దర్భాసనముఁదీఁద. అతిథిపూజకు నూకింతకన్న నుత్తమమగు నాసనములు లేవు.

ధృష్ట: మునీంద్రా! యివియే యుత్తమమయిన యాసనములు. సుఖముగఁ గూర్చుండవచ్చును. ఈవృక్షము చలిపందిరివలె నున్నది. ఆశ్రమ మెంత ప్రశాంత

ముగ నున్నది!

గాత : ఆశ్రమ మెంత ప్రశాంతముగ నున్నను, మా మన స్సులు మాత్ర మల్లకల్లోలముగ నున్నవి. దట్టనుగు నీ చెట్లనీడ వేదాధ్యయనముఁ జేసికొను వ్రాఁత కూడ నిఁకముందున్నట్టు తోఁచుట లేదు.

ధృష్ట: కలిమిలేములు, సుఖదుఃఖములు కావడికుండలు. మీకుఁ దెలియని దేమున్నది ?

శున : దేవా! మొన్న మీ ముందుఁ బాడిన పాట రాజ ద్వేషము పురికొల్పునని యు, నాతలఁ దెగ్రవేసెద ననియు నన్ను వీరు పదరఁగా నేమియుఁదోఁచక, బతిసూలి వీరినిటకుఁ దోడ్తెచ్చితిని. అట్టిపాటను బాడఁగూడదని నాకేల బోధింపరైతిరి. నిజముగ నాతలయే యెగిరిపోయిన నీపాటికి నే నెక్కడ నుండు వాఁడను ?

గాత : ఓయీ ! నీవు పాడుచున్న యాపాట యట్టిదియైన యెడల నీకేల బోధింతుము ? రాజద్వేషము మా కేల ? "నా విష్ణుః పృథివీపతి" యనునార్యోక్తిమే మెఱుంగమా ?

ధృష్ట: మీ రెఱుంగనిది యేమున్నది? కాని విపరీతార్థములు, అంతరార్థము లవసరముకొలంది చెప్పి యేదియైన సమర్థించి, సరిపుచ్చెదరని భయంబు.

గాత : ధృష్టవర్మా! అట్టిభయంబు నీకుండఁదగదు. మాకుఁ

పాపభీతిగలదు. దైవభీతిగలదు. పాపమూలకంబులగుఁ పనులేల బోధింతుము ?

ధృష్ట: కాని దృక్పథము భేదించినపుడు మీదేవునకు, మా దేవునకు మీపాపమునకు, మాపాపమునకుఁగూడ భేదమున్నము కాగూడదా ?

గౌత : దృక్పథమున భేదమెట్లు తటస్థించును. మనమందఱి మొక్కధర్మమునే యవలంబించి, వర్తించుచుంటిమి గదా ?

ధృష్ట: ఒక్కధర్మమునే యవలంబించుచున్నను, భిన్నమనఃప్రవృత్తులచే నొక్కధర్మమే భిన్నరూపములను బొందుట లేదా ?

గౌత : ఈదు ర్వాదమేల? మన సనాతనధర్మమునకు వేదము మూలము: వైదికధర్మముల నవలంబించుచున్న మనకుఁ బరస్పరవిరుద్ధము లయిన ధర్మము లేల పొసంగును ?

ధృష్ట: వేదములందు మాత్రము పరస్పర విరుద్ధములుండ గూడదా ?

గౌత : ఎట్లుండును ? వేదము భగవద్దత్తము.

ధృష్ట: "భగవద్దత్తము" అనఁగా ?

గౌత : లోకకల్యాణార్థమై భగవంతుఁడు వేదములను తొల్లి మహర్షులకు నొసంగెను.

ధృష్ట: తొల్లియనఁగా.

గౌత : సృష్ట్యాదియందు.

ధృష్ట: సృష్ట్యాదియందు కొందరు ఋషులుండిరనియు, నా ఋషులకు భగవంతుఁడు బోధించెననియు మీరు చెప్పుచున్నారు. వేదములే లేనికాలమున ఋషులెట్లు వచ్చిర? ఇది మీకెట్లు తెలిసినది?

గౌత : వేదములయందే యీ విషయంబు లన్నియుఁ జెప్పఁబడ్డవి.

ధృష్ట: వేదములు తా మెట్లుపుట్టెనో, తా మెట్లు ఋషుల వదనగహ్వారముఁజొచ్చెనో చెప్పుకొన్నవి. చక్కని కథ! పిల్లలునమ్మ్నాటకు, పోనిండు. మీరు చెప్పఁదలంచుకొన్నది చెప్పుడు.

గౌత : వంశపరంపరగ మాయధీనములును, భగవద్దత్తములునైన వేదములచేఁ బ్రతిపాదింపఁబడిన ధర్మములను ప్రచారముఁజేయుటకు సర్వదా ప్రయత్నింతుము.

ధృష్ట: ఇది యెల్లరు చేయఁదగిన కార్యమే యనుకొందును.

గౌత : ఎల్లరు చేయఁదగిన కార్యమే కాని, భగవంతుఁడు వేదప్రోక్తధర్మములను ప్రతిష్ఠించుటకు రాజులను సృష్టించి సర్వాధికారంబు వారిహస్తగతముఁ జేసెను.

ధృష్ట: ఇదియొక పెద్దచిక్కు తెచ్చిపెట్టితిరే. మీవంటి

వారా ప్రచారమునకుఁ బూనుకొనరాదా ?

గౌత : సామాన్యజనులకీ యధికారంబు లేదు. రాజులకే యీ యధికారంబు కైవసంబు చేయఁబడినది. వారు తమ విధిని దిన్నఁగానిర్వహింపకున్న వారికుపదేశించియో, వారిని శాసించియో, వైదికధర్మమును బ్రతిష్ఠింపఁ జేయవలసినది వైదికులు.

ధృష్ట: రాజులకు, బ్రాహ్మణులకుఁ దక్క మతప్రచారమున నితరు లెవ్వరికి నధికారము లేదందురు, సరియె ! ఈ వేదప్రతిపాదితధర్మము లెవ్వరిచేఁ జెలియయందగినవి ?

గౌత : మహర్షులచే. నిరంతర భగవద్ధ్యానశీలురగు సంయ ములు మనఃకాయక్లేశములకు సరకుసేయక గురుకుల వాసముఁజేసి, త్రికాలవేదులగు పెద్దలకడ విద్యల నభ్యసించి, వేదముల నామూలాగ్రముగఁ బారా యణఁజేసి, తద్ధర్మముల నవగాహముఁ జేసికొని లోకకల్యాణార్థము, శిష్యపరంపరమూలమునఁ బ్రపం చమున కెఱిఁగింతురు. ఎడ్పుడయిన ధర్మవిప్లవము తటస్థించిన రాజట్టి యుపద్రవముఁ దొలఁగించి పరి పాలనఁ జేయవలయు.

ధృష్ట: రాజట్టిధర్మపీడలను దొలఁగింపకున్నయెడల ?

గౌత : రాజు దండ్యుఁడగును.

ధృష్ట: ఎవరు రాజును దండించునది.?

గౌత : ఈలోకమున బ్రాహ్మణులు, పరలోకమున భగ వంతుఁడు.

ధృష్ట: రెండు శిక్ష లేటికి ?

గౌత : ఒకటి తప్పించుకొన్న రెండవది.

ధృష్ట: చచ్చినను దప్పిపోదా ?

గౌత : పోదు.

ధృష్ట: బ్రాహ్మణులు ప్రమత్తులై యూరకున్నచో ?

గౌత : వారును దండ్యులే యగుదురు. అందుచేతనే వేన మహారాజు వైదికధర్మములకుఁ బ్రతికూలుఁ డగుటచే వానిని నిలువఁబెట్టఁ బ్రయత్నించుచుంటిమి. రాజభక్తియు దైవభక్తియుఁబోలెఁగా నీకార్యము నకుఁ బూనుకొంటిమి. దానికి మహారాజు క్రుద్ధుఁడై యేమేమియో చేయుచున్నాఁడు. ఇంతియేకాదు. ధర్మద్వేషులను వారింపక రాజు వానికిఁ దోడ్పడు చుండిన హంతవ్యుఁడగును.

ధృష్ట: హంతవ్యుఁడా ? ఇది వినరానిమాట; రాజు హంతవ్యుఁడా ! ఇది నాముందు చెప్పఁగూడనిమాట.

గౌత : వినరానిదైనను, వినిపించవలసి వచ్చినందులకు, క్షంతించుచుంటిని. ధర్మనిర్ణయముఁ జేయునప్పుడు గాని, ధర్మబోధఁ జేయునప్పుడుగాని, మోమోటమి చెల్లదని పెద్దలు చెప్పుదురు. ఇట్టిరాజునకుఁ దోడ్పడు వారుసైతము హంతవ్యులనియే వేదములు ఘోషించుచున్నవి.

ధృష్ట: నారాజునకయి ప్రాణములు గోల్పోవుటకు నే నే మాత్రము సంకోచింపను. కాని మౌనీశ్వరా! ఒక్క విషయ మడుగుచుంటిని. మా వేనమహారాజాచరించుచున్న ధర్మములు వేదవిరుద్ధములేనా?

గౌత: వేదవిరుద్ధములే కాదు, నిస్సంశయముగా వేదనిషిద్ధములు. వేదములు నెత్తిని నోరుఁబెట్టుకొని వలదని ఘోషించుచున్నను వేనరాజు వినకున్నాఁడు. వేదములు విధించుటచేతనే మేము యజ్ఞములు యాగములు చేయుచున్నాము. వేనరాజు నిషేధించినాఁడు; మేము నిస్సహాయులమై యూరకుంటిమి.

ధృష్ట: జీవహింస వేదసమ్మతమేనా?

గౌత: యజ్ఞములయందుఁ జేయఁబడుహింస హింసకాదని వేదములు నుడువుచున్నవి.

ధృష్ట: ఇదియెట్లు?

గౌత: యజ్ఞములు జగదవనార్థము సృజింపఁబడినవి కాన.

ధృష్ట: అట్లయినచో మా వేనరాజు భ్రమప్రమాదములలోఁ బడినవాఁడన్నమాటే. మీరు మా మహారాజునకు బోధించి చూడఁగూడదా?

గౌత: లాభ మేమి యుండు? నీ వెఱుంగుదువుకదా నాఁటి సంగతి! వేదములు బోధించుచున్నను, పరిగ్రాహ్యములు కావని మహారాజు వారించుచున్నాఁడు.

ధృష్ట: అట్లయినచో భగవదపచారముఁ గావించు చున్నాఁడే.

గౌత : ఇందులకు సందియమేల ?

ధృష్ట: అయ్యో ! పరార్థజీవనుఁడే యాతఁడు, ఎన్నఁడయిన స్వార్థ మభిలషించి యేకార్యమయినఁ జేసెనా ? ప్రపంచమంతయు దుఃఖమయము. ఆదుఃఖమును దొలఁగించి తీరుదునని పాటుబడుచున్నాఁడే.

గౌత : మానవమాత్రున కిది సాధ్యపడునా ? అడియాసలు, అడిగొట్టుతనము. అందునను భగవత్ప్రతిపాదిత ధర్మములనే తృణీకరించి యసాధ్యములను సాధింపఁ బూనుట మహాసాహసము. యజ్ఞయాగములు వల దన్నఁ బ్రజలలో నెంత కలవరము గల్గుచున్నదో విచారించికొనుము.

ధృష్ట: ప్రజలలోఁ గలవరమును నేను బాగుగ గుర్తించితిని. ఎచ్చటఁ జూచినను విరోధులే.

గౌత : మహారాజు తన విపరీత ధర్మప్రచారముచే రాజ్యము నెల నలకలోలముఁజేసి, శాంతిలేకుండఁజేయుచు న్నాఁడు. మావంటిపరార్థజీవనులఁ దృణీకరించు చున్నాఁడు. ప్రజలు చెలరేగి విప్లవకారులై రాజ వంశమునకే ముప్పుగల్గింతురని వేదనపడుచున్నాను. అంగరాజుపేరు దలంచుకొన్నయప్పుడెల్ల నిర్విణ్ణుఁడ నగుచున్నాను.

ధృష్ట: ఈ వాక్యములు ననున్ గలంత పెట్టుచున్నవి. అంగ రాజవంశము నీ ముప్పుననుండి తప్పించుట యెట్లు ? ఏది ఎట్టయినను దప్పించితీరవలయును. తరతరంబుల నుండి మాప్రాణముల ధారవోసి అంగరాజ్య సింహాసనమును సురక్షితముగ నుంపఁగల్గితిమి. వేనమహా రాజుచేతిలోఁబడి నేఁటికీదుర్గతిఁ బొందినది.

గౌత : ఛాందసులమైన మేమేమి చెప్పఁగలము ? మీవంటి వారూహింపవలసినదే. వైదిక కర్మకాండమా ? తర్కమా ? మీమాలసయా ? మీసంశయములు తీర్చుటకు. అయినను నిరంతర జపతపంబుల,మునిఁగి తేలు మా కీ గొడవమాత్రమేల ?

ధృష్ట: కాని మే మెట్టులూరటఁ బొందఁగలము ? రాజులు వచ్చుచుందురు, పోవుచుందురు. రాజవంశము మాత్రము సుస్థిరమై సింహాసనముమీఁద నుండవలయును. ఇది మాకోరిక. రాజవంశమునకు నెట్టియపకారముఁ దలపెట్టము.

గౌత : ధృష్టవర్మా ! యెంతవెట్టివాఁడవు ! అంగరాజు మమ్మెంత దయాదాక్షిణ్యములతోఁ జూచెను ! మా యందెట్టి గౌరవము చూపించెను ! అట్టి మహారాజు వంశమునకుఁ గీడు తలపోయఁగల్గుదుమే ? ఇప్పుడు మేము పడుచున్న పాట్లన్నియు రాజవంశమును గాపాడుటకే.

ధృష్ట: అట్లయిన మీకుఁ జేదోడు వాదోడుగా నుందును.

గౌత : ధృష్టవర్మా ! ఒక్క-మాట. పృథుకుమారుఁడు వినయసంపన్నుఁడు, ఆచాగశీలుఁడు,వంశసంప్రదాయ ములయందుఁ బక్షపాతియని వింటిమి. ఇది యెంత వఱకు నిజంబు ?

ధృష్ట: మంచిమాట, సమయమునకుజ్ఞప్తికిఁ దెచ్చితిరి పృథుఁడు చాల యోగ్యుఁడు. వైదికధర్మపక్షపాతి. ఒకమారు మీదర్శనముఁ జేయింతును. మీరే వానిని బాగుగఁ దెలిసికొనఁగల్గుదురు.

గౌత : మహారాజు, పృథుకుమారుఁ డిందులకువచ్చుట కొడంబడునా ?

ధృష్ట: ఒడంబడఁడని తలంతును, అయిననేమి ? మహారాజు యొక్క యెఱుక లేకుండఁగనే తీసికొని వచ్చెదను. మీరు మాటాడవచ్చును. అతఁడు కుశాగ్రబుద్ధికల వాఁడు.

గౌత : అగును, మంచియూహయే.

ధృష్ట: నేను బోయి వచ్చెదను

[నిష్క్రమించును.]

గౌత : కార్యము పాటునఁ బడినది.

మూఁడవ రంగము

ముగింపు

నాల్గవ రంగము

[వేనునిపడకటిల్లు.]

[వేనుఁ డాలోచనామగ్నుఁడై యిటునటు తిరుగు చుండును. సునీథాదేవి ప్రవేశించును—వేనుఁడు నివ్వెరపడును.]

వేనుఁ: తల్లీ ! యిది యేమి ? యీ కానిప్రొద్దున నిచ్చట కేల వచ్చితిరి ? ఎందులకుఁ దత్తరపడుచున్నట్లు కన్పట్లు చున్నారు ?

సునీథా: నిద్దురపోక నీ వెందులకో యాందోళనపడుచుంటివని బోనకత్తె చెప్పినది. అందుచేఁజూచి పోదమని వచ్చి తిని.

వేనుఁ: నేనెన్నఁడయిన నాందోళనపడితినా, నేఁడుపడుటకు? ఆందోళనపడవలసిన యగత్యము నాకేల కల్గును ?

సునీథా: బోనకత్తె యట్లేల చెప్పినది ? నీయం దేదియో విలక్షణము కన్పించియుండవచ్చును.

వేనుఁ: భావికార్యగతులనుగూర్చి తలపోయుచుంటిని; అంతి యే, వేరేమియు లేదు.

సునీథా: ఇప్పుడంత తొందర యేమి వచ్చినది? క్రొత్తవిశే

షము లేమయిన నున్నవా?

వేను : తొందర యేమియును లేదు. విశేషము లంతకంటెను లేవు. కాని యమ్మా! యొక్క మాట యడిగెదను, జెప్పుము. ఏమఱిక పృథువును దినమెల్లఁ గనిపెట్టు కొని చూచుచునే యుంటివికదా!

సునీథా: మన యాయుష్మంతునినేనా? ఏల యట్లడుగుచున్నావు? ఈప్రశ్నచే నామనస్సు కలవరపడుచున్నది.

వేనుఁ: ఏమియు లేదు. పృథుకుమారుఁడు తఱుచు మునిపల్లెకుఁ బోవుచున్నట్టు తెలియవచ్చుచున్నది.

సునీథా: [ఉలికిపడి] ఏమీ మనపృథువా? మునిపల్లెకా? చిత్రముగ నున్నదే.

వేను : రెండు మూడుసారులు సేనాపతిధృష్టవర్మతోఁ గలసి పోయినట్టు తెలియవచ్చినది. పోవుట యేకాదు, మునులతో సంభాషించినట్టుకూడఁ దెలియవచ్చినది.

సునీథా: దేనినిగూర్చి? మునులతో సంభాషించునవసరమేమి వచ్చినది, కుమారపృథువునకు? ఈడా జోడా? వాన ప్రస్థములో వలయు మునిపల్లెలు నేఁడేల కావలసి వచ్చెను?

వేనుఁ: మునులు దేనినిగూర్చి సంభాషింతురు? ననుఁగూర్చి, నేఁ జేయుపనులనుగూర్చి. ఇంతకన్నను వారి కేమి యున్నది?

సునీథా: ధృష్టవర్మ్మ యుండఁగా నట్టిప్రసంగములు జరు
గునా? జరిగిన ధృష్టవర్మ్మ యూరకుండునా? నీకుఁ
దెలుపకుండునా?

వేనుఁ: అమ్మా! నీకు సంగతులు పూర్తిగాఁ దెలియవు.
ఆనాఁటిధృష్టవర్మ్మ యనుకొనుచున్నావు. ధృష్టవర్మ్మ
మనస్సెవ్వరో విఱిచిరి. అయిదాఱునెలలనుండి ధృష్ట
వర్మ్మ రాజకార్యములయందుఁ బ్రవర్తుఁడై మెలఁగు
చుండుటయేకాక నాకుఁ బ్రతికూలుఁడుగాఁగూడ
నుండెను.

సునీథా: కానికాలము వచ్చునప్పుడు గడ్డిపోచయె పాష్మైకటి
చునన్నట్లున్నది.

వేను: ధృష్టవర్మ్మ కుమారపృథువును నాపైఁ దిరుగఁబడు
నట్లు ఋషులచేఁ జెప్పించుటకు మునిపల్లెకుఁ గొంపో
యినట్లు నాయనుమానము. అనుమానమేల? నిజమే.

సునీథా: ఔరా! ధృష్టవర్మ్మ యెంతవాఁడయ్యెను? అన్నముఁ
దినిపించు చేతినే కోఱకుఁ బూనుకొన్నాఁడే. నేను
బిలిపించి మాటాడెదను.

వేనుఁ: వలదు, అట్టిదేమియు వలదు. నీవు మాటాడినంత
మాత్రమునఁనే తనపనిని మానుకొనువాఁడు కాఁడు.
మంచిచెడ్డ లతనికిం దెలియవు. చేతిక త్తిమంచిచెడ్డలు
దెలియఁగలఁడుగాని చేతముమంచిచెడ్డలు దెలియ
నేరఁడు. మొసలిపట్టుమానిసి.

సునీథా:అయినచో నీవే యాతనితో ముచ్చటించి యతఁడు
వినకున్న మితిమీరకమున్న యాతనిని శిక్షించి
నీత్రోవనిష్కంటకముగఁ జేసికొనుట యుత్తమము
కాదా?

వేనుఁ : నేనేల యాతని శిక్షింపవలయును? ఎన్నిమారులు
నేను మీయాజ్ఞనుమీరి మిమ్ముఁ బ్రతిఘటించితినో
యప్పుడెల్ల నన్నుశిక్షించితిరా?

సునీథా:శిక్షింపకున్న రాజ్యమున విప్లవము చెలరేఁగదా?
ప్రాణోపద్రవము సంభవింపదా?

వేనుఁ : అమ్మా! మిమ్ముఁ బుత్రప్రేమ యిట్లనిపించుచున్నది
కాని ప్రాణోపద్రవము సంభవించు నని స్వార్థమభి
లషించి నే నేల ధృష్టవర్మను శిక్షింతును?

సునీథా:ముక్కుపచ్చలారని పసిబాలునకు నే మేమియో
బోధించి, కుమార్గమునఁబెట్టి కుటుంబకలహంబును
గల్పింప యత్నించుచున్నాఁడుకదా యాతఁడు.

వేనుఁ : నామతసిద్ధాంతములను ప్రజలకు బోధించి నాపైపు
నకుఁ ద్రిప్పికొనుటకు నేను ప్రయత్నము సేయుట
లేదా? ఎవరియభిప్రాయములను వారు నిరాఘాటం
బుగ వెలిబుచ్చికొనుటకును, నితరులకు నచ్చఁజెప్పి
తమపైపునకుఁ ద్రిప్పుకొనుటకును నా రాజ్యంబున
నెల్లరకు సర్వాధికారంబున్నది. కాన ధృష్టవర్మను
దాఁజేయుచున్న కార్యమునుండి విరమింప నే నేటికిఁ
గట్టడిచేయుదును. ఇదియుంగాక ధృష్టవర్మకు నీపని
కూడదని చెప్పుట యతనిని రెచ్చఁగొట్టుటయే.

సునీథా:కుమారా! ఈ విషమపరిస్థితుల యిరుకటంబున నీ వేమి చేయఁబూనితివి?

వేనుఁ : పూనుట కేమున్నది?. బాహుశః మునులు ధృష్టవ ర్మాశ్రయించలిసి, పృథుకుమారునకు రాజ్యకాంక్ష కల్పించి సివమొక్కించి యుందురు. ఈకారణముచే నతఁడుకూడ మనమాట పాటింపక పోవచ్చును. నాకో, రాజ్యకాంక్ష దీరినది. ప్రజలకు విజ్ఞానము బోధించి మంచిత్రోవనుబెట్టి వారి స్వత్వములను వారి కెఱిగింప ననేకయత్నములు జేసితిని. ఇది ఫల నుకాదని దృఢంబుగ బోధపడినది. ప్రజలు వివేక ముతో యుక్తాయుక్తములను విచారించికొని, మేలు కోళ్ళను గ్రహింపఁజాలు స్థితియందు లేరు. ఎవరు తమకు హితులో యెవరు కారోసుంతయుఁ దెలిసి కొనఁ జాలరైరి. ఎవరికొఱకు నాజీవితసర్వస్వము వెచ్చించి యభ్యుదయముఁ గూర్ప యత్నించితినో, వారే నా యుద్యమమునకు సుముఖులు కాకపోయిరి. ప్రాకృతజనంబు మఱుకువలో మునింగి తేలుచు న్నారు. ఇది కనిపెట్టినవారై మునులు పరలోక సౌఖ్యంబుల సృజించి యడియాసలు గల్పించుచు న్నారు. మూనులవలలలోఁ జిక్కి ప్రజలు కీలుబొ మ్మలైరి.

సునీథా:కుమారా! కర్తవ్యమేమి? యిప్పుడు, వివరించి చెప్పుము.

వేనుఁ : కర్తవ్యమేమి యున్నది? తల్లీ! వెక్కు-మూటలేల?
ఈ ప్రపంచమున నాపని పూర్తియైనది. లోకమును
నా యాజ్ఞా బద్ధము జేసికొని యానందమయముగాఁ
జేయదొర కొంటిని. లోకము దుర్లోక మయినది.
నేను భగ్నప్రయత్నుఁడనైతిని. నాకిఁక ప్రపంచ
ముతోఁ బనిలేదు. ఈప్రపంచములో నేజేయఁదగిన
దియులేదు. ఏబుద్ధుఁడో యీ పాపపంకిలమగు లోక
మును నుద్ధరింప వలయును గాని సామాన్యమానవు
లకు సాధ్యముకాదు. కావున వేనుఁడు నీకడుపునఁ
బుట్టలేదనుకొనుము. పృథువే నీకడుపునఁ బుట్టినాఁ
డనుకొనుము.

సునీథా: అమంగళము; అమంగళముశాంతించునుగాక!
వినరాని మాటలు చెప్పుచుంటివి. కుమారా! నీకిట్టి
మాటలు తగవు.

వేనుఁ : అమ్మా! మానులు పసిఁబట్టియున్నారు. నేను జీవిం
చియున్నంతవఱకు వారియాటలు సాగవని వారె
ఱుంగుదురు. వారిప్రభావను నరికట్టుచున్న ననుఁ
దొలంగింపక యుండనేరరు. పైఁగాఁ జికిలి చేసిన
రెండుకత్తులు వారి చేతికింజిక్కినవి. మొదటిదిపృథు
కుమారుఁడు; రెండవది ధృష్టవర్మ. ఇఁక వారెట్లూ
రకుందురు? మునిపల్లెను గన్నెతియైనఁ జూడనొల్లని
మనుజులు నేఁడునిర్భయముగ మునిపల్లెకుఁ బోవ్రుచు
న్నారు. వారి కేదో గట్టినమ్మకము కల్గకున్న నిట్టి
పను లేల జరుగును?

సునీథా:కుమారా! అయినచోఁ బ్రతీకార ప్రయత్నమునైన నేల చేయవు? ప్రతివ్యూహమునైన నేల పన్నవు?

వేనుఁ: నేను బ్రతీకారమునకుఁ గడంగను. మిథ్యోపాయ ప్రయత్నమునఁ బుణ్యాపాపము లెఱుంగని జనసామాన్య మేల త్రుంగవలయును? నాకై వేలకొలంది జనంబులు రూపు మాయుటేల? నేనంత స్వార్థపరుఁడను గాను. పదికత్తులు నాపై కెగిరినను నేను కత్తిముట్టను: కత్తినెత్తను. నాప్రజలను జీల్చి, యొకరిపై కొకరిని నుసికొల్పి చీల్చిపైవను. నేనిది చూడఁజాలను.

సునీథా:పుత్రా! ఆత్మరక్షణ ప్రయత్నమైనను నేలచేయవు?

వేనుఁ: తనువులశాశ్వతములు. ఇంతకుమున్ను మరణమును దప్పించుకొన్నవారులేరు, తప్పించుకొనువారును లేరు. ఇట్టియసాధ్యమైనపనికి నే నేల తహతహలాడవలయును? నిజముగ మునిపల్లెనున్న మునులు నా ప్రాణమునకే తెగినయెడల నే నెంతకాలము తప్పించుకొని తిరుగఁగలను? "దినదినగండము నూరేండ్లాయు" వనురీతి నే నేల చరింప వలయును? చచ్చెడునంతదాఁక నిర్భయముగనే ప్రపంచమున సంచరించెదను. నేఁటినుండియు రేయింబవలు నాపడక గదితల్పులు తెఱచియే యుంప నిశ్చయించుకొంటిని.

సునీథా:కుమారా! నీ నిట్టిధర్మనిబద్ధబుద్ధివని యెఱుంగనైతి. నీవంటిప్రజ్ఞాధురీణునకుఁ, బరోపకారశీలికిఁ గన్నతల్లినగుటచేఁ గృతార్థురాలనైతిని.

వేనుఁ : మాతృదేవీ! మూసను గరగించిపోసి నాశీలమునకు వన్నెదెచ్చుటకు మీరేకదకారణము. మీయాశీర్వాదబలమే నాకు జీవగట్టి. లేనిచో నే నిట్టి మహాకార్యమునకుఁ బూనుకొందునా? మునిలోకము నా ప్రాణములకుండెగి, నికృష్టమయిన కుట్రలు బన్ని చున్నారు. స్వార్థపరులై యేవంపుఁబనులకు దిగుచున్నారు. ఎవరెన్ని యాటంకములు గల్పించినను, నాధర్మము నెఱవేర్చితీరెదను. తల్లీ! చాల ప్రొద్దు పోయినది. మీరు చని సుఖనిద్రఁబొందు. పృథుకు మారునిమాత్రము కనిపెట్టికొని యుండుఁడు.

సునీథా:కుమారా! నీవు లేనిలోకముత్తో నాకుఁబని యేమిటికి? నీవు ధర్మసంస్థాపనఁజేయుచుండుట కన్నులారఁగాంచి యానందించు భాగ్యము నాకుఁ బట్టకున్న నీపాపపుఁగనులతో నొండేలపూతును?

వేనుఁ : అమ్మా! అట్లనవలదు. మీ రుదాసీన లయినచో రాజ్య మరాజకము గాకుండునా? ప్రజలుపద్రవములకుం జిక్కకుందురా? ఆర్యఋషులచేతిలోని కీలుబొమ్మయై పృథువు పేరు ప్రతిష్ఠ లేకుండఁబోవకుండునా? ప్రజాక్షేమమునకయి మీరు పాటుపడవలసిన యగత్యములేదా?

సునీథా:కుమారా! నే నేదియో నిశ్చితాభిప్రాయమునకు వచ్చితిని. నన్ను బలవంతపెట్టకుము. చాలఁబ్రొద్దు పోయినది. నేఁబోయి పరుండెద. నీవు కూడఁ బరుండఁ బొమ్ము.

వేనుఁ : తల్లీ! నీవు సర్వజ్ఞురాలవు. నీకు నే నేమి చెప్పఁగ లను? ఈమాటలకు నీవు గాదని చెప్పుటకుఁ గూడ సాహసము లేదు. నీ యిష్టమువచ్చినట్లు లాచరింపుము.

సునీథా:నేఁబోయివచ్చెద.

వేనుఁ : చిత్తము. [పచారుచేయుచు] ఆర్యబుషులెంతకుఁ బూనిరి! ఇంత స్వార్థపరత్వ మెచ్చటను గన్పట్టదు. నేనెంత తర్కించుకొన్నను, వీరిపైఁ గత్తి దూయుటకు మనసొప్పకున్నది. నాప్రకృతి బాగుగా నెఱిఁగిన ధృష్టవర్మ వీరి కుపోద్బలంబుగా మాటాడుచుండును. లేకున్న బుషులకింత సాహస మెక్కడిది? ఈ యాధితోనే బాధపడఁజాలను. దుర్మరణమా! మరణమునకు మంచి చెడ్డ లేమున్నవి? త్వరగాఁ దేలిపోవుటయే మేలు. విరోధులను బ్రతిఘటించి నారాజ్యమున శాంతిభద్రములు లేకుండఁజేసి యల్లకల్లోలమును జేయనేరను. నాపడకటింటితలుపులన్నియుఁ దెఱచియే యుంచెదను. హాయిగా నీరేయి నిదురింతును, మరల నీయవకాశము దొరకునో దొరకదో. [పరుండును.]

[నిషాదుని ప్రవేశము; అంపపొదియు విల్లునెగుమూ పునఁ దాల్చి, చికిలిచేసిన కత్తి చేతంబట్టి వేనమహా రాజుపడక గదిముందు తూఁచివేయుచున్న యడు గులతో నిబునటు తిరుగుచుఁ గావలికాచు చుండును. పదముల చప్పుడుచే వేనుఁడులికిపడి లేచి]

వేనుఁ : ఎవరు వారు? నాపడకగదిముం దీవేళ నొంటరిగఁ దిరుగుటకుఁ గారణమేమి? ఓహో నిషాదా! నీవా?

నిషాదుఁడు : అగును, నేనే నిషాదుఁడను.

వేనుఁ : ఎచ్చటనుండి యూడిపడితివి, ఎన్నాళ్ళకు? ఈ పిలవనిపేరంటమున కేల వచ్చితివి? అంతయుఁ గలగానున్నదే.

నిషా : పిలువని పేరంటమునకుఁ బోవుట నూజాతి ప్రధాన లక్షణము. అదియుంగాక మమ్మువరు బొట్టు కాటుక పెట్టి పేరంటమునకుఁ బిల్తురు? మే మేమ యిన రాజులమా, నాగరికులమా?

వేనుఁ : ఎప్పుడును బరిహాసము లేనా?

నిషా : పెద్దలతోఁగాక నే నెవరితోఁబరిహాసములాడుదును?

వేనుఁ : (ఎగా దిగా చూచి) చాలులేవోయి, యీ యెక్కసక్కెములు? ఈ వేష మేమి? పొలికలనికిఁబోవు చుంటివా? పొలికలనినుండి వచ్చుచుంటివా? జానెడు లేవు; ఈ విల్లమ్ములేమి? ఈ కత్తియేమి? ఈ మై మటు వేమి? ఈ కాసెకోక యేమి? ఏదో యుద్ధము

నకు సిద్ధమై వచ్చినట్టు లీ వేష భాషలు చెప్పక చెప్పుచున్నవి.

నిషా : దేవా! యేలుకొనుటకు రాజ్యము లిచ్చితివా? కాపు రముఁ జేయుటకు నగరము లిచ్చితివా? అన్నిఁటికిఁ గాఱడవులే కదా! కాఱడవులలో వాసముఁ జేయు మాకుఁగత్తులు, కటారులు, కాసెకోకలు కాక మూటలు, ముల్లెలెచ్చటినుండి వచ్చును? గాండ్రను పెద్దపులులు, గీపెట్టు నేన్గులు, బొబ్బరిల్లు సింగముల నడుమఁ గాఁపురముఁ జేయు మా కివి కాక యేమి యుపకరించును ?

వేనుఁ : కుమారా! యూరక సూటిపోటి మాట లనుచున్నావు. నేను మీకుఁగాఱడవులు వాసముఁ జేయుట కొసంగలేదు. నీ తల్లికోర్కిమీఁదనే కాఱడవులు మీకు మనికిపట్టు లైనవి. వృథా యేల నా మనస్సు నొప్పింతువు?

నిషా : క్షమింపుఁడు. మహాపచారముం జేసితిని. మీ మనస్సు నొచ్చునెడల నేఁజూడలేను.

వేనుఁ : [మిగుల బాళితోఁ జేయి పట్టుకొని మొగమున దృష్టినిలిపి] ఎక్కడనుండి యీ రాఁక చెప్పవూ?

నిషా : చెప్ప కేమున్నది? హఠాత్తుగా నాకు వేఁటపై మనస్సు పోవ, మునిపల్లెసమీపములో నున్న కాఱు కోనలోఁ బొడలజింకలు విచ్చలవిడిఁ దిరుగును గాన నటకు మునిపల్లెమీఁదుగాఁ బోవుచుంటిని.

వేనుఁ : నీకుఁ బొడలయిట్టిమాంసమన్న నంతనోరూరునా?

నీవు పూర్వజన్మమున నార్యబుషివి గాఁబోలు.

నిషా : నేనా? పూర్వజన్మముమాట యేమియో కాని యీ జన్మమునమాత్ర మార్యసంబంధము కల్గినది. ఇందుచేతనే రెంటికిం జెడిన రేవఁడనైతి. ఇబ్బు తల్లి వైపు వారికిఁగాని, అటు తండ్రివైపువారికిఁగాని నా యందు సంపూర్ణవిశ్వాసము లేదు. దానితోనేమి? పూర్వజన్మమున నార్యబుషినేమో యంటిరి, యిది యెట్లు?

వేనుఁ: ఆర్యబుషులకుఁ బొడలయిట్టిమాంసము చాలరుచ్యమైన భోజనపదార్థము. కాని, కుమారా! నీ వింకను మాంసమును దినుట మానలేదుగా?

నిషా : మాంసముఁ దినుట మావాజ. మహారణ్యములో షడ్రసోపేతమైన భోజనమెట్లు దొరకును? అయినను గన్నతండ్రిమాట పాటింపకుండ జవదాటుటకు మే మార్యులమా? ఆర్యయువతీగర్భమునఁ బుట్టితిమా? మూడేండ్లకిది తొలుసారి, యీ పాడుబుద్ధి పుట్టుట. ఇంతకు వేఁటకుఁ బోవలేదు, మాంసముఁ దినలేదు.

వేనుఁ: కారణము?

నిషా : కారణమా? నిష్కారణమే. నిష్కారణముగా మన మెన్నిపనులు చేయుచుండుటలేదు? వానిలో నిది యొకటి.

వేనుఁ: కాదు, కాదు. ఏదోకారణ ముండితీరవలయును.

కుట్రా ! రమ్మా, చెప్పాము.

నిషా : మునిపల్లెదాఁటి నాలుగడుగులు పోవుసరికి నీ
యానతి జ్ఞాపకమునకు రాఁగా గిరుక్కున మగిడి
మిమ్మా సందర్శించుటకు బుద్ధిపుట్ట నిచటకువచ్చితిని,
ఇంతియె.

వేనుఁ: నీవు నిజమును గప్పిపుచ్చుటకు యత్నించుచున్నావు.
ఎచ్చట నేర్చికొంటి వీ విద్యలు ? నీ వాలకము నాకు
నచ్చుటలేదు. నోటితో మాటాడుచు నొసటితో
వెక్కిరింతువు. మఱుఁగుమాటలచే నెఱికలు దూర
నాడుదువు. ఎక్కడనుండి వచ్చిన దీచాలు?

నిషా : మీరూహించలేరా? ఇదికూడ నేనుచెప్పవలయునా?

వేనుఁ: ఊహింపలేకున్నాను.

నిషా : పెద్దలు చెప్పుదురుకదా, మేనమామపోలిక మేనత్త
చాలికయని. తల్లిచాలుసూత్రము కాదు.

వేనుఁ: కుమారా! నీవు చాల తుందుడుకుబిడ్డఁడ వైతివి.
నిజముగ ననున్న దర్శించుటకే వచ్చినయెడల దర్శిం
చితివికదా, యిఁక మగిడిపొమ్మా.

నిషా : కన్నతండ్రియింటికి నెన్నినాళ్ళకో వచ్చితిని. ఒక
పూట యుండఁగూడదా? ఒకరాత్రి మీ పడకగది
ముందు జాగరణము సేయరాదా?

వేనుఁ: నాపడకగదిముందేమి, జాగరణమేమి?వలదు,వలదు.

నాకు సేవకులు లేరనుకొంటివా?

నిషా : మీకు సేవకులు లేకయుందురా? నాకు శరచాప ములు లేకయుండునా? సేవకులు స్వామిద్రోహులు కాకుండవలయును, శరములు మొక్కవోనివికావలయును నాత్మరక్షణకు. ఇంతకును సేవకులయందుంచినవిశ్వాసము కన్నబిడ్డలయందుంచలేరా? నే నాటవికుడను. నాకు రాజ్యములతో బనిలేదు. భోగభాగ్యములతో బనిలేదు. ఎవ్వరేమన్నను నేను జాగరణముఁ జేసితీరెదను.

వేనుఁ: ఏమీ మొండితనము? నేను వలదన్నను జాగరణముఁ జేసితీరెదనందువు.

నిషా : తండ్రిపోలిక, విత్తనమొకటి, చెట్టొకటియా?

వేనుఁ: కుమారా! ధన్యుఁడవు, ధన్యుఁడవు: కాని నీవు చేయగలఁ దెద్దియును లేదు. అంతయును జేయిమీరిపోయినది.

నిషా : దేవా! ఎన్నఁడు వినరానిమాటలు వినుచుంటిని, మీవలన. చేయి మీరిపోవుట యేమి? నాపొదిలో నమ్ములున్నవి, నాయొడలిలో వేఁడినెత్తురున్నది, నాచేతిలో సత్తువయున్నది, నాకత్తికిఁ గఱికుపదనున్నది.

వేనుఁ: కుమారా! నీవు పసిబాలుఁడవు: ఒకచెంపఁ గొట్టిన్న

బాలు, ఒక చెంపఁగొట్టిన నెత్తురు. ఇట్టి నీచేనగునది యేముండును? నామాటనమ్మ్ము, మగిడిపొమ్మ్ము

నిషా : ఇ వన్నియు నిజము కావచ్చును. కాని వీని నన్నిం టిని సరకు పెట్టనీయనిది యొక్కటున్నది.

వేనుఁ: ఏది యది?

నిషా : నిషాదుఁ డైన్నఁడవమాన మెఱుంగఁడు. ఒక వేళ నవమాన మొగవలసివచ్చినచోఁ బ్రాణమును పణ ముగా నొడ్డఁగలడు. ఇది జాతిలక్షణము.

వేనుఁ: కుట్టా! యివి నేనెఱుంగనివా? నాయెదుట నేకరువు పెట్టవలసిన యవసర మేమి వచ్చినది?

నిషా : నారాకకుఁ గారణ మడిగిరిగదా?

వేనుఁ: ఇప్పుడు కారణ మేమి చెప్పితివి?

నిషా : మాయింట నొకరికి నవమానము వాటిల్ల నున్నచో నది తప్పించు బాధ్యతయు, వాటిల్లినచో నీగవలసిన బాధ్యతయుఁ గుటుంబముది. కుటుంబమున నొక హత్య జరిగినచోఁ బగవారికొక్కెన్నెత్తురు తనివిదీర చూ కత్తులచేఁ దార్పింపకమానము. మొక్కవోని వాడిగల మాకత్తు లాత్మరక్షణముఁ జేయఁజాలి యుండును.

వేనుఁ: బిడ్డా! యింత వాగ్ధోరణి యేల!

నిషా : మీ రాటంకపడి యడుగుటచేఁ జెప్పవలసి వచ్చినది.

నాపనిని నన్ను నెఱవేర్చికొననిచ్చినచో నీవాగ్దోర
ణితో నిజముగఁ బనియే లేదు.

వేనుఁ: నే నేమి యాటంకపడి యడిగితిని?

నిషా : నేనీవేళ నిచ్చటకుఁ వచ్చుటకుఁ గారణము.

వేనుఁ: కారణముఁ జెప్పకుండ నింత వాచాలుండవైతివే?

నిషా : నన్నుఁ గారణము చెప్పనీయనిదె.

వేనుఁ: చెప్పుము, విందును.

నిషా : నన్నిట కీడ్చికొనివచ్చి, రేయెల్ల జాగరణము సేయ
వలసినదని మా యాటవికధర్మ మొక్కటి నన్నుఁ
బ్రబోధించుచున్నది.

వేనుఁ: ఆయాటవికధర్మ మేది?

నిషా : పితృరక్షణము. జనకుఁడు సర్వస్వామునకు నధినేత.
ఒక్కయభిమానముదక్క సర్వమును వెచ్చించి జన
కుని గాపాడుట మా సంప్రదాయము, మా యాచార
మును.

వేనుఁ: [ఉలికిపడి, యానందబాష్పములు జడిగొనుచుండ,
మూర్ధ మాఘ్రాణించి బాష్పరుద్ధకంఠుఁడై కొంత
వడి యేమియుఁ బలుకనేరక యెట్టకేలకుఁదెప్పిరిల్లి]
కుమారా, ఇఁకఁ బ్రశాంతముతోఁ బ్రాణముపీడెదను.

నిషా : నిషాదునిబొందిలో జీవ ముండఁగా మీ కట్టి యవస

రముకలుగదు. ధర్మము శాశ్వతము, శరీరమువినశ్వరము. వినశ్వరమగు పదార్థము నభిలషించి, ధర్మము నేల యుజ్జగింపవలయును? మాయమ్మ చిన్ననాఁడొక్కపాట నేర్పినది.

వేనుఁ: తండ్రీ! యాపాటఁబాడుము, వినవలయును.

నిషా : నేను పాటలు పాడలేనే?

వేనుఁ: అమ్మనేయని, పాటఁబాడని నిషాదుఁడుండునా? నేను నమ్మను.

నిషా : చేతనయినట్లు పాడుదును..... ....

వేనుఁ: పోయినకాలము స్మరణకు వచ్చుచున్నది తండ్రీ! కాని యీ యాసన్నమరణముఁ దప్పింపలేవని నామనస్సాక్షి చెప్పుచున్నది..

నిషా : మనస్సాక్షి తలచుకూటసాక్షి యగుచుండును. తప్పింపఁగలుగుదునో లేనో యది నాపని. తప్పింపలేనిచో నా పీనుఁగుమీఁదుగనే పగతుర కరాచురకత్తి మీపయి కెగయును.

వేనుఁ: ఈమాటలు నేను వినలేను. అంటు సొంటు లేని ప్రజలు మడియుదురేమో యను భయంబున బుషులపై దాఁడియెత్తమాని మరణింపనుంటిని. అట్టినాకై సీవు ప్రమందుటయేల?

నిషా : అంటు సొంటు లేని ప్రజల క్షేమమునకై మీరు

మరణమునకే యున్మఖు లగునప్పుడు, అంటుసొంటు గల్లు మీ కై నాప్రాణమును బూటవెట్టుటగోషమా?

వేణు: ఈ ప్రపంచమును రోసి వీడఁదలంచుకొన్న నాకై తెగటారుట యేల?

నిషా: నేనుమాత్ర మిచ్చట నుట్టిగట్టుకొని యూరేగుదునా? ఎప్పుడో యొకప్పుడు చావ వలసియే యున్నది. నా తల్లి చిన్నతనమునసే పరమపదించెను. "నా"యన్న వారు మీరొక్కరే నాకు. మిమ్ములఁ గాపాడుకొనఁ గల్గుదునా పరమానందమున నోలలాడుదును. లేదా మీతోడిదే లోకమగును. కావున ననుఁగూర్చి మీరు చింతింపవలసినదిలేదు. కావున ననుఁగూర్చి మీరు చింతింపవలసినదిలేదు. నాపని ననుఁ జేసి కొననిండు. అలసినట్లున్నారు. ఈరేయి హాయిగా నిద్దురించుఁడు. ఏమరక నేను కావలిగాచెదను. నిషాదుని శరచాపములుగాని కరాళఖడ్గముగాని సామాన్యమైనవికావు.

వేణు: ఎఱుంగుదును, కాని మనస్సంక్షోభముఁ గావించు నీ పరిస్థితులలో నా కెట్లు నిదురవచ్చును?

నిషా: జనకా! నే నెఱుంగనా మీ స్వభావము? నాదగ్గఱి దాఁచెదరేల? మీకుఁజిత్తసంక్షోభ మెన్నఁడుండును? ప్రశాంతమును, గభీరమును నైన మీ మనస్సెవరు కలఁతపెట్టఁగల్గుదురు? వానచినుకులకు సముద్ర

మల్లకల్లోలమగునా ? మైమఱచి నిద్దుర వోవ్వుఁడు.

వేనుఁ: కలలు వచ్చును. నా మనస్సు చెడినది. కలలో నీ మూర్తియే, నీ మాటలే. నిద్దురపోవలేను.

నిషా : చాల ప్రొద్దుపోయినది. ఊరక వాగ్వాదమేల పెంచె దరు, నిదురించుఁడు.

వేనుఁ: కుమారా ! నీమాటల కెదురాడలేకుంటిని. నిన్ను సంప్రీతుని జేయుట కేమయినఁ జేతును. ఇదిగో ! నిదురింపఁ బోవుచుంటిని. [వేనుఁడు పడకమంచ ముపై మేను వాల్చును. నిషాదుఁడు కత్తి చేతఁబట్టి గదిముందుఁ గావలిగాచుచుండును. ధృష్టవర్మయుఁ బృథుకుమారుఁడును ఖడ్గములు ధరించి యావేశ ముతోఁ బ్రవేశించుచుందురు. నిషాదుఁడు చెవులు రిక్కించి చప్పుడాలకించి]

నిషా : ఎవ్వరు వారు ? ఈ యర్ధరాత్రివేళఁ గాలిచప్పుడు కాకుండ రాజమందిరముఁ బ్రవేశింప నుంకించు చున్నారు. [పరికించి] ఓహో! ధృష్టవర్మపృథుకుమా రులా ? ఇంచుకంతయు నేను బొరపడి యుండలేదు. కింవదంతికాదు. సత్యమునే వింటిని. మీ రచ్చటనే యాగుఁడు. ముందంజవేయకుఁడు. బడలికపడి యిప్పుడే మహారాజు నిద్రించుచున్నాఁడు. నిద్రా భంగ మగును. ఇది నేను సహింపలేను. మీ కేది కావలసిన నది యీయ సమర్థుండ. అదిగో ! సమ

ప్రదేశము. అచ్చటికిఁ బోదము, నడువుఁడు. తామ
సింపకుఁడు. మగుడఁ దేల?

ధృష్ట: నిషాదా! నన్నెవ్వరిగాఁ దలంచి యీసాహస వాక్య
ములు పల్కుచున్నావోకదా! ఎఱుంగుదువా?

నిషా: ఎఱుంగకేమి? వేనమహారాజు సైన్యాధిపతివనియు,
వేనమహారాజును ఖూనీచేయుటకే యీ వేళనే వత్తు
వనియు, వచ్చితివనియు, నీకార్యకలాపము చక్కఁగా
నెఱవేర్పించుటకు, యువరాజు తోడునీడై వచ్చె
ననియు నెఱుంగుదును. ఒకరు స్వామిద్రోహులు,
ఒకరు పితృద్రోహులు; ఒకరు కానున్న స్వామి
హంతకులు, ఒకరు కానున్న పితృహంతకులు. కావు
ననే యీ యంతఃపురమును మీ పాదధూళిచే
నపవిత్రముఁ జేయకమున్న మరలుఁడు.

పృథు: నిషాదా! తెగఁబడి మాటాడకుము. వీ రెవ్వారో
యెటొంగియు నట్లేల ప్రేలెదవు?

నిషా: నోరు నొక్కెద నింకొకమాట మాటాడిన, మహా
రాజు లేవకమున్నే యీ ప్రదేశమునకుఁ బోదము
నడువుఁడు.

ధృష్ట: మహారాజు లేచిన నేమిసేయఁగలఁడు? భయపెట్ట
కుము.

నిషా: నన్ను మీతోడఁ బోరాడకుండఁ జేయును. దానిచే
నిషాదుని కటికుకత్తి చుఱుకుపదను రుచిచూచు

భాగ్యము మీకుఁ గలుగదు.

ధృష్ట: ఓహో! నీవా మహారాజును గాపాడునది?

నిషా : కాపాడలేకున్న వీరపురుషోచితమయిన వీరస్వర్గముఁ బొందెదను. మీవలె స్వామిద్రోహము పితృద్రోహముఁ దలంచునంతటి నీచుఁడనుగాను. వెనుకకుఁ దిరుగరేమి? మీయందు సుభటలక్షణములు కూడఁ గన్పట్టవు. మహారాజునిద్ర మేల్కాంచునని యవలకుఁ బొమ్మన్నను బోరేమి? ఆ సమ్రదేశము నకుఁ గదలుదురా లేదా? మఱుమాట చెప్పవలదు.

[ధృష్టవర్మయుఁ బృథుకుమారుఁడును విభ్రాంతులై ముందు నడుతురు. నిషాదుఁడు వెనుకనే పోవును. ఒడలు తెలియని సివముతోడను, నెత్తుటం దోఁగిన కత్తితోడను, రక్తముఁగ్రక్కు నొడలితోడను ధృష్టవర్మ పృథుకుమారులు ప్రవేశింతురు. ధృష్టవర్మ నిదురించుచున్న వేనరాజు పడకకడకుఁబోయి దీర్ఘ కరవాలముచే నెదుఁబొమ్మ దూసిచనఁ బొడువ వేన రాజు కన్నులం దెఱచి యిటునటు పరికించి]

వేనుఁ: నీవా! ధృష్టవర్మా? నీపనిని దీర్చికొమ్మా. పసి తనంబునుండి పెంచి పెద్దనుజేసి యన్యదుర్లభమైన యధికారమిచ్చి మన్నించినందులకుఁ బ్రతిఫలంబుగా నన్నిట్లు గౌరవించుచుంటివా? కానిమ్మా, ఇదియొక మేలు. ఏ మౌనిచేతులలోనో పడి చావక కన్నబిడ్డ

వంటి నీచేతులలో మరణించుటచే నే నాత్మశాంతిని బొందుచుంటిని. ధృష్టవర్మా! ఇట్టిది తటస్థించునని నేనుజాలకాలమునుండి యెఱుంగుదును. ఎఱింగియు నీయందలి వాత్సల్యముచే నేమియుఁ జేయనేరక యూరకుంటిని. [పృథుకుమారుని వైపునకు దృష్టి మరల్చి] పృథూ! పృథూ! ఏఁడీ నిషాదుఁడు? నిషాదుఁడేఁడీ? [ధృష్టవర్మ మరల పొడుచును.]

పృథు: నిషాదుఁడు కావలసివచ్చెనా? నీకు ముందుగడారి తీయుటకుఁ బంపి యుంటిమి.

వేనుఁ: నిషాదా!నిషాదా! [యనిహీనస్వరంబునఁబిలిచిప్రాణములు వీడును]

[ధృష్టవర్మ వెట్టిచూపుల నదేపనిగారాజునుజూచుచు మైమఱచియుండును; పృథుకుమారుఁడుతండ్రిప్రక్కకువచ్చి తేఱి పాఱఁజూచి ధృష్టవర్మ వెన్నుఁ దట్టి]

పృథు: ధృష్టవర్మా! యేమిది? దిగాలుపడి చూచెదవేల? కావలసినపని పూర్తియైనది. మహారాజు ప్రాణములఁ బాసెను. లోక ముపద్రవముఁ బాసెను.

ధృష్ట: ఏమీ, ఏమీ! మహారాజు ప్రాణములంబాసెనా! ప్రాణములంబాసెనా? ఱహా యెంతఘోరము! ఎంత ఘోరము! పాపిని, చండాలుఁడను, ఎంతఘోరకృత్యముం జేసితిని!

పృథు: ధృష్టవర్మా? యేమి యీవావాపోవుట? ఇంతపిరికిపంద

వెప్పుడైతివి?

ధృష్ట: [వికటంబుగ] ఎప్పు డైతినా? మునులచేతిలోఁ బడి నప్పుడు, యువరాజు చెలిమిఁ జేసినప్పుడు, కుట్రలు పన్న మొదలిడినప్పుడు. యువరాజా! నేఁటినుండియు మహారాజవు గాఁబోలు: నీ వెఱుంగవు: నీ వెఱుం గఁజాల వీ మహారాజుపవిత్రహృదయము, పరార్థజీ వనము, అద్భు తౌదార్యము. మనవంటి స్వార్థపరు లెన్నండీ మహామహుని దెలియంజాలరు. కసికందుని బెంచి, పెద్దవానిం జేసి, సర్వసైన్యాధిపత్యమిచ్చి, నమ్మి నందులకుఁ బ్రతిఫలంబు పెద్దపులియై వేఁడి నెత్తురు గుటగుటఁ ద్రావివైచితిని. ఈమనఃపరితా పము భరింపఁజాల: ఈ తాపము సహింపఁజాల: ఆ పాదమస్తకము దహించివైచుచున్నది. దుర్భరము, దుస్సహము. [వేనరాజుపైఁబడి] మహారాజా! పల్క వేమి? ఈ నికృష్టజీవికి, నీ కృతఘ్ననకుఁ బ్రాయ శ్చిత్తదండన విధింపవా? రాజదండనచేఁ బరలోక దండన తొలంగిపోవునని పెద్దలందురు. దండ్యుల శిక్షించుట రాజ ధర్మముకాదా? మాటాడవేమి! [క్రింద నున్న కత్తినిదీసి చేతఁబట్టుకొని ఘోరాకా రుఁడై] ఎవ్వఁడీ మహారాజును దుర్మరణంబుపాలు చేసినది? వాని మస్తకమిఁకరవాలముచే శతధాభిన్న ముఁజేసిపుచ్చెదను.ఓరీ పిరికిపందా! నాకంటంబడవేమి? ఎవఁడున్నాఁడు? నిషాదా! నీవా? నేను మహారాజునకు

ద్రోహముఁ జేయను. నీకత్తిని దింపివేయుము. నీకే చెప్పుచున్నది. నిషాదా! నీకత్తిని నొఱలోఁబెట్టుము. ఏమీ యీ యావేదన! [వేనునింజూచి] మహారాజు మరణించెనా? నాచేత మరణించెనా? నేను జూడ లేను. పుట్టిననాఁటఁగోలె నీపాపి తోడునీడగాలేకుండ నెచ్చటికైనఁ బ్రయాణముఁ జేసియుంటివా? ఇతఁడు దక్క నెవ్వరయిన నీ కూడిగంబుఁ జేసియుండిరా? ఇప్పుడేల నాసేవఁ గైకొనవు? నీవు గైకొనకున్న నే విడుతునా? ఎవ్వరో నాకంఠమును రెండుచేతులంబట్టి నులిమివైచుచున్నారు. ఊపి రాడకున్నది. ఈబాధ భరింపఁజాల. (పడియుండును)

గౌతఁ: [ప్రవేశించి పరికించి] ఏమి చిత్రము? ధృష్టవర్మ యింతలో నున్మత్తుఁడై పోయినాఁడే. వేనునియం దితనికి నవ్యాజమును, నపారమునునైన భక్తివిశ్వాస ములుకలవు. ఇతనిని మావైపునకుఁ ద్రిప్పుకొనుటకుఁ దలప్రాణము తోఁకకు వచ్చినది. ఎన్ని మాయ మాటలు చెప్పితిని! ఎన్ని యబద్ధము లాడితిని! ఎన్ని యధర్మముల ధర్మములుగా నిరూపించి చెప్పి తిని! [ముందుకు నడచి పృథువుంజేరి] మహారాజా! ఏమట్లు చూచుచున్నావు? ధృష్టవర్మ పిచ్చివాఁడై పోయినాఁడు. ఇతండు బాగుపడినచో మనకుఁ బ్రక్కలోనిబల్లె మగును. ఇప్పు డుండి యుండి నీ మీఁదికో నా మీఁదికో యురుకకపోనఁడు. ఈ

యున్మాదావస్థలోనె వీనిని దుదముట్టించుట భూత హితమగును. నావంక నెట్లుగిమి చూచుచున్నాఁడో చూడుము, కత్తిని దీసికొనుచున్నాఁడు.

ధృష్ట: [లేచి] మహారాజా! నీ వెక్కడ కేగినను సరియె, యచ్చటకు వచ్చి సేవఁ జేసెదను.

గాత : మహారాజా! స్నేహితులను విడఁదీసి యుంచుట న్యాయముకాదు. పై పెచ్చు ధృష్టవర్మ వేనమహా రాజు కడకు సేవకై పోవ నిశ్చయించు కొన్నాఁడు. ఆలసింపకుము. అడుగో కత్తిని దీసినాఁడు.

పృథు. దేవా! భయపడకుము. పృథువు మీ కే యాపద రాకుండఁ గాపాడఁగలడు.

గాత : ఇంకేమున్నది? కత్తిని బట్టి లేవఁబోవుచున్నాఁడు.

పృథు:గాతమమునీంద్రా!అతండు లేవకుండఁగనేమఁడియును.

[చరాలున కత్తిఁదీసిధృష్టవర్మ శిరంబుభిన్నమైపడగొట్టును]

నాల్గవ రంగము

ముగింపు

పాట

పుట : 70 పంక్తి : 9

పగవారు మనపైకి వచ్చిపడ్డారు
కోయంచు మనయూళ్ళు కొల్లగొట్టారు
గూటిలో పిట్టల్ని కూల్చివైచారు
పొలములో పసిలేళ్ళ పొడిచివైచారు

మరచి పోవద్దోయి మరచిపో వద్దు
మనజాతి యగచాట్లు మరచిపో వద్దు


కారుకోనలు దూరి కలఁగి పొయ్యారు
దుంపకూరలతిండి క్రుంగి పొయ్యారు
గోచిపాతలు కట్టి క్రుంగి పొయ్యారు
ప్రొద్దెల్ల మనవారు పొగిలి పొయ్యారు

మరచి పోవద్దోయి మరచిపో వద్దు
మనజాతి యగచాట్లు మరచిపోవద్దు

పంగిళ్ళ కయ్యాల పంట్రటించినారు
పసిపాప యుయ్యాల పార దన్నారు
నిదురపో నీకోయి నీచేతికతి
క్రౌగించు పగవారి రక్తంబు నెపుడు

మరచిపో వద్దోయి మరచిపో వద్దు
మనజాతి యగచాట్లు మరచిపో వద్దు

ముద్రణ : 'వెంకటరత్నా' విజయవాడ-2



COVER : BHARATA MUDRANALAYAM, VIJAYAWADA - 2

Check List

Book Number	NPROIG112	Date	13/04/23
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	C2, B, C3, C, E, 81 83.		
Missing Pages	No		
Prepared By	Chandrashekar	Cutting By	Chandrashekar
Scanned By	Swathi	Pages	251
Quality Checking	Ramya		